సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 355

గురువారం 7-9-2023



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



పాక్ సులువుగా..
సూపర్–4 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ జట్టు విజయం
- 12లో



పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు
2023లో మొదటిసారి 90 డాలర్ల పైకి క్రూడ్
- 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆ 9 అంశాలపై చర్చించండి
పార్లమెంట్ సమావేశాల్లో మణిపూర్ హింస తదితర 9 కీలకాంశాలపై చర్చించాలని ప్రధానికి కాంగ్రెస్ నేత సోనియా లేఖ రాశారు.
వివరాలు 6లో ▸



ఉదయనిధిపై కేసు నమోదు
మత విశ్వాసాలకు భంగం కలిగించినందుకు డీఎంకే నేత ఉదయనిధి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గేపై యూపీలో కేసు నమోదైంది.
వివరాలు 6లో ▸




ఐఐటీ మండీలో ర్యాగింగ్ ఘటన
ఐఐటీ(మండీ)లో జూనియర్‌లను ర్యాగింగ్ చేసిన 10 మంది సీనియర్ విద్యార్థులను యాజమాన్యం సస్పెండ్ చేసింది.
వివరాలు 6లో ▸



'రికార్డు'తో సెమీస్‌లోకి జొకోవిచ్
సెర్బియా స్టార్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి దూసుకెళ్లాడు. కెరీర్‌లో 47వసారి గ్రాండ్ స్లామ్ సెమీస్ బెర్త్ దక్కించుకున్నాడు.
వివరాలు 12లో ▸

ఫ్యాక్ట్ చెక్



ఎక్స్ఛేంజీల్లో చెప్పిన ధరకే విద్యుత్ కొనుగోలు

- 2008 నుంచీ దేశవ్యాప్తంగా అదే జరుగుతోంది
- గతంలో గరిష్ట సీలింగ్ రేటు యూనిట్ రూ.20
- ఇప్పుడది రూ.10గా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించింది
- కాబట్టి మార్కెట్ ధరలు మూడు రెట్లు పెరిగే అవకాశమే లేదు
- ఆ రోజుకి, ఆ టైం బ్లాక్‌లో విద్యుత్ ఉత్పత్తి, డిమాండ్ ఆధారంగా మార్కెట్ ధరలుంటాయి
- కొనుగోలు, అమ్మకాల ధరలను ఎవరూ నియంత్రించలేరు
- ఈ మాత్రం కనీస పరిజ్ఞానం లేకుండా 'ఈనాడు' పిచ్చి రాతలు

2 లో

ఎక్కడి దొంగలు.. అక్కడే!



అడ్డంగా దొరికి... అరెస్టు చేస్తారేమోనంటూ బాబు కొత్త మంత్రం

ఐటీ నోటీసులపై, అవినీతి వ్యవహారంపై ష్.. గప్‌చుప్

- ఐటీ శాఖ సాక్ష్యాధారాలతో సహా నోటీసులిచ్చినా బుకాయింపు
- పదేపదే వాళ్ల అధికారాన్ని ప్రశ్నిస్తూ... అవినీతిపై మాత్రం మాట్లాడని తీరు
- పైపెచ్చు నన్ను అరెస్టు చేస్తారంటూ కార్యకర్తలను రెచ్చగొట్టే యత్నం
- తద్వారా శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలన్నది ప్రణాళిక.. నిర్మాణ కాంట్రాక్టులు, స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన టీడీపీ నేత
- రెండుచోట్లా ఒకటే నెట్‌వర్క్.. చంద్రబాబు ఇంటికి ముడుపులు చేర్చింది వారే..
- పుణె, ముంబై, ఢిల్లీ మీదుగా హైదరాబాద్ ఇంటికి అక్రమ నిధులు.. విదేశాల నుంచి సైతం హవాలా మార్గంలో బాబు బంగ్లాకే తరలింపు
- ఈ వ్యవహారాలన్నీ వెలుగుచూడటంతో కిమ్మనని ఎల్లో మీడియా.. దేశమంతా గగ్గోలు పెడుతున్నా నోరువిప్పని పెదబాబు, చినబాబు
- గతంలో ఓటుకు కోట్ల కేసులో దొరికిపోయినపుడూ బాబుది ఇదే తీరు
- తెలంగాణ ప్రభుత్వం తనపై కుట్ర చేస్తోందంటూ ఏపీకి రాక.. తన సమస్యను రెండు రాష్ట్రాల సమస్యగా చిత్రీకరించిన వైనం

సాక్షి, అమరావతి: అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబునాయుడు తన ఖాతాల్లోకి నేరుగా రప్పించుకున్న రూ.118 కోట్లకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ నోటీసులిచ్చినట్లు జాతీయ ఇంగ్లిష్ డైలీ 'హిందుస్థాన్ టైమ్స్' ప్రచురించి దాదాపు వారం దాటింది. నాటి నుంచీ ఈ నోటీసులతో పాటు బాబు హయాంలో కాంట్రాక్టు సంస్థల నుంచి ముడుపులు ఎలా అందుకున్నారో, ఖజానాను ఎలా కొల్లగొట్టారో వివరాలతో సహా వివిధ పత్రికల్లో వార్తలు వస్తూనే ఉన్నాయి. కాకపోతే ఊరూరా వెళుతున్న బాబుగానీ... పాదయాత్రంటూ తిరుగుతున్న ఆయన తనయుడు లోకేశ్ గానీ.. షూటింగ్ గ్యాప్ తీసుకున్న పవన్ గానీ ఎవ్వరూ దీనిపై మాట్లాడటం లేదు. ఇక అందరిపైనా ఉన్నవీ లేనివీ రాసే 'ఈనాడు', దాని తోకపత్రిక, తోక చానెళ్లు... ఏవీ ఈ అంశాన్నే ప్రస్తావించటం లేదు. ఆఖరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వచ్చిన

మిగతా 10వ పేజీలో ▸

దొంగతనం చేసి దబాయింపా?

- ఐటీ నోటీసులతో బాబు అవినీతి బండారం బట్టబయలు: సజ్జల
- రేపో, ఎల్లుండో అరెస్టు చేస్తారంటూ సానుభూతి నాటకం
- ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికినప్పుడూ ఇదే డ్రామా

10 లో

అరెస్టు.. పదేళ్ల జైలు!

- ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎలాంటి పదవులూ చేపట్టకుండా బాబుపై అనర్హత వేటు పడుతుంది
- ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు బీఎస్ రాంబాబు

10 లో

వియ్యంకుల వారి భూ విందు..



- నారాయణ - గంటా అసైన్డ్ దందాలో బడుగులే సమిధలు
- 37 మంది బినామీలతో కారుచౌకగా సొంతం
- రూ.18 కోట్లతో 150 ఎకరాలు హస్తగతం.. భూసమీకరణతో వాటి విలువ ఏకంగా రూ.550 కోట్లు
- మూడు నెలల్లో రూ.532 కోట్లు నష్టపోయిన అసైన్డ్ రైతులు
- ఇప్పటికే ముందస్తు బెయిల్‌పై నారాయణ

3 లో

ముందస్తు బెయిల్ పిటిషన్లు ఇన్నాళ్లు పెండింగ్‌లోనా!

అలాంటి పిటిషన్లు ఏడాది పెండింగ్‌లో ఉండటం ఎప్పుడూ చూడలేదు

- మాజీ మంత్రి నారాయణ, ఆయన బినామీల పిటిషన్లపై హైకోర్టు ఆశ్చర్యం
- ఓవైపు ముందస్తు బెయిల్ పిటిషన్లు, మరోవైపు క్వాష్ పిటిషన్లా
- ఏకకాలంలో 2 రకాల పిటిషన్లు ఎన్నడూ చూడలేదన్న హైకోర్టు
- నారాయణ, ఇతర పిటిషనర్లు మళ్లీ వాయిదా కోరడంపై అసహనం
- వాయిదా కోరితే అరెస్టుపై స్టే ఎత్తివేస్తాం

3 లో



- ఇదే చివరి అవకాశం.. మరోసారి వాయిదా ప్రసక్తే లేదు
- తేల్చిచెప్పిన న్యాయస్థానం.. తదుపరి విచారణ 14కి వాయిదా

న్యూస్‌రీల్

9న ఏయూ స్నాతకోత్సవం




ఆంధ్ర విశ్వవిద్యాలయం 87, 88, 89, 90ల సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు. అల్లూరి ఇంద్రకుమార్, కొలకలూరి ఇనాక్‌కు గౌరవ డాక్టరేట్లు అందిస్తున్నట్లు చెప్పారు.
వివరాలు 14లో ▸

బలహీనపడిన అల్పపీడనం



పశ్చిమ బంగాళాఖాతానికి ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం బలహీనపడింది. ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో 2 రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.
వివరాలు 14లో ▸

ఇదండీ సంగతి



అలాగే ప్రతిపక్షాల 'ఇండియా' కన్వీనర్ కూడా ఫోన్ చేయమంటున్నారు!



ఢిల్లీలో విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న జీ-20 సమావేశాలు జరిగే భవనం

అధికారిక కార్లు వాడొద్దు

జీ-20 సమావేశాల్లో విందు వేదికను చేరుకోవడానికి అధికారిక కార్లను వాడొద్దు. వివిధ దేశాల బృందాలకు అసౌకర్యం కలుగకుండా షటిల్ సర్వీస్‌లను వినియోగించుకోండి. అధీకృత వ్యక్తులు తప్పితే మరెవరూ మీడియాతో మాట్లాడవద్దు.

- కేంద్ర మంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశం



6 లో

జీ20: ఎందుకు.. ఏమిటి!

- ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన దేశాల కూటమిగా ఖ్యాతికెక్కిన జీ20 సదస్సుకు ఢిల్లీ ముస్తాబవుతోంది. ఈనెల 9, 10 తేదీల్లో జరిగే జీ20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జీ20 గురించిన విషయాలపై కథనం..

ఎమర్జింగ్ ఐటీ సిటీ విశాఖ

నాస్కామ్–డెలాయిట్ సర్వేలో ఎంపిక..

విజయవాడ, తిరుపతికి కూడా జాబితాలో చోటు



- దేశవ్యాప్తంగా 26 నగరాలను ఎంపిక చేసిన నాస్కామ్–డెలాయిట్.. విశాఖలో 8 స్టార్టప్ ఇంక్యుబేటర్స్‌తోపాటు 250కిపైగా ఐటీ కంపెనీలు
- విజయవాడ, తిరుపతిల్లో స్టార్టప్స్‌తో పాటు ప్రధాన విద్యాలయాలు.. ఈ నగరాల్లో నైపుణ్యం గల మానవ వనరుల వ్యయం 30 శాతం తక్కువ
- పెద్ద నగరాలతో పోలిస్తే రియల్ ఎస్టేట్ వ్యయాల్లో 50 శాతం ఆదా.. 60 శాతం మంది పట్టభద్రులు ఈ ద్వితీయశ్రేణి నగరాల నుంచే రాక

- వివరాలు 2లో

మేం చెప్పే వరకూ ఆగండి

- ఈ ఏడాది ప్రైవేటు వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ కోర్సుల్లో యాజమాన్య కోటా రివైజ్డ్ ఫేజ్–1 కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు.. తాము చెప్పే వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయవద్దని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సూచించింది.

14 లో



ఓట్ల పండగ.. ఉపాధి మెండుగా



వచ్చే ఆరు నెలల్లో దేశంలో 7 లక్షల ఉద్యోగాలు..

యువతకు భారీగా తాత్కాలిక ఉపాధి అవకాశాలు

- కేపీఎంజీ, టీమ్‌లీజ్ సంస్థల మార్కెట్ అంచనాల్లో వెల్లడి
- ఐటీ ప్రొఫెషనల్స్, అనలిస్టుల నుంచి డిజిటల్ మీడియా దాకా ఆఫర్లు
- ఓటర్ల నాడి గుర్తించేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్లు
- కొత్త యాప్‌ల రూపకల్పన, నిర్వహణలో ఐటీ కంపెనీలు
- ఎన్నికలకు తోడు పండుగలతో ఈ-కామర్స్‌లోనూ ఉద్యోగాలు

సాక్షి, హైదరాబాద్: మరికొన్ని నెలల్లో జరగనున్న పార్లమెంటు, వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు.. కొత్త ఉపాధిని కల్పించనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ.. మన దేశంలో మాత్రం ఎన్నికలతో భారీ ఎత్తున తాత్కాలిక ఉద్యోగాలు రాబోతున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆగస్టు చివరి వారం నుంచి ఆరేడు నెలల పాటు పలు సెక్టార్లలో నిపుణులైన యువతకు మంచి అవకాశాలు రాబోతున్నాయని.. మార్కెట్ సర్వేలు, సిబ్బంది సేవల సంస్థలు మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, టీమ్‌లీజ్, లింక్డ్ ఇన్ వంటి సంస్థలు చెప్తున్నాయి.

ఐటీ.. డిజిటల్..

దేశంలో ఎన్నికల సీజన్ ఇప్పటికే మొదలైంది. దేశవ్యాప్తంగా డిజిటల్ వినియోగం పెరిగిన నేపథ్యంలో.. రాజకీయ పార్టీలు సరికొత్త విధానాలను అనుసరిస్తున్నాయి. ఐటీ, సోషల్ మీడియాను తమ అవసరాలకు వినియోగిస్తున్నాయి. ఈ క్రమంలో ఐటీ నిపుణుల అవసరం పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. దీనికితోడు పండుగల సీజన్ మొదలవ్వడం, కొనుగోళ్ల సందడితో ఈ–కామర్స్ జోరందుకుంటోందని అంటున్నాయి. ఇవన్నీ కూడా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచుతాయని వివరిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో దేశవ్యాప్తంగా 7 లక్షల మందికిపైగా ఉద్యోగులను పలు కంపెనీలు తాత్కాలికంగా నియమించుకునే వీలుందని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, టీమ్‌లీజ్, లింక్డ్‌ఇన్ వంటి సంస్థలు అంచనా వేశాయి. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలూ ప్రచార జోరు పెంచాయి. పార్టీలు, నిలబడే అభ్యర్థులు సర్వేలు చేయించి పరిస్థితిని విశ్లేషించుకోవడంలో మునిగారు. ఆన్‌లైన్ విధానంలో సాగే సర్వేల కోసం యువత అవసరం ఉంది. దీనికితోడు కార్యాలయంలోనే కూర్చుని క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వగల సరికొత్త సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లనూ రూపొందిస్తున్నారు. సర్వే ఫలితాలను విశ్లేషించి నివేదిక (అనలిటికల్ రిపోర్టు) ఇవ్వడమూ ముఖ్యమే. బలాలు, బలహీనతలను పసిగట్టేలా.. ఓటర్ల మనోగతం తెలుసుకునేలా ఆన్‌లైన్ సర్వే అప్లికేషన్లను రూపొందించాల్సి ఉంటుంది. ఇందుకు ఐటీ ఉద్యోగుల అవసరం ఉంటుంది. ఇప్పటికే దేశంలో పెద్ద ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థలైన కేపీఎంజీ, డెలాయిట్, ఈవైలు, పీడబ్ల్యూసీ వంటి సంస్థలు నియామకాల కోసం ప్రకటనలు ఇస్తున్నాయి. ఈ ఏడాది ద్వితీయార్థంలో కనీసం 80వేల మంది ఐటీ ప్రొఫెషనల్స్ అవసరం ఉండొచ్చని ఈ కంపెనీలు అంటున్నాయి.

డిజిటల్ రంగం తళుకులు

ఎక్కడో ఒకచోట మాట్లాడితే.. దేశమంతటా ప్రచారం కావాలని పార్టీలు కోరుకుంటున్నాయి. దీన్ని సాకారం చేయగల సత్తా డిజిటల్ మీడియాకే ఉంది. గత ఐదేళ్లుగా వర్చువల్ రియాలిటీకి ప్రాధాన్యం పెరిగింది. ఇందుకోసం ఆధునిక పరికరాలు, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు వస్తున్నాయి. సెల్‌ఫోన్లు సహా ఓటర్ వాడే ప్రతి డిజిటల్ మీడియాకు పార్టీలను తీసుకెళ్లడం అవసరంగా మారింది. ఇందుకోసం డిజిటల్ రంగ నిపుణుల ఆవశ్యకత పెరిగింది. దీనికి అనుగుణంగా విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని నిపుణులు అంటున్నారు. ఇక ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగాం వంటి మాధ్యమాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఫొటోలు, వీడియోలు రూపొందించడం, ఎడిట్ చేయడం, వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడం వంటి సాంకేతిక అనుభవం ఉన్న వారికి భారీగా ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. టెక్ విభాగాల్లో డెవలపర్స్, క్లౌడ్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, మొబిలిటీ సైన్స్, వర్చువలైజేషన్, అనలిటిక్స్ వంటి నిపుణులకు ఎన్నికల సీజన్‌లో మంచి వేతనాలతో ఉపాధి ఉండే వీలుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశంలో పండుగలతో కొనుగోళ్లు పెరుగుతాయి. ఈ క్రమంలో రిటైల్, బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, ఈ–కామర్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల కంపెనీలు.. భారీగా తాత్కాలిక నియామకాల కోసం ప్రయత్నిస్తున్నాయి. మ్యాన్‌పవర్ గ్రూప్ అంచనాల ప్రకారం.. రిటైల్ అమ్మకాలు, సహాయక సిబ్బంది, డెలివరీ సిబ్బంది, వినియోగదారుల రుణాల కంపెనీల వద్ద ఎగ్జిక్యూటివ్‌ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ తరహా ఉద్యోగాలకు 2 లక్షల మంది అవసరం ఉండొచ్చని టీమ్‌లీజ్ సంస్థ అంచనా వేసింది.

నైపుణ్యాలు ముఖ్యం

ఇవి తాత్కాలిక ఉద్యోగాలే అయినా మంచి అవకాశాలే. నిరుద్యోగులకు అనుభవం సంపాదించి పెడతాయి. అనలిస్టులు, ఐటీ నిపుణులకు అవసరమైన పరిజ్ఞానం ఉంటేనే కంపెనీలు ప్రాధాన్యమిస్తాయి. ముఖ్యంగా మేథ్స్‌పై పట్టు ఉన్న వారు రాణించగలరు. ఈ అనుభవం ముున్ముందు కూడా దోహద పడుతుంది.

- ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్

మంచి పనితీరు చూపితే పర్మినెంట్ కావొచ్చు

సీజన్‌లో అవసరం కోసం తీసుకున్న ఉద్యోగుల నైపుణ్యాలను కంపెనీలు పరిశీలిస్తాయి. మంచి పనితీరు, ప్రావీణ్యం చూపితే సీజన్ తర్వాత కొన్ని పరీక్షల ద్వారా శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకునే వీలుంది. అందువల్ల చేసే పనిలో ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది.

- జావేద్, బహుళ జాతి సంస్థలో హెచ్‌ఆర్ నిపుణుడు

క్లుప్తంగా...

విజయకుమార్‌కు 'స్వామినాథన్ అవార్డు'



అవార్డు అందుకుంటున్న విజయకుమార్

సాక్షి, అమరావతి: రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ మద్రాస్ ఈస్ట్ రోటరీ క్లబ్ నుంచి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పర్యావరణ పరిరక్షణ అవార్డు-2023ను అందుకున్నారు. బుధవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ కనిమొళి కరుణానిధి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి పర్యావరణ పరిక్షణకు దోహదం చేస్తున్నందుకు ఈ అవార్డును విజయకుమార్‌కు అందజేశారు.

వాతావరణాన్ని తట్టుకునేలా వ్యవసాయం

జీ-20 వ్యవసాయ సాంకేతిక వర్క్‌షాప్ లక్ష్యం ఇదే

సాక్షి, హైదరాబాద్: వాతావరణాన్ని తట్టుకునేలా వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని జీ-20 వ్యవసాయ సదస్సు పిలుపునిచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్), కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు 'వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయం'పై జీ-20 టెక్నికల్ వర్క్‌షాప్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సదస్సుకు జీ-20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో సహా దాదాపు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వ్యవసాయం, జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి సీనియర్ అధికారులు, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, ఎర్త్ సైన్సెస్ అధికారులు కూడా హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగిన సదస్సులో చర్చించిన అంశాలపై భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్కే చౌదరి, క్రిడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్, ఐకార్ ఏడీజీలు డాక్టర్ రాజ్‌బీర్ సింగ్, డాక్టర్ బికాశ్ మండల్‌లు బుధవారం మీడియాకు వెల్లడించారు. వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయం కోసం అప్‌స్కేలింగ్ క్లైమేట్ రెసిలెంట్ అగ్రికల్చర్-కేస్ స్టడీస్ పైనా నిపుణులు చర్చించినట్లు తెలిపారు.

తెలంగాణ

18న వినాయకచవితి.. 28న నిమజ్జనం

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి వెల్లడి

హైదరాబాద్: ఈనెల 18వ తేదీన వినాయకచవితి...28న వినాయక నిమజ్జనం ఉంటుందని భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ్ సమితి అధికారికంగా వెల్లడించింది. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో అధికారులకు తాము కొన్ని సూచనలు ఇవ్వగా, వారు సానుకూలంగా స్పందించినట్టు ఉత్సవ్ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు తెలిపారు. వినాయకచవితి పర్వదినాన్ని 18న లేదా 19వ తేదీన జరుపుకోవాలనే విషయంలో భక్తులు గందరగోళంలో ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పంచాంగకర్తలు, శృంగేరి పీఠాధిపతులు, కంచి పీఠాధిపతులు 18న పండగ నిర్వహించాలని సూచించిన కారణంగా భక్తులంతా ఆ రోజే వినాయకుడిని ప్రతిష్టించాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ పెద్ద వినాయకుడు మొదలు గల్లీల్లో ప్రతిష్టించే వాటితో కలిపి దాదాపు 3 లక్షల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్టు చెప్పారు. ఈసారి ఖైరతాబాద్‌లో 63 అడుగుల విగ్రహం పతిష్టిస్తామని తెలిపారు.

ఎమర్జింగ్ ఐటీ సిటీ విశాఖపట్నం

నాస్కామ్-డెలాయిట్ సర్వేలో ఎంపిక.. విజయవాడ, తిరుపతికి కూడా జాబితాలో చోటు

దేశవ్యాప్తంగా 26 నగరాల ఎంపిక



రాష్ట్రంలో ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాలపై అధికంగా దృష్టి సారిస్తున్నట్లు నాస్కామ్-డెలాయిట్ సంయుక్త సర్వే వెల్లడించింది. దేశీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను పెద్ద నగరాలు కంటే చిన్న నగరాలకు విస్తరించడానికి మొగ్గుచూపుతున్నాయని ఈ సర్వే నివేదిక తెలిపింది. ఈ విస్తరణకు ఐదు కీలక అంశాల ఆధారంగా దేశవ్యాప్తంగా 26 ఎమర్జింగ్ ఐటీ హబ్స్‌ను నాస్కామ్-డెలాయిట్ ఎంపిక చేసింది. ఇందులో మన రాష్ట్రం నుంచి విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాలకు చోటు దక్కగా, తెలంగాణ నుంచి వరంగల్ ఎంపికైంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలికవసతులు, రిస్క్-వ్యవస్థల నియంత్రణ, స్టార్టప్ ఎకోసిస్టమ్, సోషల్-లివింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అయిదు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని వీటిని ఎంపిక చేసినట్లు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం బీచ్ ఐటీ పేరుతో ఇప్పటికే విశాఖ నగరాన్ని ప్రోత్సహిస్తుండటమే కాకుండా నూతన తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, స్టార్టప్ ఇంక్యుబేటర్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. దీంతో ఇన్ఫోసిస్, రాండ్‌శాండ్, బీఈఎల్, అమెజాన్ వంటి ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖకు విస్తరించగా మరి కొన్ని కంపెనీలు త్వరలో కార్యకలాపాలను ప్రారంభించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. విశాఖలో మొత్తం 1,120 స్టార్టప్స్ కార్యకలాపాలను సాగిస్తున్నాయి.



వీటిలో 20 శాతానికిపైగా స్టార్టప్స్ టెక్నాలజీ రంగానికి చెందినవే ఉన్నాయి. ఇప్పటికే 250కి పైగా ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు విశాఖ వేదికగా పనిచేస్తున్నాయి. ఇదే సమయంలో విజయవాడలో 80కి పైగా టెక్నాలజీకి చెందిన స్టార్టప్స్ ఉండగా, 550కి పైగా టెక్నాలజీ ఆధారిత వ్యాపారసంస్థలు ఉన్నాయి. అంతేగాకుండా ఏటా 25 వేలమందికి పైగా ఐటీ నిపుణులు అందుబాటులోకి వస్తున్నారు. ఐటీ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో తిరుపతి ముందువరుసలో ఉంటోంది. తిరుపతిలో ఇప్పటికే 25 టెక్నాలజీ స్టార్టప్స్ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, 50కి పైగా టెక్నాలజీ బేస్డ్ సంస్థలున్నాయి. ఇవన్నీ ఈ మూడు నగరాల్లో పెట్టుబడులను పెట్టే విధంగా ప్రోత్సహిస్తున్నాయి.

- సాక్షి, అమరావతి

30% వ్యయం తక్కువ

పెద్ద నగరాలతో పోలిస్తే నైపుణ్యం కలిగిన మానవ వనరులు ద్వితీయశ్రేణి నగరాల్లో లభిస్తుండటం, రియల్ ఎస్టేట్ ధరలూ తక్కువగా ఉండటంతో ఐటీ కంపెనీలు ఈ 26 నగరాల్లో కార్యకలాపాలు మొదలు పెట్టడానికి ప్రధాన కారణమని నాస్కామ్-డెలాయిట్ పేర్కొంది. పెద్ద నగరాలతో పోలిస్తే మానవ వనరుల వ్యయం 25 నుంచి 30 శాతం తగ్గుతున్నట్లు తెలిపింది. దేశీయ ఐటీ నిపుణుల్లో 15 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి వస్తున్నవారే కావడంతో వారి వద్దకే కార్యాలయాలను తీసుకెళ్లే యోచనలో కంపెనీలున్నాయి. రియల్ ఎస్టేట్ భవనాలు, అద్దెల వంటివీ చిన్న నగరాల్లో తక్కువగా ఉంటున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఐటీ కంపెనీలు టైర్-2 సిటీస్ బాట పడుతున్నట్లు ఆ నివేదిక విశ్లేషించింది.

అధునాతన మెటీరియల్ ప్రాసెసింగ్, ఫ్యాబ్రికేషన్‌పై అన్వేషణ

ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ



ఏర్పేడు (తిరుపతి జిల్లా): అధునాతన మెటీరియల్ ప్రాసెసింగ్, ఫ్యాబ్రికేషన్‌పై తాజా అన్వేషణ చేస్తున్నట్లు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఏర్పేడు మండలంలోని మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ప్రాసెసింగ్, ఫ్యాబ్రికేషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌పై 29వ అంతర్జాతీయ సదస్సు జరిగింది. సదస్సులో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, విద్యార్థులను కలిసి ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి వీటిపై అన్వేషణ చేస్తున్నట్లు చెప్పారు. కాన్ఫరెన్స్‌లో సంకలిత తయారీ, సూక్ష్మ పదార్థాలు, బయో మెటీరియల్స్, మిశ్రమాలు, సిరామిక్స్, లోహాలు, స్మార్ట్ మెటీరియల్, ఉపరితల ఇంజినీరింగ్, వెల్డింగ్, మోడలింగ్, అనుకరణలాంటి అంశాలపై చర్చించారు. సదస్సులో భారత్, ఇతర దేశాల నుంచి మూడు రోజులపాటు 350 మంది ప్రతినిధులు, 20 పరిశ్రమ స్టాల్స్ పాల్గొన్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, మాధవపెద్ది మూర్తి టీమ్ ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్‌కేరే, ఏపీఎస్ ప్రసాద్, శ్రీవాత్సవ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు

విత్తనాలున్నాయ్.. చూస్తే కనిపిస్తాయ్..

రాష్ట్రంలో ఎక్కడా విత్తనాల కొరత లేదు.. ఏ ప్రాంత రైతులకు ఏ విత్తనాలు కావాలో అవి సిద్ధం

- రైతుల డిమాండ్ మేరకే విత్తనాల సరఫరా
- వర్షాభావ ప్రాంతాల్లో జూన్‌లోనే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక
- అందుకు తగినట్టుగా సీజన్ ఆరంభం నుంచే విత్తనాలు సిద్ధం
- రైతులకు సరఫరా కూడా ప్రారంభం
- రాయలసీమ జిల్లాల్లో స్వల్పకాలిక పంటల విత్తనాలు సిద్ధం
- 80% సబ్సిడీపై ఆర్బీకేల్లో విత్తనాలు
- రబీకి ముందస్తుగా సిద్ధమవుతున్న ప్రభుత్వం
- సెప్టెంబర్ 15 నుంచి రబీ విత్తనాల సరఫరా
- అయినా ఈనాడు రోత రాతలు
- రైతులను రెచ్చగొట్టడమే లక్ష్యంగా అబద్ధాలతో కథనాలు



వానలు కురుస్తున్నా... విత్తనాలేవీ?

సాక్షి, అమరావతి: బెట్ట పరిస్థితులున్నాయి.. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ఏదంటూ నిన్నటి వరకు ఓ రకమైన ఏడుపు.. నాలుగు వర్షాలు కురవగానే వానలు కురుస్తున్నా విత్తనాలేవంటూ ఇప్పుడు కొత్తగా మరో ఏడుపు. ఇది ఈనాడుకు మాత్రమే తెలిసిన భిన్న రాగాలు. ఇందులో విశేషమేమిటంటే.. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితమే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించి, అమల్లో పెట్టిన విషయం ఈనాడు గ్రహించలేకపోవడం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సీజన్‌లో సాగు ముందుకు సాగక ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుంటే రామోజీకి మాత్రం ఇవేమీ కనిపించడంలేదు. సాగు వేళ కష్టాల్లో ఉన్న రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ అండగా నిలవాల్సింది పోయి వారిని రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తూ వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏనాడూ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సక్రమంగా అమలు పరిచింది లేదు. రైతులకు సరిగా విత్తనాలిచ్చిందీ లేదు. పైగా, రూ.384 కోట్లు విత్తన బకాయిలు పెట్టింది. ఈ బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించింది. దీనిపై ఏనాడూ నోరు మెదపని రామోజీ.. ఇప్పుడు మాత్రంరైతులకు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచి, అన్నదాతకు అన్ని విధాలుగా సహకరిస్తున్నా, బురద జల్లుతున్నారు.

ప్రతి 15 రోజులకూ సమీక్ష

రాష్ట్రంలో ఖరీఫ్ సాగు లక్ష్యానికి అనుగుణంగా సీజన్‌కు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) 5.73 లక్షల క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. 7.32 లక్షల మంది రైతులకు 5.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేసింది. అయితే, జూన్‌లో వర్షాలు సరిగా కురవలేదు. వెంటనే ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల నిపుణులతో సమాలోచనలు జరిపి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించింది. ప్రతి 15 రోజులకోసారి పరిస్థితిని సమీక్షిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. జూలైలో అధిక వర్షాల వల్ల నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రైతులు కోరుకున్న వరి విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. రాయలసీమ జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అక్కడి రైతులకు అవసరమైన విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. గతంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు రైతుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ఉలవలు, అలసందలు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగుల విత్తనాలను సిద్ధం చేసింది. రాయలసీమ జిల్లాల్లో ఏ ఆర్బీకేకు వెళ్లినా విత్తనాలకు కొదవలేదు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద ఆర్బీకేల్లో సిద్ధం చేసిన విత్తన నిల్వల వివరాలతో పాటు ఏ విధంగా సాగు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయంపై కరపత్రాలు, వాల్ పోస్టర్లు, వ్యవసాయ సలహా మండళ్లు, పంటల వారీ వాట్సప్ గ్రూపులు, ఆర్బీకే ఛానల్, ఆర్బీకేల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తోంది. జిల్లాల నుంచి 77,049 క్వింటాళ్ల విత్తనం అవసరమని ఇండెంట్లు రాగా..., 78,440 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసింది. ఆగస్టు 17వ తేదీ నుంచే విత్తన సరఫరా ప్రారంభించింది. 80 శాతం సబ్సిడీపై అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా ఉంచినప్పటికీ ఎక్కువ శాతం ఉలవలు ఇస్తున్నారంటూ దుష్ప్రచారం చేయడం విడ్డూరం. రైతులు కోరిన పంట విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందే తప్ప వారికి అవసరం లేని వాటిని సరఫరా చేయడం వల్ల ప్రయోజనం ఏముంటుందో రామోజీకే తెలియాలి.

అన్ని రకాల విత్తనాలు సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లోనే రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను సరిపడినంతగా సిద్ధంగా ఉంచింది. విత్తనం దొరకడంలేదని రాష్ట్రవ్యాప్తంగా ఒక్క రైతూ అనలేదు. ఎందుకంటే.. వారి కళ్లెదుటే ఆర్బీకేల్లో విత్తనాలు కనిపిస్తున్నాయి. చూడనిది ఈనాడు మాత్రమే. అనంతపురం జిల్లాల్లో 6,700 క్వింటాళ్ల విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 8,960 క్వింటాళ్లు, చిత్తూరు జిల్లాలో 2,700 క్వింటాళ్లు, అన్నమయ్య జిల్లాలో 7,419 క్వింటాళ్లు సిద్ధం చేసింది. తిరుపతి జిల్లాలో రైతుల కోరిన 226 క్వింటాళ్ల ఉలవలు అందుబాటులో ఉంచింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ముందస్తు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక లేనప్పటికీ, స్థానికంగా వచ్చిన డిమాండ్ మేరకు 3,151 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసింది. వైఎస్సార్ జిల్లాలో తొలిదశలో 612 క్వింటాళ్లు, రెండో దశలో 3,929 క్వింటాళ్ల విత్తనం నిల్వ చేసింది. సీజన్ ముగిసేవరకు వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో 80 శాతం రాయితీపై విత్తనాల సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే, ఈ సీజన్‌లో వర్షాలు మరీ తక్కువగా ఉండటంతో రైతులు ముందస్తు రబీ పంటలు వేసుకొనే ఆలోచనలో ఉన్నారు. అందువల్ల వారు ఖరీఫ్‌లో సాగుకు ఆసక్తి చూపించడం లేదు. తక్కువ మొత్తంలో విత్తనాలు తీసుకుంటున్నారు. దీంతో రాయలసీమ ప్రాంతాల్లో.. ముఖ్యంగా అనంతపురం, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ముందస్తు రబీ కింద శనగ సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నందున ప్రభుత్వం కూడా ముందస్తుగానే సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఆర్బీకేల ద్వారా శనగ విత్తనం సరఫరాకు ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవాలు ఇలా ఉంటే ఈనాడులో సత్యదూరమైన ఆరోపణలతో అబద్ధాలను అచ్చేయడంపట్ల రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటల విత్తనాల ధరలు (రూ.లలో)


పంట రకం	ప్యాకింగ్ (కేజీలు)	సరఫరా ధర	80% సబ్సిడీ అనంతరం చెల్లించాల్సిన ధర
మినుము	4	11,750	2,350
పెసలు	4	11,750	2,350
ఉలవలు	10	10,800	2,160
అలసందలు	8	11,500	2,300
కొర్రలు	2	6,750	1350
రాగులు	2	6,950	1,390
వరి	30	3,410	682
కందులు	4	11,140	2,228
జొన్నలు	3	23,334	4,667
మొక్కజొన్న	4	35,000	7,000
సజ్జలు	1.5	30,000	6,000
పొద్దుతిరుగుడు	2	80,000	16,000

రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిన విత్తనాలు, రైతులు తీసుకున్నవి (క్వింటాళ్లలో)

విత్తనం	అందుబాటులో ఉన్నది	ఆర్బీకేల్లో నిల్వ	రైతులు తీసుకున్న విత్తనం
మినుము	5,800	1,750	10
పెసలు	3,700	1,755	50
ఉలవలు	54,000	25,296	905
అలసందలు	2,000	1,700	50
కొర్రలు	590	205	3
రాగులు	50	10	--
వరి	1,800	304	--
కందులు	4,300	304	--
జొన్న, మొక్కజొన్న, సజ్జలు, పొద్దుతిరుగుడు	6,200	545	--
మొత్తం	78,440	31,869	1018

ఎక్స్ఛేంజీల్లో చెప్పిన ధరకే విద్యుత్ కొనుగోలు

- 2008 నుంచీ దేశవ్యాప్తంగా అదే జరుగుతోంది
- గతంలో గరిష్ట సీలింగ్ రేటు యూనిట్ రూ.20
- ఇప్పుడది రూ.10గా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించింది
- కాబట్టి మార్కెట్ ధరలు మూడు రేట్లు పెరిగే అవకాశమే లేదు
- ఆ రోజుకి, ఆ టైం బ్లాక్‌లో విద్యుత్ ఉత్పత్తి, డిమాండ్ ఆధారంగా మార్కెట్ ధరలు ఉంటాయి
- కొనుగోలు, అమ్మకాల ధరలను ఎవరూ నియంత్రించలేరు
- ఈ మాత్రం కనీస పరిజ్ఞానం లేకుండా 'ఈనాడు' పిచ్చి రాతలు



మనం చేస్తే ఖర్చు... మరొకరైతే దోపిడీ!


సాక్షి, అమరావతి: జాతీయ ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ ధరలను ఎవరూ నియంత్రించలేరు. కేవలం గరిష్ట సీలింగ్ ధరను మాత్రమే నిర్ణయించగలరు. ఆ అధికారం కూడా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)కే ఉంది. ఇంత చిన్న విషయంపైన కూడా అవగాహన లేకనో లేదా ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపైన, సీఎం వైఎస్ జగన్ పైనా బురద జల్లాలనే అత్యుత్సాహమో ఈనాడు బుధవారం ఓ తప్పుడు కథనాన్ని అచ్చేసింది. 'మనం చేస్తే ఖర్చు.. మరొకరైతే దోపిడీ' అంటూ అవాస్తవాలను అల్లింది. ప్రజల అవసరాలకు రాష్ట్రంలో ఉన్న విద్యుత్ సరిపోనప్పుడు బహిరంగ మార్కెట్‌లో కొనైనా ఇబ్బంది లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడమే తప్పన్నట్టుగా ఆ కథనంలో అక్కసు వెళ్లగక్కింది. విద్యుత్‌ను బయట నుంచి మూడు రెట్లు అధిక ధరకు కొంటున్నారని, ఆ భారం ప్రజలపైనే వేస్తారని లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నించింది. దీనిపై ఇంధన శాఖ వెల్లడించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి.

- దేశంలో విద్యుత్ ఎక్స్ఛేంజిలు కొత్తగా ఏమీ రాలేదు. 2008-09 ఆర్థిక సంవత్సరం నుంచి ఉన్నాయి. అప్పటి నుంచి వివిధ రకాల మార్కెట్ సెగ్మెంట్ల ద్వారా స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు జరుగుతున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు స్వల్పకాలిక విద్యుత్ అవసరాల కోసం ఎప్పటి నుండో ఈ ఎక్స్ఛేంజిలపై ఆధారపడ్డాయి.
- మార్కెట్ ధరలు ఆ రోజుకి, ఆ టైం బ్లాక్ (ఒక రోజులో 96 టైం బ్లాక్ లు ఉంటాయి. ఒక్కోటీ 15 నిమిషాల సమయం)లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న విద్యుత్, డిమాండ్ బిడ్ల ఆధారంగా ఉంటాయి.
- ఇందులో బయటి నుంచి ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉండదు. ఈ ఎక్స్ఛేంజిలు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల ప్రకారం, మండలి నిబంధనలు, నియమావళికి లోబడి పనిచేస్తాయి.
- నెల వారీగా కొనే ద్వైపాక్షిక విద్యుత్ ఒప్పందాలైతే డీఈఈపీ, ఈ-బిడ్డింగ్ పోర్టల్ ద్వారా నిర్దేశిస్తారు. ఈ పోర్టల్ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. కేంద్ర విద్యుత్ శాఖ ఎక్స్ఛేంజిల్లో కొనే విద్యుత్‌కు గరిష్ట ధర (సీలింగ్ ప్రైస్) యూనిట్ రూ.10గా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్ధారించింది.
- పీక్ లోడ్ సమయం ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా వివిధ కేటగిరీల లోడ్‌ను బట్టి, అందుబాటులో ఉండే ఉత్పత్తి వనరులపై ఆధారపడి ఉంటుంది. అంతే కానీ ఈ ధరలను ఎవరూ నియంత్రించలేరు.
- పీక్ అవర్స్‌లో విద్యుత్ కొనుగోలు కూడా ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు చార్జీల రూపంలో వసూలు చేసుకోవడానికి డిస్కంలకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతి ఇచ్చింది. దాని ప్రకారమే చార్జీలు వసూలు చేస్తున్నారు.
- మార్కెట్ ధరలు మూడు రెట్లు పెరగలేదు. గతంలో సీలింగ్ ధర యూనిట్‌కు రూ. 20 ఉండేది. అప్పుడు కూడా అత్యవసరాన్ని బట్టి డిస్కంలు యూనిట్‌కు రూ. 17 వరకు వెచ్చించి కొన్నాయి. ఈ ఏడాది అనూహ్యంగా పెరిగిన డిమాండ్ వల్ల, జల విద్యుత్ లేకపోవడం వల్ల మార్కెట్‌లో ధరలు పీక్ సమయంలో దాదాపు సీలింగ్ ప్రైస్ యూనిట్ రూ .10, రోజువారీ ధర రూ.6 నుంచి రూ.9 వరకు సీఈఆర్‌సీ నిర్ణయించింది. అంతేగానీ ధరలు మూడు రెట్లు పెరగలేదు.
- మార్కెట్ కొనుగోళ్లలో ఏ విధమైన ప్రమేయాలూ ఉండవు. ధరలు మార్కెట్ అంశాల ఆధారంగానే నిర్ధారణ చేస్తారు.
- దేశంలోనే అతి పెద్ద విద్యుత్ ఎక్స్ఛేంజి ఐఈఎక్స్ గణాంకాల ప్రకారం.. సంవత్సరం అంతా సాయంత్రం పీక్ లోడ్ సరాసరి ధరలు (అన్ని నెలలు, సీజన్లు కలుపుకుని) గత 8 సంవత్సరాలుగా ఈ విధంగా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం	సరాసరి పీక్‌లోడ్ ధర (యూనిట్‌కు రూ.లలో)	పీక్ లోడ్ సమయం
2014-15	5.48	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2015-16	4.30	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2016-17	3.06	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2017-18	3.97	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2018-19	4.94	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2019-20	3.61	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2020-21	3.16	సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు
2021-22	5.78	సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు
2022-23	7.73	సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు

రోదసీలోకి మనిషిని పంపడంపై ఇస్రో దృష్టి

అక్టోబర్ మూడో వారంలో గగన్‌యాన్ ఎక్స్‌పెరిమెంటల్ ప్రయోగం



గగన్‌యాన్ ఎక్స్‌పెరిమెంట్ ప్రయోగంలో క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టం అంటే ఇదే..

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): రానున్న రెండు మూడేళ్లలో రోదసీలోకి వ్యోమగాములను పంపించి వారిని సురక్షితంగా భూమి పైకి తెచ్చే గగన్‌యాన్-1(మ్యాన్ మిషన్) ప్రయోగాన్ని నిర్వహించే లక్ష్యంతో ఇస్రో పనిచేస్తోంది. ఇందులో భాగంగా అక్టోబర్ మూడో వారంలో గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టంగా పిలవబడే ఒక ప్రయోగాత్మక ప్రయోగాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. చంద్రుడిపై పరిశోధనలను విజయవంతంగా చేసిన అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పుడు గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించే పనిలో అనేక ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహించి సామర్థ్యాన్ని నిర్ధారించుకుంటున్నారు. ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించి ఇప్పుడు ఎక్స్‌పెరిమెంటల్‌గా గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు. ఎల్‌వీఎం3 రాకెట్ ద్వారా 8,200 కిలోలు బరువున్న క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టం పేరుతో ప్రయోగాన్ని నిర్వహించే యత్నం చేస్తున్నారు. 3.25 వెడల్పు, 3.58 పొడవుతో క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టంను రూపొందించారు. ఈ మాడ్యూల్‌ను లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టి ఏడు రోజుల తర్వాత మళ్లీ కిందకు.. అంటే భూమికి సురక్షితంగా తీసుకొచ్చే ప్రక్రియను నిర్వహిస్తారు. చంద్రయాన్-3లో విక్రమ్ ల్యాండర్‌ను దిగిన చోటు నుంచి మరో చోటుకు తరలించే ప్రయత్నాన్ని కూడా ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించడంతో, భవిష్యత్తులో చంద్రుడిపైకి వ్యోమగాములను పంపి తిరిగి తీసుకొచ్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని వారు చెప్పిన విషయం తెలిసిందే. క్రూమాడ్యూల్ సిస్టంను కూడా లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి పంపి తిరిగి భూమికి తీసుకొచ్చే సమయంలో మిషన్ విఫలమయ్యే పరిస్థితి సంభవిస్తే.. వ్యోమగాములు సురక్షితంగా బయటపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్ధారించుకునేందుకు గగన్‌యాన్ ప్రయోగాత్మక ప్రయోగం ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇలా రెండు ఎక్స్‌పెరిమెంటల్ ప్రయోగాలు చేశాక గగయాన్ సిరీస్‌లో మ్యాన్ మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతామని ఇస్రో శాస్త్రవేత్తలంటున్నారు. వ్యోమగాములను రోదసీలోకి పంపి తిరిగి క్షేమంగా తీసుకురావడమే ఇస్రో ముందున్న లక్ష్యమని వారు చెబుతున్నారు.

క్లుప్తంగా...

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ 20కి వాయిదా

విశాఖ లీగల్: పాదయాత్ర సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించిన విచారణను విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు నిందితుడు జె.శ్రీనివాసరావును రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఎల్లో మీడియా నా మాటలను వక్రీకరించింది : మంత్రి సురేష్

- గురువులను నేను కించపరిచేలా మాట్లాడలేదు



సాక్షి, అమరావతి: గురువులు కన్నా గూగుల్ మేలని తాను అనలేదని, తాను అలా అన్నట్టు వచ్చిన వార్తలను ఖండిస్తున్నానని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఒంగోలులో ఉపాధ్యాయ దినోత్సవ సభలో తాను మాట్లాడింది ఒకటైతే.. మీడియా దానిని వక్రీకరించి ఉపాధ్యాయ లోకానికి తప్పుడు సంకేతాలు పంపి తనపై వ్యక్తిగత దాడికి దిగే ప్రయత్నం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాను ఉపాధ్యాయుడిగా ఉండాలని గర్వపడతానని అదే సభలో మాట్లాడింది వినిపించలేదా.. అని ప్రశ్నించారు. మారుతున్న కాలానికనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఇంటర్నెట్ సౌలభ్యంతో సమాచారం అంతా దొరుకుతున్న ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థులే అనే ఉద్దేశంలో తాను మాట్లాడినట్టు తెలిపారు. టెక్నాలజీ పెరిగిపోయి మారిన కాలానికి అనువుగా సమాచారాన్ని గూగుల్ తల్లిని అడిగి తెలుసుకున్నానన్నారు. గూగుల్‌ను సృష్టించింది కూడా గురువులే కదా.. అని ఆయన ప్రశ్నించారు. తాను గురువులను కించపరిచేలా మాట్లాడలేదని, తన తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం పైన, తనపైన.. మరీ ముఖ్యంగా వ్యక్తిగతంగా తనపై ఎల్లో మీడియా బురద జల్లుతోందని, దీనిని నమ్మొద్దని ఉపాధ్యాయులను కోరారు. అనని మాటలను వక్రీకరించి పత్రికల్లో ప్రచురించుకునే సంస్కృతి మంచిది కాదని మంత్రి సురేష్ హితవు పలికారు.

ఆ ముగ్గురి నియామకంపై వివరాలివ్వండి

ప్రభుత్వానికి, టీటీడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : టీటీడీ బోర్డు సభ్యులుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పారిశ్రామికవేత్త పెనకా శరత్‌చంద్రారెడ్డి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మాజీ చైర్మన్ కేతన్ దేశాయ్ నియామకానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీటీడీ ఈవోను హైకోర్టు ఆదేశించింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఈ ముగ్గురినీ టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించడం దేవదాయ చట్ట నిబంధనలకు విరుద్ధమని, వీరి నియామకాన్ని రద్దు చేయాలని కోరుతూ విశ్రాంత రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు హైకోర్టులో గత వారం ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ అకుల వెంకట శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపి, వారి నియామకం వివరాలను ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 13కి వాయిదా వేసింది.

ముందస్తు బెయిల్ పిటిషన్లు ఇన్నాళ్లు పెండింగ్‌లోనా..!

అలాంటి పిటిషన్లు ఏడాది పెండింగ్‌లో ఉండటం ఎప్పుడూ చూడలేదు

మాజీ మంత్రి నారాయణ, ఆయన బినామీల పిటిషన్లపై హైకోర్టు ఆశ్చర్యం



సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని ముసుగులో 1,100 ఎకరాల అసైన్డ్, లంక భూములను కాజేసిన వ్యవహారంలో 2020లో సీఐడీ నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ, ఆయన సమీప బంధువులు, బినామీలు దాఖలు చేసిన వ్యాజ్యాలు దాదాపు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉండటంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్లు ఏడాది పెండింగ్‌లో ఉండటం తామెన్నడూ చూడలేదని తెలిపింది. ఇదే సమయంలో వాదనలు వినిపించేందుకు నారాయణ, ఇతరుల తరఫు న్యాయవాదులు మరోసారి సమయం కోరడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇలానే వాయిదాలు కోరుతుంటే, నారాయణ తదితరులను అరెస్ట్ చేయవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తామని, అప్పుడు తీరిగ్గా వాదనలు వినిపించుకోవచ్చునని ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి ఎలాంటి వాయిదాలు వేసే ప్రసక్తే లేదని, ఇదే చివరి అవకాశమని నారాయణ తదితరులకు హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే ఒకవైపు ముందస్తు బెయిల్ పిటిషన్లు, మరో వైపు కేసు కొట్టేయాలంటూ క్వాష్ పిటిషన్లు సమాంతరంగా దాఖలు చేయడంపైనా హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇలా ఎలా రెండు రకాల పిటిషన్లు దాఖలు చేస్తారని, అవి ఎలా నిలబడతాయని ప్రశ్నించింది. ఇలాంటి ఫైలింగ్‌ను తామెన్నడూ చూడలేదని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాయిదాలతో కాలం వెళ్లదీస్తున్నారు...

తాజాగా ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు వచ్చాయి. నారాయణ తదితరుల తరఫు న్యాయవాదులు ఎస్.ప్రణతి, అజయ్ తదితరులు స్పందిస్తూ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తమ తరఫున వాదనలు వినిపించాల్సి ఉందని, వ్యక్తిగత కారణాలరీత్యా ఆయన హాజరు కాలేకపోతున్నందున విచారణను వాయిదా వేయాలని కోర్టును కోరారు. దీనిపై సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం తెలిపారు. సీనియర్ న్యాయవాది పేరుతో వాయిదాల మీద వాయిదాలు తీసుకుంటున్నారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఏడాది కాలంగా ఇలాగే ఈ వ్యాజ్యాల్లో విచారణను సాగదీస్తూ వస్తున్నారని తెలిపారు. అరెస్ట్‌పై స్టేను అడ్డం పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారని కోర్టుకు ఏఏజీ నివేదించారు. ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ, ఇలా పదే పదే వాయిదాలు కోరుతుంటే ఏఏజీ ప్రభుత్వానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని నారాయణ న్యాయవాదులను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. దాదాపు ఏడాదిగా ముందస్తు బెయిల్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం ఎన్నడూ చూడలేదని, ముందస్తు బెయిల్ పిటిషన్లు, క్వాష్ పిటిషన్లు సమాంతరంగా దాఖలు చేయడం ఏంటని ప్రశ్నించింది. దీనికి నారాయణ తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ, రెండు రకాల పిటిషన్లు దాఖలు చేయవచ్చునని, ఇందుకు సంబంధించిన తీర్పులను వాదనల సమయంలో కోర్టు ముందుంచి, సంతృప్తికర వివరణ ఇస్తామని తెలిపారు. ఆమె వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ వ్యాజ్యాల్లో తదుపరి ఎలాంటి వాయిదాలు ఇచ్చే ప్రసక్తేలేదని తేల్చి చెప్పింది. వాయిదాలు ఇవ్వడం ఇదే చివరి సారి అని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది.

ఏక కాలంలో రెండు పిటిషన్లా..

సీఐడీ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నారాయణ 2022 హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే సమయంలో ఆయన సమీప బంధువులు, బినామీలు తమపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ క్వాష్ పిటిషన్లు వేశారు. నారాయణ కూడా తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ 2023లో క్వాష్ పిటిషన్ వేశారు. 2022లో ముందస్తు బెయిల్ కోసం నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను అప్పట్లో విచారించిన హైకోర్టు, కేన్సర్ శస్త్రచికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు వీలుగా మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. నారాయణ సమీప బంధువులు, బినామీలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో స్పందించిన హైకోర్టు, సీఆర్‌పీసీ 41ఏను అనుసరించాలని సీఐడీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఈ వ్యాజ్యాల్లో విచారణ పలుమార్లు వాయిదా పడింది. తమకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఉండటంతో నారాయణ తదితరులు ఏదో ఒక కారణం చూపుతూ వాయిదాల మీద వాయిదాలు కోరుతూ వచ్చారు. దర్యాప్తు సంస్థ న్యాయవాదులు కూడా ఒకటి రెండు సార్లు వాయిదాలు అడిగారు.

కేసు కొట్టేయండి: హైకోర్టును ఆశ్రయించిన అయ్యన్న

సాక్షి, అమరావతి : మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సీహెచ్. అయ్యన్నపాత్రుడు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులను అసభ్యంగా దూషించినందుకు ఎమ్మెల్యే పేర్ని నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణా జిల్లా ఆత్కూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ అయ్యన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులు నమోదు చేసిన ఐపీసీ సెక్షన్లు 505(2), 153ఏలు పిటిషనర్లకు వర్తించవన్నారు. అయ్యన్నవర్గ విభేదాలను రెచ్చగొట్టేలా మాట్లాడలేదని, అసభ్య పదజాలం వాడలేదని అన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై మాత్రమే వ్యాఖ్యలు చేశారని తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ప్రభుత్వంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులపై అభ్యంతరకర పదజాలం ఉపయోగించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అలాంటి భాషా ప్రయోగం మంచిది కాదని హితవు పలికారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఉన్నతస్థానాల్లో ఉన్న వ్యక్తులను దూషించడం అయ్యన్నకు అలవాటుగా మారిందన్నారు. ఇలాంటి వారి విషయంలో కోర్టులు తగిన విధంగా స్పందించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పిటిషనర్ అయ్యన్నకి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు.

వియ్యంకుల వారి భూ విందు

- నారాయణ – గంటా అసైన్డ్ దందాలో బడుగులే సమిధలు
- 37 మంది బినామీలతో కారుచౌకగా సొంతం

సాక్షి, అమరావతి: ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా..? చంద్రబాబు బృందం అమరావతిలో ఏకంగా రూ.5,600 కోట్ల విలువైన 1,400 వేల ఎకరాలను కొల్లగొట్టితే ఆయన మంత్రివర్గ సహచరులు పొంగూరు నారాయణ, గంటా శ్రీనివాసరావు అదే రీతిలో భారీ భూదోపిడీకి పాల్పడ్డారు. వియ్యంకులు కూడా అయిన వారిద్దరూ బినామీల పేరిట 48 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధారాలతో సహా వెలికితీసింది. టీడీపీ సర్కారు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వకుండానే అసైన్డ్ భూములను రాజధాని కోసం తీసుకుంటుందని బడుగు రైతులను బెదిరించి నారాయణ – గంటా తమ పన్నాగాన్ని అమలు చేశారు. అందుకోసం సీఆర్‌డీఏ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారు. అసైన్డ్ భూముల చట్టాన్ని ఉల్లంఘించి తమ విద్యా సంస్థల సిబ్బంది, సమీప బంధువులు 37 మందిని బినామీలుగా చేసుకుని 142 సేల్ డీడ్ల ద్వారా 150 ఎకరాలను దక్కించుకున్నారు. దీనిపై సిట్ అధికారులు పూర్తి ఆధారాలతో కేసు నమోదు చేశారు. కేవలం రూ.18 కోట్లతో హస్తగతం చేసుకున్న ఆ 150 ఎకరాల విలువ ల్యాండ్ పూలింగ్ వర్తింపజేసిన అనంతరం అమాంతం రూ.550 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

బినామీల ఖాతాల్లోకి డబ్బులు..

వియ్యంకులైన పొంగూరు నారాయణ, గంటా శ్రీనివాసరావులు పన్నాగం పన్ని, అధికార బలంతో అమరావతిలో అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెంలోని అసైన్డ్ భూములపై కన్నేశారు. భూసమీకరణ కింద తీసుకునే అసైన్డ్ భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వదని సీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారుల ద్వారా ఆయా గ్రామాల్లోని పేద రైతులను నమ్మించారు. అనంతరం తమ బినామీలు అయిన ఆర్కే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో ఆ భూములను కారు చౌకగా కొనుగోలు చేసేందుకు సంప్రదింపులు జరిపారు. అందుకోసం నారాయణ విద్యా సంస్థల ద్వారా రూ.18 కోట్లను ఆర్కే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మళ్లించారు. నారాయణ విద్యా సంస్థల సిబ్బంది, తమ సమీప బంధువులను బినామీలుగా చేసుకుని వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఆర్కే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ఆ బినామీల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు మళ్లించారు. అనంతరం నారాయణ విద్యా సంస్థల సిబ్బంది, తమ సమీప బంధువుల పేరిట అసైన్డ్ భూములను సేల్ డీడ్ ద్వారా హస్తగతం చేసుకున్నారు. మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా 37 మంది పేరుతో 142 సేల్‌డీడ్‌లు రిజిస్టర్ చేయడం గమనార్హం. ఇలా కేవలం రూ.18 కోట్లకు 150 ఎకరాలను గుప్పిట పట్టారు. ఈ వ్యవహారం అంతా 2015 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరులో పూర్తి చేశారు.

రూ.532 కోట్లు నష్టపోయిన అసైన్డ్ రైతులు

అసైన్డ్ పేద రైతుల నుంచి 150 ఎకరాలు తమ హస్తగతం అయ్యాక నారాయణ, గంటా శ్రీనివాసరావులు అసలు విషయాన్ని తెరపైకి తెచ్చారు. అప్పటికే చంద్రబాబు పన్నాగం ప్రకారం అసైన్డ్ భూములకు కూడా భూసమీకరణ ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అసైన్డ్ భూములు తమ గుప్పిట్లోకి వచ్చిన తరువాత ఆ నిర్ణయాన్ని తాపీగా 2016 ఫిబ్రవరిలో ప్రకటించారు. అంతేకాదు అసైన్డ్ చట్టానికి విరుద్ధంగా అసైన్డ్ భూములను కొనుగోలు చేసినవారికి కూడా భూసమీకరణ ప్యాకేజీ వర్తింపజేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించడం గమనార్హం. తద్వారా అమరావతిలో భూముల మార్కెట్ విలువ అమాంతం పెరిగేలా చేశారు. అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ రూ.4 కోట్లు అని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే చెప్పడం గమనార్హం. నారాయణ, గంటా బినామీల ద్వారా దక్కించుకున్న 150 ఎకరాలకు భూసమీకరణ ప్యాకేజీని వర్తింపచేసుకున్నారు. దీని ప్రకారం జరీబు భూములకు ఎకరాకు వెయ్యి గజాల నివాస స్థలం, 450 గజాల వాణిజ్య స్థలం కేటాయించారు. ఈమేరకు 150 ఎకరాలకుగాను 1.50 లక్షల గజాల నివాస స్థలం, 67,500 గజాల వాణిజ్య స్థలం దక్కాయి. మార్కెట్ విలువ ప్రకారం ఆ భూముల విలువ దాదాపు రూ.550 కోట్లకు చేరింది. కేవలం రూ.18 కోట్లతో అక్రమంగా భూములను దక్కించుకుని కేవలం మూడు నెలల్లో ఆ భూముల విలువను రూ.550 కోట్లకు పెంచేసుకున్నారు. అసత్య ప్రచారాలు, బెదిరింపులకు పాల్పడకుండా ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ అసైన్డ్ రైతుల భూముల విలువ రూ.550 కోట్లకు పెరిగి ఆ ప్రయోజనం వారికే దక్కేది. దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను నారాయణ, గంటా బెదిరించి కారుచౌకగా గద్దల్లా తన్నుకుపోయారు.

బెయిల్ మంజూరుకు హైకోర్టు సిఫార్సు చేసిందా?

- చిలకలూరిపేట బస్సు దహనం కేసులో దోషి బెయిల్ పిటిషన్‌పై విచారణలో సుప్రీంకోర్టు ప్రశ్న
- అందుకు సంబంధించిన అదనపు పత్రాల సమర్పణకు అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ: చిలకలూరిపేట బస్సు, అందులో ప్రయాణికుల దహనం కేసులో దోషికి బెయిల్ మంజూరుకు హైకోర్టు సిఫార్సు చేసిందా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అందుకు సబంధించిన ఉత్తర్వులు ఉన్నాయా అని పిటిషనర్ న్యాయవాదిని అడిగింది. అదనపు పత్రాల సమర్పణకు అనుమతి ఇస్తూ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. 1993 మార్చిలో జరిగిన ఈ ఘటనలో చలపతిరావు, విజయవర్ధనరావులకు ఉరిశిక్ష పడింది. అనంతరం నాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్.. ఈ ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. 30 ఏళ్లుగా జైల్లో ఉన్నందున బెయిలు మంజూరు చేయాలంటూ చలపతిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టును ఆశ్రయించాలని తొలుత ధర్మాసనం పిటిషనర్ న్యాయవాదికి సూచించింది. ప్రయాణికులు సహా బస్సు దహనంలో నేరుగా పాల్గొన్న వ్యక్తి జైల్లో ఉండడమే శ్రేయస్కరమని వ్యాఖ్యానించింది. ఈ తరహా కేసులో బెయిలు మంజూరైన ఘటనలున్నాయని చలపతిరావు న్యాయవాది తెలిపారు. హైకోర్టు కూడా బెయిలు మంజూరుకు సిఫార్సు చేసిందన్నారు. దీంతో ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. హైకోర్టు ఈ విధంగా సిఫార్సు చేసిందా? ఉత్తర్వులు ఉన్నాయా? అని ప్రశ్నించింది. సదరు ఉత్తర్వులు, అదనపుపత్రాల సమర్పణకు గడువు ఇవ్వాలని న్యాయవాది కోరగా నాలుగు వారాలు సమయమిస్తూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఎస్‌వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లింపు

- 2014లో ఫ్యాక్టరీని మూసివేసిన చంద్రబాబు
- వేతన బకాయిలు చెల్లించకుండా కార్మికులకు ఇబ్బందులు
- సమస్య తన దృష్టికి రాగానే నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- 368 మందికి రూ.21.36 కోట్లు అందజేసిన మంత్రి రోజా



రేణిగుంట(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా గాజులమండ్యం ఎస్‌వీ సహకార చక్కెర కర్మాగారం కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతన బకాయిలను చెల్లించింది. 368 మంది కార్మికులకు 9 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.21.36 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవల విడుదల చేశారు. బుధవారం ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి మంత్రి రోజా.. కార్మికులకు చెక్కులు పంపిణీ చేశారు. రేణిగుంట మండలం గాజులమండ్యంలోని శ్రీ వెంకటేశ్వర సహకార చక్కెర కర్మాగారాన్ని చంద్రబాబు అధికారంలోకి రాగానే 2014లో మూసివేశారు. కానీ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించలేదు. దీంతో కార్మికులు పని కోల్పోయి.. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి సమస్య తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 368 మంది కార్మికులకు అందాల్సిన బకాయిలు మొత్తం రూ.21.36 కోట్లను విడుదల చేశారు. వాటిని బుధవారం మంత్రి రోజా అందజేయగా.. కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్య తెలియగానే నిధులు విడుదల చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఎండీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

15 కొత్త రైల్వే లైన్లకు మోక్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 15 కొత్త రైల్వే ప్రాజెక్టులను నిర్మించేందుకు రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. 2,647 కి.మీ. నిడివితో నిర్మించే ఆ ప్రాజెక్టులకు రూ.50,848 కోట్లు వ్యయం కానున్నట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ప్రకటించింది. వీటితోపాటు రూ.32,695 కోట్లు వ్యయమయ్యే 2,588 కి.మీ. 11 డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులకు కూడా ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైనట్టు వెల్లడించింది. రీజినల్ రింగ్ రైల్, ఆదిలాబాద్-పటాన్‌చెరు, ఘట్కేసర్-యాదాద్రి, తాండూరు-జహీరాబాద్, మణుగూరు-రామగుండం, ఉందానగర్-జగ్గయ్యపేట, కరీంనగర్-హసన్‌పర్తి, డోర్నకల్-మిర్యాలగూడ, భూపాలపల్లి-కాజీపేట, పాండురంగాపురం-మల్కన్‌గిరి, కొత్తగూడెం-కిరండోల్, బోధన్-లాతూరు రోడ్ ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వేలు మంజూరైనట్టు వెల్లడించింది.

కీలకం.. రీజినల్ రింగ్ రైల్

నగరానికి 50 కి.మీ. నుంచి 70 కి.మీ. వెలుపల దాదాపు 338 కి.మీ. నిడివితో నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల దానికి సమాంతరంగా రింగ్ రైల్ ప్రాజెక్టు రాబోతోంది. రూ.12,408 కోట్ల వ్యయంతో దాదాపు 564 కి.మీ. నిడివితో ఈ ప్రాజెక్టు ఉంటుందని రైల్వే ప్రకటించింది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, అక్కన్నపేట్, సిద్దిపేట, గజ్వేల్, యాదాద్రి-భువనగిరి, రామన్నపేట, చిట్యాల, షాద్‌నగర్, షాబాద్ తదితర పట్టణాలను అనుసంధానిస్తూ ఇది రూపొందనుంది. అక్కన్నపేట, యాదాద్రి, చిట్యాల, బూర్గుల, వికారాబాద్, మెదక్, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్ల మీదుగా కొత్త లైన్లు నిర్మించనుండటం విశేషం. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలకు మెరుగైన రవాణా వసతి కలగటంతోపాటు సరుకు రవాణా రైళ్లకు కూడా అడ్డంకులు లేని సాఫీ ప్రయాణానికి వెసులుబాటు కలుగుతుందని రైల్వే చెబుతోంది.

ఆయేషా మీరా కేసులో సాక్షుల విచారణ



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ఆయేషా మీరా హత్య కేసులో పలువురు సాక్షులను సీబీఐ అధికారులు బుధవారం విచారించారు. విజయవాడలోని సీబీఐ కార్యాలయంలో ఈ విచారణ జరిగింది. 16 ఏళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో నేటికీ నిందితులను పట్టుకోలేకపోవడంతో ఆమె తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. దీంతో సీబీఐ అధికారులు ఈ కేసును అనేక కోణాల్లో విచారించారు. 2019లో ఆయేషా మీరా మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయించారు. అసలు నిందితుల కోసం విచారణ వేగవంతం చేశారు. విచారణలో భాగంగా ఆయేషా మీరా కేసును వాదించిన న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు, తాజాగా ఆయేషా మీరా కేసులో పంచనామా నిర్వహించిన కృష్ణప్రసాద్‌తో పాటు పలువురు సాక్షులను అధికారులు విచారించారు. కేసు విచారణలో తాము ఎప్పుడు పిలిచినా రావాల్సిందిగా అధికారులు సాక్షులకు సూచించారు.

అగ్రిగోల్డ్ కుంభకోణంలో ఈడీ చార్జిషీట్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అగ్రిగోల్డ్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం చార్జిషీట్ దాఖలు చేసింది. కంపెనీ ప్రమోటర్లు ఏవీ రామారావు, శేషునారాయణరావు, హేమసుందర వరప్రసాద్ పేర్లను అందులో పేర్కొంది. అలాగే అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్లు సహా 11 అనుబంధ కంపెనీలపై కూడా నాంపల్లి ఎంఎస్‌జే న్యాయస్థానంలో ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. వీటిని కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా అక్టోబర్ 3న న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని అగ్రిగోల్డ్ ప్రమోటర్లు, కంపెనీల ప్రతినిధులకు కోర్టు సమన్లు జారీ చేసింది. అగ్రిగోల్డ్ సంస్థ పెట్టుబడుల పేరుతో దేశవ్యాప్తంగా డిపాజిట్లు సేకరించిన సంగతి తెలిసిందే. ప్లాట్ల కొనుగోళ్లు, అమ్మకాలు, పెట్టుబడులకు ఎక్కువ వడ్డీ ఇస్తామంటూ ఈ సంస్థ 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి సుమారు రూ.6,380 కోట్లు వసూలు చేసింది. అగ్రిమెంట్ల ప్రకారం డిపాజిటర్లకు సొమ్ము తిరిగి చెల్లించకుండా మోసం చేసింది. బాధితుల ఫిర్యాదులతో ఏపీ సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐడీ కేసు ఆధారంగా ఈడీ కూడా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్(పీఎంఎల్‌ఏ) యాక్ట్ కింద కేసు రిజిస్టర్ చేసింది. 2020 ఏప్రిల్ 3న హైదరాబాద్, విజయవాడ, గుంటూరులలో ఏకకాలంలో సోదాలు జరిపింది. ప్రమోటర్లు, మేనేజర్లు, ఆడిటర్ల ఇళ్లల్లో తనిఖీలు చేసింది. డిపాజిట్ల రూపంలో సేకరించిన డబ్బుతో సొంత ఆస్తులను కూడబెట్టారని గుర్తించింది. షెల్ కంపెనీలు, బినామీల పేర్లతో మనీలాండరింగ్ చేసినట్లు ఆధారాలు సేకరించింది. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లను, ఆడిట్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. దర్యాప్తులో భాగంగా 4,141 కోట్ల విలువ చేసే స్థిరచరాస్తులను రెండు విడతలుగా అటాచ్ చేసింది.

పేదరికాన్ని గెలిచి.. స్ఫూర్తిగా నిలిచి..

- సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి.. అత్యున్నత స్థానానికి..
- ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కుమ్మరిలోవ కుర్రాడు
- కేంద్రం నుంచి ఎ–గ్రేడ్ గెజిటెడ్ హోదా
- పరిశోధనలతో దేశానికి సేవలందిస్తానంటున్న నానాజీ



భిలాయ్ ఐఐటీలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న డాక్టర్ నానాజీ



ల్యాబ్‌లో పరిశోధనలు చేస్తున్న నానాజీ

తుని రూరల్: దేశంలోనే అత్యున్నతమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి విద్యా సంస్థల్లో చదువుకునేందుకు సీటు లభించడమే అదృష్టంగా చాలా మంది భావిస్తారు. అటువంటిది సాధారణ గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆ యువకుడు ఏకంగా ప్రతిష్టాత్మక ఐఐటీలో ఉద్యోగం సాధించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎ–గ్రేడ్ గెజిటెడ్ హోదా దక్కించుకున్నారు. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ గ్రామానికి చెందిన డాక్టర్ కచ్చాల నానాజీ పేదరికాన్ని జయించారు. పరిశోధనల బాట పట్టి.. ఐఐటీ – భిలాయ్‌లో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. పట్టుదల, ప్రతిభాపాటవాలతో అంచెలంచెలుగా ఉన్నత శిఖరాన్ని అధిరోహించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఐఐటీలో బోధిస్తూనే పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

కష్టాలు అధిగమించి.. ప్రతిభతో రాణించి..

కుమ్మరిలోవ గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన కచ్చాల అప్పలనాయుడు, వరహాలమ్మ దంపతుల కుమారుడు నానాజీ. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులు పడే కష్టాలను చిన్నతనం నుంచే అతడు కళ్లారా చూశాడు. తమలా తమ బిడ్డ కష్టాలు పడకూడదని ఆ తల్లిదండ్రులు భావించారు. రెండు కిలోమీటర్ల దూరంలోని తునిలో ఉన్న ఒక ప్రైవేటు స్కూల్లో నానాజీని పదో తరగతి వరకూ చదివించారు. అదే సమయంలో తండ్రి అప్పలనాయుడు మరణించాడు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని మరీ తల్లి వరహాలమ్మ తన బిడ్డను చదువులో ప్రోత్సహించింది. తన ప్రతిభతో నానాజీ పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్‌లో చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. అక్కడే ఇంటర్మీడియెట్, కెమిస్ట్రీలో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ పూర్తయ్యింది. ఐఐటీ మద్రాసు నుంచి రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసి, డాక్టరేట్ పొందారు. దీనికి ఉత్తమ పీహెచ్‌డీగా నానాజీకి ప్రొఫెసర్ వెర్నర్ ప్రైజ్ లభించింది. అనంతరం అతడు హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ ఆర్‌అండ్‌డీ సెంటర్ ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ)లో ఐదేళ్లు శాస్త్రవేత్తగా పని చేశారు. బెంగళూరులో ఓలా ఎలక్ట్రిక్ బ్యాటరీ ఇన్నోవేషన్ సెంటర్‌లో సీనియర్ మేనేజర్, ప్రిన్సిపాల్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహించారు. లి–అయాన్ బ్యాటరీ డ్రై ఎలక్ట్రోడ్ కోటింగ్‌లో పని చేశారు.

అవార్డులు.. అభిరుచులు

సస్టెయినబుల్ మెటీరియల్స్, లి–అయాన్ బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు, సాలిడ్ స్టేట్ బ్యాటరీలు, హైబ్రీడ్ కెపాసిటర్ల రూపకల్పన, పరిశోధనల అనువాదంపై నానాజీకి ఎంతో మక్కువ. రూ.8.80 కోట్ల విలువైన ముగ్గురు స్పాన్సరర్ల ఇండస్ట్రియల్ ప్రాజెక్టుల్లో పని చేశారు. జర్మనీలో ప్రతిష్టాత్మకంగా జరిగిన లిండావ్ నోబెల్ అవార్డు గ్రహీతల సమావేశానికి హాజరయ్యారు. దీనికిగాను డీఎస్‌టీ–డీఎఫ్‌జీ అవార్డు, ఐఐటీ మద్రాసు ఇన్‌స్టిట్యూట్ పరిశోధన అవార్డు, కేవీఆర్‌ఎస్‌ఎస్ యంగ్ సైంటిస్ట్ సహా అనేక అవార్డులు నానాజీకి లభించాయి. ఐదు పేటెంట్లకు దాఖలు చేశారు. ఆయన రాసిన 30 పత్రాలు అంతర్జాతీయ ప్రఖ్యాత పత్రికల్లో ప్రచురితమయ్యాయి. డాక్టర్ నానాజీ ప్రస్తుతం అమెరికన్ కెమికల్ సొసైటీ, ఎలక్ట్రో కెమికల్ సొసైటీ సభ్యుడిగా ఉన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..

దేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అత్యుత్తమ సాంకేతిక విద్యా సంస్థ. దీనిలో సీటు పొందిన ప్రతి విద్యార్థీ తెలివైనవారే. అటువంటి వారికి బోధించే అవకాశం, అత్యాధునిక పరిశోధనలు చేసే అదృష్టం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాకు దక్కింది. గౌరవప్రదమైన స్థానం లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, దేశానికి సేవలు అందిస్తాను. నా విజయంలో అమ్మానాన్నల ప్రోత్సాహం, చిన్నాన్న తలుపులు, గ్రామస్తుల సహకారం మరువలేనిది.

– డాక్టర్ కచ్చాల నానాజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ, భిలాయ్

ఆనందంగాఉంది

నా కుమారుడు నానాజీకి ఉన్నతమైన ఉద్యోగం లభించడం ఆనందంగా ఉంది. మాలా వ్యవసాయ పనుల్లో ఉండి పోకుండా నానాజీని నా భర్త అప్పలనాయుడు ప్రోత్సహించి చదువుకు పంపించారు. ఆయన మరణించినా ఆయన చూపించిన దారిలో కష్టపడి చదువుతానంటే నేనూ ప్రోత్సహించాను. ఉద్యోగం వచ్చిందన్నదే తప్ప అది ఎంత పెద్దదన్నది నాకు తెలియదు. మంచి ఉద్యోగం లభించిందన్న ఆనందం కలిగింది. భిలాయ్‌లోనే క్వార్టర్స్ ఇవ్వడంతో నా కుమారుడిని చూసేందుకు వెళ్తున్నాను. పది రోజులుండి మళ్లీ ఇక్కడికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తాను.

– కచ్చాల వరహాలమ్మ, నానాజీ తల్లి



అసాధ్యమైనది పొందాలంటే,
ఒక మనిషి అసంగతమైనది ప్రయత్నించాలి.
- మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 7 సెప్టెంబర్ 2023

నిజం చెబితే నేరమా?

విద్వేషాగ్నిని రెచ్చగొట్టి, విధ్వంసానికి పాల్పడి, మహిళల్ని నగ్నంగా ఊరేగించిన వారిపై కేసులు పెట్టి, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి పాలకులకు వారాలు, నెలలు పడుతుంది. కానీ, నిజ నిర్ధారణ కమిటీలో భాగంగా వాస్తవ స్థితిని బాహ్య ప్రపంచానికి వెల్లడించి, తప్పులను ఎత్తిచూపిన పత్రికా ప్రముఖులపై కేసులు పెట్టడమైతే మాత్రం తక్షణమే జరిగిపోతుంది. ఘనత వహించిన మన మణిపూర్ పాలకుల తీరు ఇది. కేసులు మీద పడ్డ జర్నలిస్టులు చివరకు దేశ అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తే కానీ బుధవారం తాత్కాలిక రక్షణ, సాంత్వన లభించని పరిస్థితి. ఒక్కమాటలో తెచ్చిన సమాచారం వినకుండా, ఆ సమాచారం తెచ్చిన దూతను పాలకులు కొట్టడమంటే ఇదే!

ఈశాన్య రాష్ట్రంలోని ఘర్షణలపై మీడియాలో వార్తల నివేదన ఎలా ఉందన్న అంశంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నిజనిర్ధారణ సంఘం శనివారం వెలువరించిన నివేదిక ఇంత రచ్చకు దారి తీసింది. సదరు నివేదిక పక్షపాత వైఖరితో, తప్పుదోవ పట్టించేలా ఉందని ఆరోపిస్తూ, ఓ సోషల్ మీడియా ఉద్యమకారుడు కేసు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేసు పెట్టడంతో నిజనిర్ధారణ సంఘంలోని ముగ్గురు సభ్యుల పైన, అలాగే ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిపైన ఒకటికి రెండు ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలయ్యాయి. గత నాలుగు నెలల్లో మణిపూర్‌లో పరిస్థితిపైన నోరు విప్పి మాట్లాడడానికి తీరిక లేని ఆ రాష్ట్ర సీఎంకు ఈ విషయంపై మాత్రం విలేఖరులందరినీ కూర్చోబెట్టుకొని మనసులో మాట పంచుకొనే తీరిక, ఓపిక వచ్చాయి. ఎడిటర్స్ గిల్డ్‌ను తీవ్రస్వరంతో హెచ్చరించే సాహసమూ చేశారు.

నిజానికి, మెజారిటీ వర్గమైన మైతేయ్‌లకూ, మైనారిటీలైన కుకీ–చిన్‌లకూ మధ్య ఘర్షణలో మణిపూర్ మీడియా 'మెయితీల మీడియా'గా మారి పక్షపాత వైఖరితో ప్రవర్తిస్తోందని క్షేత్రస్థాయిలో పర్యటించి ఎడిటర్స్ గిల్డ్ అందించిన నిజనిర్ధారణ సంఘం తన నివేదికలో పేర్కొంది. ఆ మేరకు భారత ఆర్మీకి చెందిన 3వ కోర్ దళం కేంద్రకార్యాలయం సహా వివిధ వర్గాల నుంచి ఫిర్యాదు లొచ్చాయనీ గిల్డ్ తెలిపింది. ఇంటర్నెట్‌పై నిషేధంతో మణిపూర్ నుంచి వార్తల నివేదన కష్టమైందని అభిప్రాయపడింది. మీడియా ఫేక్‌న్యూస్ అందిస్తూ, తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నట్టు కనీసం 10 సందర్భాల్లో తమ ఫ్యాక్ట్–చెకింగ్ బృందం తేల్చినట్టు వెల్లడించింది. మణిపూర్ సర్కార్ మాత్రం ఈ నివేదిక అవాస్తవమనీ, ప్రాయోజితమనీ, వండి వడ్డించినదనీ ఆరోపిస్తోంది. తగలబడుతున్న ఓ భవనాన్ని కుకీల గృహంగా పేర్కొన్నారనీ, నిజానికది ఓ అటవీ అధికారి ఆఫీసనీ, నివేదిక మొత్తం 'కుకీ తీవ్రవాదుల' ప్రాయోజితమనేది గిల్డ్‌పై దాఖలైన ఫిర్యాదు. ఫోటో ఎడిటింగ్‌లో ఆ పొరపాటు జరిగిందని గిల్డ్ విచారం వ్యక్తం చేసి, వివరణ ఇచ్చినా కేసులు ఆగలేదు.

మరి, మే 3 నుంచి నాలుగు నెలల పైగా రాష్ట్రం తగలబడుతూ, కనీసం 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి, వేలమంది నిరాశ్రయులైనా నిమ్మకు నీరెత్తిన నీరో చక్రవర్తిని తలపిస్తున్న పాలకులపై ఎన్ని కేసులు పెట్టాలి? విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైనా సరే నైతిక బాధ్యత వహించక కుర్చీ పట్టుకు వేళ్లాడుతున్న సీఎంను ఏమనాలి? అందరినీ సమభావంతో చూడాల్సిన సదరు వ్యక్తే తాను ఒక వర్గానికి ప్రతినిధి అన్నట్టు నిర్లజ్జగా వ్యవహరించడాన్ని ఎలా సమర్థించాలి? ఇళ్ళు, స్కూళ్ళు, చర్చీలు తగలబడుతూ ఘర్షణలు రేగుతున్నా అంతా ప్రశాంతంగా ఉందనీ, సాధారణ పరిస్థితులు తిరిగొస్తున్నాయనీ అసత్యాలు చెబుతుంటే సిసలైన జర్నలిస్టులు ఏం చేయాలి?

ఎప్పుడైనా, ఎక్కడైనా ఏకపక్షంగా వార్తలు రాస్తూ, వాస్తవాలను వక్రీకరించడం ఘోరం, నేరం. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగంలో అలాంటి పగుళ్ళు పెరిగితే, ప్రజాస్వామ్య సౌధం కుప్పకూలుతుంది. అస్సామ్ రైఫిల్స్‌పై నిరంతర దుష్ప్రచారం అందుకు చిరు ఉదాహరణ. ఘర్షణలకు సరిగ్గా రెండు నెలల ముందే కుకీ వేర్పాటువాద బృందాలతో కాల్పుల విరమణ ఒప్పందం లాంటి త్రైపాక్షిక 'చర్యల సస్పెన్షన్' ఒప్పందం నుంచి బీజేపీ రాష్ట్ర సర్కార్ ఎందుకు ఉపసంహరించుకుందన్నది దేవరహస్యం. ఇలాంటి వాస్తవాల్ని గిల్డ్ నివేదిక ఎత్తిచూపితే, కేసులు వేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యం? కానీ, ప్రజాస్వామ్యంలో ఆరు నెలలకు ఒకసారైనా అసెంబ్లీ సమావేశం కావాలన్న రాజ్యాంగ నిబంధనను ఉల్లంఘిస్తే తిప్పలొస్తాయని పాలకులు తంటాలు పడ్డారు. రాష్ట్రం తగలబడుతున్నా భేటీ కాని సభ గత నెలాఖరులో ఒక్కరోజే అదీ 11 నిమిషాలే సమావేశమైంది.

ఎడిటర్స్ గిల్డ్ వెలువరించిన నివేదికలో అవాస్తవాలు ఉంటే ప్రభుత్వం ఆ మాటే స్పష్టం చేయవచ్చు. అసలు నిజాలేమిటో బహిరంగంగా వివరించి, ఎడిటర్ల బృందం తప్పని నిరూపించనూ వచ్చు. అంతేకానీ, క్షేత్రస్థాయి పర్యటనతో వాస్తవాల్ని బయటపెట్టేందుకు ప్రయత్నిస్తే 'మరిన్ని ఘర్షణల్ని ప్రోత్సహిస్తున్నార'నడం సమర్థనీయం కాదు. మీడియా పనితీరుకు పరిమితం కాక, ఘర్షణలకు కారణాల్నీ గిల్డ్ పరిశీలించడమేమిటని ప్రశ్నించడమూ అర్థరహితం. పైపెచ్చు, అదే నేరమన్నట్టు క్రిమినల్ ఛార్జీలు నమోదు చేయడం ఏ రకంగానూ సరికాదు. ఈ వైఖరి అప్రజాస్వామికం, తర్కరహితమే కాదు, అక్షరాలా అధికార దుర్వినియోగం! మణిపూర్ సర్కార్ ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి. ఎడిటర్స్ గిల్డ్ ప్రతినిధులపై కేసును ఉపసంహరించుకోవాలి. ముదిరిన జాతి విద్వేషాల్ని తగ్గించడమెలాగన్న దానిపై దృష్టి పెట్టాలి. ఆ అసలు సమస్యను వదిలేసి, కొసరు కథను పట్టుకొని వేళ్ళాడడం ప్రజలకూ, ప్రజాస్వామానికీ ఏ విధంగానూ మేలు చేయదు. కానీ, మన పాలకులు ఇవన్నీ చెవికెక్కించుకొనే స్థితిలో ఉన్నారా అన్నది బేతాళ ప్రశ్న.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి రా.7.56 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రోహిణి ప.3.09 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.6.59 నుండి 8.36 వరకు, తిరిగి రా.8.55 నుండి 10.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.51 నుండి 1.31 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

అవనిని తోడ్కొని ఆఖరి మైలు వరకు!

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

వసుధైక కుటుంబం! ఈ రెండు పదాల్లో యావత్ ప్రపంచాన్నీ ఏకం చేసే లోతైన తాత్త్వికత దాగి ఉంది. 'ప్రపంచమంతా ఒకే కుటుంబం' అన్నదే ఈ రెండు మాటలు బోధించే విశాల భావన. ప్రాదేశిక సరిహద్దులు, భాషలు, భావజాలాలకు అతీతంగా మనమంతా ఒకే సార్వజనీన కుటుంబంగా పురోగమించేలా మనల్ని ప్రోత్సహిస్తూ అందరినీ ప్రపంచ ప్రజానీకంతో మమేకం చేసే విశ్వ దృక్పథమిది. భారత్ జి–20 అధ్యక్షతన ఈ దృక్పథం ప్రాతిపదికగానే మానవ కేంద్రీకృత పురోగమనం అనే భావన ఒక పిలుపుగా రూపొందింది. ఒక భూమిపై నివసించేవారిగా మన గ్రహాన్ని తీర్చిదిద్దుకోవడానికి మనమంతా ఏకమౌదాం. ఒకే కుటుంబంగా... అభివృద్ధి సాధనలో పరస్పరం మద్దతిచ్చుకుందాం. సమష్టి భవిష్యత్తే ఏకైక భవిష్యత్తు అన్నది ఈ పరస్పర అనుసంధాన యుగంలో తోసిపుచ్చలేని వాస్తవం.

మహమ్మారి అనంతర ప్రపంచ క్రమం అంతకు ముందున్న ప్రపంచానికి ఎంతో భిన్నమైనది. ఈ మేరకు సంభవించిన మార్పులలో ముఖ్యమైనవి మూడు ఉన్నాయి: మొదటిది, ప్రపంచ జీడీపీ కేంద్రీకృత దృక్పథం నుంచి మానవ కేంద్రీకృత దృక్పథానికి మారడం అవసరమనే అవగాహన పెరగడం. రెండవది, వస్తూత్పత్తి సరఫరా, పంపిణీల క్రమంలో ఒడిదుడుకులను తట్టుకుని కోలుకునే సామర్థ్యాన్ని, నమ్మకమైన నిలకడల ప్రాముఖ్యాన్ని ప్రపంచం గుర్తిస్తుండటం. మూడవది, అంతర్జాతీయ వ్యవస్థలలో సంస్కరణల ద్వారా బహుపాక్షికతకు ఉత్తేజమిచ్చే దిశగా సామూహిక గళం వినిపిస్తుండటం. ఈ మూడు రకాల మార్పులకు సంబంధించి జి–20కి భారత అధ్యక్షత ఉత్ప్రేరక పాత్రను పోషించింది. ఈ మేరకు ఇండోనేషియా నుంచి 2022 డిసెంబరులో మనం అధ్యక్ష బాధ్యతను స్వీకరించిన వేళ ప్రపంచ ఆలోచనా వైఖరులలో మార్పులకు జి–20 ఉత్ప్రేరకం కావాల్సి ఉంటుందని నేనొక వ్యాసంలో రాశాను. వర్ధమాన, దక్షిణార్ధ గోళ దేశాలు సహా ఆఫ్రికా ఖండంలోని బడుగు దేశాల ఆకాంక్షలను ప్రధాన స్రవంతిలో చేర్చాల్సిన నేపథ్యంలో ఇదొక ప్రత్యేక అవసరం.

ఈ మేరకు జి–20కి మన అధ్యక్షతన తొలి కార్యాచరణలో భాగంగా దక్షిణార్ధ గోళ దేశాల గళం వినిపించేందుకు నిర్వహించిన శిఖరాగ్ర సదస్సులో 125 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. దక్షిణార్ధ గోళ దేశాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడంలో అదొక కీలక కసరత్తు. అంతేకాకుండా మన అధ్యక్షత సమయాన ఆఫ్రికా దేశాలనుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనడంతోపాటు ఆఫ్రికా సమాఖ్యకు జి–20 శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపాదన కూడా వచ్చింది. పరస్పర సంధానిత ప్రపంచమంటే వివిధ రంగాల్లో మన సవాళ్లు కూడా పరస్పరం ముడిపడి ఉంటాయి. ఇక 2030 గడువుతో సాధించాల్సిన లక్ష్యాలకుగాను మనమిప్పుడు మధ్య కాలంలో ఉన్నాం. అయినప్పటికీ సుస్థిర ప్రగతి లక్ష్యాల (ఎస్.డి.జి.) దిశగా పురోగమనం లేదన్న ఆందోళన చాలా దేశాల్లో కనిపిస్తోంది. ఈ క్రమంలో ఎస్.డి.జి. ప్రగతిని వేగిరం చేయడంపై జి–20 కూటమి 2023 కార్యాచరణ ప్రణాళిక అన్ని దేశాలనూ భవిష్యత్తు వైపు నడిపిస్తుంది.

ప్రకృతితో సామరస్యపూరిత జీవనశైలి భారతదేశంలో ప్రాచీన కాలం నుంచీ కొనసాగుతున్నదే. అదే సమయంలో ఈ ఆధునిక యుగంలోనూ వాతావరణ కార్యాచరణకు మన వంతు సహకారం అందిస్తున్నాం. ప్రగతికి సంబంధించి దక్షిణార్ధ గోళంలోని అనేక దేశాలు వివిధ దశలలో ఉన్నాయి. అందువల్ల వాతావరణ కార్యాచరణ కావడం తప్పనిసరి. లక్ష్యసాధన ఆకాంక్షలు నెరవేరాలంటే ఇందుకు తగినట్లు వాతావరణ నిధుల సమీకరణ, సాంకేతికత బదిలీ కూడా అవశ్యం. 'పరిస్థితి చక్కబడాలంటే మనం ఏం చేయకూడదు?' అనే నిర్బంధాత్మక ధోరణి నుంచి మనం పూర్తిగా బయట పడాలన్నది మన దృఢ విశ్వాసం. అలాంటి ధోరణికి భిన్నంగా వాతావరణ మార్పుల పోరాటంపై చేయాల్సింది ఏమిటనే దిశగా నిర్మాణాత్మక ఆలోచనలపై మనం దృష్టి సారించాలి. సుస్థిర, నిలకడ గల నీలి ఆర్థిక వ్యవస్థ కోసం చెన్నై 'హెచ్ఎల్పీ'లు మన మహా సముద్రాలను ఆరోగ్యకరంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి. హరిత ఉదజని ఆవిష్కరణ కేంద్రంతోపాటు పరిశుభ్ర హరిత ఉదజని కోసం అంతర్జాతీయ పర్యావరణ వ్యవస్థ మన జి–20 అధ్యక్షత నుంచి ఆవిష్కృతమౌతుంది.

2015లో మనం అంతర్జాతీయ సౌర కూటమికి నాంది పలికాం. నేడు ప్రపంచ జీవ ఇంధన కూటమి ద్వారా, వర్ధుల ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు తగినట్లు ఇంధన పరివర్తనకు శ్రీకారం చుట్టడంలో ప్రపంచానికే మనం ఆసరా అవుతున్నాం. వాతావరణ ఉద్యమానికి



ఊపునివ్వడంలో వాతావరణ కార్యాచరణను ప్రజాస్వామ్యీకరించడం ఉత్తమ మార్గం. వ్యక్తులు తమ దీర్ఘకాలిక ఆరోగ్యం ప్రాతిపదికగా రోజువారీ నిర్ణయాలు తీసుకున్న రీతిలోనే మన భూమి దీర్ఘకాలిక ఆరోగ్యంపై ప్రభావం ప్రాతిపదికగా జీవనశైలిపై నిర్ణయాలు తీసుకోవచ్చు. మానవ శ్రేయస్సుకు యోగాభ్యాసం ఒక అంతర్జాతీయ ఉద్యమంగా రూపొందిన తరహాలోనే మనం కూడా 'సుస్థిర పర్యావరణం కోసం జీవనశైలి'(లైఫ్)తో ప్రపంచవ్యాప్తంగా కదలిక తెచ్చాం.

వాతావరణ మార్పుల ప్రభావం నేపథ్యంలో ఆహారం–పోష్టికతల భద్రతకు హామీ ఇవ్వడం ఎంతో కీలకం. ఈ హామీతో పాటు వాతావరణ అనుకూల వ్యవసాయ వృద్ధికి చిరుధాన్యాలు లేదా 'శ్రీ అన్న' కూడా తోడ్పడతాయి. ప్రస్తుత అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సర నేపథ్యంలో మనం చిరుధాన్యాలను అంతర్జాతీయ ప్రజానీకం కంచాల్లోకి తీసుకెళ్లగలిగాం ఆహార భద్రత–పోష్టికతపై దక్కన్ ఉన్నత స్థాయి సూత్రాలు కూడా ఇందుకు సాయపడతాయి.

సాంకేతిక పరిజ్ఞానంలో పరివర్తన సర్వసాధారణమే. అదే సమయంలో అది సార్వజనీనం కూడా కావాలి. లోగడ సాంకేతిక పురోగమన ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందలేదు. అయితే, అసమానతల విస్తరణలోగాక తొలగింపులో సాంకేతికత వినియోగం ఎంత ప్రయోజనకరమో కొన్నేళ్లుగా భారత్ సాక్ష్యంగా నిరూపించింది. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగాబ్యాంకింగ్ సదుపాయం లేదా డిజిటల్ గుర్తింపు లేని కోట్లాది ప్రజలకు డిజిటల్ ప్రభుత్వ మౌలిక సదుపాయాలు (డి.పి.ఐ.) కల్పించడం ద్వారా ఆర్థిక సార్వజనీనతలో వారిని భాగస్వాములను చేయవచ్చు. ఈ మేరకు డి.పి.ఐ. ఆధారిత పరిష్కారాలకు నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వర్ధమాన దేశాలు సార్వజనీన వృద్ధి సాధనలో డి.పి.ఐ. ని స్వీకరించి, తమకు తగిన స్థాయిలో వాటిని రూపొందించుకునేలా మనం చేయూతనిస్తాం.

భారతదేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ కావడం యాదృచ్ఛికమేమీ కాదు. బలహీన/అట్టడుగు వర్గాలు మన పురోగమన పయనాన్ని నడిపించగలిగేలా మనం అమలు చేసిన సరళ, అనుసరణీయ, సుస్థిర పరిష్కారాలు శక్తినిచ్చాయి. అంతరిక్షం నుంచి క్రీడారంగం వరకు; ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఔత్సాహికత దాకా భారత మహిళలు వివిధ రంగాల్లో ముందంజ వేశారు. మహిళల నేతృత్వంలో ప్రగతికి వారు సరికొత్త అర్థం చెప్పారు. ఈ విధంగా లింగపరంగా డిజిటల్ విభజన తొలగింపు, శ్రామిక శక్తి పరంగా అంతరం తగ్గింపు సహా నాయకత్వం–నిర్ణయాత్మకతలో మహిళలు కీలక పాత్ర పోషించేలా ఇవి ప్రోత్సహిస్తున్నాయి.

భారత్‌కు జి–20 అధ్యక్షత ఉన్నతస్థాయి దౌత్య కర్తవ్యం మాత్రమే కాదు; ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా, వైవిధ్యానికి నమూనాగా యావత్ ప్రపంచం మన అనుభవాలను పంచుకునేందుకు ద్వారాలు తెరిచాం. వివిధ అంశాల్లో విజయసాధన అన్నది నేడు భారతదేశ సహజ లక్షణంగా మారింది. ఇందుకు జి–20 అధ్యక్ష బాధ్యత మినహాయింపు కాబోదు. ఇప్పుడీ బాధ్యత ప్రజాచోదక ఉద్యమంగా రూపొందటమే ఇందుకు కారణం. ఈ మేరకు దేశ వ్యాప్తంగా 60 నగరాల్లో 200కు పైగా సమావేశాలు, సదస్సులు నిర్వహించాం. వీటితోపాటు మన అధ్యక్ష బాధ్యతలు ముగిసేలోగా వీటిలో పాలుపంచుకున్న 125 దేశాలకు చెందిన 1,00,000 మందికిపైగా ప్రతినిధులకు మన ఆతిథ్యం రుచి చూపాం. ఇప్పటిదాకా ఏ దేశమూ ఇంత భౌగోళిక వైవిధ్యంతో జి–20 అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించింది లేదు.

భారతదేశ జనాభా, ప్రజాస్వామ్యం, వైవిధ్యం, ప్రగతిపై ఇతరుల నుంచి ప్రశంసలు వినడం ఒక అంశమైతే, అంతకన్నా ముందే వాటిని ప్రత్యక్షంగా అనుభవించడం పూర్తిగా భిన్నం. మన జి–20 ప్రతినిధులు దీనికి ప్రత్యక్ష సాక్షులుగా నిలుస్తారని నేను కచ్చితంగా నమ్ముతున్నాను. మన జి–20 అధ్యక్షత ప్రధానంగా విభజన రేఖల తుడిచివేతకు, అడ్డంకుల ఛేదనకు, విభేదాలకు భిన్నంగా ప్రపంచంలో సామరస్యం దిశగా సహకార బీజాలు వేయడానికి కృషి చేస్తుంది. 'ఎవరికివారే యమునాతీరే' అనే పరిస్థితికన్నా ఉమ్మడి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడమే మన లక్ష్యం. ఆ దిశగా ప్రతి స్వరం వినిపించేలా, ప్రతి దేశం సహకరించేలా అంతర్జాతీయ వేదిక విస్తరణకు మనం శపథం చేశాం. తదనుగుణంగా మన కార్యాచరణ, ఫలితాలు చెట్టాపట్టాలతో సాగుతున్నాయని నేను ఘంటాపథంగా చెప్పగలను.

(సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జి–20 న్యూఢిల్లీ శిఖరాగ్ర సమావేశం జరగనుంది.)

సోషల్ మీడియా

ఇలా చేస్తారా?



ఒక నటుడు నా సినిమా చేయడానికి అంగీకరించారు. ఇంతలో ఒక ఏజెన్సీ (అది ఏది? ఇదీ ఇప్పుడు ప్రశ్న) ఆయన ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించేలా చేసింది. ఇదీ సినీ పరిశ్రమ తీరు! ఇదీ సీనియర్ దర్శకులకు ఇచ్చే సోకాల్డ్ గౌరవం!

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

ఆటవిక హీరోలు



అఫ్గాన్లను ఎవరూ జయించలేరనేది ఒక మిథ్య. మహారాజా రంజిత్ సింగ్ మొత్తం కేపీకే (ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా), ఖైబర్ కనుమ, కశ్మీర్, జీబీ (గిల్‌గిత్–బాల్టిస్తాన్) గెలుచుకున్నారు. హరి సింగ్ నలవా (సిక్కు సేనాధిపతి) అంటే ఇప్పటికీ అఫ్గాన్ తల్లులు భయపడతారు. ఖైబర్ కనుమ వ్యాప్తంగా ఆటవికులను మన ఐకాన్లుగా మార్చుకున్నాం కాబట్టే, మన సమాజం నాశనమైంది.

– సయ్యద్ జబ్బార్ జైదీ, ఆర్థికవేత్త

కొత్త వంటకం



ముందు తుర్కియే, ఇప్పుడు భారత్. ఒకవేళ ఇండియా తన పేరును భారత్ అని మార్చుకుంటే, వచ్చే సంవత్సరంలో చేరే కొత్త ఆహ్వానిత దేశాల (అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ)తో 'బ్రిక్స్' కాస్తా 'బార్బిక్యూస్' అవుతుంది.

– వెలీనా చకరోవా, జర్నలిస్ట్

నాశన రంగం



పోషణ రంగంలోకి బిల్ గేట్స్ అడుగుపెడుతున్నారంటే, భారతదేశ వైవిధ్యభరిత, జీవావరణ సంబంధ ఆహారాలను ఆయన ధ్వంసం చేస్తారని కచ్చితంగా చెప్పవచ్చు. జన్యు మార్పిడి పంటలు, గోల్డెన్ రైస్ లాంటి ఆయనకు లాభాలనిచ్చే కృత్రిమ, కర్మాగార తయారీ ఆహారాలను చొప్పిస్తారు. మన ఆహార వారసత్వాన్ని తప్పక కాపాడుకోవాలి.

– వందనా శివ, పర్యావరణవేత్త

వన్యప్రాణి ప్రేమికుడు



ఆదిత్య డికీ సింగ్ (ప్రసిద్ధ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్) మరణించాడన్న దారుణ వార్తతో నిద్ర లేచాను. పులులకూ, వన్య ప్రాణులకూ ఆయన నిజమైన మిత్రుడు. ఫొటోగ్రఫీ సూచనల విషయంలో చాలా ఉదారంగా ఉండేవాడు. మొత్తంగా అద్భుతమైన మనిషి. స్నేహితుడా! నీ ఆత్మకు శాంతి కలగాలి.

– నేహా సిన్హా, కన్జర్వేషన్ బయాలజిస్ట్

ఖండిత భారత్



ఇండియా పేరు భారత్‌గా మార్పు చేయడంలో ఏ సమస్యా లేదు. అది (వారి) అంతర్గత అంశం. కానీ సమస్యంతా 'అఖండ్ భారత్' ప్రాజెక్టుతో ఉంది. ఇప్పటి ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, నేపాల్, శ్రీలంక, మయన్మార్ దేశాలన్నీ ఇందులోకి వస్తాయి. బీజేపీ నేతృత్వంలో ఈ కల ఏమోగానీ, ఇండియా మరింత విభజనకు గురవుతుంది.

– అబ్దుల్లా అలమాది, కాలమిస్ట్

ఇది మాత్రమే అభివృద్ధి కాదు!

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

76 ఏళ్ల స్వతంత్ర భారతదేశం సాధించిన ఘనతల పరంపరలో తాజాగా 'చంద్రయాన్–3' వచ్చి చేరడం కేంద్రంలోని పాలక పార్టీ బీజేపీకి కలిసొచ్చే అంశమే. ఇస్రో శాస్త్రవేత్తలు సల్పిన నిర్విరామ కృషి ఎన్డీఏ ప్రభుత్వ విజయంగా మారింది. కొన్ని దశాబ్దాల క్రితం రాకెట్లను ఎడ్ల బండ్లపై తీసుకెళ్లిన ఇస్రో శాస్త్రవేత్తలు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా... తమ కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు వారు నిస్వార్థంగా కృషి చేస్తూనే ఉన్నారు. చంద్రయాన్–3 విజయం భారత్ ప్రతిష్ఠను అమాంతం ఆకాశం అంత ఎత్తుకు పెంచేసింది. చంద్రయాన్–3 తర్వాత సూర్యయాన్ వైపు ఇస్రో శాస్త్రవేత్తలు తమ కృషిని సాగించడమూ భారతీయులందరికీ గర్వకారణమే.

అయితే, దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన ఈ ఘనత, అభివృద్ధి అన్ని రంగాలలో ప్రతిఫలిస్తున్నాయా? అనివార్యంగా వేసుకోవలసిన ప్రశ్న ఇది.

అభివృద్ధిని నిర్ధారించడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు కొలమానంగా మానవాభివృద్ధి సూచిక, శిశు మరణాల రేటు, పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఈ అంశాల ఆధారంగా భారత్‌తోపాటు ఇంచుమించుగా అదే సమయంలో స్వాతంత్ర్యం పొందిన దేశాలు, ఇతర అభివృద్ధి చెందిన దేశాల ప్రగతిని బేరీజు వేసుకోవలసిన అవసరం ఉంది. ఇటీవల ప్రపంచ బ్యాంకు వెల్లడించిన అభివృద్ధి నివేదికలలో పలు ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, చైనా, సౌత్ ఆఫ్రికాలు; జీ7 కంట్రీస్‌గా పిలవబడే కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్‌లు; ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలైన అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈజిప్ట్, హంగరీ, ఇండోనేషియా, ఇరాన్, మలేసియా, మెక్సికో, ఫిలిప్పీన్స్, పోలెండ్, సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తోపాటు భారత ఉపఖండంలోని బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక దేశాలు సాధించిన ర్యాంకింగ్‌ల ఆధారంగా అక్కడి స్థితిగతులు అర్థమవుతాయి.

పైన పేర్కొన్న దేశాల జాతీయ స్థూల ఉత్పత్తి



(జీడీపీ)ని పరిశీలిస్తే, 1960 నుంచి 2022 మధ్య కాలంలో తలసరి ఆదాయంలో భారత్‌ది అడుగు నుంచి మూడవ స్థానం. కేవలం పాకిస్తాన్, నేపాల్ మాత్రమే భారత్ కంటే దిగువన ఉన్నాయి. 1950 నుంచి 2021 మధ్య కాలంలో 31 దేశాల మానాభివృద్ధి సూచికలను పరిశీలించినప్పుడు భారత్ 1950లో 26వ స్థానంలో ఉండగా, 2021 నాటికి 29వ స్థానానికి పడిపోయింది. 32 దేశాల్లో శిశు మరణాలకు సంబంధించి 1960–1975 మధ్య కాలంలో, ఆ తర్వాత 2021 వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే... 1960–1975 మధ్య అత్యధిక శిశు మరణాలు నమోదైన దేశాలలో భారత్ 7వ స్థానంలో ఉంది. ఆ తర్వాత 2021 నాటికి ఆ స్థానం మరింత దిగజారి కింది నుంచి 3వ స్థానానికి చేరుకొంది.

పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం అంశంలో 31 దేశాలలో 1997 నుంచి 2022 మధ్యకాలంలో భారత్‌ది 21వ స్థానం. 1997–98లో భారత్ పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 7 శాతం ఉండగా, 2022 నాటికి అది 14.9 శాతంకు పెరిగింది. 140 దేశాల కంటే భారత్ పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. ఎక్కడైతే మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందో, ఆ దేశాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇక.. విద్యుత్, ఇంటర్నెట్ సేవల రంగాలలో మాత్రం భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. 1993–2000 మధ్య కాలంలో దేశంలో 50 శాతం జనాభాకు మాత్రమే విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉండగా, ప్రస్తుతం దేశంలో 99 శాతం మందికి విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇక, ఇంటర్నెట్ సేవల రంగాన్ని పరిశీలిస్తే, 2020 నాటికి భారత్‌లో 43 శాతం జనాభాకు ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరుపడిన భారత్ పౌరహక్కులు, లింగ సమానత్వం, స్వేచ్ఛ వంటి అంశాలలో ఎంతో వెనుకబడింది. మానవాభివృద్ధి సూచికల్లో ప్రధానమైన అంశంగా పౌరహక్కులను పరిగణిస్తారు. పౌరహక్కులలో భారత్ స్థానం 92గా ఉంది. అంటే, భారత్ కంటే 91 దేశాలు మెరుగైన పరిస్థితుల్లో ఉన్నట్టుగా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

భారతదేశంలో ప్రజాస్వామ్య మనుగడకు పలు రాజ్యాంగ వ్యవస్థలు దోహదం చేస్తాయి. అయితే, గత కొంతకాలంగా దేశంలోని పలు రాజ్యాంగ వ్యవస్థలను బలహీన పరిచే ప్రయత్నాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అతి ముఖ్యమైన అంశం. ఆ బాధ్యతను నిర్వహించే స్వతంత్ర సంస్థ 'భారత ఎన్నికల కమిషన్'నే పూర్తిగా తమ చెప్పుచేతల్లో పెట్టుకునే ప్రయత్నాలను కేంద్రంలో అధికారంలో ఉన్నవారు చేయడం ఆశ్చర్యకరం. భారత ఎన్నికల కమిషన్ తరఫున చీఫ్ ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు బాధ్యతలు నిర్వహిస్తారు. వారి నియామకాలను చేపట్టే విధానాన్ని సమూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఓ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. దాని ప్రకారం ఆ ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడితోపాటు భారత ప్రధాన న్యాయమూర్తి బదులుగా ఒక కేంద్ర మంత్రి నియమితులవుతారు. ఆ కేంద్రమంత్రిని ప్రధానమంత్రే సభ్యుడిగా నియమిస్తారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు పూర్తిగా మారిపోతాయి. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం అన్నది ఇకపై ఉండకపోవచ్చు. ఇది దేశ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ప్రమాదంలోకి నెట్టే చట్టం.

శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధిని, ఐటీని, సేవల రంగంలోని అభివృద్ధినీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా అందుబాటులోకి వచ్చిన అభివృద్ధినీ చూపి ఇదే దేశాభివృద్ధిగా చాటుకుంటే అంతకంటే ఆత్మవంచన మరొకటి ఉండదు. అభివృద్ధికి నిర్వచనం మార్చేసి మేడిపండు లాంటి అభివృద్ధి చూపి అదే అభివృద్ధి అని ప్రచారం చేస్తే ఎలా? ఇది కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి చేస్తున్న ప్రయత్నమని వేరే చెప్పవలసిన అవసరం లేదు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గోకులాష్టమి

శ్రీకృష్ణుడనగానే మనకు ముందు గుర్తుకు వచ్చేది, 'శ్రీభగవాన్ ఉవాచ'గా గీతను బోధించిన జగద్గురువైన జగన్నాథుడు కాదు. ధర్మగ్లాని తొలగించి, సాధురక్షణా, దుష్టశిక్షణా చేసేందుకు చనుదెంచిన అఘటన ఘటనా సమర్థుడైన అసాధ్యుడూ, అవతార పురుషుడూ కాదు. 'చేత వెన్నముద్ద–చెంగల్వ పూదండ,/ బంగరు – మొలతాడు, పట్టు దట్టి, / సందె తాయెతులును– సరిమువ్వ గజ్జెలు' సాంప్రదాయికంగా ధరించి, చక్కని శిశురూపంలో అలరించే చిన్ని కృష్ణుడు. పసివాడిని చంపేందుకు వచ్చిన రక్కసి దాని చేత, 'ఇతర బాలుర క్రియ వాడవీవు కావు,/ చన్ను విడువుము, విడువుము, చాలుననుచు,' కుయ్యోమనిపించి, కూల్చివేసిన లీలాబాలుడు.

'...ఏడ వాడు? వాని పట్టి తెచ్చి పొట్ట నిండ పాలు పోయరే?' అంటూ యశోదమ్మ వెంబడిస్తూ మురిసిపోయే 'ముద్దులాడి బాలుడు'.



'గోకులంలో హరి ఆరగించుటకు పాలు కురిసిన ధేనువులను కూడా ముక్తి కొనలకు చేర్చిన' ముకుందమూర్తి. నవనీత చోర బాలక చరితం,/నందాది వ్రజ పుణ్య తరు ఫలితం,/ధ్రువపద ఫలం, ఏతత్, అతి లలితం,/ భువి నారాయణ తీర్థ యతి ఫణితమ్ అని, భక్త్యావేశంతో నారాయణ తీర్థులచేత నాట్యమాడించిన నంద కిశోరుడు. మద శిఖి పింఛ అలంకృతమైన ముంగురులు కలవాడుగా, ముద్దు చెక్కిళ్ళ నునుపుతో మెరుగుటద్దాన్ని చిన్నబుచ్చేవాడుగా, పరిపూరిత మురళీ రవం వినిపిస్తూ, సదాశివ బ్రహ్మేంద్రులకు సాక్షాత్కరించిన పరబ్రహ్మ. 'కాళింది మడుగున విషమును కలిపే / కాళియు తలపై నాట్యము లాడి,/ ఆ విష సర్పము నంతము చేసి,/ గోవుల చల్లగ కా'చిన గోపాలకృష్ణుడు.

అధరం, వదనం, నయనం, హసితం... అన్నీ మాధుర్యమయాలు కాగా, గోప స్త్రీలను పరమాత్మ కామోత్కంఠతతో పరవశింపజేసిన మోహనాకారుడు. 'నల్లని వాడు, పద్మ నయనంబుల వాడు, కృపారసంబు పై చల్లెడి వాడు, మౌళి పరిసర్పిత పింఛము వాడు, నవ్వు రా/జిల్లెడి మోము' వాడూ అయిన బృందావన గోవిందుడు.

గోకులాష్టమి సుముహూర్త సందర్భంలో, 'సంసార పయోనిధి తరణంబులు(ఓడలు), పాపపుంజ దళనంబులు, శ్రీ/ కరణంబులు, ముక్తి సమాచరణంబులు అయిన బాలకృష్ణ సంస్మరణంబులు', కృష్ణ భక్తులకు సకల శుభాలు కలగజేయాలని ఆకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

ఆనాటి కాలం.. వడగాడ్పులు తీవ్రం

- 2015–19 మధ్య వడదెబ్బకు ఏపీలో 2,418 మంది మృతి
- కేంద్ర కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో వడగాడ్పుల తీవ్రత, మరణాలపై గడిచిన తొమ్మిదేళ్లకు సంబంధించి ఇటీవల కేంద్ర వైద్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదిక విడుదల చేసింది. 2015 నుంచి 2023 వరకు రాష్ట్రాల వారీగా లెక్కలను ఆ నివేదికలో వెల్లడించింది. సంవత్సరాల వారీగా చూస్తే 2015 నుంచి 2019 వరకు వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్‌లో 2,418 మంది మరణించారు. 2015లోనే అత్యధికంగా ఏపీలో 1,422 మంది మరణించినట్లు నివేదిక పేర్కొంది. ఇక 2020 నుంచి 2023 వరకు మన రాష్ట్రంలో వడగాడ్పులకు ఐదుగురు మరణించినట్లు నివేదిక స్పష్టం చేసింది. మన రాష్ట్రం తర్వాత తెలంగాణలోనే అత్యధికంగా వడదెబ్బ మరణాలు నమోదయ్యాయి. వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యంపై దాని ప్రభావం తదితర అంశాలపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి వేసవి గాలులపై ఎప్పటికప్పుడు రాష్ట్రాలకు సూచనలు, సాంకేతిక సహకారం అందిస్తోంది. ప్రజలకు కూడా అవగాహన కల్పించడానికి ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలను పంపించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తోందని నివేదిక పేర్కొంది. వడగాడ్పులకు చికిత్స ద్వారా సంబంధిత మరణాలను తగ్గించడానికి మౌలిక సదుపాయాలను 28 రాష్ట్రాల్లో కల్పించినట్లు తెలిపింది. భారత వాతావరణ శాఖ హీట్ వేవ్ హెచ్చరికలను ముందస్తుగా జారీ చేస్తుందని, అందుకు అనుగుణంగా రాష్ట్రాలు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని నివేదిక పేర్కొంది.

'ఉపాధి'తో పేదలకు అండగా ప్రభుత్వం

వర్షాభావంతో ఈ సీజన్‌లో ఆలస్యంగా వ్యవసాయ పనులు

- పనులు దొరక్క ఇబ్బంది పడుతున్న పేదలకు ప్రభుత్వం దన్ను
- ఉపాధి హామీ కింద దాదాపు 20 కోట్ల పని దినాలు
- గత ఐదు నెలల్లోనే 43.48 లక్షల పేద కుటుంబాలకు పనులు
- రోజుకు కూలికి సరాసరిన రూ.247.46 చెల్లింపు
- మొత్తంగా పేదలకు రూ. 4,660 కోట్ల మేర లబ్ధి
- వర్షాలు కురుస్తుండటంతో 10 రోజులుగా పనులకు తగ్గిన డిమాండ్

సాక్షి, అమరావతి: ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఆలస్యమయ్యాయి. దీంతో పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంతో అండగా నిలిచింది. అవసరమున్న ప్రతి చోటా పెద్ద ఎత్తున పనులు చేపట్టింది. పని అడిగిన ప్రతి ఒక్కరికీ వారి సొంత ఊళ్లలోనే పనులు కల్పించింది. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 4వ తేదీ మధ్య కేవలం ఐదు నెలల్లోనే 19.93 కోట్ల పనిదినాలు కల్పించింది. వ్యవసాయ పనులే దొరకని ఈ ఐదు నెలల్లో 43.48 లక్షల కుటుంబాలు సొంత గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసుకొని రూ. 4,660.53 కోట్ల మేర లబ్ధి పొందాయి. ఈ పథకం కింద కూలీలకు రోజుకు సరాసరిన రూ. 247.46 చొప్పున ప్రభుత్వం చెల్లించింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు పనుల కల్పనలో గత నాలుగేళ్లుగా మన రాష్ట్రమే దేశంలో మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది కూడా మండు వేసవి కారణంగా సాధారణంగా గ్రామాల్లో ఎక్కడా వ్యవసాయ పనులే ఉండని మే నెలలో ప్రభుత్వం రోజుకు సరాసరిన 28.73 లక్షల మంది పేదలకు పనులు కల్పించింది. సాధారణంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు మొదలయ్యాక ఏటా జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధి హామీ పనులకు పెద్దగా డిమాండ్ ఉండదు. అయితే, ఈ ఏడాది నాగార్జున సాగర్ పరిధిలో ఇంకా నీటి విడుదల చేయకపోవడం, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా ఉండటంతో ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేకంగా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. గ్రామాల్లో పనులు చేసుకొనేందుకు ముందుకొచ్చినా ప్రతి ఒక్కరికీ లేదు అనకుండా జూలై, ఆగస్టు నెలల్లోనూ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించింది. జూలై నెలలో సరాసరిన రోజుకు 8.57 లక్షల మంది, ఆగస్టులో రోజుకు సరాసరిన 2.23 లక్షల మంది ఉపాధి హామీ పథకం పనులకు హాజరైనట్టు అధికారులు చెప్పారు. పని కావాలని అడిగిన వారికి సొంత గ్రామాల్లోనే పనులిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే 12.49 లక్షల పనులు గుర్తించి, సిద్ధం చేసి ఉంచినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకొన్నాయి. అందువల్ల పది రోజులుగా ఉపాధి హామీ పనులకు డిమాండ్ తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి 4వ తేదీ మధ్య ఆదివారం పోను మిగతా మూడు రోజుల్లో 10,376 మంది మాత్రమే 'ఉపాధి' పనులకు వచ్చినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు వెల్లడించాయి.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నెల వారీగా ఉపాధి హామీ పథకం అమలు తీరు..

నెల	నెలలో పేదలకు కల్పించిన పనిదినాలు	పనులు పొందిన కుటుంబాలు
ఏప్రిల్	3,92,96,849	25,41,254
మే	7,75,90,704	35,06,039
జూన్	5,41,18,691	33,14,735
జూలై	2,22,48,406	19,24,651
ఆగస్టు	60,32,208	5,92,232
సెప్టెంబర్ (4వ తేదీ వరకు)	10,376	4,519

(నోట్: ఒకే కుటుంబం రెండు మూడు నెలలు కూడా పనులకు హాజరై ఉండొచ్చు)



నడకదారిలో చిరుత సంచారం

తిరుమల: అలిపిరి తిరుమల నడకమార్గంలోని ఏడవమైలు వద్ద మరోమారు చిరుత సంచరించింది. నడక మార్గంలోని నరసింహస్వామి ఆలయానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి చిరుత సంచరించినట్లు అటవీశాఖ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలో నమోదైంది. ఈ ప్రాంతంలోనే వారం రోజుల క్రితం చిరుత సంచారం ట్రాప్ కెమెరాలో నమోదైన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాంతంలో అటవీశాఖ బోన్లను ఏర్పాటు చేసింది. దీంతోపాటు భారీగా అటవీశాఖ సిబ్బందిని నియమించి చిరుతను పట్టుకునేందుకు ఏర్పాటు చేసినట్లు టీటీడీ అటవీశాఖ డీఎఫ్‌వో శ్రీనివాసులు తెలిపారు.

ఉట్లోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



తిరుమలలో సెప్టెంబర్ 7, 8వ తేదీల్లో శ్రీ కృష్ణజన్మాష్టమి, ఉట్లోత్సవ వేడుకలను టీటీడీ నిర్వహించనుంది. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత గురువారం రాత్రి 8 నుంచి 10 గంటల నడుమ గోకులాష్టమి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. గోగర్భం డ్యామ్ చెంత వెలసి ఉన్న ఉద్యానవనంలో కాళీయమర్ధనుడు అయిన శ్రీకృష్ణుడుకి ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంచాభిషేకాలు నిర్వహిస్తారు. తరువాత ప్రసాద వితరణ చేస్తారు. 8న తిరుమలలో ఉట్లోత్సవాన్ని మధ్యాహ్నం 4 గంటల నుండి రాత్రి 8 గంటల మధ్య ఆలయ మాడ వీధులలో నిర్వహించనున్నారు. ఉట్లోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 8న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

భక్తుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే చేతి కర్రలు

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: అలిపిరి నడక మార్గంలో క్రూర మృగాల సంచారం నేపథ్యంలో అనేక భద్రతా చర్యలు తీసుకున్నామని, ఇందులో ఓ చర్యగా భక్తుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి చేతి కర్రలు అందజేస్తున్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అలిపిరి పాదాల మండపం వద్ద టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆయన బుధవారం భక్తులకు చేతి కర్రలను అందజేశారు. మీడియాతో భూమన మాట్లాడుతూ..చేతి కర్రలతో భక్తులు క్రూరమృగాలతో పోరాడతారని కాదని, చేతిలో కర్ర ఉంటే ఏ జంతువైనా వెనకాడుతుందని శాస్త్రీయ పరిశీలన ద్వారా రుజువైందని చెప్పారు. వేల ఏళ్ల నుంచి గ్రామాల్లో ప్రజలు పొలాలకు, అడవులకు వెళ్లేటప్పుడు చేతి కర్రలను ఆసరాగా తీసుకెళుతుంటారని గుర్తుచేశారు. కర్రల పంపిణీకి సంబంధించి విమర్శలు చేస్తున్న వారిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. చేతి కర్రలను భక్తులకు ఉచితంగా అందిస్తామని, వీటిని అలిపిరిలో అందజేసి శ్రీనరసింహస్వామి వారి ఆలయం వద్ద తిరిగి తీసుకుంటామని తెలిపారు. టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం తిరుమల శిలాతోరణం వద్ద, ఏడో మైలు వద్ద చిరుతల సంచారాన్ని గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో గాలిగోపురం నుంచి వంద మంది భక్తులను గుంపులుగా గోవింద నామస్మరణ చేసుకుంటూ వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్ లోనున్న అలిపిరి నడక మార్గంలో ఇనుప కంచె వేయడానికి కేంద్ర అటవీ శాఖకు, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదనలు పంపామని, వారు తగిన డిజైన్లతో అంగీకారం తెలిపితే కంచె నిర్మిస్తామన్నారు. చేతి కర్రల కోసం అడవిని నాశనం చేయడం లేదని, పది వేల కర్రలు మాత్రమే తీసుకున్నామని, ఇందు కోసం రూ.45,000 ఖర్చయిందని తెలిపారు.



భక్తులకు చేతి కర్రలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

మత్తు మందు చల్లి.. అందిన కాడికి దోచుకుని..

బ్యూటీపార్లర్‌లో నలుగురి మహిళల ఘాతుకం

- మార్గదర్శి మేనేజర్ భార్యతో పాటు మరో ముగ్గురి అరెస్ట్
- నగలు, రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఒంగోలులోని శ్రీకృష్ణనగర్‌లో బ్యూటీషియన్‌పై దాడి చేసి చోరీకి పాల్పడిన కేసులో ఒంగోలు మార్గదర్శి బ్రాంచి మేనేజర్ కరణం నాగేశ్వరరావు భార్య కరణం మోహన దీప్తి ఉరఫ్ దీప్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికా గర్గ్ కేసు వివరాలను వెల్లడించారు. ఒంగోలుకి చెందిన షేక్ రజియా శ్రీకృష్ణ నగర్‌లోని తన ఇంటిలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నారు. ఆమె భర్త షేక్ మీరా ఉద్యోగ నిమిత్తం ఉదయం వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తారు. కూతురు కాలేజీకి వెళ్లి సాయంత్రం వస్తుంది. దీంతో రజియా ఒంటరిగా ఇంట్లో ఉంటుంది. రజియాకు షేక్ సాహెర భాను అనే స్నేహితురాలు ఉంది. ఆమెకు రజియా వద్ద రూ.10 లక్షలకు పైగా విలువైన బంగారు నగలు ఉన్నాయని తెలుసుకుని ఆ విషయాన్ని తనకు పరిచయమున్న కరణం దీప్తి, ముంద్రు లక్ష్మి నవత ఉరఫ్ నవ్య, అలహరి అపర్ణలకు చెప్పింది. దీంతో అప్పటికే అనేక చోరీలు చేసి ఉన్న ఈ కిలాడీ ముఠా బ్యూటీ పార్లర్ మీద కన్నేశారు. వీరు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యూటీపార్లర్‌కు వచ్చారు. మేకప్ చేయించుకునేందుకు వచ్చినట్లు నమ్మించారు. మొదట ఇద్దరు ఐబ్రోస్ చేయించుకున్నారు. మరొకరికి పెడిక్యూర్ చేస్తుండగా అదను చూసి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం రజియా మీద ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఆమె ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న మత్తు కలిగించే ద్రావణాన్ని స్ప్రే చేశారు. తేలికపాటి యాసిడ్ లాంటి ద్రావణాన్ని ఆమె మీద చల్లారు. క్లోరోఫాం ప్రయోగించడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయారు. ఆ తరువాత వాళ్లు చేతికి అందిన కాడికి దోచుకొని పోయారు. రజియా మెడలోని బంగారు నగలు, ఇంట్లో కప్‌బోర్డులో దాచిన నగలు, రూ.40 వేల నగదు దోచుకొని వెళ్లారు. ఈ కేసు వివరాలను తెలుసుకున్న ఎస్పీ మలికా గర్గ్ వెంటనే పోలీసులను రంగంలోకి దించారు. సీఐ భక్తవత్సలరెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో ముగ్గురు నిందితులను గుర్తించిన పోలీసులు హైడ్రామా మధ్య వారిని అదుపులోకి తీసుకున్నారు. కరణం మోహన దీప్తితో పాటుగా బజాజ్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేసే ముంద్ర వెంకటరావు భార్య లక్ష్మి నవత, శ్రీనివాసరావు భార్య అలహరి అపర్ణ, దాసరి భాను ఉరఫ్ షేక్ సాహెరా భానులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఒంగోలు తాలూకా పరిధిలో పెళ్లూరు, పాదిలి, దొనకొండలలో కూడా చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. 24 గంటల్లోపే కేసును ఛేదించడమే కాకుండా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. ఒంగోలు డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి, సీఐ భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో కొరివి



తరచూ గ్యాస్ లీకేజీలు.. గతంలో బ్లో అవుట్ మంటలు

- చమురు సంస్థల కార్యకలాపాలతో ప్రమాదాలు
- కోనసీమలో గెయిల్, ఓఎన్‌జీసీ, రిలయన్స్ పైప్‌లైన్లు
- నగరం గ్యాస్ లీకేజీ ఘటనలో 19 మంది మృత్యువాత
- గడువు దాటినా పాత పైప్‌లైన్‌లే వినియోగం
- లీకేజీలను అడ్డుకునేలా ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమలాపురం: కోనసీమలో చమురు లీకేజీలు తరచూ చిచ్చు రేపుతున్నాయి. ఒక్కొక్కసారి భూమి పొరల నుంచి గ్యాస్ ఎగదన్నుకు వచ్చి రేగుతున్న మంటలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఎప్పుడు.. ఎక్కడ.. గ్యాస్ లీకవుతుందోనని ఇక్కడి ప్రజలు నిత్యం ఆందోళనతోనే జీవితం గడపాల్సి వస్తోంది. కాలం చెల్లిన పైప్‌లైన్లు.. నిర్వహణలో పాత విధానాలు.. జవాబుదారీతనం లేకపోవడం వల్ల చోటుచేసుకుంటున్న ప్రమాదాలు కోనసీమ పాలిట కొరివిలా మారాయి. రూ.వేల కోట్ల విలువైన చమురు, సహజవాయువు సంపద కలిగి ఉండటమే తమ శాపం అన్నట్టుగా తయారైంది కోనసీమ వాసుల పరిస్థితి.

1975 నుంచీ కార్యకలాపాలు

కృష్ణా–గోదావరి బేసిన్ పరిధిలోని పశ్చిమ గోదా వరి జిల్లాలో 1975లో తొలిసారిగా పశ్చిమ గోదా వరి జిల్లా నర్సాపురం సమీపంలోని ఎల్‌బీ చర్లలో చమురు సంస్థల కార్యకలాపాలు మొదలయ్యాయి. విచిత్రంగా ఇక్కడే తొలి బ్లో–అవుట్ జరగడం విశేషం. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆయిల్ అండ్ నేచు రల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్), ఆయిల్ ఇండియా లిమిటెడ్‌తోపాటు ప్రైవేట్‌కు చెందిన రిలయ న్స్, వేదాంత వంటి సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కేజీ బేసిన్‌లో గ్యాస్ సేకరణ, సరఫరా కోసం అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున గ్యాస్ పైప్‌లైన్లను నిర్మించారు. ఓఎన్‌జీసీకి చెందిన బావుల నుంచి వచ్చే గ్యాస్ తాటిపాకలోని గ్యాస్ కలెక్షన్ సెంటర్‌కు చేరుతోంది. అక్కడ నుంచి జిల్లాలోని పరిశ్రమలతోపాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో ఎరువుల కర్మాగారాలు, విద్యుత్ ప్రాజెక్టులకు గ్యాస్ సరఫరా అవుతోంది. జిల్లా నుంచి గుజరాత్‌కు సైతం గ్యాస్ పంపేందుకు పైప్‌లైన్ల నిర్మాణాలు చేపట్టారు. కోనసీమ జిల్లాలో 17 చమురు, సహజవాయువు సంబంధిత ప్రాంతాలు ఉన్నాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ వద్ద కూడా కార్యకలాపాలు నడుస్తున్నాయి. జిల్లాలో గెయిల్ సంస్థకు 430 కి.మీ. మేర, ఓఎన్‌జీసీ 120 కి.మీ., రిలయన్స్ 36 కి.మీ. చొప్పున మొత్తం 580 కి.మీ. మేర విస్తరించి ఉంది. అత్యధికంగా రాజోలు దీవిలో పైప్‌లైన్ వ్యవస్థ ఉంది. ఆయిల్ పైప్‌లైన్లు ఓడలరేవు, తాటిపాక నుంచి విశాఖ వరకు ఉన్నాయి.



కాట్రేనికోన ఓఎన్‌జీసీ బావి వద్ద ప్రమాద సమయంలో రక్షణ చర్యలు చేపట్టిన ఓఎన్‌జీసీ సిబ్బంది

ప్రమాదాల నివారణకు సర్కారు చర్యలు

గ్యాస్ పైపులైన్ లీకేజీలు అరికట్టే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పక్కా చర్యలకు ఉపక్రమించింది. చమురు సంస్థలు తమ పరిధిలోని పైప్‌లైన్లను నిపుణులతో కూడిన థర్డ్‌పార్టీతో ఆడిట్ నిర్వహించి గుర్తించిన లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనితోపాటు పైపులైన్ స్థితిగతులపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని తేల్చిచెప్పింది. చమురు సంస్థల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్టు ప్రకటించింది.



నగరం వద్ద పేలిన గ్యాస్ పైప్‌లైన్ (ఫైల్)


ప్రతి 20 ఏళ్లకు పైప్‌లైన్లు మార్చాలి



ఆక్వా చెరువుల వద్ద బోరు బావులు వేసేటప్పుడు ప్రభుత్వం నుంచి అనుమతి పొందడంతోపాటు చమురు సంస్థలకు సమాచారం అందించాలి. సిస్మిక్ సర్వే పూర్తయిన బావులను, నిరుపయోగంగా ఉన్న బోరు బావులను పూడ్చివేయాలి. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి కొత్త పైప్‌లైన్లు వేయాలి. పైప్‌లైన్‌కు కిలోమీటర్‌కు ఒక సెన్సార్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ పెచ్చెట్టి కృష్ణకిషోర్, కోనసీమ కాలుష్య అధ్యయన నిపుణుడు, అమలాపురం

ఆన్‌లైన్ మోనిటరింగ్ వ్యవస్థతో మెరుగైన ఫలితాలు



గ్యాస్ పైప్‌లైన్ల నిర్వహణ ఆన్‌లైన్ మోనిటరింగ్ వ్యవస్థ ద్వారా నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. గ్యాస్ లీకేజీలు చాలా వరకు అరికట్టే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు థర్డ్‌పార్టీ ఆడిట్, సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని చమురు సంస్థలకు తేల్చిచెప్పాం. సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఇవీ ప్రమాదాలు..

- 1995 జనవరి 8న అల్లవరం సమీపంలో బోడసకుర్రు వద్ద ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ నిర్వహిస్తుండగా జరిగిన బ్లోఅవుట్ (పాశర్లపూడి బ్లోఅవుట్) ప్రపంచ ప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది.
- 2005 సెప్టెంబర్ 8న అమలాపురం మండలం తాండవపల్లి వద్ద ఇదే తరహాలో మరో బ్లోఅవుట్ చోటుచేసుకుంది.
- 2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరం వద్ద గెయిల్ సంస్థకు చెందిన గ్యాస్ పైప్‌లైన్ లీకై 19 మంది దుర్మరణం పాలయ్యారు.
- 2020 ఫిబ్రవరి 3న కాట్రేనికోన వద్ద ఓఎన్‌జీసీ బావి వద్ద ప్రైవేట్ సంస్థ గ్యాస్ సేకరణకు దిగగా లీకేజీ ఏర్పడింది. స్థానికులను ఖాళీ చేయించాల్సి వచ్చింది.
- రాజోలు దీవిలో ఏటా కనీసం 20కి పైగానే గ్యాస్ లీకేజీలు జరగడం సర్వసాధారణంగా మారింది.
- ఇటీవల రాజోలు మండలం శివకోడు వద్ద ఆక్వా రైతు ఏకంగా 270 అడుగుల లోతున ఉప్పునీటి తవ్వకాలు చేయడంతో గ్యాస్ ఎగదన్ని ప్రమాదానికి కారణమైంది.

లీకేజీలకు కారణాలివీ

ఇప్పుడున్న పైప్‌లైన్లలో నాలుగు దశాబ్దాల క్రితం నాటి కాలం చెల్లినవి కూడా ఉన్నాయి. దీనివల్ల లీకేజీలు ఎక్కువ అవుతున్నాయి. ప్రతి 25 ఏళ్లకు ఒకసారి పైప్‌లైన్లు మార్చాలనే నిబంధనలను చమురు సంస్థలు పట్టించుకోవడం లేదు. ఆక్వా సాగు వల్ల ఉప్పు శాతం పెరిగి పైప్‌లైన్ గొట్టాలు తుప్పు పడుతున్నాయి. 25 ఏళ్లు బలంగా ఉండాల్సిన గ్యాస్ పైప్‌లైన్లు 15 ఏళ్లకే దెబ్బతింటున్నాయి. కోనసీమ భూమిలోని మట్టి పొరలలో చాలా తక్కువ మోతాదులో గ్యాస్ నిక్షిప్తమై ఉంది. 30 నుంచి 40 అడుగుల లోతు వరకు ఎటువంటి ప్రమాదం లేదు. కానీ.. అంతకన్నా లోతుకు వెళితే గ్యాస్ ఎగదన్నుకు వస్తోంది. సిస్మిక్ సర్వేల పేరుతో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వేలాది చోట్ల భూమి పొరల్లో బాంబింగ్ చేస్తున్నారు. వీటిని నిబంధన మేరకు పూడ్చకుండా వదిలేస్తున్నారు. అలాంటి చోట్ల నిల్వ ఉన్న గ్యాస్ అప్పుడప్పుడు ఎగదన్నుకు వచ్చి మంటలు చెలరేగుతున్నాయి. చమురు, సహజ వాయువుల కోసం డ్రిల్లింగ్ చేసిన బావుల వద్ద వెల్ క్యాపింగ్ వేసి వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఇటువంటి చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.



కోనసీమలో గ్యాస్ లీకేజీలు

పారదర్శకంగా డీజిల్ కొనుగోలు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో డీజిల్ కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేపడుతున్నామని ఆ సంస్థ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు తెలిపారు. అడ్డంగా దొరికిన డీజిల్ మాఫియా శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనాన్ని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. దురుద్దేశంతో ఆర్టీసీలో డీజిల్ కొనుగోలుపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 10,500 బస్సులను ఆపరేట్ చేయడానికి ఏటా 27 కోట్ల లీటర్ల హైస్పీడ్ డీజిల్‌ను ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీల నుంచి రాయితీపై కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఇంధన కంపెనీల వద్ద బల్క్ డీజిల్ ధర రిటైల్ డీలర్ల వద్ద ధర కంటే పెరిగిందన్నారు. దీంతో పొదుపు చర్యల్లో భాగంగా టెండర్ల ప్రక్రియ ద్వారా రిటైల్ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలుకు ఆర్టీసీ ఆర్ఎంలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో పక్క రాష్ట్రాల్లోని బంకుల నుంచి డీజిల్ కొనుగోలు చేయడానికి వీల్లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా బల్క్ డీజిల్ ధరలను తగ్గిస్తూ ఈ ఏడాది మార్చిలో నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే రిటైల్ డీలర్‌ల వద్ద ఆయిల్ కొనుగోలు నిలిపి వేశామన్నారు. తిరిగి ఆయిల్ కంపెనీల నుంచి కొనుగోలు ప్రారంభించామన్నారు. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూర్చే ఏ చిన్న పనిని ఆర్టీసీ సంస్థ చేయదని స్పష్టం చేశారు. రిటైల్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగిన సందర్భాల్లో బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్నారు. వాస్తవాలను తెలుసుకుని రాయాలని సూచించారు.

ఏడుగురికి పునర్జన్మనిచ్చిన 'కీర్తి'

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి బ్రెయిన్ డెడ్
- అవయవాలు దానం చేసిన తల్లిదండ్రులు
- 7 అవయవాలను ఏడుగురికి అమర్చిన వైద్యులు



ఎస్.కీర్తి (ఫైల్)

పిచ్చాటూరు: తాను మరణించినా.. తన అవయవాలతో ఏడుగురికి పునర్జన్మనిచ్చింది కీర్తి అనే యువతి. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం రామాపురం ఎస్సీ ప్రాంతానికి చెందిన సి.సంపత్‌కుమార్, అమ్ములు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. సంపత్‌కుమార్ ఎడ్లబండి నడుపుతూ వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. మొదటి కుమార్తె కీర్తి గత ఏడాది బీకామ్ పూర్తి చేసి చెన్నై అరుబాక్కంలోని కాల్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తుండేది. రెండో కుమార్తె స్వాతి డిగ్రీ, మూడవ కుమార్తె స్మృతి ఫార్మసీ, కుమారుడు సారథి ఇంటర్ చదువుతున్నారు. కీర్తి ఆదివారం చెన్నై నుంచి స్వగ్రామం రామాపురం వచ్చింది. ఆ సమయంలో పెళ్లి చేసుకోవాలని కీర్తిని తల్లిదండ్రులు కోరారు. చెల్లెళ్లు, తమ్ముడి చదువులు కొలిక్కి వచ్చాక పెళ్లి చేసుకుంటానని అమ్మ, నాన్నలకు నచ్చజెప్పింది. సాయంత్రం తమిళనాడులోని కరడిపుత్తూరులో ఓ పెళ్లికి గ్రామంలోని తమ బంధువుతో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కరడిపుత్తూరు సమీపంలో రోడ్డుపై ఉన్న ఓ పెద్ద గుంతలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి దిగబడిపోవడంతో వెనుకవైపు కూర్చుని ఉన్న కీర్తి కిందపడిపోయింది. ఆమె తలకు, చేతికి తీవ్ర గాయమై స్పృహ కోల్పోయింది. వాహనం నడుపుతున్న రాబర్ట్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో ఇద్దరినీ సమీపంలో ఉన్న తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కీర్తిని పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. గుండె సహా మిగిలిన అన్ని అవయవాలు పనిచేస్తున్న విషయాన్ని గుర్తించారు. కీర్తి అవయవాలను దానం చేయడం ద్వారా మరికొంత మందిని బతికించే అవకాశం ఉందని వైద్యులు వివరించడంతో కీర్తి అవయవాలు దానం చేయడానికి తల్లిదండ్రులు అంగీకరించారు.

కీర్తికి గౌరవ వందనం

చెన్నై జీహెచ్ వైద్యులు కీర్తి శరీరం నుంచి గుండె, రెండు మూత్రపిండాలు, రెండు కళ్లు, గుండె వాల్వు, కాలేయం, మూత్రనాళాలు, ఊపిరితిత్తులను మంగళవారం రాత్రి సేకరించారు. స్టాండ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి రెండు అవయవాలను తరలించి.. మిగిలిన వాటిని అదే ఆస్ప త్రిలోని రోగులకు అమర్చినట్టు వైద్యులు వెల్లడించా రు. రాగా, మంగళవారం అర్ధరాత్రి కీర్తి పార్థివదేహం వద్ద ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆ నటరాజ ప్రతిమ... మన ప్రతిభకు తార్కాణం: మోదీ

న్యూఢిల్లీ: జీ 20 సదస్సుకు వేదిక అయిన భారత్ మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ నటరాజ ప్రతిమ ప్రాచీన కాలం నుంచీ వస్తున్న భారతీయ కళా నైపుణ్యానికి, ప్రతిభకు నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో ఆయన కామెంట్ చేశారు. అనంత విశ్వ శక్తికి సంకేతమైన నటరాజ విగ్రహం జీ 20 సదస్సు వేదిక వద్ద ప్రధాన ఆకర్షణగా నిలవనుందన్నారు. అష్ట ధాతుమయమైన 27 అడుగుల ఎత్తు, 18 వేల కిలోల ఎత్తుతో నటరాజ ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. దీన్ని తమిళనాడుకు చెందిన ప్రఖ్యాత శిల్పి రాధాకృష్ణన్ బృందం రికార్డు స్థాయిలో కేవలం 7 నెలల్లో రూపొందించింది. ఆయన కుటుంబీకులు చోళుల హయాం నుంచీ, అంటే ఏకంగా 34 తరాలుగా శిల్పులుగా ఉంటూ వస్తున్నారు.

పర్యావరణ హామీలపై దృష్టి

జీ20 సదస్సులో బైడెన్ ప్రాథమ్యాలపై అమెరికా

వాషింగ్టన్: వర్ధమాన దేశాలకు చేసిన వాగ్దానాలను, పర్యావరణం సహా కీలక అంశాలపై హామీలను నెరవేర్చడం తదితరాలు జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రాథమ్యాలు కానున్నాయి. ఆయన భారత పర్యటనకు సంబంధించి బుధవారం చేసిన ప్రకటనలో వైట్‌హౌస్ ఈ మేరకు పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జీ20 సదస్సు గొప్పగా విజయవంతం అవుతుందని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివన్ ఆశాభావం వెలిబుచ్చారు. బైడెన్ గురువారం భారత్ రానున్నారు. శుక్రవారం ఆయన మోదీతో భేటీ అవుతారు. శని, ఆదివారాల్లో జీ20 భేటీలో పాల్గొంటారు.

పాత భవనంలో ప్రారంభమై... కొత్త భవనంలోకి

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ: ఈ నెల 18న మొదలై ఐదురోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్న విషయం విదితమే. ఈ సమావేశాలు పాత పార్లమెంటు భవనంలో ప్రారంభమై.. మరుసటి రోజు 19న కొత్త పార్లమెంటు భవనంలోకి మారుతాయని అధికారవర్గాలు బుధవారం తెలిపాయి. 19న వినాయక చవితి శుభదినం కాబట్టి ఆ రోజునుంచి కొత్త పార్లమెంటు భవనంలో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 9, 10 తేదీల్లో జరిగే జీ-20 సదస్సు తర్వాత పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ఎజెండా ఖరారు చేస్తారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. సమావేశాల అజెండాపై స్పష్టత ఇవ్వాలని, అజెండా ఏమిటో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ వివరణ రావడం గమనార్హం.

జీ20: ఎందుకు.. ఏమిటి!

జీ20 సదస్సుకు సర్వం సిద్ధం



ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన దేశాల కూటమిగా ఖ్యాతికెక్కిన జీ20 సదస్సుకు హస్తిన ముస్తాబైంది. ఈనెల 9, 10 తేదీల్లో జీ20 శిఖరాగ్ర సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగు తున్నాయి. జీ20కి భారత సారథ్య బాధ్యతలు త్వరలో ముగుస్తున్న తరుణంలో ఢిల్లీలో జరిగే సదస్సులో విప్లవాత్మక తీర్మానా లు జరిగే అవకాశముంది. వర్కింగ్ గ్రూప్ సెషన్స్‌లో తీసుకున్న నిర్ణయాలు, వివిధ శాఖల జీ20 మంత్రుల విడివిడి సమావేశాల్లో చేసిన తీర్మానాలు ఈ శిఖరాగ్ర సదస్సు ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో జీ20 గురించి కొన్ని విషయాలను గుర్తుచేసుకుందాం.

- నేషనల్ డెస్క్, సాక్షి

ఈసారి ఇతివృత్తమేంటి ?

వసుధైక కుటుంబం అనేది ఈ ఏడాదికి జీ20 సదస్సు ఇతివృత్తం. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే భావనను స్ఫూర్తిగా తీసుకున్నారు. మహా ఉపనిషత్తులోని సంస్కృత రచనల్లో పేర్కొన్నట్లు సూక్ష్మజీవులు మొదలు మనుషులు, జంతుజాలం అంతా ఈ భూమిపైనే ఒకే కుటుంబం జీవిస్తూ ఉమ్మడి భవిష్యత్తుతో ముందుగు సాగుతాయనేది 'వసుధైక కుటుంబం' అంతరార్థం. భూమిపై మనగడ సాగిస్తున్న జీవజాలం మధ్య అంతర్గత బంధాలు, సంపూర్ణ సమన్వయ వ్యవస్థల సహారమే వసుధైక కుటుంబం అని చాటిచెపుతూ దీనిని జీ20 సదస్సుకు ఇతివృత్తంగా తీసుకున్నారు. లైఫ్(లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్).. అంటే పర్యావరణహిత జీవన విధానాన్ని అవలంభించాలని సదస్సు ద్వారా జీ20 దేశాలు ప్రపంచానికి పిలుపునిచ్చాయి. వ్యక్తిగత స్థాయిలోనే కాదు దేశాల స్థాయిల్లో ఇదే విధానాన్ని కొనసాగించాలని జీ20 సదస్సు అభిలషిస్తోంది. 'లైఫ్'తోనే శుద్ధ, పర్యావరణ హిత, సుస్థిర ప్రపంచాభివృద్ధి సాధ్యమని జీ20 కూటమి భావిస్తోంది.

జీ20 సారథ్య బాధ్యతలను ఎలా నిర్ణయిస్తారు?

19 దేశాలు, ఐరోపా సమాఖ్యల కూటమే జీ20. ప్రపంచం స్థూల వస్తూత్పత్తిలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతులు జీ20 దేశాల్లోనే ఉంది. జీ20లో అంతర్గతంగా ఐదు గ్రూప్‌లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్ నుంచి ఒక దేశం జీ20 సారథ్యం కోసం పోటీపడొచ్చు. ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో ఒక గ్రూప్‌కు సారథ్య బాధ్యతల అవకాశం దక్కుతుంది. తమ గ్రూప్ తరఫున సారథ్య అవకాశం వచ్చినపుడు ఆ గ్రూప్ నుంచి ఎవరు ప్రెసిడెన్సీకి పోటీ పడాలనేది అంతర్గతంగా ఆ దేశాలు విస్తృతంగా చర్చించుకుని నిర్ణయించుకుని ఉమ్మడి నిర్ణయం ప్రకటిస్తాయి. అలా తదుపరి సారథి ఎవరో నిర్ణయమైపోతుంది. సారథ్యం వహించే దేశం అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. జీ20 అజెండా ఖరారు, శిఖరాగ్ర సదస్సుసహా మంత్రిత్వ శాఖల స్థాయిలో విడివిడిగా జీ20 గ్రూప్ సమావేశాలను వేర్వేరు పట్టణాల్లో నిర్వహించాలి. సమావేశాల తాలూకు అన్ని రకాల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది తరలింపు బాధ్యత సారథ్య దేశానిదే. శాశ్వత సచివాలయం లేని సందర్భాల్లో జీ20 సదస్సు సంబంధ వ్యవహారాలనూ అతిథ్య దేశమే చూసుకోవాలి.

తొలి సదస్సు ఎక్కడ ?

2008 నాటి ఆర్థిక సంక్షోభం కారణంగా జీ20 ఉద్భవించింది. ఆనాడు యురోపియన్ యూనియన్‌కు సారథ్యం వహిస్తున్న ఫ్రాన్స్.. ప్రపంచం ఆర్థిక మాంద్యం నుంచి గట్టెక్కి ఆర్థికవ్యవస్థ మళ్లీ ఉరకలెత్తాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చింది. అప్పటికే జీ8 దేశాలైన కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, రష్యా, బ్రిటన్, అమెరికాలు పరిస్థితిని చక్కదిద్దలేకపోయాయి. దీంతో మరిన్ని దేశాలతో కలిపి జీ20ని కొత్తగా ఏర్పాటుచేశారు. 'ఫైనాన్షియల్ మార్కెట్లు- ప్రపంచ ఆర్థికవ్యవస్థ' ఇతివృత్తంతో తొలి జీ20 సదస్సు 2008 నవంబర్‌లో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరిగింది.

ఈసారి సదస్సుకు ఎవరెవరు వస్తున్నారు?

అమెరికా అధ్యక్షుడు బైడెన్

పర్యావరణ మార్పులను అడ్డుకుంటూ శుద్ధ ఇంధనం వైపు ప్రపంచ దేశాలను ఎలా నడిపించాలనే అంశంపై ప్రసంగించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ సదస్సులో పాల్గొనబోతున్నారు. బహుళజాతి అభివృద్ధి బ్యాంకుల సామర్థ్యం పెంపుతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సామాజిక అంశాలపై ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాన్ని సమీక్షించనున్నారు.

చైనా తరఫున లీ కియాంగ్

ఈసారి సదస్సులో చైనా తరఫున ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ రావట్లేదు. ఆయన బదులు చైనా ప్రధాని లీ కియాంగ్ వస్తున్నారు.

బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్

భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్యం లక్ష్యంగా బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ ఈ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు. మోదీతో విడిగా భేటీ కానున్నారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

ఢిల్లీలోని క్లారిడ్జ్ హోటల్‌లో ఈయన బస చేయనున్నారు.

కెనడా ప్రధాని ట్రూడో

రష్యాతో యుద్ధంలో తాము ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు ఈ అంతర్జాతీయ వేదికపై ఈయన ప్రకటన చేయనున్నారు.

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌లోనూ పర్యటిస్తూ ఈయన భారత్‌లో జీ20లో పాల్గొననున్నారు.

- టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాలూ సదస్సులో పాల్గొంటారు.

రానివారెవ్వరు ?

ఆహ్వానం అందని కారణంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రావట్లేదు. సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, జపాన్, ఇటలీ, జర్మనీ, ఇండోనేసియా, బ్రెజిల్, అర్జెంటీనాల అగ్రనేతలు సదస్సుకు రావట్లేదు.

అతిథులు వస్తున్నారు..

అతిథి హోదాలో కొన్ని దేశాల నేతలు ఈ భేటీలో పాల్గొంటారు. నెదర్లాండ్స్, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), ఒమన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నైజీరియా ఈ జాబితాలో ఉన్నాయి.

- శిఖరాగ్ర సదస్సు మొదలవగానే ఈ భేటీలో అగ్రరాజ్యాధినేతలు ఏమేం నిర్ణయాలు తీసుకోబోతున్నారు? ఎలాంటి తీర్మానాలు చేస్తారు ? ఏం వాగ్దానాలు చేస్తారు? అని ప్రపంచ దేశాలు ఉత్సకతతో ఎదురుచూడటం ఖాయం. పెను వాతావరణ మార్పులు, ఆర్థిక అనిశ్చితి, మాంద్యం భయాలు మొదలు ఉక్రెయిన్ యుద్ధం దాకా ఎన్నో అంతర్జాతీయ అంశాలు ఈ భేటీలో చర్చకురానున్నాయి. సదస్సులో భాగంగా విచ్చేసే దేశాధినేతలు విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు, ఒప్పందాలు, ఉమ్మడి ప్రణాళికలు చేసుకునేందుకు చక్కని అవకాశం దక్కనుంది. ఇది ఆయా దేశాల పురోభివృద్ధికి ఎంతో దోహదపడనుంది.

భారత మూలాలు... నాకెంతో గర్వకారణం...!

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్
అత్తమామలతో క్రికెట్ గురించే మాట్లాడుకుంటాం
రాజకీయాల ఊసే ఉండదు



న్యూఢిల్లీ: ఆయన రిషి సునాక్. బ్రిటన్ ప్రధాని. ఆ పీఠమెక్కిన తొలి భారత మూలాలున్న నేత. అత్తామామలు ఇన్ఫోసిస్ వంటి దిగ్గజం ఐటీ కంపెనీ వ్యవస్థాపకులు. అంతా కలిస్తే భోజనాల బల్ల దగ్గర వాళ్ల మధ్య ఏ అంశాలు చర్చకు వస్తాయి? రాజకీయాలా? అస్సలు కాదట. కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడుకుంటారట. చివరికి రిషి ఇద్దరు కూతుళ్లు కూడా క్రికెట్ అంటే ప్రాణం పెడతారట. ఎంతగా అంటే, సర్వ కాల సర్వావస్థల్లోనూ భారత జట్టునే సమర్థించేటంతగా. అయితే, ఫుట్‌బాల్‌లో మాత్రం ఇంగ్లాండ్ జట్టును సమర్థించాలన్నదే వారికి ఆయన విధించే ఏకైక షరతు! సునాక్ తల్లిదండ్రులు ఇద్దరూ భారత మూలాలున్న వారే. తూర్పు ఆఫ్రికా నుంచి ఇంగ్లాండ్ వెళ్లారు. ఇక ఆయన భార్య అక్షతా మూర్తి నారాయణ మూర్తి, సుధా మూర్తి దంపతుల ఏకైక సంతానం. జీ 20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్ వస్తున్న నేపథ్యంలో బుధవారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇ- మెయిల్ ఇంటర్వ్యూలో రిషి పలు అంశాలు పంచుకున్నారు. సరదా సంగతుల నుంచి భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక బంధం దాకా అన్ని అంశాలనూ స్పృశించారు. భారత మూలాలు తనకెంతో గర్వకారణమని పునరుద్ఘాటించారు రిషి. బ్రిటన్ ప్రధానిగా తాను బాధ్యతలు చేపట్టినప్పుడు భారతీయుల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకాలు చెప్పలేని అనుభూతి ఇచ్చాయని గుర్తు చేసుకున్నారు. అత్తామామలతో ముచ్చటించేటప్పుడు భారత రాజకీయాలు, టెక్నాలజీ, ప్రధానిగా బ్రిటన్‌ను నడిపించడంలో ఆయన ఎదుర్కొంటున్న సమస్యల వంటివి ఎంత మాత్రమూ ప్రస్తావనకు రావని ఒక ప్రశ్నకు బదులుగా రిషి చెప్పారు. 'రాజకీయాలను, కుటుంబాన్ని విడిగా ఉంచడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

మోదీతో భేటీ కోసం ఎదురు చూస్తున్నా...

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నట్టు రిషి చెప్పారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక కృషి పాత్రపై లోతుగా చర్చిస్తామన్నారు. గత ఏడాది కాలంలో భారత్‌లో పర్యటించిన తన మంత్రివర్గ సహచరులు రెట్టించిన ఉత్సాహంతో తిరిగొచ్చారని చెప్పారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

భారత్-ఇంగ్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు మరి కాస్త సమయం పడుతుందని రిషి అభిప్రాయపడ్డారు. కానీ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేయడమే లక్ష్యంగా అధునాతన ఒప్పందం కుదురుతుందని విశ్వాసం వెలిబుచ్చారు. 'బ్రిటన్ వాణిజ్య మార్కెట్లో 4.8 కోట్లకు పైగా భారతీయ చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలున్నాయి. భారత ఎగుమతిదారులకు వాటితో యాక్సెస్ కల్పించేలా ఒప్పందం ఉండాలి. వార్షిక ద్వైపాక్షిక వర్తకం ఇప్పటికే రూ.3.5 లక్షల కోట్లు దాటేసింది' అని అన్నారు. ఇంగ్లాండ్‌లో 16 లక్షలకు పైగా భారతీయులున్నారు.

భారత్ కు జీ 20 సారథ్యం...

జీ 20 సారథ్యానికి భారత్ సరైన దేశమని రిషి అన్నారు. అపార వైవిధ్యానికి నెలవు భారత్. కొన్నేళ్లుగా అన్ని రంగాల్లోనూ అసాధారణ విజయాలు సాధిస్తూ ప్రపంచ దేశాలన్నింటికీ ఆదర్శంగా నిలుస్తోంది. అలాంటి దేశం జీ 20 సదస్సుకు సారథ్యం వహిస్తుండటం సరైన సమయంలో జరుగుతున్న చక్కని ఘటన' అని అభిప్రాయపడ్డారు. మోదీ నాయకత్వ సామర్థ్యానికి నిజంగా సెల్యూట్ చేస్తున్నా. ప్రపంచ సారథిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్ర నిజంగా శ్లాఘనీయం' అన్నారు.

> బ్రిటన్ ప్రధాని కాగానే నేను చేసిన మొదటి పని అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో దీపావళి విందు ఇవ్వడమే. భవనమంతా విద్యుద్దీపాలు, పూలతో మెరిసిపోతుంటే చూసి చెప్పలేనంత భావోద్వేగానికి లోనయ్యా. ఒక భారతీయునిగా నాకెంతో గర్వకారణమైన విషయమది.
>
> నా గాథ నిజానికి లోతైన భారత మూలాలున్న ఎంతోమంది బ్రిటన్ వాసుల కథే. ఈ భిన్నత్వంలో ఏకత్వం బ్రిటన్ బలం.
>
> నేను పాటించే విలువలకు నా భార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లిదండ్రులు, అత్తామామలు దారి చూపే దీపాలుగా నిలుస్తారు. ముఖ్యంగా అత్తామామల ఘనతలు చూసి నేనెంతో గర్విస్తాను. ఏమీ లేని స్థితి నుంచి మొదలై ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఐటీ దిగ్గజ కంపెనీని స్థాపించే దాకా వాళ్ల ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకం. భారత్, ఇంగ్లాండ్‌ల్లో వేలాది మందికి అది ఉపాధి కల్పిస్తోంది. ప్రతి పౌరుడూ అలాంటి విజయాన్ని సాధించేందుకు వీలు కల్పించేలా బ్రిటన్‌ను తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం.
>
> జీ 20 సదస్సు కోసం భార్య అక్షతతో కలిసి భారత్ లో పర్యటించనుండటం పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నా. బిజీ బిజీగా గడిపేలా ఇప్పటికే మొత్తం ప్లానింగ్ చేసుకున్నాం. భారత్‌లో మేం గతంలో వెళ్లాలని అనుకున్న పలు ప్రాంతాలకు వెళ్తాం.

సమావేశాల్లో ఆ 9 అంశాలపై చర్చించండి

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధానికి సోనియా గాంధీ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అజెండాను ప్రకటించకుండానే ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసారి సమావేశాల్లో మణిపూర్‌లో హింస, దేశవ్యాప్తంగా పెరిగిన ధరలు తదితర కీలకాంశాలపై చర్చించాలని డిమాండ్‌చేస్తూ ప్రధాని మోదీకి సోనియా లేఖ రాశారు. ముఖ్యంగా తొమ్మిది అంశాలపై చర్చ జరగాల్సిందేనని ఆమె పట్టుబట్టారు. 'మణిపూర్‌లో హింస, పెరిగిన ధరవరలు, రాష్ట్రాలు- కేంద్రం మధ్య క్షీణిస్తున్న సత్సంబంధాలు, చైనాతో సరిహద్దు వెంట కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అదానీ గ్రూప్‌లో అవినీతి లావాదేవీల బహిర్గతం కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు వంటి అంశాలను చర్చించాలి' అని లేఖలో పేర్కొన్నారు. 'ఇతర రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రతింపులు జరపకుండానే ఎలాంటి ఎజెండా ప్రకటించకుండానే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఈ సమావేశాల్లో ప్రభుత్వ ఎజెండా ఏమిటో ఎవ్వరికీ తెలియదు. సమావేశాలు జరిగే ఈ మొత్తం ఐదు రోజులూ ప్రభుత్వ ఎజెండాపైనే చర్చ జరగనుందని మాకు సమాచారం వచ్చింది' అని సోనియా వ్యాఖ్యానించారు.

ఇదో చక్కని అవకాశం

'ఇదో చక్కని అవకాశం. ప్రజాసమస్యలు, ప్రాముఖ్యత దృష్ట్యా ఈసారి సమావేశాల్లో మేం తప్పకుండా పాల్గొంటాం. ఈ అంశాలపై చర్చకు సమయం కేటాయిస్తారనే భావిస్తున్నాను' అని సోనియా అన్నారు. 'ఉభయ సభల్లో ఏ అంశాలపై చర్చిస్తారో అనే విషయాన్ని ముందుగా తెలపకుండానే సెషన్‌ను ప్రారంభిస్తుండటం బహూశా ఇదే తొలిసారి అనుకుంటా' అని కాంగ్రెస్ మరో నేత జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతర రాజకీయ పార్టీలు చేస్తున్న డిమాండ్లకు తగ్గట్లు దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని సోనియా కోరారు. ప్రకృతి విపత్తుల కారణంగా కొన్ని రాష్ట్రాల్లో భారీ వరదలు సృష్టించిన విలయం, మరి కొన్ని రాష్ట్రాల్లో కరువు కాటకాలు వంటి ఘటనలను చర్చించాలని సోనియా డిమాండ్‌చేశారు. 'పెరుగుతున్న నిరుద్యోగిత, సమాజంలో అసమానతలు, సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సమస్యల వలయంలో చిక్కుకోవడం వంటి అంశాలనూ చర్చించాలి. రైతుల డిమాండ్ మేరకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతాంగం సమస్యలు చర్చకు రావాలి' అని సోనియా అన్నారు. 'ఈసారి సమావేశాలను మేం బాయ్‌కాట్ చేయబోం. సభలోనే ఉండి సమస్యలపై పోరాడతాం' అని ఢిల్లీలో మీడియా సమావేశంలో జైరాం రమేశ్ చెప్పారు.



ఆ తొమ్మిది అంశాలు

1. ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితితో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగం, అసమానతల పెరుగుదల, ఎస్ఎంఈలపై దుస్థితి
2. రైతులు, రైతు సంస్థలు లేవనెత్తిన కనీస మద్దతు ధర అంశంతో పాటు వారు లేవనెత్తిన ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం మోదీ సర్కార్ చూపే నిబద్ధత
3. అదానీ వ్యాపార సమూహం లావాదేవీలను దర్యాప్తు చేయడానికి జేపీసీ ఏర్పాటు
4. మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న నిరంతర వేదన, రాజ్యాంగ వ్యవస్థల విచ్ఛిన్నం, అక్కడ నెలకొల్పాల్సిన సామాజిక సామరస్యం
5. హరియాణా వంటి వివిధ రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం
6. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించడం, లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని మన సరిహద్దుల్లో దేశ సార్వభౌమాధికారానికి ఎదురైన సవాళ్లు
7. దేశవ్యాప్తంగా కుల గణన
8. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దిగజారుతున్న సంబంధాలు
9. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో కొన్ని రాష్ట్రాల్లో విపరీతమైన వరదలు, మరికొన్ని రాష్ట్రాల్లో కరువు కారణంగా పెరిగిన కష్టాలు

ఆ ఒక్క బిస్కెట్ విలువ రూ.1 లక్ష !

తిరువల్లూర్(తమిళనాడు): చిన్న బిస్కెట్ ప్యాకెట్ కొంటే అందులో ఒక బిస్కెట్ మిస్సయింది. ప్యాకెట్‌లో లేని ఆ ఒక్క బిస్కెట్ విలువ ఎంత ఉంటుంది?. నిజానికి అదేం బంగారు బిస్కెట్ కాదు కాబట్టి దాని విలువ చాలా తక్కువే ఉంటుంది. కానీ ఆ ఒక్క బిస్కెట్ కోసం ఐటీసీ ఫుడ్స్ వారు రూ.1 లక్ష జరిమానాను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఏమిటీ బిస్కెట్ బాగోతం అనేగా మీ సందేహం. వివరాల్లోకి వెళ్తే అంతా తెలుస్తుంది. తమిళనాడు రాజధాని చెన్నైలో పి.దిల్లిబాబు అనే వ్యక్తి ఇటీవల సన్‌ఫీస్ట్ మ్యారీ లైట్ అనే బిస్కెట్ ప్యాకెట్ కొన్నాడు. 'ఈ ప్యాకెట్‌లో 16 బిస్కెట్లు ఉంటాయి' ఆ ప్యాకెట్ రేపర్‌పై ఉంది. అది చూసిన దిల్లిబాబు సరదాకి ప్యాకెట్‌లోని బిస్కెట్లు లెక్కించాడు. ఒక బిస్కెట్ లెక్క తగ్గింది. తప్పుడు ప్రచారం చేస్తూ కంపెనీ మోసం చేస్తోందంటూ నేరుగా ఆయన తిరువల్లూర్ జిల్లా వినియోగదారుల ఫోరమ్ వద్ద కెళ్లి కేసు వేశారు. ప్యాకెట్‌ను తయారుచేసిన ఐటీసీ ఫుడ్స్ సంస్థపై రూ.100 కోట్ల పెనాల్టీ వేయాలని కోరారు. సరైన వ్యాపార విధానాలు అవలంభించని కారణంగా రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో సేవా లోపాన్ని ఎత్తిచూపారు. ప్యాకెట్‌ను బరువు ఆధారంగా విక్రయిస్తామేగానీ అందులో ఉన్న బిస్కెట్ల సంఖ్యను బట్టి కాదు అంటూ తయారీసంస్థ చేసిన వాదనలను వినియోగదారుల ఫోరమ్ పట్టించుకోలేదు. 'రేపర్‌పై ఉండే సమాచారంతో సంతృప్తి చెందిన వినియోగదారులే ఆయా వస్తువులను కొంటారు. బరువును చూసి కాదు ఇందులోని బిస్కెట్ల సంఖ్యను చూసే కొనండి అని రేపర్‌పై ప్రత్యేకంగా ముద్రించి ఉంది' అంటూ కోర్టు గుర్తుచేసింది. వినియోగదారునికి రూ.1 లక్ష నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద మరో రూ.10 వేలు అందించాలని సూచించింది.

'భారత్'గా మారిన అక్షయ్ కొత్త సినిమా పేరు



ముంబై: భారతదేశం పేరును అధికారికంగా ఇండియా నుంచి భారత్‌కు మార్చాలన్న ప్రతిపాదనలు, వివాదాల నేపథ్యంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కొత్త సినిమా పేరు మారింది. 'మిషన్ రాణీగంజ్: ది గ్రేట్ ఇండియన్ రెస్క్యూ' పేరులోని ఇండియా పదాన్ని తొలగించి భారత్ పదాన్ని చేర్చారు. దీంతో సినిమా పేరు 'మిషన్ రాణీగంజ్: ది గ్రేట్ భారత్ రెస్క్యూ'గా మారింది. ఈ రోజే(గురువారం) ఈ సినిమా థియేటర్లలో విడుదలకాబోతోంది. 1989 నవంబర్‌లో పశ్చిమబెంగాల్‌లోని రాణిగంజ్‌లో వరదమయమైన బొగ్గు గనిలో చిక్కుకున్న వారిని సాహసోపేతంగా రక్షించిన సహాయక బృందానికి సారథ్యం వహించిన మైనింగ్ ఇంజనీర్ దివంగత జస్వంత్ సింగ్ గిల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు.

4 లక్షల భారతీయులు... గ్రీన్ కార్డ్ కళ్లజూడలేరు!



వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న భారతీయుల్లో 4 లక్షల మందికి పైగా తమ జీవిత కాలంలో గ్రీన్ కార్డ్ కళ్లజూడలేరని తాజా అధ్యయనం ఒకటి పేర్కొంది! ఆ లోపే వారు కన్ను మూస్తారని అభిప్రాయపడింది. అమెరికాలో ఈ ఏడాది ఉద్యోగాధారిత గ్రీన్ కార్డ్ పెండింగు దరఖాస్తులు ఏకంగా 18 లక్షలు దాటాయి. వీటిలో ఏకంగా 63 శాతం, అంటే 11 లక్షలకు పైగా భారతీయులవే! దాదాపు 2.5 లక్షలు, అంటే 14 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. కానీ ఏటా గరిష్ఠంగా జారీ చేసే గ్రీన్ కార్డుల్లో ఏ దేశానికీ 7 శాతం కంటే ఇవ్వరు. ఈ నిబంధన వల్ల భారతీయులకు తీవ్ర అన్యాయం జరుగుతూ వస్తోంది. ఈ కారణంగా జీవిత కాలంలో గ్రీన్ కార్డు పొందలేని 4.24 లక్షల మందిలో ఏకంగా 90 శాతానికి పైగా భారతీయులే ఉంటారని అధ్యయనం చెబుతోంది. 83 లక్షల కుటుంబ ఆధారిత గ్రీన్ కార్డు పెండింగ్ దరఖాస్తులు వీటికి అదనం!

ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేలపై కేసు నమోదు

రాంపూర్: మతవిశ్వాసాలకు భంగం కలిగించినందుకు డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేలపై ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని స్టాలిన్ ఇటీవల వ్యాఖ్యానించడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను సమర్థించినందుకు ప్రియాంక్ ఖర్గేపై కూడా కేసు నమోదైంది. సనాతన ధర్మాన్ని ఉదయనిధి డెంగ్యూ, మలేరియాలతో పోల్చిన విషయం విదితమే. ఉదయనిధి వ్యాఖ్యలు తమ మతవిశ్వాసాలకు విఘాతం కలిగించాయని న్యాయవాదులు హర్ష్ గుప్తా, రామ్‌సింగ్ లోధిలు స్థానిక సివిల్ లైన్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేలపై ఐపీసీ సెక్షన్ 295 ఎ (మతవిశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా కించపర్చడం), 153 ఎ (భిన్న మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం) కింద కేసులు నమోదయ్యాయి.

ఐఐటీ మండీలో ర్యాగింగ్ ఘటన

10 మంది విద్యార్థుల సస్పెన్షన్

న్యూఢిల్లీ/మండీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-మండీలో జూనియర్లను ర్యాగింగ్ చేసిన 10 మంది సీనియర్లను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. మరో 62 మందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. విద్యార్థి విభాగం ఆఫీస్ బేరర్స్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ర్యాగింగ్ చేసిన సీనియర్ విద్యార్థులకు రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించారు. 20 నుంచి 60 గంటలపాటు సమాజసేవ చేయాలని ఆదేశించినట్లు ఐఐటీ-మండీ ఉన్నతాధికారులు బుధవారం వెల్లడించారు. ముగ్గురు విద్యార్థి విభాగం ఆఫీస్ బేరర్లతోపాటు 10 మంది విద్యార్థులను తరగతి గదులు, వసతి గృహాల నుంచి డిసెంబర్‌దాకా సస్పెండ్ చేశారు. బీ.టెక్ కోర్సుల్లో కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం పరిచయ కార్యక్రమాన్ని ఇటీవల కాలేజీలో నిర్వహించారు. 'ఈ ఘటనలో 72 మంది సీనియర్ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాం' అని కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

యూరప్ పర్యటనలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ యూరప్‌లో వారంపాటు పర్యటించనున్నారు. మంగళవారమే ఆయన భారత్ నుంచి బయల్దేరారు. సెప్టెంబర్ ఏడున బ్రస్సెల్స్‌లో యురోపియన్ యూనియన్ పార్లమెంటేరియన్లతో రాహుల్ భేటీ అవుతారు. ఆ తర్వాత అక్కడే కొందరు ప్రవాస భారతీయులతో సమావేశమవుతారు. తర్వాతి రోజు ఉదయం కొందరు భారతీయ పారిశ్రామికవేత్తలతో భేటీ జరగనుంది. మధ్యాహ్నం పత్రికా సమావేశంలో పాల్గొంటారు. తర్వాత ఆయన పారిస్‌కు చేరుకుని సెప్టెంబర్ ఎనిమిదో తేదీన మరో పత్రికా సమావేశంలో పాల్గొంటారు. సెప్టెంబర్ తొమ్మిదో తేదీన ఫ్రాన్స్ పార్లమెంటేరియన్లతో ముచ్చటిస్తారు. తర్వాత అక్కడి సైన్స్ పా విశ్వవిద్యాలయం విద్యార్థులతో మాట్లాడతారు. సెప్టెంబర్ పదో తేదీన రాహుల్ నెదర్లాండ్స్‌కు వెళ్తారు. 400 ఏళ్ల నాటి లీడెన్ యూనివర్సిటీలో పర్యటించి అక్కడి విద్యార్థులతో మాట్లాడతారు. సెప్టెంబర్ 11వ తేదీన నార్వేకు వెళ్తారు. ఓస్లోలో ఆ దేశ పార్లమెంటేరియన్లతో సమావేశమవుతారు. తర్వాత అక్కడి ప్రవాస భారతీయులతో, ఓస్లో వర్సిటీ విద్యార్థులతోనూ మాట్లాడతారు. సెప్టెంబర్ 12వ తేదీన రాత్రి రాహుల్ భారత్‌కు తిరుగుపయనమవుతారు.

అధికారిక కార్లు వాడొద్దు

మంత్రులకు ప్రధాని ఆదేశం



న్యూఢిల్లీ: జి-20 సమావేశాల్లో విందు వేదికను చేరుకోవడానికి అధికారిక కార్లను వాడొద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. బుధవారం జరిగిన భేటీలో మంత్రులకు విధినిషేధాలను వివరించారు. భారత్‌కు వస్తున్న వివిధ దేశాల బృందాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మసలుకోవాలని సూచించారు. ప్రధాన వేదిక భారత మండపం, ఇతర వేదికలను చేరుకోవడానికి షటిల్ సర్వీసును ఉపయోగించుకోవాలని చెప్పారు. తాము బాధ్యత వహిస్తున్న విదేశీ బృందాలకు సంబంధించి ఆచారవ్యవహారాలను తెలుసుకోవాలని మంత్రులను కోరారు. వారి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని.. అందుకు అనుగుణంగా ఆతిథ్యమివ్వాలని చెప్పారు. జీ-20 సమావేశాలకు సంబంధించి అధీకృత వ్యక్తులు తప్పితే మరెవరూ మీడియాతో మాట్లాడవద్దని సూచించారు. ఈనెల తొమ్మిదో తేదీన జరిగే రాత్రి విందుకు ఆహ్వానించిన ముఖ్యమంత్రులందరూ సొంత కార్లలో రావాలని, వేదిక వద్ద షటిల్ సర్వీసును ఉపయోగించుకొని విందు జరిగే ప్రదేశానికి చేరుకోవాలని ఇదివరకే సూచనలు వెళ్లాయి. కేంద్ర మంత్రులందరూ జీ-20 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇందులో జీ-20 దేశాల భాషలతో పాటు భారతీయ భాషలన్నింటిలోనూ అనువాద సదుపాయం ఉందని ప్రధాని వివరించారు. వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 40 మంది ప్రపంచ నాయకులు సెప్టెంబరు 9, 10వ తేదీల్లో జరిగే జీ-20 సదస్సుకు హాజరవుతారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్‌మోహన్ క్వాత్రా మంత్రులకు తెలిపారు. పాటించాల్సిన ప్రొటోకాల్ నిబంధనల గురించి వివరించారు. భారత్, ఇండియా వివాదంపై అధీకృత వ్యక్తులు మాత్రమే మాట్లాడాలని ప్రధాని మోదీ మంత్రివర్గ సహచరులకు సూచించారు. చరిత్రలోకి వెళ్లకుండా రాజ్యాంగానికి లోబడి వాస్తవాలను మాట్లాడాలని కోరారు. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాలతో పోల్చిన డీఎంకే నాయకుడు, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు తగురీతిలో సమాధానమివ్వాలని ప్రధాని ఈ భేటీలో అభిప్రాయపడ్డారు. ఉదయనిధి వ్యాఖ్యలపై పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఉదయనిధి స్టాలిన్, ఆయన వ్యాఖ్యలకు మద్దతు పలికి ప్రియాంక్ ఖర్గేలపై మతవిశ్వాసాలను దెబ్బతీశారనే అభియోగాలపై బుధవారం ఎఫ్ఐఆర్ నమోదైంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 7 : సెప్టెంబర్ : 2023




ఉడుపి కళకళ

బుధవారం ఉడుపిలోని ప్రఖ్యాత శ్రీకృష్ణ దేవస్థానాన్ని అలంకరించిన దృశ్యం. గురువారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు పెద్దఎత్తున జరుగుతాయి

సైబర్ బ్లాక్‌మెయిలింగ్

- బెదిరించి డబ్బు దోచుకుంటున్న వంచకులు
- అయోమయంలో బాధితులు



గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి



అమాయకులను హడలెత్తించి దండుకుంటున్న సైబర్ దొంగలు

బనశంకరి: సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతూ నగదు దోచేయడం సిలికాన్ సిటీలో పెరుగుతోంది. అటు బెదిరింపులు, ఇటు డబ్బు పోయి బాధితులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రైవేటు మహిళా ఉద్యోగి నుంచి రూ.96 వేలు దోచేశారు. బెంగళూరు రాచేనహళ్లికి చెందిన బాధితురాలు మోనికా చౌహాన్ బుధవారం సంపిగే హళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసే ఆమె మొబైల్‌కి గత నెల 26న ఒక కాల్ వచ్చింది. ఆమె మాట్లాడగా.. కోర్టు నుంచి మాట్లాడుతున్నాము. ముంబైలో మీ పేరుతో చలాన్ వచ్చింది, హిట్ అండ్ రన్ కేసు మీపై ఉంది, కోర్టుకు రావాలని చెప్పారు, భయపడిన మోనిక.. తనది ముంబై కాదని, యాక్సిడెంట్‌తో సంబంధం లేదని చెప్పింది. మీ ఆధార్‌తో కొన్ని అనుమానాస్పద బ్యాంకు అకౌంట్లు ఉన్నాయని మళ్లీ బెదిరించారు. వాటిని తనిఖీ చేయడానికి డబ్బు పంపాలని ఒత్తిడి చేయడంతో ఆమె రెండుసార్లు రూ.48,325 చొప్పున మొత్తం రూ.96,650 జమ చేసింది. చివరకు అంతా మోసమని గ్రహించిన మోనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యాప్ పంపి రూ.43 వేలు వంచన

గూగుల్ కస్టమర్ కేర్ అని పరిచయం చేసుకుని సదరు వ్యక్తి పంపిన లింక్ పై క్లిక్ చేయగానే రూ.43 వేలు పోగొట్టుకున్నాడు. ఈఘటనపై సారాయిపాళ్య నివాసి అబ్దుల్ వాహిద్ (41) అనే వ్యక్తి ఈశాన్య విభాగ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 3వ తేదీన అబ్దుల్ వాహిద్ తన బావ అకౌంట్ కు పేటీఎం ద్వారా నగదు పంపేందుకు యత్నించగా విఫలమైంది. తరువాత గూగుల్ కస్టమర్ కేర్ పేరుతో ఫోన్ చేసిన వ్యక్తి ఒక లింక్ పంపించి ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. బాధితుడు అలాగే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న క్షణాల్లోనే అకౌంట్ నుంచి రూ.43,049 కట్ అయింది.

రివార్డు పేరుతో 1.24 లక్షలు..

రివార్డు పాయింట్ల ఆశ చూపి లక్షకు పైగా కాజేశారు. హుణసేమారనహళ్లి నివాసి భీమానాయక్‌కు ఈ నెల 3వ తేదీన ఫోన్ చేసిన వ్యక్తి ప్రైవేటు బ్యాంకు నుంచి మీకు రివార్డు పాయింట్లు వచ్చాయి, వాటిని వాడుకోకపోతే వృథా అవుతాయని చెప్పాడు, ఈ లింక్ ద్వారా ఉపయోగించుకోవాలని లింక్‌ను పంపాడు. బాధితుడు ఆ లింక్‌పై క్లిక్ చేయగానే అకౌంట్ నుంచి రూ.1.24 లక్షల నగదు కట్ అయింది. దీంతో ఈశాన్య విభాగం సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

న్యూస్‌రీల్

నాణేల పెట్టెలు దొంగలపాలు

- ఫిల్టర్ వాటర్ కేంద్రాలపై కన్ను



చోరీ జరిగిన శుద్ధజల కేంద్రం

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణ, తాలూకా పరిధిలో ఇప్పుడు ఎక్కడ చూసినా వాటర్ ఫిల్టర్ యూనిట్లు కనిపిస్తున్నాయి. ప్రజలు తాగునీటి కోసం ఏ సమయంలోనైనా వాటర్ ఫిల్టర్ యూనిట్ వద్దకు వెళ్లి రూ.5 నాణెం వేసి ఒక క్యాన్ వాటర్ పట్టుకోవచ్చు. కానీ ఇటీవల దొంగల కన్ను వాటర్ ఫిల్టర్ యూనిట్ ముందు కాయిన్‌లు వేసే బాక్స్ మీద పడింది. పగలంతా జనం నాణేలు వేసి బాక్స్ నిండుగా ఉంటుంది. చీకటి పడ్డాక దొంగలు కాయిన్ బాక్సులను చోరీ చేస్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి తాలూకాలోని కోడిపాళ్య, మళవళ్లి గ్రామాల్లో శుద్ధ జల కేంద్రాల ముందు ఉన్న నాణేల పెట్టెలను చోరీ చేసారు. దీంతో జనం ఫిల్టర్ నీరు తీసుకునేందుకు వీలు లేకుండా పోయింది. గత వారం గారడిగరపాళ్య గ్రామంలోనూ ఇదేమాదిరి నాణేలను ఎత్తుకెళ్లారు. వాటర్ ఫిల్టర్ యూనిట్ల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలువలోకి దూకి రైతు ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధను తట్టుకోలేక రైతన్న పంట కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లాలోని పిరియాపట్టణ తాలూకాలో జరిగింది. చిక్కనెరళె గ్రామానికి చెందిన హనుమేగౌడ (50) తన పొలంలో పొగాకుతోపాటు వివిధ పంటలను సాగు చేశాడు. ఇందుకోసం వివిధ ఫైనాన్స్ సంస్థల నుంచి లక్షలాది రూపాయలను అప్పుగా తీసుకొచ్చాడు. అయితే సకాలంలో వర్షాలు కురవక పంట నష్టం వాటిల్లింది. దీంతో అప్పు తీర్చే మార్గం కనిపించక విరక్తి చెంది కాలువలోకి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. బెట్టదపుర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

బోనులో చిక్కిన చిరుత



శివమొగ్గ: శివమొగ్గ తాలూకా గెజ్జెనహళ్లి గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో బోనులో చిరుత లభించింది. దీనికి 4 నుంచి 5 ఏళ్ల వయసు ఉంటుంది. గత కొన్ని రోజులుగా చిరుత సమీపంలోని పొలాల్లో తిరుగుతుండడంతో పాటు ఇటీవల ఒక ఇంటి వద్ద ఉన్న కుక్కను చంపి తినింది. దీంతో చిరుతను బంధించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖాధికారులు చిరుత సంచరించే ప్రాంతంలో బోనును ఏర్పాటు చేయగా అది చిక్కింది. కాగా, మరో చిరుత కూడా సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కుమారకు విజయేంద్ర పరామర్శ

శివాజీనగర: బీజేపీ ఎమ్మెల్యే బీ.వై.విజయేంద్ర బుధవారం జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామిని కలిశారు. బెంగళూరులోని జేపీ నగరలో ఉన్న కుమారస్వామి ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి విచారించారు. ఈ సందర్భంగా కొంతసేపు రాజకీయ విషయాలపై కూడా చర్చలు జరిసినట్లు తెలిసింది. కుమారస్వామి తీవ్ర అస్వస్థతతో ఐదురోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకోవడం తెలిసిందే.

ఎంపీ ఆఫీసు ముందు హైడ్రామా



మైసూరు: నగరంలోని జలదర్శిని గెస్ట్‌హౌజ్ వద్ద ఉన్న ఎంపీ ప్రతాప్‌సింహా ఆఫీసు ఎదుట కేపీసీసీ అధికార ప్రతినిధి లక్ష్మణ్, ముఖ్య నేతలు, కార్యకర్తలతో పెద్ద హైడ్రామా నడిచింది. మైసూరుకు సిద్ధరామయ్య ఏమి చేశారో చెప్పాలని ఎంపీ ప్రతాప్ సింహా ప్రశ్నించిన నేపథ్యంలో.. ఏమి చేశారో నిరూపిస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంపీ ఆఫీసు ఎదుటకు వచ్చారు. పలు డాక్యుమెంట్లు, కుర్చీలు, టేబుళ్లతో సహా మకాం వేశారు. ఆఫీసులోకి వెళ్లబోగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేట్ బయటే కుర్చీలు, టేబుళ్ల వేసుకుని కూర్చొని తమ నిరసన తెలిపారు.

సుప్రీంలో కావేరి విచారణ వాయిదా

శివాజీనగర: కావేరి నదీ జలాల పంపకాల విషయమై తమిళనాడు, కర్ణాటక సుప్రీంకోర్టులో వేసిన కేసు విచారణ సెప్టెంబర్ 21కు వాయిదా పడింది. న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వపు త్రిసభ్య ధర్మాసనంలో ఒక జడ్జి గైర్హాజరైన కారణంతో వాయిదా వేశారు. వర్షాభావం వల్ల తమిళనాడుకు కావేరి జలాలను సరఫరా చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ సమర్పించింది. కాగా, వచ్చే వారం తాము కూడా విచారణకు అందుబాటులో ఉండం. ఈ కేసును కొత్త బెంచ్‌కు ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తికి విన్నవించాలని జస్టిస్ గవాయి రాష్ట్ర న్యాయవాదులకు సూచించారు. దీని వల్ల కేసును మొదటి నుంచీ విచారణ సాగించాలని న్యాయవాదులు తెలుపగా, అయితే సెప్టెంబర్ 21న విచారణ చేపడతామని జస్టిస్ గవాయి బదులిచ్చారు. రైతు సంఘాలు వేసిన పిటిషన్లు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

మండ్యలో రైతుల రాస్తారోకో

మండ్య: కావేరి జలాశాయల నుంచి తమిళనాడుకు విడుదల చేస్తున్న నీటిని తక్షణమే ఆపేయాలని బుధవారం మండ్య నగరంలో రాస్తారోకో నిర్వహించారు. సుప్రీంకోర్టులో కావేరి నది నీటి విచారణ వాయిదా పడిన నేపథ్యంలో నగరంలోని సర్ ఎంవీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, కన్నడపర సంఘాల కార్యకర్తలు, ఆందోళనకారులు బెంగళూరు–మైసూరు జాతీయ రహదారిపై తమ పోరాటాన్ని చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు.



మండ్యలో ధర్నా చేస్తున్న రైతులు

నగరమంతటా జడివాన



బుధవారం ఉదయం వర్షంలో గొడుగులతో వెళుతున్న విద్యార్థినులు

- పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు

బనశంకరి: రాజధాని నగరంలో మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చొరబడటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. బన్నేరుఘట్ట రోడ్డులో జలమండలి పనులు జరుగుతున్నచోట మడుగులా మారి బుధవారం ఉదయం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కార్పొరేషన్, మార్కెట్, మెజెస్టిక్, ఆనందరావ్ సర్కిల్, కేఆర్ సర్కిల్‌తో పాటు చాలాచోట్ల వర్షం ధాటికి ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మెజస్టిక్ బీఎంటీసీ బస్టాండు చెరువులా మారింది. ప్లాట్‌ఫారాల్లోకి నీళ్లు వచ్చాయి. మల్లేశ్వరం కేసీ.జనరల్ ఆసుపత్రి రోడ్డులో నిలిచిఉన్న కారుపై చెట్టు కూలిపోయింది. విద్యుత్ స్తంభం, బైకు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాలేదు.

70 మి.మీ. పైగా వర్షం

బుధవారం ఉదయం 8.30 వరకు 24 గంటల్లో బెంగళూరు నగరజిల్లా అనేకల్‌తాలూకా చందాపురలో 74 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. బొమ్మసంద్ర లో 66.5 మి.మీ, నెరళూరు 64.5, బీదరగుప్పె 64, దొడ్డజాల 56, హిండేనహళ్లి 55, గొల్లహళ్లి 54, ముత్తానల్లూరు 52.5, చుంచనకుప్పె 59 మిల్లీమీటర్లు వర్షం కురిసిందని వాతావరణశాఖ తెలిపింది. బెంగళూరువ్యాప్తంగా ఉరుములు పిడుగులతో కూడిన వర్షం వచ్చింది. ఇంకా రెండురోజులపాటు మబ్బులతో కూడుకున్న వాతావరణం ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి సమయంలో భారీ వర్షం రావచ్చని వాతావరణశాఖ తెలిపింది.



బెంగళూరులో మంగళవారం రాత్రి వానలకు జలమయమైన ఓ రహదారి

గోవిందుడు అందరివాడు



బుధవారం రాష్ట్రమంతటా గోకులాష్టమి పర్వదినాన్ని ఉత్సాహంగా ఆచరించారు. తమ చిన్నారులకు కృష్ణ, రాధలుగా అలంకరించి వేడుకలు చేసుకున్నారు. ఆలయాలు, పాఠశాలల్లో సంబరాలు హోరెత్తాయి. మంగళూరు మంజునాథ ఆలయంలో సందడి



ధార్వాడలో ముచ్చటగా ఉన్న రాధాకృష్ణులు



మంగళూరులో చిన్నికృష్ణుడు

ఉద్యోగాలిప్పిస్తామని వసూళ్లు

- వ్యక్తి, ఇద్దరు భార్యలు, బావమరిదిపై కేసు

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని భారీగా నగదు వసూళ్లకు పాల్పడిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురిపై కేసు నమోదైన సంఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. నెలమంగల తాలూకా హుచ్చవీరయ్యనపాళ్య గ్రామానికి చెందిన మంజు అలియాస్ 420 మంజ, ఇతని ఇద్దరు భార్యలు లలిత, మంజుల, బావమరిది బసవరాజులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని అమాయకులకు వల వేసేవారు. లక్ష్మణ్, కార్తీక్, వెంకటేశ్, శరత్, హనుమంతరాజు అనేవారి నుంచి మంజు ముఠా రూ.20 లక్షల వరకూ వసూలు చేసింది. ప్రధాన నిందితుడు మంజుపై బెంగళూరు హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌లో రూ.65లక్షలు వసూలు చేసినట్టు మరో కేసు నమోదయింది. మంజు, లలితను పోలీసులు అరెస్టు చేసారు. బసవరాజు, మంజుల ఇద్దరూ పరారీలో ఉన్నారు.

భార్య, కొడుకు హత్య

దొడ్డబళ్లాపురం: భార్యను, కుమారున్ని హత్య చేసి భర్త పరారైన సంఘటన నగరంలో బాగలగుంటె పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. రవీంద్రనాథ్‌గుడ్డె ప్రాంతంలో నివసిస్తున్న చంద్రు (45) అనే వ్యక్తి భార్య నవనీత (35), కుమారుడు సృజన్ (8)ను కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి నవనీత తల్లి పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కుటుంబ కలహాలే కారణం కావచ్చని అనుమానాలున్నాయి.

జంబో షో షురూ

- మైసూరు దసరా గజరాజులకు తూకం పరీక్షలు
- 5,160 కేజీలతో అభిమన్యు ఆధిక్యం
- రాచనగరిలో ఏనుగులతో కళకళ



ఓ గజరాజుకు బరువు తూస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరు దసరా మహోత్సవంలో పాల్గొననున్న ఏనుగుల బృందం బుధవారం నుంచి సాధనను షురూ చేశాయి. ప్యాలెస్ ఆవరణలో ఉన్న కెప్టెన్ అభిమన్యు నేతృత్వంలోని గజ బృందానికి ఉదయం పశువైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తరువాత వాటిని నడిపిస్తూ దేవరాజ మొహల్లాలోని సాయిరామ్ తూకం కేంద్రానికి తీసుకొచ్చారు. 8 ఏనుగులకు బరువు తూచారు. తూకంలో అభిమన్యు బలశాలిగా తేలింది. అభిమన్యు 5,160 కేజీలు, గోపీ 5,080 కేజీలు, ధనుంజయ 4,940, మహేంద్ర 4,530, భీమా 4,370, కొత్తగా వచ్చిన మగ ఏనుగు కుంజన్ 4,240, ఇక ఆడ ఏనుగులు విజయ 2,830, వరలక్ష్మి 3,020 కేజీల బరువున్నాయి.

జంబూసవారీ మార్గంలో పయనం

ఏనుగుల బరువులను తూచిన తర్వాత ప్యాలెస్ నుంచి జంబూసవారి ఊరేగింపు సాగే కేఆర్ సర్కిల్, ఆయుర్వేద ఆస్పత్రి, సయ్యాజీరావ్ రోడ్డు ద్వారా బన్ని మంటపం, మళ్లీ అదే మార్గంలో తిరుగుపయనం అయ్యేలా ప్రాక్టీస్ చేయించారు. కొత్త ఏనుగు కుంజన్ కొద్దిగా గందరగోళానికి గురి అయింది. నగర రోడ్లపై గజ గమనాన్ని ప్రజలు ఉత్సాహంగా తిలకించారు.

నిత్యం పౌష్టికాహారం

అడవిలో రాగి ముద్ద, ఆకు అలములు మాత్రమే ఆహారంగా తీసుకునే ఈ ఏనుగులకు ఇప్పుడు రాచమర్యాదలు లభిస్తున్నాయి. నెయ్యి, బెల్లం, అన్నం, గోధుమలు వంటి పలు రకాల పౌష్టికాహారాన్ని ఏనుగులకు ఇస్తున్నారు. దసరా నాటికి ఒక్కో ఏనుగు కనీసం 300 నుంచి 400 కేజీల బరువు పెరిగేలా చూస్తారు.



అభిమన్యు నాయకత్వంలో వస్తున్న గజరాజులు



ఏనుగుల దండును ఆసక్తిగా తిలకిస్తున్న దంపతులు

తాను మరణించీ.. ప్రాణదానం

మైసూరు: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు అయి బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు పలువురికి ప్రాణం పోశాడు. ఈపి ప్రజ్వల్ (20) అనే యువకుడు ఇటీవల పాండవపుర చక్కెర కర్మాగారం వద్ద రైల్వే వంతెన వద్ద బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తేల్చారు. వైద్యులు ప్రజ్వల్ కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి ఒప్పించారు. ప్రజ్వల్ శరీరం నుంచి రెండు మూత్రపిండాలు, కాలేయం, హృదయ కవాటాలు, శ్వాసకోశం, నేత్రాలను సేకరించి అవసరమైన రోగుల కోసం పంపించారు.

రమ్య క్షేమంగా ఉంది



యశవంతపుర: ప్రముఖ నటి, కాంగ్రెస్ నాయకురాలు రమ్య అలియాస్ దివ్యస్పందన ఇక లేరని వచ్చిన వదంతులను ఆమె సన్నిహితులు ఖండించారు. ఆమె ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నట్లు కుటుంబవర్గాలు తెలిపాయి. సోషల్ మీడియాలో వచ్చిన వదంతులు పూర్తిగా అబద్ధం. ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తమిళ సినీ రంగానికి చెందిన స్పందన అనే మహిళ మరణించగా, ఒక సినీ ప్రచారకుడు పొరపాటుగా దివ్య స్పందన చనిపోయినట్లు పోస్ట్ చేశారు. దీంతో గందరగోళం తలెత్తింది. తరువాత ఆ వ్యక్తి పొరపాటు తెలుసుకుని పోస్ట్‌ను తొలగించాడు.

2026లోగా గదగ-వాడి రైల్వేమార్గం

బనశంకరి: ఉత్తర కర్ణాటక ప్రాంతంలో కీలక రైల్వే పథకాలైన గదగ–వాడి, బాగల్‌కోటె-కుడచి రైలుమార్గ నిర్మాణ పథకాల గురించి మంత్రి ఎంబీ పాటిల్ బుధవారం నగరంలో సమీక్ష నిర్వహించారు. 257 కిలోమీటర్ల పొడవు గల గదగ–వాడి మార్గాన్ని 2026 మార్చిలోగా పూర్తిచేయాలని గడువు విధించామని మంత్రి తెలిపారు. రూ.1,922 కోట్ల వ్యయంతో కేంద్రం, రాష్ట్రం తలా సగం భారం వహిస్తాయని చెప్పారు. ఈ పనులకు 4,002 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటికి 3,945 ఎకరాలు సేకరించామన్నారు.

రాయచూరులో ట్రక్ టెర్మినల్

రాయచూరు నగరంలో ట్రక్ టెర్మినల్ నిర్మాణానికి స్థలం గుర్తించాలని అధికారులకు జిల్లా మంత్రి బోసురాజు సూచించారు. విధానసౌధలో మాట్లాడుతూ ట్రక్ టెర్మినల్ నగర శివారు ప్రాంతంలో నిర్మిస్తే మంచిదని, ఇందుకు 10 ఎకరాల స్థలం అవసరమన్నారు.

రైతుల ఆత్మహత్యలు బూటకం: డీసీఎం

బనశంకరి: రైతులు ఆత్మహత్య గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి శివానందపాటిల్ తరువాత డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అదే తరహాలో మాట్లాడారు. ఈ వీడియోను కర్ణాటక బీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మంత్రి శివానందపాటిల్ వ్యాఖ్యలపై విలేకరులు డీకేశి వద్ద ప్రస్తావించగా, ఎక్కడున్నాయి రైతుల ఆత్మహత్యలు? ఆత్మహత్యకు పాల్పడినవారు రైతులు కాదని, ఇదంతా అబద్ధమని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతుల ఆత్మహత్యలు బూటకం అని మండిపడ్డారు. రైతుల సమస్యలు ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఇది తీవ్రమైన విషయమని బీజేపీ ఐటీసెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- ఆలయాల్లో శ్రీకృష్ణునికి పూజలు
- భక్తులతో ఆలయాలు కిటకిట

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. నగరంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. మేయర్ త్రివేణి, గొల్లర సంఘం జిల్లాధ్యక్షుడు, పాలికే కార్పొరేటర్ గాదెప్ప తదితరులు పాల్గొని శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. నగరంలోని శ్రీకృష్ణ ఆలయం కిటకిటలాడింది. శ్రీకనక దుర్గమ్మ ఆలయ సమీపంలోని శ్రీకృష్ణ దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

మాలూరులో..

మాలూరు: లక్కూరు గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించి అభిషేకం, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం తదితర పూజలను జరిపారు. శ్రీకృష్ణ ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూలతో అలంకరించారు. లక్కూరు, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

కోలారు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం నగరమంతా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.



కోలారులో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి కళ్యాణోత్సవం నిర్వహించారు. యాదవ సముదాయం అధికంగా నివాసం ఉంటున్న కిలారిపేటలో జన్మాష్టమిని ఘనగా నిర్వహించారు.



బెళగావిలో చిన్నారుల వేషధారణ

వైభవంగా కళ్యాణోత్సవం: దేవాలయ ప్రాంగణంలోనే 10 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులు స్వామి వారికి కానుకలను సమర్పించారు. దేవాలయం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని చూసి తరించారు. మాజీ ఎమ్మెల్యే కె శ్రీనివాసగౌడ, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, కాంగ్రెస్ నాయకుడు జయదేవ్, తదితర ప్రముఖులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

మురిపించిన చిన్నారులు

తుమకూరు : జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం వివిధ పాఠశాలల హాళ్లలో ఘనంగా నిర్వహించారు. పురాణ కాలంలో భూమిపై దుర్మార్గాలు ఎక్కువైనప్పుడు లోకాన్ని రక్షించేందుకు విష్ణువు కృష్ణుని అవతారంలో భూమిపై అవతరించి రాక్షసులను సంహరించి నందగోకులాన్ని రక్షించిన దేవునిగా పూజలందుకున్నాడు. ఉపాధ్యాయులు షణ్ముఖ్ మాట్లాడుతూ పండుగల వేడుకలతో పాటు మానవీయ విలువలను అలవర్చుకుని తమ జీవితాలను మెరుగుపరుచుకుని సమాజానికి మంచి వ్యక్తులుగా జీవించాలన్నారు. రాధా కృష్ణుల వేషధారణలో చిన్నారి బాలలు రంజింపజేశారు.



మంగళూరులో రాధాకృష్ణుల నృత్యం



తుమకూరులో రాధాకృష్ణులుగా చిన్నారులు

చిన్మయ విద్యాలయలో...



చిన్మయ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

కోలారు: నగరంలోని చిన్మయ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం చిన్మయ పాఠశాలలో చిన్నారులు రాధాకృష్ణ వేషధారులై అలరించారు. మధ్యాహ్నం విద్యార్థులు ఉట్టిని కొట్టి సంభ్రమించారు. విద్యార్థులకు ప్రసాదం పంచి పెట్టారు. అదేవిధంగా నగరంలోని కీలుకోటలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నెరవేర్చారు. ఉదయం 7 గంటలకు విశేష పూజలను చేశారు. బుధవారం నుంచి ఈనెల 16 వరకు కీలుకోటిలోని బీరేశ్వర ఆలయం ప్రాంగణంలో ప్రతి నిత్యం జన్మాష్టమిని పురస్కరించుకుని విశేష పూజలు జరుగుతాయి. చివరి రోజున నగరంలో శ్రీకృష్ణ ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తారు.



శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ వేటు

సాక్షి,బళ్లారి: సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గురుసిద్ధనగౌడతో పాటు ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ నుంచి సస్పెండ్ చేశారు. బుధవారం ఈ మేరకు పార్టీ రాష్ట్ర నేతలు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జగళూరు ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగళూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రామచంద్రప్ప ఓటమికి కారణం అయ్యారని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలు రుజువు కావడంతో ఆయన్ను, ఆయన కుమారులను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో దావణగెరె నుంచి ఆయన తనయుడు పోటీ చేయాలని భావించి పార్టీ టికెట్ రేసులో కూడా ఉన్నారు. అయితే లోలోపల పార్టీకి తీవ్ర ద్రోహం చేసినట్లు అధిష్టానానికి తెలియడంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా చెక్ పెట్టారు.

బాలలకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

సాక్షి,బళ్లారి: కలుషిత ఆహారం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన దావణగెరె జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. మాయకొండలోని మొరార్జీ దేశాయి హాస్టల్‌లోని విద్యార్థులకు వడ్డించిన చికెన్, సాంబారు, అన్నం తిన్న విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో వారిని తక్షణం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. రోజూ హాస్టల్‌లో వంట సరిగా చేయనందున తరుచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ఉద్యోగి కుటుంబానికి పరామర్శ

యశవంతపుర: హాసన్ జిల్లా ఆలూరు హళ్లియూర వచ్చ అడవీ ఏనుగు దాడిలో మృతి చెందిన అటవీ ఉద్యోగి హెచ్ వెంకటేశ్ కుటుంబానికి మొత్తం రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు అటవీశాఖ మంత్రి ఈశ్వరఖండ్రె ప్రకటించారు. బుధవారం ఆయన ఇంటికెళ్లి భార్య మంజుళ, కొడుకులు మోహిత్, మిథున్‌లను పరామర్శించారు. అటవీశాఖ మంచి అధికారిని కోల్పోయినట్లు వాపోయారు.

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.31 లక్షల వంచన

హుబ్లీ: నేకార నగర్‌కు చెందిన నివాసి ఒకరికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.31.04 లక్షలను వంచించిన కేసులో కేటుగాడిని కసబాపేటె పోలీసులు అరెస్ట్ చేశారు. విజయపుర జిల్లా ప్రశాంత్ దేశ్‌పాండే అరెస్ట్ అయిన నిందితుడు. నేకార నివాసిని పరిచయం చేసుకున్న యువకుడు రైల్వే శాఖలో తనకు ఉన్నత స్థాయి అధికారులందరూ పరిచయం ఉన్నారని నమ్మించాడు. అనేక మందికి ఉద్యోగం ఇప్పించానని అబద్ధాల నియామక పత్రం, జాయినింగ్ లెటర్‌ను చూపించాడు. ఇలా నమ్మించి రూ.31.04 లక్షలను తీసుకొని వంచించినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కసబాపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆ స్టేషన్ సీఐ రాఘవేంద్ర హళ్లూర నేతృత్వంలోని ప్రత్యేక బృందం పరిశోధించి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించింది. కాగా నిందితుడిపై శివమొగ్గ రిప్పన్‌పేటె, బాగలకోటె నవనగర తదితర పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనరేట్ తెలిపింది.


పిల్లల్లో పౌష్టికత కోసమే క్షీరభాగ్య: సీఎం



పిల్లలకు పాలు అందిస్తున్న సీఎం సిద్ధరామయ్య

తుమకూరు: పిల్లల మానసిక, శారీరక దృఢత్వం కోసం క్షీరభాగ్య యోజనను తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక సహకార పాల ఉత్పాదకుల మహామండలి, జిల్లా సహకార పాల ఉత్పాదకుల సంఘాల ఒక్కూట ఆధ్వర్యంలో మధుగిరిలో బుధవారం ఏర్పాటు చేసిన క్షీరభాగ్య దశమానోత్సవ వేడుకలను సీఎం ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 54 లక్షల మంది పిల్లలకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పేదలు, మధ్యతరగతి వర్గాల మెరుగైన జీవితాల కోసం తాము కార్యక్రమాలు రూపొందిస్తే బీజేపీ నేతలు అడ్డుపడి నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక స్థితి దివాళా తీస్తుందని సాక్షాత్తు దేశ ప్రధాని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు.

నరేగ జాబ్‌కార్డ్ తనిఖీ



హొసపేటె: కల్లహళ్లి జీపీలో జాబ్ కార్డులు కలిగిన కుటుంబాల ఇంటింటి సర్వేను మహిళా సమాఖ్య సిబ్బంది, తండా రోజ్‌గార్ మిత్రలు చేపట్టారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల సాధారణ కేటగిరీగా నమోదైన కుటుంబాల ఇంటింటి సర్వే నిర్వహించి కార్డులను ధృవీకరించారు.

లాటరీతో కాంగ్రెస్‌కు అధికారం

- రాష్ట్రంలో పడకేసిన అభివృద్ధి పనులు
- బీజేపీ నేత, మాజీ మంత్రి బీ.శ్రీరాములు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు కాని హామీలు గుప్పించి ఐదు గ్యారంటీల ద్వారా లాటరీతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ నేత, మాజీ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉచిత పథకాలతో రాష్ట్రంలో అంధకారం నెలకొంటోందన్నారు. అభివృద్ధి పనులు పూర్తిగా ఎక్కడివక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. ఐదు గ్యారంటీల్లో ఉచిత బియ్యం పథకం డబ్బులు మహిళల ఖాతాల్లోకి పడటం లేదన్నారు. గృహలక్ష్మికి సర్వర్ సమస్య అని కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సిద్ధరామయ్య తుగ్లక్ తరహాలో పాలిస్తున్నారని, కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు.

రైతు వ్యతిరేక సర్కార్ కాంగ్రెస్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకమని ఆరోపించారు. రైతుల శ్రేయస్సు కోసం తాము అమలు చేసిన పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో ఈనెల 8న బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కరువు తాలూకాలు ప్రకటించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో 42 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం రైతు కుటుంబాలను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. బ్రిటిష్ వారు పెట్టిన ఇండియా పేరు తొలగించి భారత్ అని పేర్కొనడం మంచిదేనన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిచి మోదీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి

ప్రతిపక్ష స్థానానికే ఇండియా పోటీ

కేంద్రంలో ఇండియా కూటమి ప్రతిపక్ష స్థానానికే పోటీ పడుతుందన్నారు. వారికి అధికారం దక్కడం కల్ల అన్నారు. ఉత్తర భారత పప్పు రాహుల్‌గాంధీ అయితే దక్షిణభారత పప్పు ఉదయనిధి స్టాలిన్ అని విరుచుకుపడ్డారు. మన ధర్మాలను విమర్శించే వారికి దేవుడే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదన్నారు. పురాణాల కాలం నుంచి సనాతన ధర్మం ఉందన్నారు. సనాతన ధర్మం అంటే దైవం అని అన్నారు. దేవుడిని విమర్శిస్తే ఖచ్చితంగా శిక్ష తప్పదన్నారు. ఈసందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు వై.ఎం సతీష్, రైతు మోర్చా నాయకుడు గురులింగనగౌడ పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సీకి నీరు విడుదల

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి విజయనగర, బళ్లారి, అనంతపురం జిల్లాకు తాగు, సాగునీరందించే హెచ్‌ఎల్‌సీ కాలువకు రెండో సారి గండిపడటంతో మూడు రోజులుగా కాలువకు నీటి సరఫరా నిలిపేసి మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేయడంతో బుధవారం మళ్లీ కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువకు గండి పడిన తర్వాత బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర, ఎస్‌డీఓ సంధాని తదితరుల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు పూర్తి చేశారు. హెచ్‌ఎల్‌సీ కాలువకు నీరు వదిలిన తర్వాత రెండోసారి గండిపడటంతో రైతుల పంటలకు నీరు అందించడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే గణేష్ తదితరులు పనులు పూర్తి చేయించడంలో తగిన దిశానిర్దేశం చేసి నిధుల కొరత లేకుండా చేయడంతో పనులు చకచకా పూర్తిచేసి కాలువకు నీటి విడుదల సాధ్యమైందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే కాలువ పొడవునా తరచు గండ్లు పడుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కాలువ ఆధునీకరణ కోసం దాదాపు రూ.900 కోట్ల నిధులు ఖర్చు చేసినా పనుల్లో నాణ్యత లోపించడం వల్లే గండ్లు పడుతున్నాయని రైతు సంఘం నేతలు ధ్వజమెత్తున్నారు. మళ్లీ కాలువకు గండ్లు పడకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని, కాలువ గుండా గస్తీని పెంచాలని రైతులు కోరుతున్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న దృశ్యం

పలు కేసుల్లో దొంగల అరెస్టు

యశవంతపుర: పగటిపూట తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో చోరీ పాల్పడుతున్న నలుగురు నిందితులను బెంగళూరు ఉత్తరవిభాగం పోలీసులు అరెస్ట్ చేసి రూ.75 వేలు నగదు, రూ.10.50 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మత్తికెరెలో నివాసం ఉంటున్న కోల్‌కతావాసి సుభాష్ మండల్ (28)ను అరెస్టు చేశారు. సంజయనగర పటేలప్పలేఔట్‌కు చెందిన రామయ్యశెట్టి ఆగస్టు 27న ఇంటికి తాళం వేసుకొని వెళ్లగా మండల్ చొరబడి 50 గ్రాముల లాంగ్ చైన్, మూడు జతల కమ్మలను దోచుకెళ్లాడు. మరో కేసులో బాగలగుంట పోలీసులు బన్నేరఘట్ట రోడ్డు బిలేకహళ్లికి చెందిన రవి అలియాస్ రవికుమార్ (36), కెంగేరి చళ్లఘట్టకు చెందిన ఇమ్రాన్(28), జైకుమార్ (39) అనే దొంగలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.8 లక్షలు నగదు, రూ.6.45 లక్షలు విలువగల 129 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కోలారు వార్తలు...

విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దు

కోలారు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెస్కాం జాగృత దళం ఇన్‌స్పెక్టర్ సదానంద తెలిపారు. బుధవారం తాలూకాలోని నరసాపురం గ్రామంలో బెస్కాం జాగృత దళం నుంచి వినియోగదారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చౌర్యం జరిగితే అధికారులు తమపై ఒత్తిడి తెస్తారన్నారు. తాము తనిఖీకి వచ్చినప్పుడు విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే తదుపరి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బులు మిగుల్చుకోవాలనే ఉద్దేశంతో సమస్యలు కొని తెచ్చుకోవద్దని సలహా ఇచ్చారు. విద్యుత్ చౌర్యం చేయబోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందున విద్యుత్ చౌర్యం చేయాల్సిన అవసరం లేదన్నారు. నరసాపురం జీపీ అధ్యక్షుడు కృష్ణప్ప, పంచాయతీ అభివృద్ధి అధికారి మునిరాజు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సదానంద

ప్రతిమల స్థాపనకు డిమాండ్

శ్రీనివాసపురం: తాలూకాలోని రోజరపల్లి క్రాస్‌లో కెంపేగౌడ ప్రతిమను స్థాపిస్తే తమ సముదాయాలకు చెందిన దార్శనికుల ప్రతిమలను కూడా నెలకొల్పాలని వివిధ సముదాయాలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. లోక్‌సభ సభ్యుడు ఎస్. మునిస్వామి క్రాస్ వద్ద కెంపేగౌడ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ.10 లక్షలను ఇస్తానని తెలపడంతో బుధవారం రోజరపల్లి క్రాస్‌లో పలువురు అంబేడ్కర్, వాల్మీకి, కైవార నారాయణప్ప, పునీత్‌రాజ్‌కుమార్‌ల చిత్రాలను పట్టుకుని తమ సముదాయాలకు చెందిన దార్శనికుల ప్రతిమలను కూడా స్థాపించాలని ఒత్తిడి చేశారు. దీనిపై స్పందించిన ఆయన క్రాస్ వద్ద ప్రభుత్వ స్థలంలో ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి దార్శనికులందరి ప్రతిమలను స్థాపిస్తామని, దీనిపై జిల్లాధికారితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.



ప్రతిమలను స్థాపించాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు

వైభవంగా లక్ష దీపోత్సవం



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

మాలూరు: శ్రీ ద్రౌపతాంబ దేవి జయంతిని పురస్కరించుకుని మంగళవారం లక్కూరులోని ముత్యాలమ్మ దేవి ఆలయంలో లక్షదీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పలు పూజలను నెరవేర్చారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దీపాలను వెలిగించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం, కలశ స్థాపన తదితర పూజలను జరిపారు.

లాభాల బాటలో సహకార సంఘం

కంప్లి: 2022–23వ సంవత్సరంలో తమ బ్యాంక్ రూ.4.24 కోట్ల లాభం గడించిందని బ్యాంక్ అధ్యక్షుడు హెచ్.జగదీశ్ వెల్లడించారు. పేటె బసవేశ్వర సభాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన వరలక్ష్మి క్రెడిట్ సహకార సంఘం 20వ వార్షిక మహాజన సభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ సంఘంలో 10,438 మంది సభ్యులు ఉన్నారన్నారు. రూ.5 కోట్ల 90 లక్షల 32 వేల షేర్ల పెట్టుబడులు కల్గి ఉన్నామన్నారు. వివిధ రంగాల వారికి రుణాలను అందించడం, అందించిన రుణాలు సకాలంలో వారి నుండి తిరిగి రాబట్టడం వల్ల పట్టణంలో పేరు సంపాదించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. బ్యాంక్ మేనేజర్ ఎం.లోకేశ్వరరెడ్డి వార్షిక నివేదిక, ఆదాయ ఖర్చులను వెల్లడించారు. బ్యాంక్ ఉపాధ్యక్షులు టీ.కొట్రేష్, డైరెక్టర్లు హెచ్.మంజునాథ్, డీ.వీరప్ప, వాలి కొట్రప్ప, కే.సణ్ణ గవిసిద్ధప్ప, బణగార చంద్రశేఖర్, కే.పంపాపతి, కవితాళ చెన్నప్ప, డాక్టర్.వీరనగౌడ, ఎస్.పాటిల్, కే.ఉషారాణి, కేఎం.సౌభాగ్యమ్మ, జీ.ఫకీరప్ప, యంకప్ప పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో వ్యక్తి మృతిపై తనిఖీ చేస్తాం

కోలారు: పోలీస్ కస్టడీలో ఉండగా ఆస్పత్రిలో మరణించిన ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి తాలూకాకు చెందిన మునిరాజు అనే వ్యక్తి మృతిపై తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎం.నారాయణ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. పోలీస్ కస్టడీలో ఉన్న వ్యక్తి మరణించడంపై అనేక అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో తనిఖీ చేయాలని నిర్ణయించామన్నారు. మృతుడి సంబంధీకులు గల్‌పేటె పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మృతుడు మునిరాజుపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో బైక్, మొబైల్ ఫోన్ చోరీలకు సంబంధించి నంగలి పోలీసులు నిందితుడిని మదనపల్లి తాలూకాలోని అతని స్వగ్రామం నుంచి తీసుకు వచ్చారు. మృతుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మరణించినట్లు ప్రాథమిక తనిఖీలో తెలుస్తోందన్నారు. అయితే సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో తనిఖీకి ఆదేశించామన్నారు. నంగలి పోలీసులు ఈ కేసులో సంబంధం ఉన్న వారినందరినీ విచారణ చేస్తారన్నారు. దోషులని తేలితే ఎలాంటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్మార్ట్ వాచీ కోసం స్నేహితుడి హత్య



హతుడు అస్లాం మకాందార్(ఫైల్)

హుబ్లీ: నగరంలోని బెంగేరి వెంకటేష్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి స్మార్ట్ వాచీ విషయమై స్నేహితులిద్దరి మధ్య ప్రారంభమైన ఘర్షణ హత్యతో అంతమైంది. హతుడు సిద్రామనగర నివాసి అస్లాం మకాందార్ కాగా గాయత్రినగర మంజునాథ్ నిందితుడు. కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడు అస్లాం మకాందార్ నిందితుడు మంజునాథ్ ఇద్దరు మంచి స్నేహితులు. కొద్ది రోజుల క్రితం మంజునాథ్ అస్లాంకు స్మార్ట్ వాచీని ఇచ్చాడు. అయితే అస్లాం సదరు వాచీని తిరిగి ఇవ్వకుండా వేధించాడు. ఈక్రమంలో మధ్య రాత్రి బెంగేరి వెంకటేష్ కాలనీలో ఎగ్‌రైస్ తింటుండగా ఇదే విషయమై ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఆగ్రహం చెందిన మంజునాథ్ చాకుతో అస్లాం ఛాతీపై పొడిచాడు. దీంతో తీవ్రంగా రక్తస్రావమైన అస్లాంను అతడి స్నేహితులు కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక అతడు మృతి చెందాడు. ఘటనపై కేశ్వాపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వైద్యం ఫలించక యువకుడు మృతి



ఆస్పత్రిలో బెడ్‌పై మరణించిన సునీల్ నాయక్



సునీల్ నాయక్ (ఫైల్)



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

- ఆస్పత్రి ముందు మృతుడి బంధువుల ఆందోళన

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి తండాకు చెందిన సునీల్‌నాయక్(24) అనే యువకుడు వైద్యం ఫలించక ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి హొసపేటె రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీంతో నగరంలోని ఆస్పత్రి ముందు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలు.. అమరావతిలోని శరణం ప్రైవేట్ ఆస్పత్రిలో సునీల్ నాయక్‌ను ఉదయం 10 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. 2 గంటల తర్వాత డాక్టర్ అతన్ని ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అయితే రాత్రి 8 గంటలకు యువకుడు మృతి చెందినట్లు వైద్యుడు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆపరేషన్‌కు నాలుగు గంటల సమయం పడుతుందా? అన్నది కుటుంబ సభ్యుల ప్రశ్నగా మారింది. ఉదయం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి మృతి చెందడంపై బంధువులకు అనుమానాలు ఏర్పడ్డాయి. పక్కలో రక్తం గడ్డకట్టడంతో ఆపరేషన్‌కి తీసుకొచ్చారు. మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి ఆవరణలో మిన్నంటాయి. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యుడు వినయ్ రాఘవేంద్ర మాట్లాడుతూ తాము నాలుగు సార్లు చికిత్స చేశాం. ఐదోసారి వచ్చి ఆస్పత్రిలో చేరినా ఆపరేషన్ చేశాం. చివరి గంటలో బీపీ తక్కువగా ఉండటంతో శ్వాస ఆగిపోయిందన్నారు. తాము తమ వంతు కృషి చేసి చికిత్స చేశాం. తమ నుంచి ఎలాంటి లోపమూ జరగలేదని తెలిపారు.

ఆయుష్ బలోపేతానికి కేంద్రం కృషి

శివాజీనగర: జాతీయ ఆయుష్ మిషన్ ప్రాంతీయ పరిశీలన సభను కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన సంప్రదాయ వైద్య విధానాలను ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్‌ను బలోపేతం చేస్తోందన్నారు. కేంద్ర ఆయుష్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ రాష్ట్ర మంత్రి డాక్టర్ ముంజపరా మహేంద్రబాయి కలుబాయి, తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి తిరుమా సుబ్రమణియన్, కర్ణాటక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండురావు, ఆయుష్ సచివాలయ కార్యదర్శి, వైద్య రాజేశ్ కొటిచాతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలు, భారత ప్రభుత్వ ఆయుష్ సచివాలయ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్య బోధించండి


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను బోధించాలని బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప సూచించారు. హోసకోటె పట్టణంలోని స్వామి వివేకానంద నగర శ్రీవారి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే క్రమంలో సీఎస్ఆర్ నిధులను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. చిక్కబళ్లాపుర ఎంపీ బీఎన్ బచ్చేగౌడ, విశ్రాంత న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్‌దాస్, ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొన్నారు.

మంటల్లో ట్రక్

మైసూరు: నడుస్తున్న ట్రక్ వాహనానికి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మైసూరు శివార్లలోని బోగాది రింగ్ రోడ్డులో జరిగింది. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు నడుస్తున్న ఒక ట్రక్‌లో మంటలు చెలరేగాయి. ఇది రాజస్థాన్‌కు చెందినది. ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపేసి కిందకి దిగేశాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసేటప్పటికి ట్రక్ ముందు భాగం పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

మొబైల్ బ్యాటరీల లోడులో మంటలు


లారీలో నుంచి మంటలు వస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: హిందూపురం సమీపంలోని కొల్లకుంట పైవంతెన వద్ద పాత మొబైల్‌ఫోన్ల బ్యాటరీల లోడుతో వెళ్తున్న లారీ అగ్నికి ఆహుతైంది. రాజస్థాన్ ప్రాంతంలో సేకరించిన పాత మొబైల్ బ్యాటరీలను హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి హిందూపురం పారిశ్రామిక వాడలోని సంగీత్ కర్మాగారానికి తరలిస్తుండగా వంతెన వద్దకు రాగానే లారీలో నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ బయటకు దూకేశాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికి బ్యాటరీలు సహా లారీ పాక్షికంగా కాలిపోయింది.

వెంకటకృష్ణయ్య తాతయ్య సేవలు మరువలేనివి

మైసూరు: వెంకటకృష్ణయ్య తాతయ్య 179వ జయంతిని మైసూరు నగర పాలికె ఆధ్వర్యంలో నిర్వహించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న తాతయ్య పార్కులో తాతయ్య విగ్రహానికి పాలికె మేయర్ శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ మైసూరు నగరంలో వందేళ్ల క్రితమే విద్యా సంస్థలు, కర్మాగారాలు తెరిచేందుకు తాతయ్య కృషి చేశారని గుర్తు చేశారు.

హోం గార్డుపై యువకుడి దాడి


హోం గార్డు చొక్కా పట్టుకున్న నిందితుడు అరవింద్

మైసూరు: హోంగార్డుపై యువకుడు దాడికి పాల్పడిన ఘటన హుణసూరు నగరంలోని కేఎస్ఆర్‌టీసీ బస్టాండ్‌లో జరిగింది. హుణసూరులోని నరసింహస్వామి తిట్టు లేఔట్ నివాసి మూర్తిరావ్ కుమారుడు అరవింద్ స్నేహితులతో కలసి వచ్చి తన బైక్‌ను నోపార్కింగ్ స్థలంలో నిలిపాడు. అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డు అవినాశ్ అభ్యంతరం వ్యక్తం చేయగా అరవింద్ అతని స్నేహితులు గొడవకు దిగారు. ఓ దశలో అరవింద్. హోం గార్డు చొక్కా కాలర్ పట్టుకొని వీరంగం చేశాడు. స్థానికులు వారిస్తున్నా వినకుండా హోం గార్డుపై దాడి చేశాడు. బస్టాండ్ అధికారులు ఇచ్చిన సమాచారంతో సీఐ దేవేంద్ర పోలీసు సిబ్బందితో వచ్చి అరవింద్‌ను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఉదయనిధిపై ఫిర్యాదు

శివాజీనగర: సనాతన ధర్మం గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీరామసేన కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు కబ్బన్‌పార్కు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. శ్రీరామసేన సంఘం సంఘటనా కార్యదర్శి ఎం.లక్ష్మీశ్ మాట్లాడుతూ సమాజంలో మత సామరస్యతకు భంగం కలిగించేలా, సనాతన ధర్మాన్ని అవమానిస్తూ ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు చేశారన్నారు.

మువ్వ గోపాలుడికి భక్తజన నీరాజనం



బొమ్మనహళ్లిలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


చిక్కబళ్లాపురంలో శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు

బొమ్మనహళ్లి: భగవద్గీతతో ప్రపంచ మానవాళికి దిశా నిర్దేశం చేసిన నల్లనయ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాల్లో రాధాకృష్ణులకు విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పండ్లు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించి ముచ్చటపడ్డారు. రాధాకృష్ణుల ప్రతిమలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. హెచ్ఎస్ఆర్ లేఔట్ సోమసంద్రపాళ్యలో శ్రీ సాయి రామ్ విద్యామందిర పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్కబళ్లాపురం: జిల్లా కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో జిల్లా పాలకమండలి, తాలూకా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకలను మంత్రి డాక్టర్ ఎం.సి.సుధాకర్ ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణుని విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, ఏడీసీ తిప్పేస్వామి, తహసీల్దార్ అనిల్‌కుమార్, యాదవ సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు. బీజీఎస్ అగలగుర్కి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను జిల్లా ఆహార, పౌరసరఫరాల శాఖ జేడీ డైరెక్టర్ సవిత ప్రారంభించారు.

యశవంతపుర: కృష్ణాష్టమి సందర్భంగా బెంగళూరు నగరంలోని ఇస్కాన్ ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాధాకృష్ణులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా వెస్ట్ ఆఫ్ కార్డ్ రోడ్డు, రాజ్‌కుమార్ రోడ్డు మార్గంలో బీఎంటీసీ, కేఎస్ఆర్‌టీసీ బస్ సంచారంను నిషేధించారు. యశవంతపుర వంతెన, కేసీ జనరల్ ఆస్పత్రి, శేషాద్రిపురం మార్గంలో మెజిస్టిక్‌కు మళ్లించారు. మూడు రోజుల పాటు ఇస్కాన్‌లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఉడుపిలో

ఉడుపి శ్రీకృష్ణ మఠంలో నల్లనయ్యకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ మఠం రథవీధిలో పండుగ వాతావరణం నెలకొంది. గురువారం విట్లపిండి జరుగనుంది. మూడురోజుల పాటు ఉడిపి మఠంలో జాతర నిర్వహిస్తారు.


చింతామణిలో ఊరేగింపు


శివమొగ్గ: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


శివమొగ్గ: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తిభావంతో నిర్వహించారు. కృష్ణ మందిరాల్లో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలను చేపట్టారు.

చింతామణి: చింతామణిలో ప్రవాసిమందిరం నుంచి ట్రాక్టర్లలో శ్రీకృష్ణుని ప్రతిమలు ఉంచి ఊరేగించారు.

గౌరిబిదనూరు: జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. యాదవ సముదాయ నాయకుడు గోపి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ పారాయణం చేయాలన్నారు. నాగయ్యరెడ్డి కాలనీలో ఉన్న కుడుగోలు శ్రీకృష్ణ దేవాలయంలో గోపాలకృష్ణాచార్ నేతృత్వంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎక్స్‌ప్రెస్‌వేపై తగ్గిన ప్రమాదాలు

- పకడ్బందీగా రోడ్డు నిబంధనలు అమలు
- సాఫీగా ప్రయాణం


సాఫీగా ప్రయాణిస్తున్న వాహనాలు

దొడ్డబళ్లాపురం: నిత్యం రోడ్డు ప్రమాదాలతో నెత్తురోడే బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోయాయి. బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వాహనాల వేగాన్ని 100 కిలోమీటర్లకు పరిమితం చేశారు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిషేధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు జరిమానాలు విధించారు. బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పై గత జనవరి నుంచి జూన్ వరకూ జరిగిన ప్రమాదాల్లో వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. 105మంది మృత్యువాత పడగా వందలాది మంది క్షతగాత్రులుగా మారారు. పోలీసుశాఖ, హైవే అథారిటీ అధికారులు రహదారిపై పలు ఆంక్షలు విధించి ప్రమాదాల సంఖ్యకు కళ్లెం వేశారు. దీంతో జులై, ఆగస్టు నెలల్లో ప్రమాదాల సంఖ్య తగ్గింది. జులైలో 8మంది, ఆగస్టులో 6మంది మృత్యువాత పడ్డారు. అయితే పోలీసులు మాత్రమే ప్రమాదాల నియంత్రణకు ముందుకు వస్తే సరిపోదని, వాహనదారులు, ప్రయాణికులు జాగ్రత్త వహించాల్సి ఉందని రామనగర జిల్లా ఎస్పీ సురేశ్ సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మైసూరు: నగరంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించారు. మైసూరు తాలూకా ఇలవాల గ్రామానికి చెందిన నాగరాజ (25) తన స్నేహితుడు పునీత్‌తో కలసి ఆర్‌టీ నగర వైపు బైక్‌లో వెళ్తుండగా దట్టగళ్లి వర్తుల రోడ్డు వద్ద మలుపులో శ్రీరాంపుర నుంచి వచ్చిన లారీ కొట్టింది. బైక్ వెనుక కూర్చొన్న నాగరాజ్ కింద పడి తలకు తీవ్ర గాయమై మరణించాడు. పునీత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. అదేవిధంగా రామకృష్ణనగర కవితా బేకరి రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్గవ్ అనే యువకుడు మృతి చెందాడు. స్నేహితుడు గురుప్రసాద్‌తో కలసి బైక్‌లో వెళ్తుండగా వాహనం స్కిడ్ అయి కింద పడ్డారు. ఈ సమయంలో పెద్ద రాయిపై పడడంతో భార్గవ్ అక్కడికక్కడే మరణించాడు. గురుప్రసాద్ తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై కువెంపు నగర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీ-బాలుడు మృతి

- వృద్ధురాలికి తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో మనవడు మృతి చెందగా అవ్వ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన దొడ్డబళ్లాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దర్జీపేటకు చెందిన కమలేశ్‌దేవి(60)తన మనవడు దర్శన్(3)తో కలిసి అయ్యప్పస్వామి దేవాలయం వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కరువు తాలూకాల ప్రకటనలో జాప్యమెందుకు?

శివాజీనగర: కరువు తాలూకాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంపై నిందలు వేయాలనే ఉద్దేశంతోనే కరువు పీడిత ప్రాంతాలను ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కరువు తాలూకాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.

రైతుల ఆందోళనకు రాకేశ్ టికాయత్ మద్దతు


టిప్పు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాకేశ్ టికాయత్, రైతు నాయకులు

దొడ్డబళ్లాపురం: భూ స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ అన్నదాతలు చేపట్టిన పోరాటానికి ఢిల్లీకి చెందిన రైతు నాయకుడు రాకేశ్ టికాయత్ మద్దతు తెలిపారు.

దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ క్లస్టర్ పరిధిలోని 13 గ్రామాల్లో 1777 ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకోవడానికి కేఐఏడీబీ నోటీసులు జారీ చేసింది. దవీనిని వ్యతిరేకిస్తూ రైతులు 520 రోజులుగా పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతు నాయకుడు రాకేశ్ టికాయత్ బుధవారం దేవనహళ్లికి విచ్చేశారు. టిప్పు సుల్తాన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెన్నరాయపట్టణకు వెళ్లి రైతుల సమస్యల గురించి తెలుసుకున్నారు. రాబోవు రోజుల్లో చేయాల్సిన పోరాటం పై చర్చించారు.

సాగు నీరు విడుదల చేయండి


మాట్లాడుతున్న మంత్రి మధుబంగారప్ప

శివమొగ్గ: భద్రా పరివాహక ప్రాంతంలో పంటల సాగుకు సెప్టెంబర్ 11లోగా నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎస్.మధు బంగారప్ప ఆదేశించారు. బుధవారం శివమొగ్గలో భద్రా పరివాహక ప్రాంత అభివృద్ధి మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన భద్రా జలాశయం 83వ నీటి సలహా సమితి సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. భద్రా పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా నీటి విడుదలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏనుగు పట్టివేత

బనశంకరి: మడికేరి తాలూకా కెదకల్ గ్రామప్రజలను బెంబేలెత్తిస్తూ అటవీ సిబ్బందిని హతమార్చిన ఏనుగును బుధవారం అటవీశాఖ అధికారులు బంధించారు. ఇటీవల అటవీసిబ్బంది గిరీశ్‌పై ఏనుగు దాడిచేయడంతో అతను తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు మడికేరి కెదకల్ గ్రామంలో రెండురోజులుగా ఏనుగు కోసం గాలింపు చేపట్టారు. ఆరు పెంపుడు ఏనుగుల సాయంతో ఏనుగును బంధించారు.

హోసూరు వార్తలు..

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

హోసూరు: హోసూరు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనగా ఒకరు మృతి చెందారు. బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకొంది. బాగలూరు వద్ద ఇచ్చంగూరుకి చెందిన ఆనందప్ప(55), భార్య రత్నమ్మ (55)తో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం రాత్రి మాలూరు రోడ్డుపై వెళుతుండగా, ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన భార్యాభర్తలను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా ఆనందప్ప మార్గమధ్యంలో మృతి చెందాడు. రత్నమ్మ చికిత్స పొందుతోంది. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

నైపుణ్య కేంద్రం ప్రారంభం

హోసూరు: తమిళనాడు, కర్ణాటక సరిహద్దు అత్తిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న ఆక్స్‌ఫర్డ్ వైద్య కళాశాల ఆస్పత్రిలో బుధవారం కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి శరణ్‌ప్రకాష్ రుద్రప్ప స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ప్రారంభించారు. కళాశాల చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫల్స్, స్కిల్‌డెవలఫ్‌మెంట్ కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. డైరెక్టర్ శ్రీనివాసులు, డాక్టర్లు జయంతి, లక్ష్మి, రామ్‌నిహార్, సుమ పాల్గొన్నారు.

బాక్సింగ్ చిన్నారికి సన్మానం

హోసూరు: జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకం అందుకొన్న విద్యార్థినిని క్రిష్ణగిరి జిల్లా కిక్‌బాక్సింగ్ సంఘం నేతలు సన్మానించారు. గత నెల ఆగస్టు 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జాతీయ స్థాయి జూనియర్ కిక్‌బాక్సింగ్‌పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తమిళనాడు నుంచి 193 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో 50 బంగారు పతకాలు, 45 వెండి, 67 సిల్వర్ పతకాలను కైవసం చేసుకొన్నారు. హోసూరుకు చెందిన రక్షిత బంగారు, వెండి పతకాన్ని కైవసం చేసుకొంది.

గిరిజన విద్యార్థులకు అన్యాయం

కెలమంగలం: కేంద్ర ప్రభుత్వం ద్వారా గిరిజన విద్యార్థులకు అందజేసే ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాపస్ పంపిందని ఆరోపిస్తూ బుధవారం బీజేపీ నాయకులు ధర్నా చేశారు. డెంకణీకోట పాతబస్టాండులో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజ్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. తమిళనాడు రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసిన నిధులను విద్యార్థులకు అందించకుండా వెనక్కి పంపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిమ్మరాజ్, ఆనంద్, వెంకట్, పార్థిభన్, శ్రీనివాసరెడ్డి, పాపణ్ణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా మంజునాథ్

చింతామణి: తాలుకాలోని కైవార హోబళి పెరుమాచనహళ్లి పంచాయతీ పరిధిలోని నాగదేనహళ్లి పాల డైరీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారులు మంజునాథ్, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర గెలుపొందినట్లు ఎన్నికల అధికారి లీలావతి వెల్లడించారు.

వర్షానికి చెరువులా మారిన రోడ్లు


హోసూరు బస్టాండు ప్రాంతం జలమయం

హోసూరు: క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. హోసూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లపై వరద నీరు ప్రవహించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా హోసూరు బస్టాండు ప్రాంతంలో వరదనీరు చేరడంతో చెరువును తలపించింది. హోసూరు రైల్వేస్టేషన్ సమీపంలోని సొరంగ మార్గంలో నీరు నిలిచి వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా హోసూరు- డెంకణీకోట రహదారిని మూసివేయడంతో తళి మార్గం మీదుగా వెళ్లి అందివాడి ఆటల మైదానం, మత్తిగిరి కూడలిరోడ్డు వద్దకు చేరుకొని వెళ్లవలసి ఉంది. దీంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

అలరించిన గోకులాష్టమి


చిన్నారి రాధాకృష్ణుల ఊరేగింపు

హోసూరు: గోకులాష్టమి సందర్భంగా బుధవారం హోసూరు పట్టణంలో వివిధ హిందూ సంఘాలు పిల్లలచే శ్రీకృష్ణ, రాధా వేషధారణలు ధరించి ఊరేగింపు నిర్వహించాయి. మొదటగా జీఆర్‌టి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ బ్రహ్మాండ విగ్రహానికి విశేషపూజలు నిర్వహించారు. మంగళవాద్యాలతో హరేరామ హరేక్రిష్ణ అంటూ పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి మళ్లీ జీఆర్‌టి వద్దకు చేరుకొన్నారు. వందలాది మంది పిల్లలు గోపి గోపికల వేషాల్లో మురిపించారు. జిల్లా వ్యాప్తంగా ఇస్కాన్ ఆలయాల్లోనూ విశేష పూజలు నిర్వహించారు.

పరస్పరం కత్తిపోట్లు.. యువకుడి మృతి


హతుడు జమయాంగ్(ఫైల్)

యశవంతపుర: ఉత్తరకన్నడ జిల్లా ముండగోడ తాలూకా టిబెటియన్ క్యాంప్‌లో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. జమయాంగ్ డార్బా అలియాస్ లోబ్సంగ్(35), విశ్రాంత సైనికుడైన గోనపూ తిన్లె చోడక్ మధ్య మంగళవారం మధ్య రాత్రి గొడవ జరిగింది. చాకుతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఘటనలో జమయాంగ్ మృతి చెందగా చోడెక్‌ను హుబ్లీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మాజీ ఎంపీ ఇంటిలో దోపిడీ

- బంగారు చైన్‌తో ఉడాయించిన దుండగుడు

యశవంతపుర: మాజీ ఎంపీ దేవరాజనాయక్ ఇంటిలో పట్టపగలు దోపిడీ జరిగింది. ఓ వ్యక్తి లోపలకు చొరబడి బంగారు చైన్ లాక్కొని ఉడాయించారు. ఈ ఘటన ఉత్తరకన్నడ జిల్లా శిరసిలో జరిగింది. దేవరాజనాయక్ భార్య గీతా నాయక్ బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఒక్కరే ఉనారు. ఆ సమయంలో ఓ వ్యక్తి వచ్చి తాగటానికి నీళ్లు అడిగాడు. నీళ్లు తెచ్చేందుకు ఆమె లోపలకు వెళ్లగా దుండగుడు ఇంట్లోకి చొరబడి ఆమె మెడపై కత్తి పెట్టి 60 గ్రాముల బంగారు చైన్ లాక్కొని ఉడాయించాడు. ఒంటిగంట సమయంలో కుమారుడు నాగరాజు ఇంటికి రాగా ఈ విషయం వెలుగు చూసింది. సిద్ధాపుర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దుండగుడి కోసం గాలింపు చేపట్టారు.

ప్రైవేటు రైల్వే టికెట్ సెంటర్లపై దాడులు

మైసూరు: శివమొగ్గ జిల్లా పరిధిలో టికెట్ల విక్రయాలలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు టికెటింగ్ సెంటర్లపై మైసూరు రైల్వే అధికారులు దాడులు చేశారు. ఆర్‌పీఎఫ్ విభాగం కమిషనర్ జేకే శర్మ, పోలీసులు కలిసి మూడు టికెట్ సెంటర్లపై దాడి చేసి రూ. 2.5 లక్షల విలువ చేసే రైల్వే ఈ-టికెట్లు, రూ. 1.25 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రేణుకా సైబర్ సెంటర్‌కు చెందిన గణేశ్ రామ్ నాయక్ (31), శ్రీ కమ్యూనికేషన్ మొబైల్ సేల్స్‌కు చెందిన రేవణ్ణప్ప (36), సైబర్ జోన్ నుంచి ప్రశాంత్ హెగ్డేను అరెస్టు చేశారు. ఈ మూడు సైబర్ కేంద్రాలు రైల్వే నుంచి ముందుగా ఈ-టికెట్లను తీసుకుని అధిక ధరకు ప్రయాణికులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

సామవేదం ప్రవచనాలు



సాక్షి, బెంగళూరు: బెంగళూరు మారతహళ్లిలోని న్యూ హొరైజెన్ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో శ్రీ సామవేదం షణ్ముఖశర్మ శ్రీ మహాలక్ష్మీ వైభవము 7 రోజుల ప్రవచనాలు మంగళవారం నుంచి మహా వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమహాలక్ష్మీ అమ్మవారి లీలలు, తత్త్వము, వైభవంపై హృదయాలకు హత్తుకునేలా షణ్ముక శర్మ వివరించారు. బెంగళూరులోని ఋషిపీఠం సత్సంగం 22 ఏళ్లుగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న శ్రీ సామవేదం షణ్ముకశర్మ ప్రవచనాలు ఈసారి కూడా 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

భార్య చేతబడి చేయిస్తోందని ఫిర్యాదు

శివాజీనగర: భార్యనే తనపై చేతబడి చేయిస్తోందని నగరంలోని రెస్ట్ హౌస్ రోడ్డుకు చెందిన వ్యాపారి దేవ్ కుమార్ (39) పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతని భార్య ఐశ్వర్య, అత్త మహాలక్ష్మీ, మామ మంజునాథ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వ్యాపారి దేవ్ కుమార్ 2022 జూన్ 1న ఐశ్వర్యను వివాహం చేసుకున్నారు. 2023 ఫిబ్రవరి 22న బిజినెస్ ట్రిప్ ముగించుకొని ఇంటికి రాగాబాత్‌రూమ్‌లో బూడిద, కర్పూరం చల్లారని, ఇంట్లో పలుచోట్ల నిమ్మకాయల ముక్కలు, పూజ చేసిన టెంకాయలు ఉన్నాయని, అనుమానంతో ప్రైవేటు తనిఖీ ఏజెన్సీతో విచారణ చేయించగా భార్య ఐశ్వర్య, అత్త మహాలక్ష్మీ అత్తిగుప్ప జ్యోతిష్యుడు నాగేంద్ర, శ్మశానంలో పూజ చేసినట్లు తేలిందని బాధితుడు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన తండ్రి అనారోగ్యానికి గురయ్యాడని, తమ ఇంట్లో కుక్క కూడా మృతి చెందిందని, ఇదంతా తన భార్య చేయిస్తున్న చేతబడి ఫలితమేనని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

9, 10 తేదీల్లో క్రైస్తవ ప్రత్యేక ఆశీర్వాద కూడికలు


రెవరెండ్ డాక్టర్ కోన శౌరిబాబు

శివాజీనగర: రాజధాని బెంగళూరులో ఉన్న తెలుగు క్రైస్తవులను ఆత్మీయంగా బలోపేతం చేసేందుకు ఈ నెల 9–10 తేదీల్లో మార్తహళ్లిలో ప్రత్యేక ఆశీర్వాద కూడికలను నిర్వహించనున్నట్లు అమానా మినిస్ట్రీస్, అమానా చర్చ్ పాస్టర్ కే.పీ.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దైవ వర్తమానికులుగా అంతర్జాతీయ వర్తమానికులు, ఇశ్రాయేలు దేశపు రాయబారి రెవరెండ్ డాక్టర్ కోన శౌరిబాబు పాల్గొంటారు. రోజూ సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి.

అట్టతో బ్యాండేజ్

- ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం

దొడ్డబళ్లాపురం: ఆస్పత్రి సిబ్బంది ఓ క్షతగాత్రుడికి పేపర్ అట్ట పెట్టి బ్యాండేజ్ కట్టి తమ నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు.ఈ ఘటన నెలమంగల తాలూకా దాబస్‌పేట ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన ప్రభు అనే వ్యక్తి బైక్‌పై నుంచి పడి కాలికి గాయమైంది. దాబస్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి రాగా వైద్య సిబ్బంది పేపర్ అట్ట పెట్టి కట్టుకట్టారు. ఈ సమయంలో ఆస్పత్రిలో డాక్టర్ లేరని తెలిసింది. వైద్య సిబ్బంది నిర్వాకం పట్ల సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా...

భారీ వర్షంతో అమరావతికి రాకపోకలు బంద్

జల దిగ్బంధంలో రాజధాని రహదారులు



గుంటూరు నుంచి రాజధానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న కోటేళ్ల వాగు

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో వాగులు పొంగిపొర్లి రాజధాని అమరావతికి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద కోటేళ్లవాగు పొంగి రోడ్లపైకి నీరు రావడంతో సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో విధులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే జనాలు ఇబ్బందిపడ్డారు. కోటేళ్ల వాగుకు వరద ఉధృతి తగ్గకపోవడంతో వీఐపీలు సైతం రోడ్లపైకి చేరిన వరద నీటిలోనే వాహనాలను పోనివ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మిస్తానని చెప్పిన చంద్రబాబు రాజధానికి వెళ్లేందుకు రోడ్లను మాత్రం అందుకు తగ్గట్లుగా నిర్మించకపోవడంతో పాటు లోలెవల్ చప్టాల వద్ద వంతెనలు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే పెదపరిమి కోటేళ్ల వాగు, లాం-నీరుకొండ వద్ద కొండవీటి వాగు పొంగి వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడుతోంది. ప్రతిష్టాత్మక ఎస్ఆర్ఎం, విట్-ఏపీ వంటి యూనివర్సిటీల విద్యార్థులు, అధ్యాపకులకు నిత్యం వెతలు తప్పడం లేదు.

బాబు 'అరెస్ట్' వ్యాఖ్యలు నెరవేరుతాయి

- 1,074వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: అధికారం అడ్డుపెట్టుకుని పాల్పడిన అవినీతి కేసుల్లో జైలు తప్పదని గ్రహించినందునే చంద్రబాబు తనను అరెస్టు చేస్తారనే వ్యాఖ్యలు చేస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,074వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. రాజకీయాల్లో సానుభూతి కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు అవినీతి కేసులను కూడా తనకు అనుకూలంగా మలుచుకోవాలనే దుర్మార్గ ఆలోచన చేయడం సిగ్గుచేటన్నారు. బాబు అవినీతిపై అధికార పక్షం మినహా మిగిలిన పార్టీలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నాయకులు గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ నోటీసులకు ఎవరైనా సమాధానం చెప్పాల్సిందే

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తెనాలి: లెక్కజెప్పని ఆదాయంపై ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఇచ్చే నోటీసులకు ఎవరైనా సమాధానం చెప్పాల్సిందేనని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఖాతాలోని డబ్బుకు ఏదైనా నేరంతో సంబంధముంటే పోలీస్‌శాఖ, విదేశాల నుంచి డబ్బు వస్తే మనీ ల్యాండరింగ్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగుతాయని చెప్పారు. గుంటూరు జిల్లాలోని కొల్లిపర మండల గ్రామం అత్తోటలో బుధవారం జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన లక్ష్మీనారాయణను మాజీ సీఎం చంద్రబాబుకు ఐటీ నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. సహజంగా ఎవరి ఖాతాలోకైనా వచ్చిన డబ్బులపై ఐటీ రిటర్న్‌లో వెల్లడించకపోతే, ఐటీ శాఖ నుంచి నోటీసులు ఖాయంగా వస్తాయని చెప్పారు. సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే తగిన పన్నును కట్టించుకుని వదిలేస్తారన్నారు. ఏదైనా నేరంచేసి, అవినీతికి పాల్పడి ఉన్నట్టయితే పోలీసు దర్యాప్తు మొదలవుతుందని చెప్పారు. బ్లాక్‌మనీని వైట్‌గా మార్చటం, మనీ ల్యాండరింగ్ అయివుంటే ఈడీ రంగంలోకి దిగుతుందని చెప్పారు. చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో ఈ విధమైన ప్రక్రియ జరిగే అవకాశం ఉందన్నారు. బోగస్ కంపెనీల నుంచి డబ్బులిచ్చారని సాక్ష్యాధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబుకు ఐటీ నోటీసుల విషయంలో ఏ విధమైన సమాధానం వస్తుంది? దర్యాప్తుసంస్థలు చూపే సాక్ష్యాధారాలు చూడాల్సి ఉందన్నారు.

- తెలంగాణ

ఆడిటర్ బుచ్చిబాబు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు విచారించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం విధానం రూపకల్పనలో ఎవరెవరి భాగస్వామ్యం ఉంది? ఎవరి లబ్ధి కోసం మార్పులు చేర్పులు చేశారు? అనే అంశాలపై సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త బినోయ్‌బాబుకు ఢిల్లీ హైకోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. బినోయ్‌బాబు కుమార్తె ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి పదిరోజుల పాటు బెయిల్ పొడిగిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది.

అరెస్టు.. పదేళ్ల జైలు!

లేదంటే చంద్రబాబుకు జీవిత ఖైదు విధించే అవకాశం

- ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎలాంటి పదవులూ చేపట్టకుండా అనర్హత వేటు పడుతుంది
- గతంలో మాదిరిగా ఆయన ఈసారి తప్పించుకోలేరు
- ఐటీ నోటీసులో ఉన్నవి తీవ్ర ఆరోపణలు
- ఈ కేసులో స్టే తెచ్చుకోవడం సాధ్యం కాదు
- సాక్షుల వాంగ్మూలం, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ పక్కాగా ఉన్నాయి
- పన్ను ఎగవేతే కాకుండా.. రూ.కోట్లలో మనీ లాండరింగ్ జరిగింది
- ఈడీ, సీబీఐ దర్యాప్తునకు వెయ్యి శాతం అవకాశాలు
- ముఖ్యమంత్రిగా ఉంటూ చంద్రబాబు అధికారాన్ని దుర్వినియోగం చేశారు
- లాలూ ప్రసాద్ యాదవ్, జయలలితపైనా ఇదే తరహా కేసులు
- ఇది రూ.118 కోట్లతో ఆగేది కాదు.. ఇంకా చాలా స్కామ్‌లు బయటికొస్తాయ్
- నారా లోకేష్ పాత్రపైనా ఆధారాలు.. విచారణ ఎదుర్కోక తప్పదు
- 'సాక్షి' ప్రతినిధి ఇంటర్వ్యూలో ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు బీఎస్ రాంబాబు



సాక్షి, హైదరాబాద్:

ప్రజాధనాన్ని కాజేసి పేదల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టుల్లో రూ.వందల కోట్ల కుంభకోణానికి పాల్పడిన మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అరెస్టు ఖాయమని, ఈ కేసు నుంచి ఆయన బయటపడడం అసాధ్యమని ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు బీఎస్ రాంబాబు స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక నేరానికి పాల్పడినందుకు చట్ట ప్రకారం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి సంబంధించి ఐటీ శాఖ దగ్గర అన్ని ఆధారాలున్నాయని, సాంకేతికంగా మాత్రమే నేరం రుజువు కావాల్సి ఉందని వివరించారు. 'ఈ కేసును రాజకీయ కక్ష సాధింపు కోణంలో చూడలేం. ఆదాయపు పన్ను (ఐటీ) అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎంతో తీవ్రమైన ఆరోపణలు. అందుకు వారి వద్ద ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, డాక్యుమెంటరీ ఆధారాలున్నాయి. ఇందులో భారీ అవినీతి దాగి ఉంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భవిష్యత్తులో ఏదైనా పదవిని పొందేందుకు సైతం చంద్రబాబు అనర్హుడు అవుతారు. ఈ కేసులో వెయ్యి శాతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ దర్యాప్తు చేపట్టడం తప్పదు' అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతున్న చంద్రబాబు అవినీతి వ్యవహారాలు, ఐటీ నోటీసుల్లో ప్రధానాంశాలు, సాంకేతిక విషయాలపై మంగళవారం 'సాక్షి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన విశ్లేషించారు.

మాజీ సీఎం చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో కీలక అంశాలేమిటి?

ఇది చాలా తీవ్రమైన ఆర్థిక నేరం. చంద్రబాబు నాయుడు రూ.118 కోట్ల ఆదాయాన్ని బహిర్గతం చేయకుండా దాచి పెట్టారన్న ఆరోపణ ఉంది. ఈ నేరానికి చట్ట ప్రకారం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడవచ్చు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భవిష్యత్తులో ఆయన ఎలాంటి పదవులు పొందకుండా అనర్హుడు అవుతారని చట్టం చెబుతుంది. ఈ కేసులో కీలక వ్యక్తుల స్టేట్మెంట్లు ఉన్నాయి. డాక్యుమెంటరీ ఎవిడెన్స్ పక్కాగా ఉంది. సాంకేతికంగా మాత్రమే నేరం నిరూపణ కావాల్సి ఉంది. ఇప్పటికే ఐటీ శాఖ దగ్గర ఉన్న ఆధారాలను చూస్తే ఈ కేసులో ఆయనకు శిక్ష తప్పదని తెలుస్తోంది.

ఈ కుంభకోణంలో ప్రధాన ఉల్లంఘనలు ఏమిటి? ఐటీ అధికారులు నోటీసుల్లో ఏ అంశాలు పేర్కొన్నారు?

ఈ కేసును మూడు రకాల ఉల్లంఘనలుగా చూడవచ్చు. ఈ మూడు కూడా తీవ్రమైన నేరాలే. ఆదాయాన్ని దాచిపెట్టి ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టాన్ని మొదట ఉల్లంఘించారు. రెండోది.. ఈ డబ్బును విదేశాలకు పంపడం. అక్కడి నుంచి ఆ సొమ్ము విరాళాల రూపంలో మళ్లీ చంద్రబాబు ఖాతాలోకో టీడీపీ ఖాతాలోకో వచ్చింది. అంటే మనీ లాండరింగ్ చట్టాన్ని ఉల్లంఘించినట్టు అయింది. ఇక ప్రజా ప్రతినిధిగా ఉంటూ తన ప్రతిజ్ఞకు భిన్నంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు కాబట్టి యాంటీ కరప్షన్ యాక్ట్ కింద చంద్రబాబు శిక్షార్హుడు అవుతారు. దీన్ని క్విడ్ ప్రోకోగా చూడవచ్చు.

ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో తన పేరు లేదని చంద్రబాబు వాదిస్తున్నారు కదా? గతంలో ఇచ్చిన సమాధానాల్లో ఇదే ప్రధానంగా ప్రస్తావించారు..

ఈ వ్యవహారంలో తన పేరు లేదని చంద్రబాబు నాయుడు చెబుతున్నారు. కానీ ఇక్కడ వాస్తవం ఏమిటంటే ఏ నేరంలోనైనా ఒక వ్యక్తి పేరు లేనంత మాత్రాన అతడు నేరం చేయనట్టు కాదు. ఈ మొత్తం కుంభకోణంలో చంద్రబాబు పాత్రపై ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలున్నాయి. డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఉంది. ఈ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ (ప్రాసంగిక సాక్ష్యాలు) సైతం నిందితుడి పాత్రను నిరూపిస్తాయి కాబట్టి నా పేరు లేదు కదా.. అనే దానికి మినహాయింపులు ఉండవు. తన పేరు లేదని చంద్రబాబు స్టేట్మెంట్లు ఇచ్చినంత మాత్రాన కుదరదు. చట్ట ప్రకారం సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్, డాక్యుమెంటరీ ఎవిడెన్స్, ప్రత్యక్ష సాక్షులు చెప్పే సాక్ష్యాల ఆధారంగా ఎన్నో కేసులు నిరూపితమయ్యాయి. ఇవన్నీ ఐటీ అధికారుల దగ్గర పక్కాగా ఉన్నట్టు నోటీసుల ఆధారంగా తెలుస్తోంది. కాబట్టి చంద్రబాబునాయుడు తన పేరు లేదంటూ తప్పించుకోలేరు. ఐటీ సెక్షన్ 153 సీ, సెక్షన్ 142(1), 143(2) ప్రకారం మీకు జ్యూరిస్‌డిక్షన్ లేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తే తమకు ఆ అధికారం ఉందని ఐటీ అధికారులు ఇప్పటికే తేల్చి చెప్పారు.

గతంలో తనపై దాఖలైన కేసుల్లో స్టేలు తెచ్చుకున్నట్లుగా చంద్రబాబు ఈ కేసులోనూ స్టే తెచ్చుకునే అవకాశం ఉందా..?

గతంలో మాదిరిగా చంద్రబాబు నాయుడు ఐటీ కేసులో స్టే తెచ్చుకోవడం సాధ్యం కాదు. ఐటీ కేసులకు ప్రత్యేకంగా ట్రిబ్యునల్ ఉంటుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ అనేది హైకోర్టు, సుప్రీంకోర్టుల పరిధిలోకి ఇమీడియెట్‌గా రాదు. అక్కడ జ్యుడీషియల్ పవర్స్ ఉండే జ్యుడీషియల్ అధికారి ఉంటారు. ఆయన ట్రిబ్యునల్‌లో విచారిస్తారు. కాబట్టి మొదట ప్రొసీడింగ్స్ పూర్తి చేయాల్సిందే. జ్యుడీషియల్ పవర్స్ అన్నీ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు ఉన్నాయి. ఈ కేసులో ఎంతో సీరియస్ అభియోగాలున్నాయి. నకిలీ ఇన్‌వాయిస్‌లతో ప్రజాధనాన్ని కొట్టేశారు. ప్రత్యక్ష సాక్షుల స్టేట్మెంట్ ఉంది, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ కూడా ఉంది. సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ కూడా ఉంది. అందువల్ల స్టేలు ఇచ్చే ఆస్కారం ఏమాత్రం లేదు. గతంలో జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్‌లపైనా ఈ తరహా కేసులు నమోదయ్యాయి.

ఈ మొత్తం వ్యవహారంలో అధికార దుర్వినియోగం స్పష్టంగా ఉంది. ఆ కోణంలో దర్యాప్తునకు అవకాశం ఉందా?

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటూ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారనేందుకు డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఉంది. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్, జయలలితపైన నమోదైన కేసులను చూస్తే.. అధికారంలో ఉండగా వారు తీసుకున్న నిర్ణయాల మేరకు పెట్టిన కేసులే అవి. అదే మాదిరిగా చంద్రబాబు సైతం అధికారాన్ని దుర్వినియోగం చేసి డబ్బులు సంపాదించారని ఐటీ అధికారుల నోటీసులలో స్పష్టంగా ఉంది. బోగస్ ఇన్‌వాయిస్‌లను సీఎం హోదాలో చంద్రబాబు అంగీకరించి ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిపారు. ఆ డబ్బులు రూపం మార్చుకుని తిరిగి చంద్రబాబు పార్టీ ఖాతాలోకే వచ్చాయి. అంటే ఎవరైతే నిర్ణయం తీసుకున్నారో వాళ్లకే తిరిగి లబ్ధి చేకూరింది. కాబట్టి అవినీతి నిరోధక చట్టాల కింద కూడా దర్యాప్తునకు అవకాశం ఉంది.

ఐటీ అధికారుల దర్యాప్తులో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. విదేశాల్లోనూ చెల్లింపులు జరిగినట్టు ఆధారాలున్నాయి. ఐటీతోపాటు ఈడీ, సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేసే అవకాశం ఉందా..?

ఈ కేసులో కీలక నిందితుడు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో పలు కీలక విషయాలను వెల్లడించాడు. 'ఏం చేయాలో నా పీఎస్‌కు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చా.. నా పీఎస్‌ను కలవండి..' అని చంద్రబాబు స్వయంగా తనకు చెప్పినట్లు పార్థసాని ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. అంటే అది ప్రత్యక్ష సాక్ష్యం అవుతుంది. చంద్రబాబు ఆయన పీఎస్ శ్రీనివాస్ ద్వారా తమను వేధించడంతోనే డబ్బులు చెల్లించినట్లు పార్థసానితోపాటు ఇద్దరు చార్టెడ్ అకౌంటెంట్లు వారి వాంగ్మూలాల్లో అంగీకరించారు. ఇవన్నీ కీలక విషయాలే అవుతాయి. డబ్బులు చంద్రబాబుకు సంబంధించిన వ్యక్తులకు చేరడం.. తిరిగి అవి ఏ రూపంలో ఎవరెవరికి చెల్లించారు? చంద్రబాబుకు దుబాయ్‌లో పేమెంట్ చేయడం గురించి కూడా వారు చెప్పారు. అంటే ఇండియన్ కరెన్సీని బయటి దేశాలకు తరలించారు.. తిరిగి దాన్ని విరాళాల రూపంలో టీడీపీ ఖాతాల్లోకి చేర్చారు. ఈ మొత్తం వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణం ఉంది కాబట్టి ఈ కేసులో వెయ్యి శాతం ఈడీ అధికారులు దర్యాప్తు చేపడతారు. సీబీఐ సైతం వంద శాతం దర్యాప్తు చేపడుతుంది. ఈ రెండు దర్యాప్తు సంస్థలు సుమోటోగా కేసును తీసుకోకపోయినా కేసు దర్యాప్తు సవ్యంగా జరిగేందుకు ఈడీ, సీబీఐని ఆదేశించాలని ఎవరైనా కోర్టులను కోరే అవకాశం ఉంది.

ఈ కేసులో ఇప్పటివరకు ఐటీ అధికారులు రూ.118 కోట్ల అక్రమాలను నిగ్గు తేల్చారు. దర్యాప్తులో ఇంకా కొత్త కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందా..?

ఇది రూ.118 కోట్లతో ఆగేది కాదు. తవ్వి తీస్తే ఇంకా చాలా కుంభకోణాలు బయటికి వస్తాయి. ఇందులో ఐటీ చట్టాలతోపాటు మనీ లాండరింగ్ జరిగింది. ప్రభుత్వ అధికారిక హోదాలో ఉంటూ అవినీతికి పాల్పడిన అంశం ఉంది. ఇలా భిన్న కోణాల్లో దర్యాప్తు జరగాల్సి ఉంది. తీగ లాగితే డొంక కదిలినట్టుగా మరిన్ని కుంభకోణాలు వెలుగులోకి రావచ్చు.

ఈ కేసులో నారా లోకేశ్ పాత్ర కూడా ఉన్నట్లు ఐటీ అధికారులు కీలక ఆధారాలను సేకరించారు. లోకేశ్‌ను విచారించే అవకాశం ఉందా?

ఐటీ అధికారులు తమ నోటీసులలో వెల్లడించిన ప్రకారం చూస్తే నారా లోకేశ్‌కు ఇందులో కీలక పాత్ర ఉన్నట్లు అన్ని ఆధారాలున్నాయి. చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్‌కు సైతం లోకేశ్ అనేక విషయాల్లో ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. కాబట్టి లోకేశ్ సైతం భవిష్యత్తులో ఈ కేసులో విచారణ ఎదుర్కోక తప్పదు.

ఈ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుకు అవకాశం ఉందా..?

ఐటీ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా ట్రిబ్యునల్‌లో చార్జిషీట్ ఫైల్ చేస్తారు. ఆ తర్వాత చంద్రబాబును రిమాండ్‌కు అడగడం తప్పదు. ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించకుండా నిజాలు బయటికి రావు కాబట్టి ఇప్పుడు షోకాజ్ నోటీసులు మాత్రమే ఇచ్చారు. చార్జిషీట్ దాఖలైన తర్వాత ట్రిబ్యునల్ ఆదేశం మేరకు అరెస్టుకు అవకాశం ఉంది. మనీలాండరింగ్, ఇతర అంశాలున్నందున ఈడీ అరెస్టు చేస్తుందా? లేదంటే సీబీఐ అరెస్టు చేస్తుందా? అన్నది పక్కన పెడితే ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబు అరెస్టు ఖాయంగానే కనిపిస్తోంది. ఐటీ అధికారులు సైతం ఈ వ్యవహారంపై ఈడీకి సమాచారం ఇవ్వొచ్చు.

ఎక్కడి దొంగలు.. అక్కడే!

▶ మొదటి పేజీ తరువాయి

పురందేశ్వరి కూడా దీన్నో సాధారణ అంశంగా తేల్చేశారు తప్ప బాబు అవినీతికి నిదర్శనంగా చూడటం లేదు. ఏమయింది వీళ్లకి?

ఇక చంద్రబాబు విషయానికొస్తే అటు ఐటీ విభాగానికేమో.. 'నాకు నోటీసులిచ్చే అధికారం మీకెక్కడిది?' 'నాకు సాక్ష్యాధారాలు చూపించండి' 'ఫలానా సంవత్సరానికి ఇది వర్తించదు' అనే డొంకతిరుగుడు జవాబులిస్తున్నారు. ఇటు ప్రజల ముందేమో... 'నాపై కుట్ర చేస్తున్నారు' 'నన్ను అరెస్టు చేస్తారేమో' 'నన్ను ఏ క్షణాన్నైనా అరెస్టు చేయొచ్చు' అని నానా సంగనాచి కబుర్లు చెబుతున్నారు. అంతే తప్ప... ఆ నోటీసులు ఎందుకొచ్చాయి? తాను నిజంగా అవినీతి చేశాడా... లేదా? ఆ 118 కోట్లూ నిజంగా ముట్టాయా? కాంట్రాక్టు సంస్థలను బెదిరించటం అబద్ధమా? మనోజ్ పార్థసానితో తనకు సంబంధాలున్నాయా... లేవా? దుబాయ్‌లో డబ్బులు తీసుకున్నాడా.. లేదా? అనే ఏ విషయమూ చెప్పటం లేదు. పైపెచ్చు ఐటీ శాఖకే సమాధానాలిస్తారంటూ ఆయన తరఫున కొందరు బీరాలు పోవటమూ మొదలయ్యింది. కేంద్రం ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఆదాయపు పన్ను శాఖ... రిటర్నుల్లో చూపించని మొత్తం ఎవరి లావాదేవీల్లోనైనా కనిపించినపుడు నోటీసులివ్వటం మామూలే. కాకపోతే చంద్రబాబుది రిటర్నుల్లో చూపించని మొత్తం మాత్రమే కాదు. అది అక్రమంగా ఆర్జించిన అవినీతి సొమ్ము. ప్రభుత్వ ప్రాజెక్టుల్ని కట్టబెట్టి.. లంచాల రూపంలో తన ఖాతాలోకి నేరుగా రప్పించుకున్న అక్రమార్జన. పైపెచ్చు ఆయన 40 ఇయర్స్ ఇండస్ట్రీ!!. ప్రజా జీవితంలో ఉన్న నాయకుడు. మరి ప్రజలకు జవాబుదారీయే కదా? బయట అన్ని సభల్లో మాట్లాడుతున్న చంద్రబాబుకు... తనపై వచ్చిన నోటీసులపై స్పందించాల్సిన ఆవశ్యకత లేదా? ఇలాంటి రాజకీయం ఎక్కడైనా ఉంటుందా? దొంగలంతా కలిసి... ఎక్కడివారక్కడే గప్‌చుప్... అన్న తరహాలో నోరు మూసుకున్నంత మాత్రాన విషయం అందరికీ తెలియకుండా ఉంటుందా? జబాబు చెప్పాల్సిన బాధ్యత నుంచి చంద్రబాబు తప్పించుకోగలరా?

ఇదీ అసలు కథ...

అధికారాన్ని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా సాగించిన అవినీతి బండారం బట్టబయలవుతున్న కొద్దీ బాబులో ఆందోళన రెట్టింపు అవుతోంది. ఇన్నాళ్లూ ప్రతి వ్యవస్థలో తన మనుషుల్ని పెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేయడంద్వారా 'నిప్పు'లా చెలామణీ అయిన బాబుకు... రోజులన్నీ ఒకేలా ఉండవని ఇప్పుడు అర్థమవుతోంది. రూ.8వేల కోట్ల కాంట్రాక్టుల కేటాయింపులో షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌లతో సాగించిన అవినీతిని ఐటీశాఖ నిగ్గుతేల్చింది. నోటీసులిచ్చింది. ఆధారాలూ చూపించింది. తప్పించుకునేందుకు బాబు వేసిన ఎత్తుల్ని తిప్పికొట్టింది. దీంతో బాబుకు దారులు మూసుకుపోయాయి. మరోవైపు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో చంద్రబాబు అవినీతిని సీఐడీకి చెందిన సిట్ బృందం ఆధారాలతో సహా వెలికి తీసింది. ఆ రెండు వ్యవహారాల్లోనూ షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనం హైదరాబాద్‌లోని చంద్రబాబు బంగ్లాకే చేరిందన్నది బట్టబయలైంది. ఈ స్కిల్ స్కామ్‌లో హవాలా దందా నిగ్గు తేల్చడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దిగింది.

ఇదీ చంద్రబాబు అవినీతి నెట్‌వర్క్

అటు అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాలు, టిడ్కో గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఇటు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ రెండింట్లోనూ చంద్రబాబు ఒకే అవినీతి నెట్‌వర్క్‌ను ఉపయోగించారు. రెండుచోట్లా తానే సూత్రధారిగా ఉంటూ... నిధులను చేర్చడంలో పాత్రధారులుగా యోగేశ్ గుప్తా, షాపూర్జీ-పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లను పెట్టారు. అదెలాగంటే...

- జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా దాని సహ భాగస్వామిగా డిజైన్ టెక్ కంపెనీని రంగంలోకి దింపి ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం చేశారు చంద్రబాబు. రూ.3,300 కోట్ల మేర కాగితాలపై ప్రాజెక్టును చూపించి డిజైన్ టెక్ సంస్థ తన వాటా 90 శాతంలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టకపోయినా సరే రాష్ట్ర ప్రభుత్వం వాటా 10 శాతం కింద జీఎస్టీతో సహా రూ.371 కోట్లు విడుదల చేశారు. అందులో సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు రూ.56 కోట్లు చెల్లించి... మిగిలిన రూ.315కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి తమ ఖాతాల్లోకి తరలించేసుకున్నారు. దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు నికరంగా రూ.241 కోట్లు చేరాయని సిట్ నిర్ధారించింది.

అక్రమ నిధుల ఎలా తరలించారంటే...

- రాష్ట్ర ప్రభుత్వం పుణెకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణెలోని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐకి రూ.2.71కోట్లు అంటే మొత్తం మీద రూ.241కోట్లు తరలించారు.
- పీవీఎస్‌పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబయి, అహ్మదాబాద్‌లలో ఉన్న వివిధ షెల్ కంపెనీలతో పాటు దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...

ఏసీఐ:	రూ.56 కోట్లు
నాలెడ్జ్ పోడియమ్:	రూ.45.28 కోట్లు
ఈటా:	రూ.14.1 కోట్లు
పాట్రిక్స్:	రూ.3.13 కోట్లు
ఐటీ స్మిత్:	రూ.3.13 కోట్లు
భారతీయ గ్లోబల్:	రూ.3.13 కోట్లు
ఇన్‌వెబ్:	రూ.1.56 కోట్లు
పోలారీస్:	రూ.2.2 కోట్లు
కెడెన్స్ పార్టనర్స్:	రూ.12 కోట్లు

- మొత్తం రూ. 140.53కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేసి యోగేశ్ గుప్తా మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదును చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. అంటే ఆ రూ.140.53కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47కోట్లను పీవీఎస్‌పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులు మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అక్కడ నుంచి చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- అంటే ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా గుట్టు చప్పుడు కాకుండా చంద్రబాబు బంగ్లాకు వచ్చి చేరాయి.

అదే కుతంత్రం...మళ్లీ మళ్లీ

పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన చంద్రబాబు... తన అవినీతి బాగోతం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మళ్లీ పాత దారే ఎంచుకున్నారు. తనను రెండు రోజుల్లో అరెస్టు చేయవచ్చంటూ వ్యాఖ్యానించారు. దానిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు స్పందించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పరోక్షంగా ఆదేశించారు. తద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలన్నది బాబు పన్నాగం. తాను ఇబ్బందుల్లో పడిన ప్రతిసారీ చంద్రబాబు అనుసరించే దిగజారుడు రాజకీయ ఎత్తుగడ ఇదే. 2015లో హైదరాబాద్‌లో ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయినపుడూ ఇదే చేశారు. తెలంగాణ పోలీసులు తనను అరెస్టు చేస్తారేమో అని చెబుతూ రాత్రికి రాత్రి హైదరాబాద్ విడిచిపెట్టి అమరావతి వచ్చేశారు. పైపెచ్చు రాష్ట్రం నుంచే పరిపాలన చేసేందుకే వచ్చేశానని చెప్పుకొచ్చారు. పైగా తనపై కేసు పెట్టడాన్ని ఆంధ్రపై తెలంగాణ ప్రభుత్వం చేసిన దాడిగా వక్రీకరించారు. అంతేతప్ప తాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచేందుకు కోట్ల రూపాయలు లంచంగా ఇస్తూ పట్టుబడ్డానన్న వాస్తవాన్ని మాత్రం ఒప్పుకోలేదు. ఇప్పుడూ అదే సూత్రం అమలు చేస్తున్నారు. ఇటీవల అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పర్యటనల్లో పోలీసులపై దాడులకు పాల్పడేలా టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రేరేపించారు. తాజాగా భీమవరంలోనూ అదే రీతిలో ఘర్షణలు సృష్టించారు. ఇపుడు తనను అరెస్టు చేస్తారని వ్యాఖ్యానిస్తూ కార్యకర్తల్ని రెచ్చగొడుతున్నారు.

దమ్ముంటే.. బాబుకిచ్చిన ఐటీ నోటీసులపై స్పందించు

- రామోజీకి మంత్రి కాకాణి సవాల్



నెల్లూరు(దర్గామిట్ట): దమ్ముంటే.. చంద్రబాబుకు ఐటీశాఖ ఇచ్చిన నోటీసులపై కథనాలు రాయాలని రామోజీకి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. అది చేతకాకపోతే కట్టుకథలు రాయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. బుధవారం నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని.. అందులో రామోజీ శకుని పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో లేని ఎన్నో సంక్షేమ పథకాలు ఏపీలో ఉన్నాయని వివరించారు. తెలంగాణలో అమలుకాని వాటిపై రాసే దమ్ముందా అని రామోజీని ప్రశ్నించారు. చంద్రబాబు, వైఎస్ జగన్ ఎన్ని హామీలిచ్చి.. ఎన్ని అమలు చేశారో కూడా సమగ్రంగా రాస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. దొంగ హామీలతో చంద్రబాబు ప్రజల్ని మోసం చేయడం, రాష్ట్రాన్ని దోచేయడం, ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన నోటీసులపై సమగ్ర కథనాలు రాయాలని రామోజీకి సూచించారు. నాలుగేళ్ల తమ పాలనలో వర్షాలు విస్తారంగా పడిన విషయం తెలిసిందేనన్నారు. ఈ ఏడాది వర్షాలు కాస్త ఆలస్యమయ్యేసరికి కనీస జ్ఞానం లేక కరువు మండలాలు ప్రకటించాలనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి ఈనాడులో రాయగలిగితే చెప్పేందుకు తాము సిద్ధమన్నారు. రాజధాని పేరుతో అవినీతికి పాల్పడడం వల్లే ఆదాయపు పన్ను శాఖ చంద్రబాబుకు నోటీసులు ఇచ్చిందని చెప్పారు. దీనివల్ల చంద్రబాబు ఎంత అవినీతిపరుడో ప్రజలకు మరోసారి అర్థమైందన్నారు. ఈ విషయంపై టీడీపీ నేతలు, రామోజీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే ఎల్లో మీడియా వీటిపై కథనాలు రాయాలని సవాల్ విసిరారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు.. పశ్చిమ బెంగాల్‌లోని శారదా కుంభకోణం వంటిదన్నారు. దీని విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దొంగతనం చేసి దబాయింపా?

- ఐటీ నోటీసులతో చంద్రబాబు అవినీతి బండారం బట్టబయలు
- విచారణకు సహకరించకుంటే అరెస్టు చేయడం ఖాయం: సజ్జల



సాక్షి, అమరావతి: ఐటీ శాఖ నోటీసుల వ్యవహారంలో చంద్రబాబు తీరు దొంగతనం చేసి దబాయిస్తున్నట్లుగా ఉందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. అవినీతి బండారం బయటపడటంతో ఆయనకు భవిష్యత్తు కళ్ల ముందు కనిపిస్తోందని, అడ్డంగా దొరికిపోయినట్లు ఆయనకే అర్థమవుతోందని చెప్పారు. అందుకే గుమ్మడికాయల దొంగలా భుజాలు తడుముకుంటున్నారన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం మీడియాతో మాట్లాడారు. తనను రేపో ఎల్లుండో అరెస్టు చేస్తారంటూ చంద్రబాబు సానుభూతి కోసం నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నిప్పు కాదని.. తప్పులకు మానవ రూపమని, తప్పుడు పునాదులపై ఎదిగిన నకిలీ మనిషి అని మండిపడ్డారు. బాబు చట్టానికి అతీతుడు కాదన్నారు. నోటీసులకు స్పందించకుండా, విచారణకు సహకరించకుంటే ఐటీ శాఖ అరెస్టు కూడా చేయవచ్చన్నారు. ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులను పరిశీలిస్తే చంద్రబాబు, లోకేష్ హవాలా, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు స్పష్టమవుతోందని, ఈ వ్యవహారంపై ఇన్నాళ్లూ ఈడీ జోక్యం చేసుకోకపోవడంపై సజ్జల విస్మయం వ్యక్తం చేశారు.

అప్పట్లోనే కుంభకోణాన్ని ఎండగట్టాం..

అమరావతిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాన్ని చదరపు అడుగుకు రూ.పది వేల చొప్పున షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ సంస్థలకు చంద్రబాబు అప్పగించారు. హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్‌లో అత్యాధునిక సదుపాయాలు, ఫర్నీచర్‌తో సహా చదరపు అడుగు నిర్మాణానికి రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేలు మాత్రమే బిల్డర్లు తీసుకుంటున్నారు. ప్రభుత్వ భూమిలో తాత్కాలిక నిర్మాణం కోసం చదరపు అడుగుకు రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేలకు మించి వ్యయం కాదు. ఇందులో భారీ ఎత్తున అవినీతి చోటుచేసుకుందని అప్పట్లోనే మేం అభ్యంతరం తెలిపాం. కాంట్రాక్టర్లకు చదరపు అడుగుకు అదనంగా రూ.7-8 వేలు దోచిపెట్టిన చంద్రబాబు అందులో 60 నుంచి 70 శాతం వరకూ కమీషన్ తీసుకున్నారు.

పేదల నోళ్లు కొట్టి..

టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం చదరపు అడుగుకు రూ.వెయ్యికి మించి వ్యయం కాదు. కానీ ఆ పనులను రూ.2,200 చొప్పున కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. పేదల కష్టార్జితాన్ని చదరపు అడుగుకు అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన చంద్రబాబు వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నారని, ఇది పాపమని అప్పట్లోనే మేం చెప్పాం. ఐటీ నోటీసులతో అది రుజువైంది. షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ సంస్థల నుంచి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, విక్కీజైన్, కిలారు రాజేష్ ద్వారా చంద్రబాబు, ఆయన పీఎస్ శ్రీనివాస్, లోకేశ్ వసూలు చేసిన విధానాన్ని ఆధారాలతోసహా ఐటీ శాఖ బహిర్గతం చేసింది. ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కార్ చేతిలో అడ్డంగా దొరికిపోయిన సమయంలోనూ తనను ఎప్పుడైనా అరెస్టు చేయొచ్చునని, ప్రజలంతా తనకు రక్షణ కవచంలా నిలబడి రక్షించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఐటీ శాఖ నోటీసులతో ఇప్పుడూ అలాగే కోరడం విడ్డూరం.

శాంతి భద్రతల సమస్య సృష్టించే కుట్ర..

చంద్రబాబు శాంతి భద్రతల సమస్య సృష్టించి లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తున్నారు. పుంగనూరులో పోలీసులపైకి టీడీపీ గూండాలను ఉసిగొల్పారు. అదే కుట్రను లోకేశ్ భీమవరంలో అమలు చేశారు. శాంతి భద్రతల సమస్య సృష్టించాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోం.

కుంభకోణాల దారులన్నీ బాబు వైపే..

అమరావతి భూకుంభకోణం, ఫైబర్‌నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌ల్లో సీఐడీ దర్యాప్తుతో చంద్రబాబు అవినీతి బండారం బట్టబయలైంది. ఐటీ నోటీసుల్లో పేర్కొన్న వ్యక్తులనే ఆ కుంభకోణాల్లో నిందితులుగా సీఐడీ గతంలోనే తేల్చింది. 1995-2004 మధ్య ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారు. ఈ వ్యవహారంపై కోర్టుల్లో విచారణను ఎదుర్కోకుండా వ్యవస్థలను మేనేజ్ చేసి స్టే తెచ్చుకున్నారు. రాజకీయంగా కక్ష సాధించాలనుకుంటే వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే చంద్రబాబును అరెస్టు చేసి జైలులో పెట్టించేవారు. చంద్రబాబు కుంభకోణాలన్నీ ఆధారాలతోసహా ఇప్పుడు బయటపడుతున్నాయి. వాటి నుంచి తప్పించుకోవడం ఆయన తరం కాదు.

ఖజానాను లూటీ చేయడం సాధారణమా?

చంద్రబాబుకు ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులు సాధారణమైనవని, వాటిపై తాను స్పందించబోనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొనడం విడ్డూరం. ప్రభుత్వ ఖజానాను కాంట్రాక్టర్లకు దోచిపెట్టి ముడుపులు తీసుకున్నందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిందని ఆమెకు తెలియదా? లేదంటే మరిదిని రక్షించుకోవడానికి అలా మాట్లాడారా? చీటికిమాటికీ ట్వీట్లతో రెచ్చిపోయే పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించకపోవడంలో ఆంతర్యమేంటి? ఎల్లో మీడియా ఐటీ నోటీసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది.



● ఎంపికైన విద్యార్థులతో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

అమెరికాలో చదువుకుని వస్తాం

సీఎం సార్... ఆశీర్వదించండి

ఆంధ్రప్రదేశ్ గురుకులం విద్యార్థులు అరుదైన అవకాశం చేజిక్కించుకున్నారు.
అగ్రరాజ్యం అమెరికా వెళ్లి అక్కడ 10 నెలలు ఉండి పాఠాలు చదువుకోబోతున్నారు.
ఈ గొప్ప అవకాశం వారి జీవితాలను మార్చనుంది.
ఇందుకు కారణమైన ఏ.పి. సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం అంటున్నారు.
'ఏ.పి గురుకులాలను సి.ఎం గారు ఆధునికంగా తీర్చిదిద్దడం వల్లే మాకు ఈ అవకాశం దక్కింది' అంటున్నారు.
'కెనడీ లుగర్-యూత్ ఎక్స్చేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్' కింద అమెరికా వెళ్లిన విద్యార్థుల మనోగతాలు...

మా దేశానికి అధ్యయానికి రండి అంటూ అగ్ర దేశం అమెరికా నుంచి వచ్చిన ఆహ్వానం ఏ.పి. గురుకుల పాఠశాలల్లో సీనియర్ ఇంటర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా చేసింది. నెలకు కనీసం రూ.10 వేలు కూడా సంపాదన లేని కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులు అమెరికాను చూడటమే కాదు అక్కడ పది నెలలు ఉండి చదువుకునే అవకాశం పొందడం వారి జీవితాలను మార్చనుంది. ఇలా పేదపిల్లలకు పెద్ద అవకాశం దక్కడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన చదువుల మహాయజ్ఞం కీలక పాత్ర పోషించిందన్నది జగమెరిగిన సత్యం. 'నాడు-నేడు'తో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు అధునాతంగా మారిపోవడంతో పాటు అన్ని వసతులూ సమకూరాయి. ఇంగ్లిష్ విద్య, నాణ్యమైన విద్యాబోధన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఆన్‌లైన్ క్లాసులు, ట్యాబ్‌లు వంటి ఎన్నో సౌకర్యాలతో పేదపిల్లల పెద్ద చదువుకు కొత్త బాటలు పరుస్తున్నారు.

థాంక్యూ సీఎం సార్



అమెరికా చదువులకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన విప్లవాత్మక చర్యల వల్లే నాకు ఈ అవకాశం దక్కింది. విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం పెదగంట్యాడ మా ఊరు. మా నాన్న ప్రవీణ్ రాజ్ నెలకు రూ.7 వేలు సంపాదించే ప్రైవేటు ఉద్యోగి. తల్లి సుకాంతి గృహిణి. ఇల్లు గడవడమే కష్టమైన పరిస్థితిలో గురుకులం ద్వారా ప్రభుత్వం నాకు మంచి విద్యావకాశాలు కల్పించింది.

- రోదా ఇవాంజిలి,
మధురవాడ గురుకులం, విశాఖ జిల్లా.

విద్యాలయాల్లో మెరుగైన సదుపాయాలు



మా వంటి పేద వర్గాల పిల్లలు చదివే విద్యాలయాలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో బాగా తీర్చిదిద్దారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి మా గ్రామం. మా నాన్న దార కేశయ్య పదవ తరగతి చదివి వ్యవసాయ పనులతో నెలకు రూ.10 వేలు సంపాదిస్తాడు. ఐదవ తరగతి చదివిన అమ్మ ఆదిలక్ష్మమ్మ గృహిణి. పేదరికం కారణంగా ప్రకాశం జిల్లా మార్కాపురం గురుకులంలో 5 వ తరగతిలో చేరిన నేను ప్రస్తుతం సీనియర్ ఇంటర్ చదువుతున్నా.


- డి.నవీన, మార్కాపురం గురుకులం

ఆనందంగా ఉంది



ప్రభుత్వ గురుకులంలో చదివే నేను అమెరికా చదువులకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. విజయవాడ గుణదల ప్రాంతం మాది. మా నాన్న చొక్కా సురేష్ అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా అమ్మ వనజ గృహిణి.

- సీహెచ్ ఆకాంక్ష, ఈడ్పుగల్లు ఐఐటీ-ఎన్ఐటీ అకాడమి, కృష్ణా జిల్లా



Class: Sr Inter-MPC
School: Dr. B.R Ambedkar Gurukulam, IIT-NEET Academy, Eedupugallu, Krishna
Year of Joining Gurukulam: 2022-23 (Earlier studied in a private school)
Category: SC
Sibling: 1 younger brother
Address: H.no 46-4-21/B, Bethlehem nagar, Gunadala, Vijayawada, District: NTR
Parents Background:

	Name	Education	Occupation	Income
Father	Chokka Suresh.	Class 10	Attender in APTPC	Rs. 15000 per month
Mother	Chokka Vanaja	Class 7	Housewife	-



పేద పిల్లల చదువులకు సీఎం శ్రద్ధ చూపిస్తున్నారు



పేద పిల్లల ఉన్నత చదువుల కోసం సీఎం వైఎస్ జగన్ శ్రద్ధ చూపిస్తున్నారు. పేదవర్గానికి చెందిన నేను అమెరికా చదువులకు ఎంపిక అయ్యానంటే మా చదువులకు సీఎం సార్ అందించిన ప్రోత్సాహమే కారణం. చాలా సరదాగా మాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న సీఎం గారు మాకు రూ.లక్ష సాయం, ట్యాబ్‌లు అందించారు. సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం, మల్లెనిపల్లి మా గ్రామం. మా నాన్న నరసింహులు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి నాగమణి గృహిణి.

-హాసిని బలిగా, ఈడ్పుగల్లు ఐఐటీ-నీట్ అకాడమి, ఎస్సీ గురుకుల

కలలో కూడా ఊహించలేదు



నేను అమెరికా చదువుకు ఎంపిక అవుతానని కలలో కూడా ఊహించలేదు. ప్రభుత్వం, ఉపాధ్యాయులు అందించిన సహకారం వల్లే ఈ అవకాశం దక్కింది. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జి.కొత్తూరు మా ఊరు. మా నాన్న ఎస్.కృష్ణ మృతి చెందడంతో అమ్మ రాము రోజువారీ కూలీగా నెలకు ఆరు వేలు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. 2017లో గురుకులంలో 6వ తరగతిలో చేరి ప్రస్తుతం సీనియర్ ఇంటర్ చదువుతున్నాను.

- ఎస్. జ్ఞానేశ్వరరావు,
శ్రీకృష్ణాపురం గురుకులం, విశాఖ జిల్లా.

తొమ్మిది దశల వడపోత

ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో అంతర్జాతీయ అవగాహనలో భాగంగా యూనైటెడ్ స్టేట్స్ (యూఎస్) గత కొన్నేళ్లుగా 'కెన్నడీ లుగర్-యూత్ ఎక్స్చేంజ్ అండ్ స్టడీ (కేఎల్ - వైఈఎస్) ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా ఎంపికైన విద్యార్థులు పది నెలల పాటు అమెరికాలో ఉంటారు. దీనికి ఎంపిక కావాలంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల నుంచి గట్టి పోటీ ఉంటుంది. మొదట బయోడేటా నుంచి చివరి ఇంటర్వ్యూల వరకు తొమ్మిది దశల్లో కఠినతరమైన వడపోత కొనసాగుతుంది. దాదాపు తొమ్మిది నెలలపాటు కొనసాగే అన్ని అర్హత పరీక్షల ప్రక్రియను విజయవంతంగా దాటుకుని రాష్ట్రానికి చెందిన ఎస్సీ గురుకుల విద్యార్థులు డి.నవీన, ఎస్. జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిలి, బి.హాసిని, సీహెచ్. ఆకాంక్షలు అవకాశాన్ని దక్కించుకున్నారు. వారంతా ఇటీవలే అమెరికాకు పయనమై వెళ్లారు. వారిని అక్కడ ఎంపిక చేసిన పాఠశాలలోచేర్పిస్తారు. ఆ విద్యార్థులు పరీక్షలు, క్రీడలతోపాటు మొత్తం పాఠశాల ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఆ విద్యార్థులకు అమెరికాలో ఎంపిక చేసిన కుటుంబాలు ఆతిథ్యం ఇస్తాయి. విద్యార్థులు ఒక్కొక్కరికీ దాదాపు 200 డాలర్లు (సుమారు రూ. 16,500) నెలవారీ ఆర్థిక తోడ్పాటు (స్టైపెండ్)ను అందిస్తారు.

సీఎంకు కృతజ్ఞతలు

2023-24 విద్యా సంవత్సరానికి 'కెన్నడీ లుగర్-యూత్ ఎక్స్చేంజ్ అండ్ స్టడీ' కోసం ఆఫ్రికా, పశ్చిమాసియా, దక్షిణాసియాలోని 38 దేశాల విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో మన దేశానికి చెందిన 30 మంది ఎంపిక కాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉండటం గర్వకారణం. వీరికి కావలసిన నిత్యావసరాలు, దుస్తులు, బ్యాగులు, మొబైల్‌ఫోన్‌ల కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థికసాయం అందిస్తోంది. కేఎల్-వైఈఎస్ ప్రోగ్రామ్‌లో అమెరికా చదువులకు వెళ్తున్న ఐదుగురు విద్యార్థులు డి.నవీన, ఎస్.జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిలి, బి.హాసిని, సీహెచ్ ఆకాంక్ష సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆగస్టు 31న కలిశారు. వారితోపాటు గతేడాది అమెరికా వెళ్లి కోర్సు పూర్తిచేసుకుని వచ్చిన విద్యార్థులు కె.అక్ష, సి.తేజ కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కుటుంబ నేపథ్యం తదితర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. యూఎస్ఏ లో చదువులు పూర్తై వచ్చిన తర్వాత కూడా వారి చదువులు కొనసాగించేలా నిరంతరాయంగా వారిని పర్యవేక్షించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి ట్యాబ్‌లను అందజేశారు.

– యిర్రింకి ఉమమాహేశ్వరరావు,
సాక్షి ప్రతినిధి, అమరావతి

న్యూస్‌మేకర్

పెళ్లిచూపులు ఎంత సబబు?

ఇంటికొచ్చిన అపరిచిత పురుషులు, స్త్రీలు. వారితో పాటు పెళ్లికొడుకు. వారి ముందుకు టీ కప్పుల ట్రేతో పెళ్లికూతురు రావాలి. తర్వాత ప్రశ్నలు ఉంటాయి. 'ఇంటికెళ్లి ఏ సంగతీ చెప్తాం' అని వాళ్లు వెళ్లిపోతారు. సంబంధం ఖాయమా కదా అనే టెన్షన్. చెడితే మళ్లీ మొత్తం సీన్ రిపీట్ చేయాలి. ఆడపిల్లలను ప్రదర్శనకు పెట్టి బాధ పెట్టే ఈ పెళ్లిచూపుల తంతును మార్చలేమా అని ప్రశ్నిస్తూ తీసిన మరాఠీ సినిమా 'స్థల్' టొరెంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. సెప్టెంబర్ 7–18 తేదీల్లో 'స్థల్' అక్కడ ప్రదర్శితం కానుంది.



● 'స్థల్' చిత్రంలో ఓ సన్నివేశం



● 'స్థల్' కథానాయిక నందిని చిట్కె

1970లలో 80 లలో సినిమాల్లో పెళ్లిచూపులు ఎలా ఉండేవో ఇప్పటికీ అలాగే ఉన్నాయి. నగరాల్లో అయితే ఒకలాగా... పల్లెల్లో అయితే ఒకలాగా.. కొద్ది మార్పులతో. అప్పుడైనా ఇప్పుడైనా 'ఎంచేవాడు' అబ్బాయే అవుతున్నాడు. 'అబ్బాయి వాళ్లు ఓకే అంటే చాలు' అనుకునే ఆడపిల్లల తల్లిదండ్రులు ఎక్కువమంది ఉన్నారు. అసలు అమ్మాయిని చూడటానికి రావడంలోనే మగపెళ్లివారి పైచేయి ఉంది. ఇన్నేళ్లు గడిచినా అబ్బాయిని చూసుకోవడానికి అమ్మాయి వాళ్లు తరలి రావడం వినడం లేదు. పెళ్లి అంటే అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చాలి. కాని అమ్మాయి ఔను/కాదులకు ప్రాధాన్యం లేదు. ఈ పద్ధతి ఇంకా ఎంతకాలం అని ప్రశ్నిస్తోంది మరాఠీ సినిమా 'స్థల్'. ఆ మాటకు 'పెళ్లి సంబంధం' అని అర్థం.

పత్తి రైతు ఇంట్లో అమ్మాయి

'స్థల్' సినిమా కథ మహారాష్ట్రలోని విదర్భజిల్లాలో దోంగర్ గావ్ అనే ఊళ్లో జరుగుతుంది. ఈ ప్రాంతమంతా పత్తి రైతులు. వయసొచ్చిన ఆడపిల్లకు తొందరగా పెళ్లి చేయాలని భావిస్తారు. అయితే ఆడపిల్లవాళ్లు అనుకున్నంత మాత్రాన ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగిపోవు. దానికి సవాలక్ష కుదరాలి. ముందు పెళ్లిచూపుల తంతు జరగాలి. ఈ సినిమాలో బి.ఏ చదివిన సవిత అనే అమ్మాయి 'పి.జి చదువుతాను మొర్రో' అని మొత్తుకుంటున్నా వినకుండా తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూడటం మొదలెడతారు. అక్కడి నుంచి రకరకాల అనుభవాలు ఆమెకు ఎదురవుతుంటాయి. విదర్భ ప్రాంతంలో పెళ్లి చూపులకు వచ్చిన వారికి పెళ్లికూతురు 'పోహా' తీసుకెళ్లి ఇవ్వడం ఆనవాయితీ. దీని 'పోహా కార్యక్రమం' అంటారు. ఆ పోహాతో మొదలెట్టి పెళ్లి చూపుల తంతు అయ్యేంత వరకూ ముళ్ల పీఠంపై కూర్చున్నట్టు పెళ్లి కూతురు ఎదుర్కొనే శల్య పరీక్షలను ప్రశ్నిస్తుంది ఈ సినిమా.

ఎన్నో లోపాలు, వంకలు

పెళ్లిసంబంధాల్లో పెళ్లికూతురిలో వంకలు, లోపాలు వెతకడం కొనసాగుతూనే ఉంది. దీని గురించి జయంత్ సోమల్కర్ మాట్లాడుతూ 'చదువు, ఉద్యోగం, రంగు, ఎత్తు... వీటన్నింటి మీద అబ్బాయి తరపు వాళ్లకు ఒక అభిప్రాయం ఉంటుంది. పెళ్లికూతురిలో ఆ మేరకు లోపం వెతకడానికి చూస్తారు. వంకలు పెడతారు. ప్రతి పెళ్లి చూపుల్లో అవే ప్రశ్నలు. పెళ్లికూతురు జవాబు చెప్పి చెప్పి విసిగిపోవాలి. అసలు అంతమంది వచ్చి కూచుని ఒకమ్మాయిని గుచ్చి గుచ్చి చూస్తూ ప్రశ్నలు సంధిస్తూ ఉంటే ఎంత ఇబ్బందిగా ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించామా? నా చిన్నప్పుడు మా అక్కలకు ఇలాగే పెళ్లిచూపులు జరుగుతుంటే చూసేవాణ్ణి. ఇటీవల మా కజిన్‌ను చూడటానికి అబ్బాయి వస్తే అదే తంతు. సినిమా తీయాలనిపించింది' అన్నాడు.

ఊరివాళ్లే నటులు


జయంత్ సోమల్కర్ విదర్భ ప్రాంతం వాడే. తన సొంత ఊళ్లో షూటింగ్ మొత్తం చేశాడు. ఊరి వాళ్లనే నటీనటులుగా ఎంపిక చేసుకున్నాడు. రియలిస్టిక్‌గా అనిపించేందుకే అలా చేశాడు. 'షూటింగ్ మధ్యలో పొలానికి నీళ్లు పెట్టి వస్తానని, బర్రెకు గడ్డి వేసి వస్తానని నటీనటులు వెళ్లిపోకుండా చూడటం నాకు పెద్ద సమస్య అయ్యింది' అంటాడు జయంత్ నవ్వుతూ. ముఖ్యపాత్రను ఊరి అమ్మాయి నందిని చిట్కె అద్భుతంగా చేయడం కూడా యూనిట్‌కు ఆశ్చర్యమే. 'పెళ్లి చూపుల తంతును సహజమైన హాస్యంతో నేను చూపించినా సంబంధాలు వద్దనేకొద్దీ పెళ్లికూతురిలో వచ్చే తిరుగుబాటును, ఆమెలో వచ్చే ఆగ్రహాన్ని చూపించాను. నన్ను తిట్టుకున్నా సరే... పదిమందైనా మారితే అదే పదివేలు' అంటాడు జయంత్.

ప్రతిష్టాత్మక 48వ టొరెంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'డిస్కవరీ సెక్షన్'లో భారతదేశం నుంచి 'స్థల్' ఒక్కటే ఎంపికైంది. ఇక్కడ ప్రదర్శితమయ్యాక ఇండియాలో రిలీజ్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నాడు.

కిచెన్ టిప్స్



మార్కెట్ నుంచి తెచ్చిన పచ్చిమిరపకాయలను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. తడిలేకుండా ఆరిన మిరపకాయల తొడిమలు తీసేసి టిష్యూపేపర్‌లో వేసి చుట్టి, జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి. ఇలా పెట్టిన పచ్చి మిరపకాయలు నెలరోజులపాటు పాడవకుండా చక్కగా ఉంటాయి.



ఇంట్లో చేసే నూడుల్స్ రెస్టారెంట్లలోలాగా పొడిపొడిగా రావాలంటే.. నీటిలో రెండు టీస్పూన్ల నూనె, కొద్దిగా ఉప్పువేసి నూడుల్స్‌ను మరిగించాలి. నూడుల్స్ చక్కగా ఉడికిన తరువాత వేడి నీటి నుంచి తీసి చల్లటి నీటితో కడగాలి. నీరంతా పోయేలా వంపేసి నూడుల్స్ పైన టీస్పూన్ నూనెను వేసి కలుపుకుంటే నూడుల్స్ పొడిపొడిగా వస్తాయి. వీటికి మసాలా జోడిస్తే ఎంతో రుచిగా ఉంటాయి.



పనీర్‌ను నీటిలో వేసి, పైన కాటన్ వస్త్రాన్ని కప్పి ఉంచి రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే రెండు మూడు వారాలపాటు తాజాగా ఉంటుంది. పనీర్ ముక్కలు మునిగే అన్ని నీళ్లు పోయాలి. ఈ నీటిని రెండు మూడు రోజులకొకసారి మార్చుకుంటూ ఉంటే మరిన్ని రోజులపాటు తాజాగా ఉంటుంది.

సైబర్ టాక్

వ్యక్తిగత డేటా సురక్షితమేనా?!

వ్యక్తిగత డేటా సేఫ్‌గా ఉండకపోతే స్కామర్ల చేతిలో నష్టపోవాల్సి ఉంటుంది. డేటా దొంగిలించడం అనే కారణంతో ఇటీవల సైబర్‌మోసాలు పెరుగుతున్నాయి. మన వ్యక్తిగత డేటాను స్కామర్లు ఏ విధంగా దొంగిలిస్తారు, ఈ సమస్య నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే ఏం చేయాలి..

డేటా ఎప్పుడూ సురక్షితంగా ఉండేలా చూసుకోవడానికి సాంకేతిక, సంస్థాగత, చట్టపరమైన రక్షణ తీసుకోవాల్సి ఉంటుంది.

వ్యక్తిగత డిజటల్ హక్కులలో...

యాక్సెస్ పొందే హక్కు, నిర్ధారించే హక్కు, సరిచేసే హక్కు, పోర్టబిలిటీ హక్కు, మర్చిపోవడం, ఆమోదం తెలిపే హక్కు ఉంటాయి.

వ్యక్తిగత డేటా సమాచారం వారి ప్రయోజనాల కోసం ఉపయోగపడాలి. వ్యక్తులు, వ్యాపారులు తమకు సంబంధించిన డేటా రక్షణగా ఉంటే ఆర్థిక, పరువు, చట్టపరమైన బాధ్యత వంటి నష్టాలను తగ్గించడంలో సహాపడుతుంది. డేటా ఉల్లంఘనలు, సైబర్ నేరాల సంఘటనలు పెరుగుతున్నందున చట్ట ప్రకారం అవసరమైన జనరల్‌డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) చర్యలను అమలు చేస్తుంటారు. డేటా దొంగిలించడం జరిగినప్పుడు దానికి సంబంధించిన వ్యక్తులు అధికారులకు తెలియజేయడం తప్పనిసరి. జీడీపీఆర్ ప్రకారం డేటా ఉల్లంఘన జరిగితే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

మీ డేటాను వివిధ కంపెనీలు ఎలా తీసుకుంటాయంటే...

ఆన్‌లైన్ షాపింగ్: పేరు, జెండర్, ఇమెయిల్, చిరునామా, డెలివరీ, ఫోన్ నెంబర్, క్రెడిట్‌కార్డ్ వివరాలు, ప్రొడక్ట్ హిస్టరీ, తరుచూ కొనుగోలు చేసే వస్తువులు, షాపింగ్ విలువ, ఎక్కువ శాతంలో బ్రౌజ్ చేస్తున్న ప్రొడక్ట్స్, మీ ఐపీ అడ్రస్... ఈ వివరాలన్నీ వ్యక్తిగత డేటా జాబితాలోకి వస్తాయి.

డేటింగ్‌యాప్‌లు...
పేరు, జెండర్, వయసు, సెక్సువల్ ఓరియెంటేషన్, ఫోన్ నెంబర్, ప్రైవేట్ చాట్, పొలిటికల్ వ్యూస్, వ్యక్తిగత ఫొటోలు, ఇష్టాలు, స్వైప్స్, డిజిటల్ డివైజ్ సమాచారం, ఐపీ అడ్రస్.. ఈ యాప్ ద్వారా బహిర్గతం అవుతాయి.

సెర్చ్ ఇంజిన్లు..
ఆన్‌లైన్ సెర్చింగ్, బ్రౌజింగ్ హిస్టరీ, ఆన్‌లైన్ ఆసక్తులు, షాపింగ్ అలవాట్లు, ఐపీ చిరునామా, ప్లేస్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డులు, పరికర సమాచారం, డౌన్‌లోడ్ చేసిన ఫైల్స్, ఉపయోగించే బ్రౌజర్ యాడ్-ఆన్‌లు.. ద్వారా జరుగుతుంటుంది.

సోషల్ మీడియా..
పోస్ట్‌లు, ఫొటోలు, వీడియోలు, మెసేజ్‌లు, ఫైల్స్, ఫోన్ పరిచయాలు, పేరు, జెండర్, ఇమెయిల్, ప్లేస్, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, ఫ్రెండ్స్ గ్రూప్, గ్రూప్ చాట్స్, పోస్టులు, ట్యాగ్ చేసిన ఫొటోలు అండ్ వీడియోలు.. సోషల్ మీడియా ద్వారా జరుగుతుంటాయి.

గుర్తించదగిన సమాచారం..
మీ పుట్టిన రోజు లేదా ఫోన్ నెంబర్ వంటివి పబ్లిక్ రికార్డ్‌లో ఉండవచ్చు. ఒకసారి మీ వివరాలు బయటకు వచ్చాక దాడి చేసేవారు ఉండవచ్చు. సోషల్ ఇంజనీరింగ్ మోసాలకు వ్యక్తిగత డేటా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

సురక్షిత చర్యలు..
చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌పై ఆధారపడి డేటా రక్షణ సూత్రాలు కొద్దిగా మారుతూ ఉంటాయి. అవి సాధారణంగా కింది అంశాలను కలిగి ఉంటాయి... ● చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, పారదర్శకంగా వ్యక్తులకు ప్రయోజనం కలిగేలా ప్రాసెస్ చేయాలి ● వ్యక్తిగత డేటా విషయంలో కచ్చితత్వం పాటించాలి. అదే విధంగా ఇతరులు యాక్సెస్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ● అనధికార లేదా చట్టవిరుద్ధమైన ప్రాసెసింగ్ ద్వారా నష్టం కలిగితే నియంత్రణ అధికారులకు తెలపాలి.

భారతదేశంలో డేటా రక్షణ కోసం చట్టం..
మన దగ్గర ఉన్న ఏకైక డేటా రక్షణ చట్టం.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 (ఐటీ చట్టం). దీని ప్రకారం డేటా చౌర్యం జరిగితే రక్షణ కోసం ఉపయోగించే కొన్ని సెక్షన్లు ఎ)సెక్షన్ 69 బి) సెక్షన్ 69ఎ సి) సెక్షన్ 69 బి.. ఉన్నాయి. అయితే, ముందస్తుగా డేటా గోప్యతను రక్షించడానికి చట్టం లేదు.

తమ డేటాను రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు..
● బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి. అల్ఫాన్యూమరిక్ వర్డ్స్ ఉపయోగించాలి. ప్రత్యేక అక్షరాలను చేర్చాలి ● రెండు కారకాల ప్రమాణీకరణను ప్రారంభించాలి ● ఓటీపీ లేదా అథెంటికేటర్ యాప్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి ● పేరొందిన సెక్యూరిటీ, యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి. ఫిషింగ్ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి ● చిన్న లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయరాదు. డేటా కేర్ సాఫ్ట్‌వేర్/యాప్స్‌ని చట్టబద్ధమైన మూలాల నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి ● మీ బ్రౌజర్‌ని అప్‌డేట్ మోడ్‌లో ఉంచాలి. https://తో ప్రారంభమయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయాలి ● https://mxtoolbox.com/EmailHeaders.aspx ఉపయోగించి ఇమెయిల్ పూర్తి హెడర్‌ను చెక్ చేయాలి ● మీ యాప్‌లు మీ డేటాను ఎలా యాక్సెస్ చేస్తున్నాయో చెక్ చేయాలి. అందుకు.. https://reports.exodus-privacy.eu.org/en/, https://smsheader.trai.gov.in/ని ఉపయోగించి ఎసెమ్మెస్ సరైనదేనా అని ధృవీకరించుకోవచ్చు.

మీ డేటా చౌర్యం జరిగిందీ లేనిదీ తెలుసుకోవడానికి చెక్ చేయాలంటే..
మీ ఇమెయిల్ లేదా ఫోన్ నెంబర్ డేటా ఉల్లంఘనలో భాగమైందో లేదో తనిఖీ చేయడానికి మీరు ఈ వెబ్‌సైట్‌ల్‌లో సెర్చ్ చేయచ్చు.
(a) https://amibeingpwned.com
(b) https://snusbase.com
(c) https://leakcheck.net
(d) https://leaked.site
(e) https://leakcorp.com/login
(f) https://haveibeensold.app.





ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,** డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



తొమ్మిదో స్థానంలో అర్జున్

టాటా స్టీల్ ఇండియా చెస్ ఓపెన్ ర్యాపిడ్ టోర్నీలో ఆరు రౌండ్లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 2.5 పాయింట్లతో 9వ స్థానంలో ఉన్నాడు. కోల్‌కతాలో 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం 3 రౌండ్లు జరిగాయి. నాలుగో గేమ్‌లో గ్రిష్‌చుక్ (రష్యా) చేతిలో 55 ఎత్తుల్లో ఓడిన అర్జున్... ఐదో గేమ్‌లో 67 ఎత్తుల్లో విదిత్ (భారత్)పై గెలిచాడు. గుకేశ్ (భారత్)తో జరిగిన ఆరో గేమ్‌ను అర్జున్ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. విదిత్, ప్రజ్ఞానంద, గుకేశ్ 3 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ 750 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆసియా కప్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో గిల్ అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఇషాన్ కిషన్ 12 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 24వ ర్యాంక్‌ను అందుకున్నాడు. పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 882 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



భారత జట్టుకు కాంస్యం



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు మరోసారి కాంస్య పతకంతో సంతృప్తి పడింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 0–3తో చైనీస్ తైపీ చేతిలో ఓడిపోయింది. ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్ తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు. 2021 ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ భారత జట్టు సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకం దక్కించుకుంది.

లంక మాజీ క్రికెటర్ సేనానాయకే అరెస్ట్



కొలంబో: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై శ్రీలంక మాజీ క్రికెటర్ సచిత్ర సేనానాయకేను క్రీడా అవినీతి దర్యాప్తు సంస్థ అరెస్ట్ చేసింది. 2020లో జరిగిన లంక ప్రీమియర్ లీగ్‌లో ఆటగాళ్లను సంప్రదించి మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నించాడనేది అతనిపై ప్రధాన ఆరోపణ. ఇదే ఆరోపణలపై అతడు దేశం విడిచి వెళ్లరాదంటూ మూడు వారాల క్రితమే కోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 15 వరకు సేనానాయకే పోలీసులలో అదుపులో ఉంటాడు. అతనిపై క్రిమినల్ కేసు కూడా నమోదు కానుంది. 38 ఏళ్ల సేనానాయకే ఆఫ్ స్పిన్నర్‌గా 2012–2016 మధ్య శ్రీలంకకు ఒక టెస్టు, 49 వన్డేలు, 24 టి20ల్లో ప్రాతినిధ్యం వహించి మొత్తం 78 వికెట్లు పడగొట్టాడు. 2014లో టి20 వరల్డ్ కప్ నెగ్గిన లంక జట్టులో అతను సభ్యుడు. 2013 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు తరఫున ఎనిమిది మ్యాచ్‌లు ఆడి తొమ్మిది వికెట్లు తీశాడు.

సాత్విక్–చిరాగ్ జోడీ ఓటమి

చాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి 17–21, 21–11, 17–21తో షోహిబుల్ ఫిక్రి–మౌలానా బగస్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ జంట 15–21, 16–21తో చెన్ టాంగ్ జియే–తో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

'రికార్డు'తో సెమీస్‌లోకి జొకోవిచ్

కెరీర్‌లో 47వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన సెర్బియా స్టార్

- క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్‌పై గెలుపు
- అన్‌సీడెడ్ బెన్ షెల్టన్ జోరు



న్యూయార్క్: ఈ ఏడాది వరుసగా నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ ఫైనల్ చేరడానికి సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో విజయం దూరంలో నిలిచాడు. టెన్నిస్ సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 13వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 2 గంటల 35 నిమిషాల్లో 6–1, 6–4, 6–4తో తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. ఫ్రిట్జ్‌తో గతంలో ఆడిన ఏడుసార్లూ గెలుపొందిన జొకోవిచ్ ఎనిమిదోసారి కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేశాడు. ఏడు ఏస్‌లు సంధించిన జొకోవిచ్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ నెట్ వద్దకు 17 సార్లు దూసుకొచ్చి 13 సార్లు పాయింట్లు గెలిచాడు. 2016 వింబుల్డన్ టోర్నీ మూడో రౌండ్‌లో సామ్ క్వెరీ (అమెరికా) చేతిలో ఓడిన జొకోవిచ్ ఆ తర్వాత అమెరికా ఆటగాళ్లతో 30 సార్లు తలపడినా ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. ఫ్రిట్జ్‌పై విజయంతో జొకోవిచ్ రికార్డు పుస్తకాల్లోకి కూడా ఎక్కాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో అత్యధికసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో సెమీఫైనల్ చేరిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. ఓవరాల్‌గా కెరీర్‌లో 47వ సారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్న జొకోవిచ్ స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (46 సార్లు) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు.

2011 తర్వాత సెమీస్‌లోకి బోపన్న

పురుషుల డబుల్స్ విభాగంలో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 43 ఏళ్ల బోపన్న 2011 తర్వాత యూఎస్ ఓపెన్ డబుల్స్‌లో సెమీఫైనల్ చేరుకోవడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జంట 7–6 (12/10), 6–1తో లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) ద్వయంపై గెలిచింది.

వరుసగా మూడో ఏడాది...

మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ అరీనా సబలెంకా (బెలారస్) ఈ టోర్నీలో వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6–1, 6–4తో కిన్వెన్ జెంగ్ (చైనా)పై గెలిచింది. తొమ్మిదో సీడ్, ఈ ఏడాది వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్), 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో సెమీఫైనల్లో సబలెంకా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) 6–0, 6–3తో సొరానా క్రిస్టియా (రొమేనియా)పై గెలిచి తొలిసారి యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరింది.


షెల్టన్

ఐదో అన్‌సీడెడ్ ప్లేయర్‌గా...

మరో క్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల అన్‌సీడెడ్ అమెరికా ప్లేయర్ బెన్ షెల్టన్ 3 గంటల 7 నిమిషాల్లో 6–2, 3–6, 7–6 (9/7), 6–2తో అమెరికాకే చెందిన పదో సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోను ఓడించి కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గత 23 ఏళ్లలో ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన ఐదో అన్‌సీడెడ్ ప్లేయర్‌గా షెల్టన్ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో టాడ్ మార్టిన్ (అమెరికా; 2000లో), రాబీ జినెప్రి (అమెరికా; 2005లో), మిఖాయిల్ యూజ్నీ (రష్యా; 2006లో), దిమిత్రోవ్ (బల్గేరియా; 2019లో) ఉన్నారు. సెమీఫైనల్లో జొకోవిచ్‌పై షెల్టన్ గెలిస్తే 1996లో మార్క్ ఫిలిప్పోసిస్ (ఆస్ట్రేలియా) తర్వాత యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తొలి అన్‌సీడెడ్ ప్లేయర్‌గా ఘనత సాధిస్తాడు.

పాక్ సులువుగా...

- 'సూపర్–4' మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- నాలుగు వికెట్లతో మెరిసిన రవూఫ్
- ఇమామ్, రిజ్వాన్ అర్ధ సెంచరీలు


ఇమామ్, రిజ్వాన్

లాహోర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పాకిస్తాన్ జట్టు ఆసియా కప్ టోర్నీ 'సూపర్–4' దశలో శుభారంభం చేసింది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 38.4 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పాకిస్తాన్ పేస్ బౌలర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హారిస్ రవూఫ్ (4/19), నసీమ్ షా (3/34) బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టారు. 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన బంగ్లాదేశ్‌ను కెప్టెన్ షకీబుల్ హసన్ (57 బంతుల్లో 53; 7 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (87 బంతుల్లో 64; 5 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. అయితే షకీబ్ అవుటయ్యాక బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. మూడు పరుగుల తేడాలో బంగ్లాదేశ్ చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. 194 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ 39.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇమామ్ ఉల్ హఖ్ (84 బంతుల్లో 78; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), మొహమ్మద్ రిజ్వాన్ (79 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించి పాక్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్ ఇన్నింగ్స్ సమయంలో గడాఫీ స్టేడియంలోని ఒక ఫ్లడ్‌లైట్ కాసేపు మొరాయించింది. దాంతో అరగంటపాటు ఆటకు అంతరాయం కలిగింది. 'సూపర్–4'లోని తదుపరి మ్యాచ్‌లన్నీ ఇక శ్రీలంకలోని కొలంబోలో జరుగుతాయి. ఈనెల 9న బంగ్లాదేశ్‌తో శ్రీలంక తలపడుతుంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (సి అండ్ బి) రవూఫ్ 20; మిరాజ్ (సి) ఫఖర్ (బి) నసీమ్ షా 0; లిటన్ దాస్ (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 16; షకీబ్ (సి) ఫఖర్ (బి) అష్రఫ్ 53; తౌహిద్ (బి) రవూఫ్ 2; ముష్ఫికర్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 64; షమీమ్ (సి) ఇమామ్ (బి) ఇఫ్తికార్ 16; అఫీఫ్ (సి) అష్రఫ్ (బి) నసీమ్ షా 12; టస్కిన్ అహ్మద్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 0; షోరిఫుల్ (బి) నసీమ్ షా 1; హసన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (38.4 ఓవర్లలో ఆలౌట్) 193. వికెట్ల పతనం:** 0–1, 2–31, 3–45, 4–47, 5–147, 6–174, 7–190, 8–190, 9–192, 10–193. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 7–1–42–1, నసీమ్ షా 5.4–0–34–3, రవూఫ్ 6–0–19–4, అష్రఫ్ 7–0–27–1, షాదాబ్ 7–0–35–0, ఆగా సల్మాన్ 1–0–11–0, ఇఫ్తికార్ 5–0–20–1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ జమాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షోరిఫుల్ 20; ఇమామ్ (బి) మిరాజ్ 78; బాబర్ ఆజమ్ (బి) టస్కిన్ 17; రిజ్వాన్ (నాటౌట్) 63; ఆగా సల్మాన్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (39.3 ఓవర్లలో ఏడు వికెట్లకు) 194. వికెట్ల పతనం:** 1–35, 2–74, 3–159. **బౌలింగ్:** టస్కిన్ 8–1–32–1, షోరిఫుల్ 8–1–24–1, హసన్ 7–0–46–0, మిరాజ్ 10–0–51–1, షకీబ్ 5.3–0–31–0, షమీమ్ 1–0–8–0.

మరో 4 లక్షల టికెట్లు!



న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకొని టికెట్లు దక్కని అభిమానులకు ఊరట కలిగించే ప్రకటన బీసీసీఐ నుంచి వచ్చింది. అభిమానుల కోసం మరో 4 లక్షల టికెట్లను అమ్మకానికి ఉంచుతున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. ఈ నెల 8న రాత్రి 8 గంటల నుంచి అధికారిక వెబ్‌సైట్ https://tickets.cricketworldcup.comలో టికెట్లు కొనుక్కోవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అభిమానుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. టికెట్లు అమ్మకానికి ఉంచిన గంటల్లోనే 'సోల్డ్ అవుట్' అని రావడం, అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో రాష్ట్ర సంఘాలతో చర్చించి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఏ మ్యాచ్ కోసం ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయో, అందులో భారత్ ఆడే మ్యాచ్‌లకు ఎంత శాతం టికెట్లు కేటాయించారనేదానిపై మాత్రం ఎలాంటి స్పష్టత లేదు.

సినిమా


• రామ్, శ్రీలీల

స్కంద రెడీ

వారాంతపు సెలవులను, గాంధీ జయంతి సెలవుని క్యాష్ చేసుకోవడానికి 'స్కంద' రెడీ అయ్యాడు. రామ్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్కంద'. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. రిలీజ్ డేట్‌ని బుధవారం అధికారికంగా ప్రకటించింది చిత్ర యూనిట్. ''మా 'స్కంద' గురువారం విడుదల కానుంది. వారాంతపు సెలవులు, ఆ తర్వాత సోమవారం గాంధీ జయంతి సెలవు, ఆ తర్వాత వచ్చే దసరా సెలవులు ఇవన్నీ మా సినిమాకు కలిసి వస్తాయి. అందుకే 28 పర్ఫెక్ట్ రిలీజ్ అనుకుని ఆ డేట్‌ని లాక్ చేశాం. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందించిన చిత్రం ఇది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాని రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్.

మా అమ్మానాన్న కూడా అడగలేదు!


• తమన్నా

'మీ పెళ్లెప్పుడు' అనే ప్రశ్న లైఫ్‌లో ఒక దశలో దాదాపు అందరికీ ఎదురవుతుంటుంది. సెలబ్రిటీలను అయితే ప్రతి ఇంటర్వ్యూలో, బయటికి వెళ్లినప్పుడు.. ఇలా తరచూ ఈ ప్రశ్న వెంటాడుతుంటుంది. ఇటీవల తమన్నాని ఓ అభిమాని, ''పెళ్లెప్పుడు చేసుకుంటారు? తమిళ అబ్బాయిలెవరైనా నచ్చారా?'' అని అడిగితే.. ''ఇప్పటివరకూ మా అమ్మానాన్న కూడా అడగలేదు'' అంటూ ఈ బ్యూటీ కాస్త అసహనంగా సమాధానం ఇచ్చారు. ఇక తమిళ అబ్బాయిలు ఎవరైనా నచ్చారా? అనే ప్రశ్నని ఉద్దేశించి ''ప్రస్తుతం చాలా ఆనందంగా ఉన్నాను. నా జీవితం చాలా ఆనందంగా సాగుతోంది'' అని పేర్కొన్నారామె. నెగటివిటీని ఎలా హ్యాండిల్ చేస్తారు? అనే ప్రశ్నకు – ''విమర్శలు, ప్రశంసలు.. రెండూ వస్తుంటాయి. విమర్శలు వచ్చినప్పుడు ఎందుకు అలా అన్నారా? అని ఆలోచిస్తాను. అయితే విమర్శ, ప్రశంస.. ఏదైనా వారి వ్యక్తిగత అభిప్రాయమే. అందుకని పెద్దగా పట్టించుకోను'' అన్నారు తమన్నా.

టీజర్ వైవిధ్యంగా ఉంది


• బిష్ణు అధికారి, ఏఎం రత్నం

''హిట్ మ్యాన్' సినిమా టీజర్ చాలా వైవిధ్యంగా ఉంది. యాక్షన్ సీక్వెన్సులు ఆకట్టుకుంటున్నాయి. బిష్ణు చేస్తోన్న ఈ తొలి ప్రయత్నం పెద్ద సక్సెస్ కావాలి'' – ఏఎం రత్నం

అని నిర్మాత ఏఎం రత్నం అన్నారు. బిష్ణు అధికారి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ మ్యాన్'. అదితీ శర్మ, ఆంచల్ శర్మ హీరోయిన్లు. 99 సినిమాస్‌పై దీపక్ అధికారి నిర్మించిన ఈ సినిమా నవంబర్‌లో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను ఏఎం రత్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా బిష్ణు అధికారి మాట్లాడుతూ– ''హిట్ మ్యాన్' ఒక స్పై థ్రిల్లర్. న్యూ ఏజ్ మూవీ. ఈ సినిమాను మూడు భాగాలుగా చిత్రీకరిస్తున్నాం. తొలి భాగాన్ని నవంబర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ సముద్ర. ''మా 'హిట్ మ్యాన్' సినిమాకు సహకారం అందిస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు చిత్ర సహ నిర్మాత సిప్రా మిశ్రా, సంగీత దర్శకుడు 'మంత్ర' ఆనంద్. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: రోహిత్ ఇంగ్లే, అసోసియేట్ ప్రొడ్యూసర్: సన్నీ లల్వానీ, కెమెరా: వైఆర్ శేఖర్.



కథ బోల్డ్‌గా ఉంటుంది కానీ..

– పి. మహేశ్‌బాబు

''జీవితంలో పెళ్లి చేసుకోకూడదు అనే ఆలోచన ఉన్న ఒక అమ్మాయి పెళ్లి కాకుండా తల్లి అవడంలో సంతోషాన్ని కోరుకుంటుంది. అందుకోసం ఒక అబ్బాయి సహాయం తీసుకుంటుంది. ఇలా మొదలైన వీరి జర్నీ ఎక్కడ ముగిసింది? వారికి ఎదురైన పరిణామాలు ఏంటి?'' అనేది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రకథ'' అని డైరెక్టర్ పి. మహేశ్‌బాబు అన్నారు. నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు పి. మహేశ్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ– ''నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉండటంతో ఇంజినీరింగ్ టైమ్‌లోనే కథలు రాసేవాణ్ణి. దర్శకుల్లో మణిరత్నం, కృష్ణవంశీ, రామ్‌గోపాల్ వర్మగార్లంటే ఇష్టం. రాంబాబుగారి వద్ద 'బావ' చిత్రానికి, కృష్ణవంశీగారి వద్ద 'మొగుడు' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా నా తొలి చిత్రం 'రారా కృష్ణయ్య'. రెండో చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. నేను ఈ చిత్రకథ చెప్పగానే అనుష్కగారికి నచ్చేసింది. ఆ తర్వాత నవీన్‌గారికి కథ చెప్పాను. వంశీ, ప్రమోద్‌గార్లకు కూడా కథ, నా విజన్ నచ్చడంతో రాజీ పడకుండా ఈ మూవీ తీశారు. ఈ సినిమాలో బోల్డ్ కంటెంట్ ఉంటుంది కానీ అడల్ట్ కంటెంట్ ఉండదు. అనుష్క, నవీన్‌గార్లకు ఒక ఇమేజ్, క్రెడిబులిటీ ఉంది. కథ బాగా లేకుంటే వాళ్లే ఈ సినిమా ఒప్పుకోరు కదా? కొత్త తరహా కథలు చేసేందుకు అలాంటి స్టార్స్ సిద్ధంగా ఉన్నారు కాబట్టే మాలాంటి డైరెక్టర్స్ స్క్రిప్ట్స్ రాయగలుగుతున్నాం. చిరంజీవిగారు మా సినిమా చూసి నన్ను, నవీన్‌ను ఇంటికి పిలిచి అభినందించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో టెన్షన్‌గా ఉన్న మాకు ఆయన ప్రశంసతో పెద్ద సక్సెస్ కొట్టిన అనుభూతి కలిగింది. మన నేటివిటీకి దగ్గరగా ఉన్న కథ ఇది.. అందుకే హిందీలో రిలీజ్ చేయడం లేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం'' అన్నారు.

అలా నిన్ను చేరి..


• క్రిష్, దినేష్ తేజ్

దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ లీడ్ రోల్స్‌లో నూతన దర్శకుడు మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అలా నిన్ను చేరి..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ పాట చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు అద్భుతమైన విజువల్స్‌తో చిత్రీకరించిన ఈ పాటకు మంచి స్పందన వస్తుందనుకుంటున్నాను'' అన్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. ఈ సినిమాలో అన్ని పాటలను చంద్రబోస్ రాయడం విశేషం. దినేష్ తేజ్, పాయల్‌పై వచ్చే ఈ పాట సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

అక్టోబర్‌లో మామా....


• సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ దర్శకత్వంలో సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఇందులో స్థూలకాయుడు దుర్గగా, ఓల్డ్ డాన్ పరశురామ్‌గా, డీజేగా సుధీర్‌బాబు మూడు భిన్నమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 6న విడుదల చేయనున్నట్లు బుధవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా.

రీల్స్

అక్టోబర్‌లో ఎవరు?


• జేడీ చక్రవర్తి

జేడీ చక్రవర్తి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హూ'. శుభ రక్ష, నిత్య హీరోయిన్లుగా నటించారు. రెడ్డమ్మ కె. బాలాజీ నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో అక్టోబర్ మొదటి వారంలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. రెడ్డమ్మ కె. బాలాజీ మాట్లాడుతూ– ''ఎమోషనల్ థ్రిల్లర్ మూవీ 'హూ'. ఇందులో యాక్షన్ సన్నివేశాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. క్లాస్, మాస్ ప్రేక్షకులను అలరించేలా కథ విషయంలో జాగ్రత్తలు తీసుకున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఈశ్వర్ చంద్, కెమెరా: ఎంబీ అల్లికట్టి.

వాస్తవ ఘటనతో...


• పోసాని కృష్ణమురళి

సాయి పవన్, ప్రియాంక జంటగా సత్య సలాది దర్శకత్వం వహించిన చిత్రం 'వారెవ్వా జతగాళ్లు'. పోసాని కృష్ణమురళి, గుండు మురళి, భాస్కర్, రాబర్ట్ లూయిస్, మమత కీలక పాత్రల్లో నటించారు. బండారు నాగబాబు (రాజు), దొడ్డి వీర ప్రభాకర్, గరగ వీరబాబు నిర్మించిన ఈ సినిమాని ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సత్య సలాది మాట్లాడుతూ– ''తమిళనాడులో జరిగిన ఒక వాస్తవ ఘటన స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేసి ఈ కథ తయారు చేశాను. ఆటలు, పాటలు, విద్య వంటి ప్రాథమిక హక్కులు సైతం నిషేధించిన ఒక గ్రామంలో నలుగురు కుర్రాళ్లు చేసిన పోరాటమే ఈ చిత్రకథ'' అన్నారు. ''ఈ నెల 22న తెలుగులో, ఆ తర్వాత ఇతర భాషల్లో రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

మాస్ మహారాజు


• సందీప్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా సీహెచ్ సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మాస్ మహారాజు'. సిమ్రత్ కౌర్, సట్న టీటస్, సంపద హీరోయిన్లు. స్వాతి రాజు నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. ''1980 నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. యాక్షన్, ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉంటాయి. ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

పక్కా మాస్


• ఉపేంద్ర, సావిత్రి

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా, ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''ప్రస్తుతం హీరో హీరోయిన్ల మీద సీన్స్ చిత్రీకరిస్తున్నాం. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేయాలనుకుంటున్నాం. ఈ చిత్రంలో 4 పాటలు ఉన్నాయి'' అన్నారు. ''ఇందులో హీరో పక్కా మాస్ అయితే హీరోయిన్ డబ్బున్న క్లాస్ అమ్మాయి'' అన్నారు ఆర్యన్ సుభాన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	100	65,881
నిఫ్టీ ▲	36	19,611

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి పొద్దు ముగింపు)			
నాస్‌డాక్	13,834	▽	183
డోజోన్స్	34,349	▽	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,426	▽	12
డాక్స్	15,741	▽	30
షాంఘై	3,154	▲	4
నికాయ్	33,241	▲	204

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
59,329	▽	27
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,091	▽	27
వెండి (కిలో)		
72,065	▽	166

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.27	83.94
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.78	106.21
€	యూరో	ఒకటి	87.65	90.76
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.48	57.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.91	54.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.07	62.01
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.74	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.26	12.34

పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు!

2023లో మొదటిసారి 90 డాలర్ల పైకి క్రూడ్



న్యూఢిల్లీ: సౌదీ అరేబియా, రష్యా తమ ఉత్పత్తి–ఎగుమతి కోతల విధానాన్ని ఏడాది చివరి వరకు పొడిగించడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు బ్యారెల్‌కు దాదాపు 90 డాలర్ల పైకి చేరాయి. ఇది 10 నెలల గరిష్ట స్థాయి. దీనితో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోగా, మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. చమురు అవసరాల కోసం 85 శాతం కంటే ఎక్కువ దిగుమతులపై భారత్ ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా క్రూడ్ ధర పెరిగితే, దేశంపై దిగుమతుల భారం మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోగా, పెరిగే అవకాశాలే ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. రష్యాతో కలిసి కూటమిగా ఉన్న ఒపెక్ (ఓపీఈసీ- పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ)కు నాయకత్వం వహిస్తున్న సౌదీ అరేబియా డిసెంబర్ చివరి వరకు ప్రపంచ మార్కెట్‌కు సరఫరాలో రోజుకు ఒక మిలియన్ బ్యారెల్స్ తగ్గింపును కొనసాగించాలని ఇటీవల నిర్ణయించింది. అటు తర్వాత బ్రెంట్ ధర గత వారంలో 6.5% పెరిగింది. ఇక రష్యా కూడా ఇటీవలి నెలల్లో చమురు ఎగుమతులపై కోతలకు నిర్ణయం తీసుకుంది.

భారత్ బిల్లు బ్యారెల్ సగటు 89.81 డాలర్లు!

తాజా పరిణామాలతో మంగళవారం మొదటిసారి ఈ సంవత్సరంలో బ్రెంట్ బ్యారెల్ ధర మొదటిసారి 90 డాలర్లు దాటింది. బుధవారం కూడా ఈ వార్త రాసే 11 గంటల సమయంలో అదే స్థాయిలో ట్రేడవుతోంది. చమురు మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురు బాస్కెట్ ఆగస్టులో 86.43 డాలర్లు. ఈ నెలలో 89.81 డాలర్లకు పెరుగుతుందని అత్యున్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. మేలో ఈ ధర 73 నుంచి 75 డాలర్ల శ్రేణిలో తిరిగింది. అయితే జూలైలో 80.37 డాలర్లకు తాజాగా 90 డాలర్లకు పెరిగింది. దీనితో దేశీయంగా రేట్లు తగ్గవచ్చన్న అంచనాలకు ముగింపు పడినట్లయ్యింది. నిజానికి గత సంవత్సరం తీవ్ర స్థాయికి ధరలు చేరినప్పుడు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. ఈ యేడాది మేలో పరిస్థితి కొంత మెరుగుపడుతోందనుకుంటుండగా, ధరలు మళ్లీ దూసుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో నిజానికి 17 నెలల నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో నిలకడగా కొనసాగుతున్నాయి. రాజధాని న్యూఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.96.72 పలుకుతుండగా, డీజిల్ ధర రూ.89.62 వద్ద కొనసాగుతోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఇంధన రిటైలర్లు అంతర్జాతీయ ఇంధన ధరల బెంచ్‌మార్క్ 15 రోజుల రోలింగ్ యావరేజ్ ఆధారంగా ప్రతిరోజూ పెట్రోల్, డీజిల్ ధరలను సవరించాలి. అయితే ఆయా సంస్థలు 2022 ఏప్రిల్ 6 నుంచి అలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల తర్వాత రిటైల్ రేట్ల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పుడు మే 22న చివరిసారిగా ధరలు మారాయి. అంతర్జాతీయ చమురు ధరలు బ్యారెల్ ధర 73–74 డాలర్ల శ్రేణిలో ఉంటే, చమురు కంపెనీలు రోజువారీ ధరల సవరణను మళ్లీ ప్రారంభించేవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఇక తగ్గింపు అవకాశాలే సన్నగిల్లాయన్నది నిపుణుల అంచనా.

భారీ 'విండ్‌ఫాల్' ఆదాయం!

అధిక ధరల పరిస్థితుల్లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వంటి దేశీయ ఉత్పత్తి సంస్థలు అధిక ఆదాయాలను పొందుతాయి. దీనితో పెరుగుతున్న ఆదాయాల నుంచి ప్రభుత్వం విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ రూపంలో భారీ మొత్తాలను పొందే అవకాశం ఉంది. దేశీయంగా ఉత్పత్తి అయిన ముడి చమురుపై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్‌ఏఈడీ) రూపంలో విధించే పన్ను సెప్టెంబర్ 2 నుండి టన్నుకు రూ. 6,700కి తగ్గింది. ఇది గతంలో టన్నుకు రూ.7,100గా ఉంది. రానున్న నెలల్లో మళ్లీ పెంపు బాట పట్టవచ్చు. భారత్ 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చమురు ఉత్పత్తిదారులు ప్రతి బ్యారెల్‌కు 75 డాలర్ల కంటే ఎక్కువ ధరను పొందే సందర్భంలో వారు పొందే విండ్‌ఫాల్ లాభాలపై ప్రభుత్వం పన్ను విధింపు దీని లక్ష్యం. తద్వారా అంతర్జాతీయంగా ధరలు పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతి పదిహేను రోజులకు ఈ పన్ను మదింపు, నిర్ణయం జరుగుతోంది. అటువంటి లెవీ ప్రస్తుతం ఉన్న అన్ని ఇతర పన్నులకు అదనం. క్రూడ్ ఆయిల్, పెట్రోలియం ప్రొడక్టుల ఎగుమతులపై విధించిన ఈ ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం (ఎస్‌ఏఈడీ) వల్ల 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ఖజానాకు దాదాపు రూ.40,000 కోట్ల ఆదాయం లభించింది. 2023–24లో దాదాపు రూ.15,000 కోట్ల ఆదాయం వస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రస్తుత అంచనా.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థకు రూ. 3,760 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ. 3,760 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. 2030–31 వరకు దీన్ని అయిదు విడతల్లో విడుదల చేయనున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. 4,000 మెగావాట్ అవర్స్ స్థాయిలో శక్తిని నిల్వ చేసే సామర్థ్యాలను సమకూర్చుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఆయన పేర్కొన్నారు. ఈ వీజీఎఫ్‌తో రూ. 9,500 కోట్ల మేర పెట్టుబడులకు అవకాశం లభించగలదని ఠాకూర్ వివరించారు.

రిలయన్స్ రిటైల్‌లో ఖతర్ రూ. 8,278 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో (ఆర్‌ఆర్‌వీఎల్) ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) పెట్టుబడులకు సంబంధించి రూ. 8,278 కోట్లు అందినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. డీల్ ప్రకారం సుమారు 1 శాతం వాటా కింద 6.86 కోట్ల షేర్లను క్యూఐఏకి కేటాయించినట్లు వివరించింది. రూ. 8.278 లక్షల కోట్ల (100 బిలియన్ డాలర్లు) వ్యాల్యుయేషన్‌తో క్యూఐఏకి చెందిన అనుబంధ సంస్థ ఆర్‌ఆర్‌వీఎల్‌లో ఇన్వెస్ట్ చేసినట్లు రిలయన్స్ పేర్కొంది. ఆగస్టు 23న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ డీల్ గురించి వెల్లడించింది.

సాయి లైఫ్ సైన్సెస్ కొనుగోలుకు తీవ్ర పోటీ

ముంబై: ఫార్మా కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్‌ను కొనుగోలు చేసేందుకు అరడజను పైగా సంస్థలు పోటీపడుతున్నాయి. బ్లాక్‌స్టోన్, కార్లైల్, పీఏజీ, సీవీసీ క్యాపిటల్, బేరింగ్ పీఈ ఆసియా ఈక్విటీ, బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఎపాక్స్ పార్ట్‌నర్స్ వీటిలో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థలో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ క్యాపిటల్‌కు 43.3 శాతం వాటాలు ఉండగా, స్విస్ హెల్త్‌కేర్ ఫండ్ హెచ్‌బీఎంకు తన ఇండియా పీఈ ఫండ్ ద్వారా 6 శాతం వాటాలు ఉన్నాయి. మిగతా వాటాలు ప్రమోటర్లయిన కనుమూరి కుటుంబానికి ఉన్నాయి.

ఏథర్‌కు రూ.900 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఏథర్ ఎనర్జీ తాజాగా రూ.900 కోట్ల నిధులను అందుకుంది. కంపెనీ వాటాదారులు అయిన హీరో మోటోకార్ప్, జీఐసీ నుంచి రైట్స్ ఇష్యూ ద్వారా ఈ మొత్తాన్ని కంపెనీ సేకరించింది. కొత్త ఉత్పత్తుల విడుదలతోపాటు చార్జింగ్ మౌలిక వసతులు, రిటైల్ నెట్‌వర్క్ విస్తరణకు ఈ నిధులను వెచ్చించనున్నట్టు ఏథర్ సీఈవో, కో–ఫౌండర్ తరుణ్ మెహతా వెల్లడించారు.

రిలయన్స్ రిటైల్ చేతికి 'ఎడ మామ'

అలియాభట్ కిడ్స్‌వేర్ బ్రాండ్ కొనుగోలు



న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ మరో కొనుగోలుకు తెర తీసింది. బాలీవుడ్ నటి అలియాభట్ ప్రమోట్ చేసిన చిన్నారుల కిడ్స్, మెటర్నిటీ వేర్ బ్రాండ్ 'ఎడ మామ'లో 51 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (రిలయన్స్ రిటైల్ మాతృ సంస్థ) ఒప్పందం చేసుకుంది. అలియాభట్‌కు చెందిన కాన్షియస్ క్లాతింగ్ బ్రాండ్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందంపై సంతకాలు చేసింది. ఎడమామ బ్రాండ్‌ను చురుకైన వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని రిలయన్స్ ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-9-2023	
విశాఖ	500-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	495-00
రిటైల్ ధర (డజను)	72.00
6-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455-00
వరంగల్	457-00
రిటైల్ ధర	5.15

సెన్సెక్స్ లాభం 100 పాయింట్లు

- 19,600 పైకి నిఫ్టీ
- నాలుగో రోజూ లాభాలే



ముంబై: ఆఖర్లో వినిమయ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు నాలుగోరోజూ లాభపడ్డాయి. ఉదయం ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 292 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 100 పాయింట్లు పెరిగి 65,881 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36 పాయింట్లు బలపడి 19,611 వద్ద నిలిచింది. వినిమయ షేర్లతో పాటు ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, ఇంధన షేర్లూ లాభపడ్డాయి. కమోడిటీ, ఫైనాన్స్, పరిశ్రమ, ఐటీ, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ నాలుగు రోజుల వరుస ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.317.33 లక్షల కోట్లకు చేరింది. క్రూడాయిల్ ధరలు పది నెలల గరిష్టానికి చేరుకోవడం, చైనా సేవల రంగం 8 నెలల కనిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

గంటలోనే ట్రేడ్ సెటిల్‌మెంట్

- ఆ ఆర్థిక సంవత్సరం చివరికి ఆరంభం
- చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్



ముంబై: తక్షణ ట్రేడ్ సెటిల్‌మెంట్ అమలు దిశగా సెబీ తన చర్యలు మొదలుపెట్టింది. వచ్చే ఏడాది ఆరంభం నాటికి ఒక గంట ట్రేడ్ సెటిల్‌మెంట్ విధానాన్ని తీసుకొస్తామని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ ప్రకటించారు. దీనివల్ల లావాదేవీలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయన్నారు. ముంబైలో జరుగుతున్న ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో భాగంగా ఆమె ఈ అంశాన్ని ప్రస్తావించారు.

మూడేళ్లలో హోండా ఎలివేట్ ఈవీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా ఎలివేట్ ప్లాట్‌ఫామ్‌పై ఎలక్ట్రిక్ వెహికిల్‌ను అభివృద్ధి చేస్తోంది. మూడేళ్లలో ఈ మోడల్‌ను మార్కెట్లోకి తేనున్నట్టు సంస్థ నేషనల్ సేల్స్ హెడ్ నిఖిల్ సరీన్ బుధవారం వెల్లడించారు. ఎస్‌యూవీ ఎలివేట్‌ను హైదరాబాద్ విపణిలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రాడక్ట్ ప్లానింగ్ హెడ్ గుర్మీత్ సింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్యాసింజర్ కార్ల రంగంలో 40% వాటా చేజిక్కించుకున్న ఎస్‌యూవీ విభాగంపై పెద్ద ఎత్తున ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ జీఎం సబా ఖాన్ కూడా పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఎస్ఆర్‌టీసీ, నెల్లూరు జోన్‌లో 300 అప్రెంటిస్‌లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్‌టీసీ).. నెల్లూరు జోన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **నెల్లూరు జోన్ పరిధిలోని జిల్లాలు:** చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 300
» **జిల్లాల వారీగా ఖాళీలు:** చిత్తూరు–46, తిరుపతి–102, నెల్లూరు–96, ప్రకాశం–56.
» **ట్రేడులు:** డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, మెషినిస్ట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్. » **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో వచ్చిన మార్కులు, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపల్, ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజీ, కాకుటూరు, నెల్లూరు చిరునామాకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2023
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.09.2023
» **సర్టిఫికేట్‌లు పరిశీలించే స్థలం:** ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజీ, కాకుటూరు, నెల్లూరు.
» **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.gov.in

నాబార్డ్, ముంబైలో 150 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్).. దేశవ్యాప్తంగా ఉన్న నాబార్డ్ శాఖల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **విభాగాలు:** జనరల్, కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్, కంపెనీ సెక్రటరీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మేటిక్స్,ఫారెస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్, స్టాటిస్టిక్స్,మాస్ కమ్యూనికేషన్/మీడియా స్పెషలిస్ట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి 60% మార్కులతో జనరల్ డిగ్రీ, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ బీబీఏ, బీఎంఎస్, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఐసీఏఐ, సీఎఫ్ఏ, ఏసీఎంఏ, ఎఫ్‌సీఎంఏ, ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.09.2023
» **ఫేజ్–1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 16.10.2023.
» **వెబ్‌సైట్:** www.nabard.org

టీచర్ కొలువుకు.. సిద్ధమేనా!



టీఎస్.. డీఎస్సీ..

» తెలంగాణలో 6,612 పోస్టుల భర్తీకి ఆమోదం
» మరికొద్ది రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్
» బీఈడీ, డీఈడీ అర్హతతో పోటీ పడే అవకాశం

టీచర్ రిక్రూట్‌మెంట్... బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు వేయి కళ్లతో ఎదురు చూసే నోటిఫికేషన్! ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎల్‌పీ.. ఇలా పలు రకాల సర్కారీ టీచర్ పోస్టుల కోసం లక్షల మంది సన్నద్ధమవుతుంటారు. వీరంతా ఇప్పుడు తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా 6,612 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో టీచర్ రిక్రూట్‌మెంట్ తాజా సమాచారం, అర్హతలు, పరీక్ష విధానంతోపాటు విజయానికి మెలకువలు..

మొత్తం 6,612 పోస్టులు

రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం–మొత్తం 6,612 టీచర్ పోస్టులకు త్వరలో నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది.ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)–2,575 పోస్టులు; స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ)–1,739 పోస్టులు;లాంగ్వేజ్ పండిట్స్(ఎల్‌పీ)–611పోస్టులు;ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ)–164 పోస్టులు; స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్–1,523 పోస్టులు ఉన్నాయి.

ఒక్కో పోస్టుకు 61 మంది పోటీ!

మొత్తం 6,612 పోస్టులకు నిర్వహించనున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లో ఒక్కో పోస్టుకు దాదాపు 61 మంది పోటీ పడే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో టెట్ ఉత్తీర్ణుల సంఖ్య దాదాపు 3.5 లక్షలు. వీరంతా దరఖాస్తు చేసుకోవడం ఖాయం. దీంతో.. ఒక్కో పోస్టుకు 61 మంది పోటీ పడే పరిస్థితి ఉంది.

రాత పరీక్ష గతంలో మాదిరిగానే

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను గతంలో మాదిరిగానే నిర్వహించే అవకాశముంది. 2017లో తొలిసారిగా టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో టీచర్ నియామకాలు చేపట్టారు. అందు కోసం టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సారి టీఎస్‌పీఎస్సీకి బదులుగా పాఠశాల విద్యా శాఖ ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్ష ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితా రూపొందించి.. ఆ తర్వాత డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ నేతృత్వంలో నియామకాలు ఖరారు చేయనున్నారు.

వెయిటేజీ విధానం

టెట్‌కు వెయిటేజీ ఇచ్చే విధానాన్ని యథాతథంగా అమలు చేసే అవకాశం ఉంది. రాత పరీక్షకు 80 శాతం; టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఇచ్చి.. తుది జాబితా రూపొందిస్తారు. గత రిక్రూట్‌మెంట్ విధానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ సారి కూడా వెయిటేజీని అమలు చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హతలు

- **సెకండరీ గ్రేడ్ టీచర్స్:** ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. (లేదా) నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత (లేదా) ఎన్‌సీటీఈ నిబంధనలు–2002 ప్రకారం–45 శాతం మార్కులతో ఇంటర్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. దీంతోపాటు టీఎస్ టెట్ లేదా ఏపీ టెట్ పేపర్–1లో లేదా సీటెట్‌లో అర్హత సాధించాలి.
- **స్కూల్ అసిస్టెంట్స్:** సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీగా బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి(లేదా) యాభై శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్ట్‌తో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ పాసవ్వాలి. దీంతోపాటు సంబంధిత సబ్జెక్ట్‌తో టెట్ పేపర్–2లో అర్హత సాధించాలి.
- **ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్:** ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒక ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి (లేదా) ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సులో 50 శాతం మార్కులతో పాసవ్వాలి (లేదా) ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(ప్రాథమిక పాఠశాలలు):** తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి యాభై శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా ఉండాలి.
- **లాంగ్వేజ్ పండిట్స్(భాష పండితులు):** సంబంధిత భాష ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ లేదా సదరు భాష సాహిత్యంలో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ (లేదా) పీజీ ఉత్తీర్ణత (లేదా) బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. బీఈడీలో సంబంధిత భాషను మెథడాలజీగా చదివి ఉత్తీర్ణత సాధించి ఉండాలి (లేదా) యాభై శాతం మార్కులతో తెలుగు మెథడాలజీలో నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పాసవ్వాలి. దీంతోపాటు టీఎస్ టెట్ లేదా ఏపీ టెట్ పేపర్–2లో అర్హత సాధించాలి (లేదా) మ్యాథమెటిక్స్; సైన్స్ లేదా సోషల్ స్టడీస్ ఒక ఆప్షనల్‌గా సీటెట్‌లో అర్హత పొందాలి.
- పైన పేర్కొన్న పోస్టులకు సంబంధించిన గరిష్ట అర్హత మార్కులు జనరల్ కేటగిరీకి నిర్దేశించినవి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు ఉంటుంది.

80 మార్కులకు రాత పరీక్ష

టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పరీక్షను 80 మార్కులకు నిర్వహించే అవకాశముంది. ఎస్‌జీటీ పోస్టులకు 8 విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే వీలుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్, విద్యా దృక్పథాల నుంచి 20 ప్రశ్నలు చొప్పున, లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌ల నుంచి ఒక్కో సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలు చొప్పున అడగనున్నారు.

అదే విధంగా టీచింగ్ మెథడాలజీ నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 8 విభాగాల్లో 160 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారని తెలుస్తోంది.

ఎస్ఏ రాత పరీక్ష

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా 160 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్(20 ప్రశ్నలు–10 మార్కులు); విద్యా దృక్పథాలు (20 ప్రశ్నలు–10 మార్కులు); సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ (88 ప్రశ్నలు–44 మార్కులు); టీచింగ్ మెథడాలజీ (32 ప్రశ్నలు–16 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ సారి పరీక్షను ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహించే వీలుంది.

సన్నద్ధమవ్వండిలా

ఎస్‌జీటీ అభ్యర్థులు

ఎస్‌జీటీ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టాలి. అవి.. విద్యా దృక్పథాలు, కంటెంట్, మెథడాలజీ. విద్యా దృక్పథాలకు సంబంధించి వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధ అంశాలు; దేశంలో విద్యా చరిత్ర; ఉపాధ్యాయ సాధికారత, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, విద్యాహక్కు చట్టం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కంటెంట్ కోసం పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను చదవాలి. సోషల్‌లో భూగోళశాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం; మ్యాథ్స్‌లో సంఖ్యామానం, అంకగణితం, బీజగణితం, సమితులు–సంబంధాలు, క్షేత్రగణితం, రేఖాగణితం; తెలుగులో కవులు–కావ్యాలు, భాషా రూపాలు, పరుషాలు–సరళాలు; ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, వొకాబ్యులరీ, ఆర్టికల్స్–ప్రిపొజిషన్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి. మెథడాలజీని ప్రత్యేక దృష్టితో చదవాలి. బోధనా లక్ష్యాలు, భాషా నైపుణ్యాలు, బోధనా ప్రణాళిక, మూల్యాంకనం తదితర అంశాలను కంటెంట్‌లోని టాపిక్స్‌తో అన్వయించుకుంటూ చదవాలి.

స్కూల్ అసిస్టెంట్.. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేకంగా

- స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులు తమకు అర్హత ఉన్న సబ్జెక్ట్ పరంగా ప్రత్యేక దృక్పథంతో చదవాలి.
- సోషల్ స్టడీస్ ఎస్ఏ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు.. కంటెంట్ పరంగా.. భూగోళశాస్త్రం : సౌర కుటుంబం–భూమి; భూ ఉపరితల స్వరూపాలు–వర్గీకరణ; ప్రపంచ ప్రకృతి సిద్ధ మండలాలు; ఖండాలు; భారతదేశ ఉనికి–భౌతిక అమరిక; వాతావరణం; సముద్రాలు; తెలంగాణ భౌగోళిక అంశాల గురించి అవగాహన పొందాలి. చరిత్రకు సంబంధించి మధ్యయుగ ప్రపంచం; ప్రాచీన భారతీయ నాగరికతలు; ఢిల్లీ సుల్తానులు; మొఘలుల సామ్రాజ్యం; భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమం; ఆధునిక ప్రపంచం; ఆర్థిక, సామాజిక రంగాల్లో మార్పులపై ప్రత్యేక దృష్టితో చదవాలి. పౌరశాస్త్రంలో భారత రాజ్యాంగం; లౌకికత్వం–భారతదేశం; ప్రపంచ శాంతి–భారతదేశం పాత్ర; ఐక్యరాజ్య సమితి–విధి విధానాలపై అవగాహన పొందాలి. ఎకనామిక్స్ నుంచి ద్రవ్యోల్బణం; ఆర్థికాభివృద్ధి; భారతదేశ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు; జాతీయ ఆదాయం; ద్రవ్యం వంటి బేసిక్ కాన్సెప్ట్స్‌పై అవగాహన పొందాలి. సోషల్ స్టడీస్ మెథడాలజీలో సాంఘిక అధ్యయన బోధనా ఉద్దేశాలు; విలువలు; విద్యా ప్రణాళిక; ఉపాధ్యాయుడు; బోధ నోపకరణాలు; మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- మ్యాథమెటిక్స్ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు.. కంటెంట్ పరంగా బీజ గణితం, వ్యాపార గణితం, క్షేత్ర గణితం, రేఖా గణితం, త్రికోణమితి, శ్రేఢులు, సమితులు–సంబంధాలు వంటి అంశాలపై పట్టుసాధించాలి. మెథడాలజీలో.. గణితశాస్త్ర బోధనా లక్ష్యాలు, బోధనా విలువలు, బోధనా ప్రణాళిక, బోధనా పద్ధతులు, మూల్యాంకనం వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- బయాలజీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు కంటెంట్ పరంగా.. జీవ శాస్త్రం–ఆధునిక పద్ధతులు, జీవ ప్రపంచం, సూక్ష్మ జీవుల ప్రపంచం, జంతు ప్రపంచం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఈ సబ్జెక్ట్‌లో మెథడాలజీకి సంబంధించి జీవశాస్త్ర బోధనా లక్ష్యాలు, విజ్ఞానశాస్త్ర పాఠ్యప్రణాళిక, జీవశాస్త్ర ఉపగమాలు–పద్ధతులు గురించి తెలుసుకోవాలి.
- ఫిజికల్ సైన్సెస్ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు.. మెజర్‌మెంట్స్, యూనిట్స్, డైమెన్షన్స్, సహజ వనరులు, మన విశ్వం, కాంతి సిద్ధాంతం, ఉష్ణం, ధ్వని విభాగాలకు సంబంధించి ఉండే అన్ని అంశాలను అప్లికేషన్ విధానంలో నేర్చుకోవాలి. అదే విధంగా అయస్కాంతత్వం, విద్యుదయస్కాంతత్వం, ఆధునిక భౌతిక శాస్త్రానికి సంబంధించిన అంశాలపై లోతైన అవగాహన పెంచుకోవాలి. ఫిజికల్ సైన్సెస్‌లో మెథడాలజీకి సంబంధించి బోధన పరికరాలు, మూల్యాంకన పద్ధతులు, బోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాలపై పట్టు సాధించాలి.


9న ఏయూ స్నాతకోత్సవం

- చాన్సలర్ హోదాలో హాజరు కానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం 87, 88, 89, 90ల సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరవుతారని, ముఖ్య అతిథిగా జి.ఎం.ఆర్ సంస్థల అధినేత, ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ జి.ఎం రావు హాజరై స్నాతకోత్సవ ప్రసంగం అందిస్తారన్నారు. పరిశ్రమలు–శాస్త్ర రంగంలో అవంతి ఫీడ్స్ సంస్థ ఎం.డి అల్లూరి ఇంద్రకుమార్(డీఎస్సీ), సాహిత్యం–కళా రంగాల్లో ఎస్.వి యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కొలకలూరి ఇనాక్(డిలిట్)లకు గౌరవ డాక్టరేట్లను అందిస్తామని తెలిపారు. స్నాతకోత్సవంలో 690 మందికి డాక్టరేట్లు, 600 మందికి మెడల్స్‌ను ప్రదానం చేస్తామన్నారు.

'ఐసెట్–2023' కౌన్సెలింగ్‌కు షెడ్యూల్

- రేపటి నుంచి వెబ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం



సాక్షి, అమరావతి: ఏపీ ఐసెట్–2023 కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 16వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఈ నెల 12న విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో సర్టిఫికెట్లు నేరుగా పరిశీలిస్తామని తెలిపారు. 22న వెబ్ ఆప్షన్ మార్చుకునేందుకు అవకాశం ఇచ్చి, 25న మొదటి విడత సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మరుసటిరోజు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

ఉల్లి రైతుకు మేలు చేస్తున్నా

కంటగింపు రాతలేనా?

- ప్రోత్సాహకాలు ఇవ్వడంలేదంటూ ఈనాడు అసత్య కథనం
- వర్షాభావంతో సాగు జాప్యమైతే.. రైతులు మానేస్తున్నారంటూ అబద్ధపు రాతలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికే 41,382 ఎకరాల్లో సాగు
- గతంలో ఎప్పుడూ లేనంతగా బీమా చెల్లింపు
- ఉల్లిరైతుకు మేలు చేసేలా భారీ సంఖ్యలో సోలార్ డ్రైయర్ల ఏర్పాటు
- రాయితీపై ఉల్లి విత్తనాలు, పంట నిల్వకు గోదాముల నిర్మాణం
- రైతుల కోసం ప్రభుత్వం ఇన్ని చేస్తున్నా రామోజీకి కనిపించడం లేదు



కర్నూలు (అగ్రికల్చర్): ఉల్లి రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా రామోజీరావుకు కనబడటంలేదు. రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి విషం చిమ్ముతూ.. చంద్రబాబును ఆహా, ఓహో అని పొగిడేస్తూ 'ఉల్లిరైతుకు వెన్నుపోటు' అంటూ అసత్యాలతో నిండిన కథనాన్ని ఈనాడు అచ్చేసింది. చంద్రబాబు హయాంలో తాము పడిన ఇబ్బందులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు ఇస్తున్న ప్రోత్సాహం ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులే వెల్లడిస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా ప్రీమియం చెల్లించనక్కర్లేకుండానే బీమా మొత్తం తమకు అందిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి పంటతో తాము నష్టపోలేదని స్పష్టం చేస్తున్నారు. 2014–15 నుంచి 2018–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం రైతుల నుంచి 3.10 లక్షల టన్నుల ఉల్లిని కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా విక్రయించడం ఒట్టి అబద్ధమని ఈనాడు రాతలను కొట్టిపారేస్తున్నారు. ఇక వర్షాభావం వల్ల పంట సాగు ఆలస్యమైతే.. రైతులే సాగును మానేస్తున్నారని రాయడాన్ని వారు తప్పు పట్టారు.

రూ. 118.05 కోట్ల బీమా చెల్లింపు

టీడీపీ హయాంలో బీమా కోసం 5 శాతం ప్రీమియం చెల్లించి, ఉల్లి సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నుంచి సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి వచ్చేది. అయినా ఉల్లి రైతులకు టీడీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా బీమా లభించలేదు. కానీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రెండేళ్లలో ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే ఈ–క్రాప్‌లో నమోదును ప్రామాణికంగా తీసుకొని ఉమ్మడి కర్నూలు జిల్లాలో రికార్డు స్థాయిలో ఉల్లి పంటకు రూ.118.05 కోట్ల బీమా రైతులకు అందింది. మొదటి సారి బీమా పొందామని ఉల్లి రైతులు సంతోషంగా చెబుతున్నారు.

ఏటికేడు పెరుగుతున్న సాగు..

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019–20 నుంచి 2023–24 వరకు పరిశీలిస్తే ఉల్లి సాగు ఏటికేడు పెరుగుతూనే ఉంది. 2019–20లో 75,525, 2020–21లో 73,708, 2021–22లో 80,719, 2022–23లో 87,453 ఎకరాల్లో ఉల్లి సాగు కావడం విశేషం. దిగుబడి కూడా గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 41,382 ఎకరాల్లో ఉల్లి సాగు అయింది. వర్షాలు పడుతుండటంతో సాగు ముమ్మరమైంది.
- గత మూడేళ్లుగా రైతులు లాభాలనే ఆర్జించారు. 2022–23లో రెండు, మూడు నెలలు మినహా అన్ని నెలల్లో మద్దతు ధర రూ. 770 కంటే ఎక్కువ ధరలే లభించాయి.
- ఉల్లి నిల్వ కోసం గోదాములు నిర్మిస్తున్నారు. రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఎంఐడీహెచ్ కింద 75 శాతం సబ్సిడీతో ఉల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కలెక్షన్ సెంటర్లు మంజూరు చేస్తోంది.
- 35 శాతం సబ్సిడీతో సోలార్ డ్రైయర్ల ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 120 పనిచేస్తున్నాయి. వచ్చే మూడు నెలల్లో మరో 3 వేలు ఏర్పాటు కానున్నాయి.

రూ. 30,600 బీమా లభించింది



గతేడాది మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. ఈ–క్రాప్‌లో నమోదు అయింది. ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా అమలైంది. దిగుబడి తగ్గడం వల్ల ఎకరాకు రూ. 10,200 ప్రకారం 3 ఎకరాలకు రూ. 30,600 బీమా లభించింది. గతంలో బీమా చేసుకోవాలంటే 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. గతంలో ఎపుడూ బీమా లభించలేదు. మొదటిసారిగా బీమా లభించడం పట్ల ఆనందంగా ఉంది. ఇక పంటకు సరాసరి రూ. 900 ప్రకారం ధర లభించింది. బీమా వల్ల నష్టం నుంచి బయటపడ్డాం.

– దిన్నె మహేశ్వరరెడ్డి, ఏ.గోకులపాడు, కల్లూరు మండలం

బలహీనపడిన అల్పపీడనం

- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- రాష్ట్రంలో నేడు, రేపు మోస్తరు వర్షాలు
- ఆపై తగ్గుముఖం పట్టనున్న వానలు



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమ బంగాళాఖాతానికి ఆనుకుని ఉత్తరాంధ్రపై ఏర్పడిన అల్పపీడనం బుధవారం బలహీనపడింది. ఈ అల్పపీడనం ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల వైపు పయనిస్తూ బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారింది. ప్రస్తుతం ఈ ఆవర్తనం దక్షిణ అంతర్గత ఒడిశా, పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతూ నైరుతి వైపు వంగి ఉంది. దీని ప్రభావంతో రెండురోజులు ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్రల్లో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి. రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసలో 13.8 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. నరుబుజ్జిలిలో 12 సెంటీమీటర్లు, చిలకలపల్లిలో 10.8, దేవరాపల్లిలో 8.7, డుంబ్రిగుడలో 4.3, పెందుర్తిలో 4, రేచర్లలో 3.7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అల్పపీడనం బలహీనపడిన నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మళ్లీ అల్పపీడనంగానీ, ఉపరితల ఆవర్తనం/ద్రోణిగానీ ఏర్పడితే వర్షాలకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు.

మేం చెప్పే వరకూ ఆగండి

- ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా పీజీ సీట్లు పొందిన వారికి హెల్త్ వర్సిటీ సూచన

సాక్షి, అమరావతి: ఈ ఏడాది పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా రివైజ్డ్ ఫేజ్ –1 కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు సంబంధిత కాలేజీల్లో రిపోర్ట్ చేయవద్దని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం ప్రకటించింది. రాజమండ్రిలోని జీఎస్ఎల్ కళాశాలలో ఎండీ– రేడియో డయగ్నోసిస్ కోర్సులో 14 సీట్లకు నకిలీ అనుమతులు జారీ అయినట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంగళవారం తెలిపింది. దీంతో యాజమాన్య కోటా విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. విశ్వవిద్యాలయం మళ్లీ తెలిపే వరకూ విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయద్దని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి కోరారు. ఇప్పటికే కళాశాలల్లో రిపోర్ట్ చేసిన, చేయని విద్యార్థులు విశ్వవిద్యాలయం నుంచి జారీ చేసే తదుపరి నిర్ణయం కోసం వెబ్‌సైట్‌ను చూస్తుండాలని సూచించారు.

ఎన్ఎంసీకి వైద్య, ఆరోగ్య శాఖ లేఖ

నంద్యాల జిల్లా శాంతీరామ్, విజయనగరం జిల్లా మహారాజా, తూర్పుగోదావరి జిల్లా జీఎస్ఎల్ వైద్య కళాశాలల్లో నకిలీ అనుమతులతో పీజీ సీట్లు పెంచినట్లు వెల్లడవడంతో గత నెలలో నిర్వహించిన తొలిదశ కౌన్సెలింగ్‌ను విశ్వవిద్యాలయం రద్దు చేసింది. ఎన్ఎంసీ నుంచి స్పష్టత తీసుకుని తిరిగి మొదటి నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి సోమవారం సీట్లు కేటాయించింది. అయితే అనూహ్యంగా మంగళవారం మరో 14 సీట్లకు జీఎస్ఎల్ నకిలీ అనుమతులు ఉన్నాయంటూ ఎన్ఎంసీ పేర్కొంది. దీంతో ఈ అంశంపై స్పష్టత కోసం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఎన్ఎంసీకి లేఖ రాశారు. ఎన్ఎంసీ నుంచి వివరణ వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నకిలీ అనుమతులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎన్ఎంసీ సమాచారమిచ్చిందని తెలిపారు. ఫిర్యాదు వివరాలను కోరామని చెప్పారు. విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశామన్నారు. మరో వైపు నకిలీ అనుమతుల అంశంపై మూడు కళాశాలలకు విశ్వవిద్యాలయం వీసీ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగులకు మేలు చేసింది జగనే

రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్

సాక్షి, అమరావతి: రెవెన్యూ ఉద్యోగుల కోరికలన్నీ నెరవేరడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణమని రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వైఎస్ దివాకర్ తెలిపారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవుతారన్నారు. తాడేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలకు వీఆర్వోలుగా, వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా, రెవెన్యూ శాఖలో ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అన్ని తరగతుల ఉద్యోగులకు పదోన్నతులు లభించాయన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ధైర్యం పాల్గొన్నారు.

'భారత్'గా పిలిచేందుకు గర్వపడాలి

వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే



కర్నూలు కల్చరల్: 'భారత్'గా పిలిచేందుకు గర్వపడాలని భారత్, ఇండియా రెండూ వాడుకలో ఉన్న పేర్లేనని అందులో ఎలాంటి లోపాలని, తప్పులను వెతకాల్సిన అవసరం లేదని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. కర్నూలులో నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్ షష్టిపూర్తి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. తమిళనాడు క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని అవమానించారని, అతన్ని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న ఉదయనిధి స్టాలిన్‌కు మల్లికార్జున ఖర్గే, చిదంబరం కుమారులు ఆ వ్యాఖ్యలను సమర్థించారన్నారు. వీహెచ్‌పీ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 6 నుంచి వచ్చే సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి వరకు సంవత్సరం పాటు షష్టిపూర్తి ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను ముంచెత్తుతున్న అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్!

- అధిక కొవ్వు, షుగర్, ఉప్పులతో కూడిన చిరుతిండితో తీవ్ర అనారోగ్యాలు
- దేశంలో ఇలాంటి ప్రాసెస్డ్ ఫుడ్ వ్యాపారం ఏకంగా రూ.3 లక్షల కోట్లు
- ఇందులో సాల్టెడ్ స్నాక్స్ వ్యాపారమే రూ.60 వేల కోట్లు
- కిరాణా షాపుల ద్వారానే 70శాతం విక్రయాలు
- బీపీ, షుగర్ సహా దీర్ఘకాలిక రోగాల బారిన బాధితులు
- భారత్‌లో ప్రాసెస్డ్ ఫుడ్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ప్రొటీన్లు, విటమిన్లు, ఫైబర్ తక్కువగా ఉండి.. కొవ్వులు, చక్కెర, ఉప్పుశాతం అధికంగా ఉండే అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ భారతదేశాన్ని ముంచెత్తుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. అధిక కొవ్వు, చక్కెర, ఉప్పులతో కూడిన స్నాక్స్ (హెచ్‌ఎఫ్ఎస్ఎస్)తో మధుమేహం, అధిక రక్తపోటు సహా పలురకాల దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయని హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల వినియోగం పెరుగుతుంటే.. అందుకు విరుద్ధంగా భారత్‌లో హెచ్‌ఎఫ్ఎస్ఎస్ పెరుగుతుండటం మంచిది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ది గ్రోత్ ఆఫ్ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ ఇన్ ఇండియా' అనే పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం ఒక నివేదిక విడుదల చేసింది.

అధిక కొవ్వు, కేలరీలతో..

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తినడంతోపాటు శారీరక శ్రమ తక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు వస్తాయని డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక స్పష్టం చేసింది. రోజుకు సగటున 1,580 కేలరీలుపైగా శక్తిని అందించే ఆహారం తీసుకోవడం సరికాదని.. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌తో ఎక్కువ కేలరీలు వస్తాయని పేర్కొంది. రోజూ ప్రొటీన్లు 41 నుంచి 57 గ్రాములకు మించి, కొవ్వు 19–32 గ్రాములకు మించి తీసుకుంటే అధిక బరువు సమస్య వస్తుందని తెలిపింది. భారత్‌లోని ఏడు పెద్ద నగరాల్లో ప్రజలు రోజుకు సగటున 33 గ్రాముల కంటే ఎక్కువ కొవ్వు తీసుకుంటున్నారని.. వాస్తవంగా రోజుకు 20 గ్రాముల లోపే తీసుకోవాలని వెల్లడించింది.

కిరాణా దుకాణాలే కొంప ముంచుతున్నాయి

ప్రస్తుతం దేశంలో అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ మార్కెట్ విలువ రూ.3లక్షల కోట్లు అని.. ఇందులో ఉప్పుతో కూడిన సాల్టీ స్నాక్స్ వ్యాపారమే రూ.60 వేల కోట్లు ఉంటుందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ఇదే సమయంలో ధాన్యాలు, పప్పులు, నూనెలు, పాల వంటి నిత్యావసరాల మార్కెట్ విలువ రూ.5లక్షల కోట్లు మాత్రమేనని తెలిపింది. 2038 నాటికి అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ మార్కెట్ రూ.6 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. చిన్న ప్యాకెట్లలో, తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం.. ఇలాంటి వాటిలో 70శాతం కిరాణా షాపుల్లోనే దొరుకుతుండటంతో వినియోగం బాగా పెరుగుతోందని పేర్కొంది. గతంలో కంటే కూల్‌డ్రింక్స్ వాడకం తగ్గినా.. రెడీమేడ్ జ్యూస్, పాల ఆధారిత డ్రింక్‌ల మార్కెట్ పెరిగిందని తెలిపింది.

- పోర్చుగల్‌లో స్వీట్లు, బేవరేజెస్‌లపై ప్రత్యేక వినియోగ ట్యాక్స్ పెట్టడంతో ఏడు శాతం విక్రయాలు తగ్గాయని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. అదే భారత్‌లో హానికరమైనవైనా, మంచివైనా అన్నింటికీ ఒకే రకంగా జీఎస్టీ ఉంటోందని.. దీనివల్ల హానికరమైన వాటి విక్రయాలు తగ్గడంలేదని పేర్కొంది.
- భారత్‌లో చక్కెర తక్కువ ధరలో దొరుకుతుందని, దీనికి ప్రత్యామ్నాయాలను వాడాలంటే పన్నులు ఎక్కువగా ఉంటుండటంతో.. వ్యాపారస్తులు చక్కెరనే ఎక్కువగా వాడుతున్నారని వివరించింది. ప్రజల్లోనూ చక్కెర వినియోగం ఎక్కువగా ఉంటోందని పేర్కొంది.

హెచ్‌ఎఫ్ఎస్ఎస్‌లో ఐదు రకాలు

1) **చక్కెర సంబంధిత పదార్థాలు:** చాక్లెట్స్, బబుల్‌గమ్స్, లాలిపాప్స్, ఐస్‌క్రీమ్స్, స్వీట్లు, బిస్కెట్లు, కేక్స్ వంటివి.
2) **అధిక ఉప్పుతో కూడినవి:** నట్స్, ఆలూ చిప్స్, పాప్‌కార్న్, పాపడ్ తదితరాలు
3) **బేవరేజెస్:** సాఫ్ట్ డ్రింక్స్, రెడీమేడ్ జ్యూసులు, రెడీమేడ్ కొబ్బరి నీళ్లు, ఎనర్జీ డ్రింక్స్, ఫ్లేవర్డ్ మిల్క్ వంటివి.
4) **రెడీమేడ్ బ్రేక్ ఫాస్ట్:** ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్, గ్రనోలా వంటివి
5) **మిగతా రెడీమేడ్ ఫుడ్ ఐటమ్స్:** డీప్ ప్రాసెస్డ్ ఫ్రూట్స్, వెజిటబుల్స్, చిల్డ్ ఫ్రాజెన్ మీట్, ఫ్రాజెన్ సీఫుడ్, రెడీమేడ్ సూప్‌లు, కండెన్స్‌డ్ మిల్క్, లస్సీ, ఇన్‌స్టంట్ నూడుల్స్, పిజ్జాలు, బర్గర్లు, రెడీమేడ్ రైస్, సాస్‌లు, కెచప్‌లు, టేబుల్ సాల్ట్, టమాటా, సోయా డ్రింగ్స్, పెరుగు వంటివి.

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల కొవ్వులు, ప్రొటీన్లు, చక్కెర, ఉప్పు అధికంగా శరీరంలోకి వెళతాయి. అధిక కొవ్వుతో ఊబకాయం, గుండె జబ్బులు.. అధిక ఉప్పుతో పక్షవాతం, బీపీ వస్తాయి. అధిక ప్రొటీన్లతో కిడ్నీ వ్యాధులు తలెత్తుతాయి. దేశంలో జాతీయ స్థాయిలో ప్రాసెస్డ్ ఫుడ్‌పై ఎలాంటి విధానం లేదు. ఆరోగ్యకర, అనారోగ్యకర ఆహార పదార్థాలకు సంబంధించి విధివిధానాలు లేవు. ప్రపంచమంతా చక్కెర, ఉప్పు, కొవ్వులు తక్కువగా ఉన్న ఆహారంవైపు మళ్లుతుంటే.. భారత్‌లో వాటి వినియోగం పెరుగుతోంది. ఈ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది.

– డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

కవ్విద్దాం.. రెచ్చగొడదాం..

- వెలవెలబోతున్న యువగళం కోసం టీడీపీ విధ్వంసక వ్యూహం
- గొడవల ద్వారా ప్రజల దృష్టిలో పడేందుకు ప్రయత్నాలు
- లోకేష్ యాత్ర జరిగే ప్రాంతాల్లో కాలుదువ్వుతున్న వైనం
- సీఎం జగన్ బ్యానర్లు చించడం, నేతలను దూషించడమే లక్ష్యం
- అంగళ్లు, పుంగనూరులో బాబు.. భీమవరంలో లోకేశ్

సాక్షి, అమరావతి: ఎన్ని జాకీలతో పైకి లేపినా లోకేశ్ యువగళం పాదయాత్రకు జనాదరణ రాకపోవడంతో ఘర్షణలు సృష్టించడం ద్వారా లబ్ధి పొందడానికి తెలుగుదేశం పార్టీ శత విధాలుగా ప్రయత్నిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ కనిపించినా, వైఎస్సార్‌సీపీ జెండా కనిపించినా ఓర్వలేని రీతిలో పాదయాత్రలో టీడీపీ రౌడీలు విధ్వంసం సృష్టిస్తున్నారు. రెచ్చగొడుతూ కయ్యానికి కాలు దువ్వుతున్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. లోకేశ్ నిర్వహించే సభలు, యాత్ర జరిగే ప్రాంతాల్లో ఇలా వైఎస్సార్‌సీపీ శ్రేణులను కవ్వించడం, రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. తద్వారా ఘర్షణలు చెలరేగేలా చేసి పాదయాత్రపై ప్రజల దృష్టి పడాలని కోరుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్ని కవ్వించి, చివరికి వారిపైనే దాడులకు దిగారు. లోకేశ్ బహిరంగ సభ జరిగే ప్రాంతంలో ఉన్న సీఎం జగన్ ఫ్లెక్సీపైకి టీడీపీ రౌడీ మూకలు రాళ్లు విసరడం, అడ్డుకున్న పోలీసులను సైతం గాయపరచడం, యాత్ర వెళ్లే రూటులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా విచక్షణారహితంగా దాడులు చేయడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. వాళ్లే దాడులు చేసి తమపైనే దాడులు చేశారని బుకాయింపులకు దిగారు. గత కొన్ని నెలలుగా చంద్రబాబు, లోకేశ్ యాత్రల సందర్భంగా టీడీపీ కార్యకర్తలు దాడులకు దిగడం, మళ్లీ తమపైనే దాడులు జరిగాయని ఎదురుదాడి చేయడం పరిపాటిగా మారింది. గత నెలలో అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా అలజడులు సృష్టించిన విషయం తెలిసిందే. పుంగనూరులో అయితే ఏకంగా పోలీసులపై మూకుమ్మడి దాడికి దిగి, పోలీసు వాహనాలు తగులబెట్టడాన్ని ఇంకా ఎవరూ మరచిపోలేదు. ఈ దాడుల్లో ఒక కానిస్టేబుల్ కన్ను కూడా పోయింది. స్వయంగా చంద్రబాబు పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టడం ద్వారా ఈ దాడులకు కారణమయ్యారు. భీమవరంలో లోకేశ్ తండ్రి మాదిరిగానే కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేయించారు.

పథకం ప్రకారమే ఉద్రిక్తతలు

సీఎం జగన్‌ను బూతులు తిట్టడం ద్వారా మీడియా దృష్టిలో పడేందుకు లోకేశ్ నోటికి పని జెప్పారు. ఇదీ తన స్థాయి అంటూ పదేపదే చాటుకుంటున్నారు. అదికూడా సరిపోక, యాత్ర జరిగే ప్రాంతాల్లో అధికార పార్టీ ఫ్లెక్సీలు, బ్యానర్లు చింపి వేయించడం ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. ఏవైనా సూచనలు చేస్తే పోలీసులతో గొడవలకు దిగడం నిత్యకృత్యంగా మారింది. ఇవన్నీ కూడా ఒక పథకం ప్రకారం తన వెనుక ఉన్న అల్లరి మూకల ద్వారా లోకేశ్ చేయిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులో వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుని నిలబడి ఉన్న కార్యకర్తపై లోకేశ్ వెంట ఉండే యువగళం వలంటీర్లు దాడి చేశారు. అదే జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం మండల పర్రు గ్రామంలో లోకేశ్ కనుసైగ చేయడంతో ఆయన పక్కనున్న ఒక కార్యకర్త రోడ్డుపై ఉన్న సీఎం జగన్ ఫ్లెక్సీపై రాళ్లు విసిరాడు. ఆ తర్వాత దాన్ని చించివేశారు. చింతలపూడిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎలీజా కార్యాలయం మీదుగా యాత్ర నిర్వహించిన సమయంలో అక్కడ ఆగి.. టీడీపీ కార్యకర్తలు ఈలలు వేస్తూ, సీఎం జగన్‌ను బూతులు తిడుతూ బీభత్సం సృష్టించారు.

జనం నిరాదరణతో దిగజారుడు రాజకీయం

లోకేశ్ యాత్రకు ప్రజల నుంచి నిరాదరణ ఎదురవుతుండడంతో ఈ తరహా దిగజారుడు రాజకీయానికి తెరలేపినట్లు స్పష్టమవుతోంది. పార్టీ నాయకులు డబ్బులిస్తామన్నా పెద్దగా జనం రావడంలేదు. ఎంత హడావుడి చేసినా పాదయాత్రకు ఊపు రావడం లేదు. పార్టీ యంత్రాంగంతో.. హంగు, ఆర్భాటాలతో కొంత హడావుడి చేస్తున్నా.. ఎల్లో మీడియాలో తప్ప సాధారణ జనంలో ఈ యాత్ర ఊసే లేదు. ఇటీవల చంద్రబాబు ప్రకటించిన ముందస్తు మేనిఫెస్టో కూడా అట్టర్ ఫ్లాప్ అయింది. మరోవైపు అన్ని సర్వేలు మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఢంకా బజాయిస్తున్నాయి. ఇవన్నీ చూసి పార్టీ క్యాడర్ కూడా బయటకు వచ్చి పని చేసేందుకు ఉత్సాహం చూపించడం లేదు. ఒకవైపు వైఎస్సార్‌సీపీ ఉత్సాహంతో ప్రజల్లో మమేకమవుతుంటే టీడీపీ మాత్రం పైకి లేవలేకపోతోంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలు సృష్టించి ఘర్షణలు జరిగేలా చేయడం.. తద్వారా కొంత వరకైనా మైలేజ్ పెంచుకోవచ్చనే ఆలోచనతో పుంగనూరు తరహా ఘర్షణలకు వ్యూహ రచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

44 మంది యువగళం వలంటీర్ల అరెస్ట్

- టీడీపీ నేతల కనుసన్నల్లోనే భీమవరంలో విధ్వంసకాండ
- 13 మంది టీడీపీ నేతలపై కూడా కేసు నమోదు
- లోకేశ్‌కు పోలీసుల నోటీసులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : భీమవరంలో టీడీపీ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో మంగళవారం రాత్రి రౌడీ మూకలు రెచ్చిపోయి దాడులకు తెగబడిన ఘటనకు సంబంధించి 44 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వలంటీర్లే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక వలంటీర్లు.. టీడీపీ నేతలు చింతమనేని ప్రభాకర్, కొళ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో దాడులకు తెగబడ్డారు. యువగళం వలంటీర్ల పేరుతో టీషర్ట్ ధరించిన 44 మంది దాడులకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించి, అరెస్ట్ చేశారు. టీడీపీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్ద హంగామా సృష్టించేందుకు సిద్ధమవుతుండగా, ముందు జాగ్రత్తగా పోలీసులు అరెస్ట్ చేసిన వారిని కాళ్ల మండలం సీసలి గ్రామంలోని రొయ్యల ఫ్యాక్టరీ వద్దకు తరలించారు. అక్కడకు కూడా టీడీపీ నాయకులు చేరుకుని పోలీసులను పదేపదే దూషిస్తూ ఇబ్బంది పెడుతుండటంతో భీమవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం 39 మందిని భీమవరంలో, ఐదుగురిని ఉంగుటూరులో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కాగా, దాడులను ప్రోత్సహించిన టీడీపీ నేతలు 13 మందిపై కూడా కేసు నమోదు చేశారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, భీమవరం, వీరవాసరం, ఉండి మండలాల టీడీపీ నాయకులపై ఐపీసీ సెక్షన్ 307, 324, 332, రెడ్ విత్ 149 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న నారా లోకేశ్‌కు భీమవరం పోలీసులు నోటీసులు జారీ చేశారు. భీమవరంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను తీవ్ర స్థాయిలో దుర్భాషలాడారు. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటంతో నోటీసులు ఇచ్చారు. అయితే పోలీసుల నుంచి నోటీసు తీసుకోవడానికి లోకేశ్ నిరాకరించారు. చివరకు లోకేశ్ లీగల్ టీం నోటీసులు తీసుకుంది.

మెడికల్ సీట్ల కేటాయింపు వివాదంపై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొత్త మెడికల్ (ఎంబీబీఎస్, డెంటల్) కాలేజీల్లో సీట్ల కేటాయింపు వివాదంపై వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వు కానున్నాయి. ఈ మేరకు జూలై 3న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకు ముందు జాతీయ కోటా 15 శాతం పోగా.. మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. అన్ రిజర్వుడులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ప్రభుత్వ తాజా జీవోతో అన్ రిజర్వుడు అనేది ఉండదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీకి చెందిన గంగినేని సాయి భావనతో పాటు మరికొందరు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో నంబర్ 72 చట్టవిరుద్ధమని, దానిని కొట్టివేయడంతో పాటు కౌన్సెలింగ్‌లో పాత విధానాన్నే అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రాష్ట్ర విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, వర్సిటీ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. విభజనకు ముందు ఉన్న కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు కూడా అవకాశం ఇస్తున్నామన్నారు. కొత్త కాలేజీల్లోని సీట్ల వివరాలు, అలాగే రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు వివరాలనూ అందజేయాలని ధర్మాసనం.. స్పష్టం చేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- ఆలయాల్లో శ్రీకష్ణునికి పూజలు
- భక్తులతో ఆలయాలు కిటకిట

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. మేయర్ త్రివేణి, గొల్లర సంఘం జిల్లాధ్యక్షుడు, పాలికే కార్పొరేటర్ గాదెప్ప తదితరులు పాల్గొని శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. నగరంలోని శ్రీకృష్ణ ఆలయం కిటకిటలాడింది. శ్రీకనక దుర్గమ్మ ఆలయ సమీపంలోని శ్రీకృష్ణ దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

బళ్లారిఅర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలోని 20వ వార్డు రాయల్ కాలనీలో వెలసిన శ్రీవిఠలకృష్ణ దేవస్థానంలో శ్రీ కృష్ణుడికి గోడంబి వెన్న అలంకరణ, సాయంత్రం సంగీత కార్యక్రమాన్ని రాయచూరు మాధవాచార్య జోషి ఆధ్వర్యంలో జరిపారు. కప్పగల్ రోడ్డు శ్రీకృష్ణ దేవస్థానంలో అలంకరణ పూజలను చేశారు. ముఖ్యంగా మోతీ రైల్వే బ్రిడ్జి సమీపంలోని రాధాకృష్ణ ఆలయంలో మర్వాడీ బృందం శ్రీకృష్ణ జన్మాష్టమిని విశేషంగా నిర్వహించారు. బెళగల్ క్రాస్ రామాంజినేయ నగర్‌లో గీతా మందిరంలో పాలరాతి కృష్ణుడికి అలంకరణ పూజలు నెరవేర్చారు. రాజేశ్వరి పాండురంగ ఆలయంలో, మిల్లర్‌పేట్ పాండురంగ ఆలయంలో, కౌల్‌బజార్‌లోని కోదండరామ ఆలయంలో, హుస్సేన్ నగర్ సముదాయ భవన్‌లో ఆ ప్రాంతం యాదవ బాంధవులు కృష్ణుడి పూజ, రథోత్సవ ఊరేగింపు కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ముఖ్యంగా జిల్లా గొల్లర యాదవ సంఘం ఆధ్వర్యంలో కుమారస్వామి దేవస్థానంలో సమీపంలోని నందగోకుల పాఠశాల ఆవరణంలో గోపూజ, శ్రీకృష్ణుడి పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, భజన భక్తి గీతాలను నిర్వహించి రాత్రి కృష్ణుడి జననం, ఉయ్యాల సేవను నిర్వహించారు. పలు చోట్ల విద్యుత్ అలంకరణలను గావించారు.


బళ్లారిలో విఠలకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక అలంకరణ చేసిన దృశ్యం

కంప్లిలో..

కంప్లి: తాలూకా కార్యాలయంలో బుధవారం శ్రీకృష్ణ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెన్నదొంగ శ్రీకృష్ణుని చిత్రపటానికి పూజలు చేసి కొంతమంది ప్రముఖులు శ్రీకృష్ణుని జనన వృత్తాంతం గురించి వివరించారు. కార్యక్రమంలో తాలూకా కార్యాలయ సిబ్బంది, గొల్లర సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.


బళ్లారిలో రాధాకృష్ణ ఆలయంలో చిన్నికృష్ణులకు అలంకరణలు

అదే విధంగా మున్సిపల్ ముఖ్యాధికారి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోను శ్రీకృష్ణ జన్మదినాచరణను జరిపారు.

శ్రీకృష్ణుని ఆదర్శాలు అనుసరణీయం

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో శ్రీకృష్ణ పరమాత్ముని ఆదర్శాలను, ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప అన్నారు. బుధవారం శ్రీక్రిష్ణ యాదవ భవనంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరేశ్వర ఆలయం నుంచి శ్రీకృష్ణ భగవాన్ చిత్రపటంతో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ జాతాను ప్రారంభించారు. సమావేశంలో నగరసభ మాజీ అధ్యక్షుడు మారెప్ప, హరీష్, శరణప్ప, బిచ్చన్న, భీమన్న, హనుమంతప్ప, చెన్నారెడ్డి, కన్నడ సంస్కృతి శాఖాధికారి మంగళ నాయక్‌లున్నారు.

హొసపేటలో..

హొసపేటె: శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను బుధవారం జిల్లాధికారి కార్యాలయ హాలులో ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్పతో పాటు జిల్లా కలెక్టర్ దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, ఏడీసీ అనురాధ పూజలు జరిపారు. కార్యక్రమంలో కల్లంభట్ శ్రీకృష్ణ జన్మాష్టమిపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ స్థానంలో కూడా శ్రీకృష్ణుడు ప్రబోధించిన భగవద్గీతనే వినియోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


బళ్లారిలో శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక అలంకరణ


కంప్లిలో చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


రాయచూరులో ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ


హొసపేటెలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

లాటరీతో కాంగ్రెస్‌కు అధికారం

- రాష్ట్రంలో పడకేసిన అభివృద్ధి పనులు
- బీజేపీ నేత, మాజీ మంత్రి జి.శ్రీరాములు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు కాని హామీలు గుప్పించి ఐదు గ్యారంటీల ద్వారా లాటరీతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ నేత, మాజీ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉచిత పథకాలతో రాష్ట్రంలో అంధకారం నెలకొంటోందన్నారు. అభివృద్ధి పనులు పూర్తిగా ఎక్కడివక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. ఐదు గ్యారంటీల్లో ఉచిత బియ్యం పథకం డబ్బులు మహిళల ఖాతాల్లోకి పడటం లేదన్నారు. గృహలక్ష్మికి సర్వర్ సమస్య అని కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సిద్ధరామయ్య తుగ్లక్ తరహాలో పాలిస్తున్నారని, కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు.

రైతు వ్యతిరేక సర్కార్ కాంగ్రెస్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకమని ఆరోపించారు. రైతుల శ్రేయస్సు కోసం తాము అమలు చేసిన పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో ఈనెల 8న బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కరువు తాలూకాలు ప్రకటించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో 42 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం రైతు కుటుంబాలను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. బ్రిటిష్ వారు పెట్టిన ఇండియా పేరు తొలగించి భారత్ అని పేర్కొనడం మంచిదేనన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిచి మోదీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖరరెడ్డి ఉన్నారు

ప్రతిపక్ష స్థానానికే ఇండియా పోటీ

కేంద్రంలో ఇండియా కూటమి ప్రతిపక్ష స్థానానికే పోటీ పడుతుందన్నారు. వారికి అధికారం దక్కడం కల్ల అన్నారు. ఉత్తర భారత పప్పు రాహుల్‌గాంధీ అయితే దక్షిణభారత పప్పు ఉదయనిధి స్టాలిన్ అని విరుచుకుపడ్డారు. మన ధర్మాలను విమర్శించే వారికి దేవుడే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదన్నారు. పురాణాల కాలం నుంచి సనాతన ధర్మం ఉందన్నారు. సనాతన ధర్మం అంటే దైవం అని అన్నారు. దేవుడిని విమర్శిస్తే ఖచ్చితంగా శిక్ష తప్పదన్నారు. ఈసందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు వై.ఎం సతీష్, రైతు మోర్చా నాయకుడు గురులింగనగౌడ పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సీకి నీరు విడుదల

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సీ కాలువకు పడిన గండి మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేయడంతో బుధవారం మళ్లీ కాలువకు నీటిని విడుదల చేశారు. బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర, ఎస్‌డీఓ సంధాని తదితరుల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు పూర్తి చేశారు. హెచ్‌ఎల్‌సీ కాలువకు నీరు వదిలిన తర్వాత రెండోసారి గండిపడటంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే గణేష్ తదితరులు పనులు పూర్తి చేయించడంలో తగిన దిశానిర్దేశం చేసి నిధుల కొరత లేకుండా చేయడంతో పనులు చకచకా పూర్తిచేసి కాలువకు నీటి విడుదల సాధ్యమైందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే కాలువ పొడవునా తరచు గండ్లు పడుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కాలువ ఆధునీకరణ కోసం దాదాపు రూ.900 కోట్ల నిధులు ఖర్చు చేసినా పనుల్లో నాణ్యత లోపించడం వల్లే గండ్లు పడుతున్నాయని రైతు సంఘం నేతలు ధ్వజమెత్తున్నారు.


గండి పూడ్చివేత పరిశీలిస్తున్న రైతు సంఘం నేత

నాసిరకం పనులతోనే కాలువకు గండ్లు

కాలువ మరమ్మతు పనులు నాసిరకంగా చేయడంతోనే హెచ్‌ఎల్‌సీకి వారంలో రెండుసార్లు గండ్లు పడి రైతులకు శాపంగా మారిందని వామపక్ష నేత శివశంకర్ ఆరోపించారు. ఆయన బుధవారం హెచ్‌ఎల్‌సీకి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. హెచ్‌ఎల్‌సీకి పదే పదే గండ్లు పడటంతో రెండు రాష్ట్రాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు, అధికారులు లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని పనులు నాసిరకంగా చేపట్టారని ధ్వజమెత్తారు. దీనిపై పూర్తి స్థాయిలో తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ కాలువకు గండ్లు పడకుండా అధికారులు కాలువ గుండా గస్తీని పెంచాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దు

కోలారు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెస్కాం జాగృత దళం ఇన్‌స్పెక్టర్ సదానంద తెలిపారు. బుధవారం తాలూకాలోని నరసాపురం గ్రామంలో బెస్కాం జాగృత దళం నుంచి వినియోగదారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చౌర్యం జరిగితే అధికారులు తమపై ఒత్తిడి తెస్తారన్నారు. తాము తనిఖీకి వచ్చినప్పుడు విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే తదుపరి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బులు మిగుల్చుకోవాలనే ఉద్దేశంతో సమస్యలు కొని తెచ్చుకోవద్దని సలహా ఇచ్చారు. విద్యుత్ చౌర్యం చేయబోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందున విద్యుత్ చౌర్యం చేయాల్సిన అవసరం లేదన్నారు. నరసాపురం జీపీ అధ్యక్షుడు కృష్ణప్ప, పంచాయతీ అభివృద్ధి అధికారి మునిరాజు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సదానంద

వైద్యం ఫలించక యువకుడు మృతి


ఆస్పత్రిలో బెడ్‌పై సునీల్ నాయక్ మృతదేహం


సునీల్ నాయక్ (ఫైల్)



ఆసుపత్రి ఎదుట రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

- ఆస్పత్రి ముందు మృతుడి బంధువుల ఆందోళన

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి తండాకు చెందిన సునీల్‌నాయక్(24) అనే యువకుడు వైద్యం ఫలించక ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి హొసపేటె రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీంతో నగరంలోని ఆస్పత్రి ముందు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలు.. అమరావతిలోని శరణం ప్రైవేట్ ఆస్పత్రిలో సునీల్ నాయక్‌ను ఉదయం 10 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. 2 గంటల తర్వాత డాక్టర్ అతన్ని ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అయితే రాత్రి 8 గంటలకు యువకుడు మృతి చెందినట్లు వైద్యుడు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆపరేషన్‌కు నాలుగు గంటల సమయం పడుతుందా? అన్నది కుటుంబ సభ్యుల ప్రశ్నగా మారింది. ఉదయం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి మృతి చెందడంపై బంధువులకు అనుమానాలు ఏర్పడ్డాయి. పక్కలో రక్తం గడ్డకట్టడంతో ఆపరేషన్‌కి తీసుకొచ్చారు. మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి ఆవరణలో మిన్నంటాయి. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యుడు వినయ్ రాఘవేంద్ర మాట్లాడుతూ తాము నాలుగు సార్లు చికిత్స చేశాం. ఐదోసారి వచ్చి ఆస్పత్రిలో చేరినా ఆపరేషన్ చేశాం. చివరి గంటలో బీపీ తక్కువగా ఉండటంతో శ్వాస ఆగిపోయిందన్నారు. తాము తమ వంతు కృషి చేసి చికిత్స చేశాం. తమ నుంచి ఎలాంటి లోపమూ జరగలేదని తెలిపారు.

విమానాశ్రయ నిర్మాణంలో అక్రమాలు

రాయచూరు రూరల్: నగరంలో విమానాశ్రయ నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని కర్ణాటక దళిత సంఘర్ష సమితి జిల్లాధ్యక్షుడు రాజు పట్టి ఆరోపించారు. ఆయన బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిరాశ పరిచాయన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.157 కోట్లు కేటాయించిందన్నారు. భూమిని స్వాధీనపరుచుకోకుండా త్వరగా టెండర్లు పిలిచి కమీషన్ల కోసం నామమాత్రంగా పనులు చేస్తున్నారన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ నిధుల కేటాయింపు తగదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మౌనం వహించారన్నారు. ప్రభుత్వం కేకేఆర్‌డీబీ నుంచి రూ.28 కోట్లు కేటాయించాలని పేర్కొనడాన్ని ఖండించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను వారి ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. విమానాశ్రయ నిర్మాణ అక్రమాల్లో భాగస్వాములైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న రాజు పట్టి

ఎల్‌ఐసీ ఆవిర్భావ వారోత్సవ ర్యాలీ

బళ్లారి రూరల్: భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ) 67వ ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని బ్రాంచ్–2 అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్–1 సీనియర్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌ఐసీ 66 వసంతాలను పూర్తి చేసుకొని 67వ వసంతంలోకి ప్రవేశించిందన్నారు. కోట్లాది మంది పాలసీదారుల నమ్మకానికి ప్రతీకగా నిలిచిన ఎల్‌ఐసీ దేశంలో ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ర్యాలీలో బ్రాంచ్–2 మేనేజర్ బీ.సంపత్ తిప్ప, ఏబీఎం ఈ.రాములు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సూర్యనారాయణ, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.


రాయల్ సర్కిల్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అధికారుల తనిఖీ


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

రాయచూరు రూరల్: నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు, నోడల్ అధికారి గణేష్ తనిఖీ చేశారు. ప్రజా సేవకు ముందుండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. విధులకు ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై మండిపడ్డారు. పథకాలపై ప్రజలకు ఆరోగ్య కార్యకర్తలు వివరించాలన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

కంప్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కర్ణాటక రక్షణ వేదిక జిల్లా యువ శాఖ అధ్యక్షులు మృత్యుంజయ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో మరో ప్రాణం పోసుకుంటుందన్నారు. యువత రక్తదానం చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. తహసీల్దార్ కే.రాఘవేంద్రరావ్, ఉపతహసీల్దార్ మల్లేశప్ప, యాదవ సమాజ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేయండి

రాయచూరు రూరల్: నగరంలోని జవహర్‌నగర్ సంస్థలో జరిగే నిర్మాణాలను స్తంభింపజేయాలని సామాజిక కార్యకర్త మారెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీఏ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. కోర్టులో కేసు నడుస్తున్నందున సభ్యులు తిరిగి కట్టడ నిర్మాణ పనులు చేపట్టారని, వాటిని నిలిపివేయాలన్నారు

క్లుప్తంగా

హాస్టల్‌లో 20 మంది బాలలకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సాక్షి,బళ్లారి: కలుషిత ఆహారం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన దావణగెరె జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. మాయకొండలోని మొరార్జీ దేశాయి హాస్టల్‌లోని విద్యార్థులకు వడ్డించిన చికెన్, సాంబారు, అన్నం తిన్న విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో వారిని తక్షణం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. దీంతో హాస్టల్‌లో సరైన ఆహారం అందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ వార్డెన్‌పై నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు మాట్లాడుతూ తమకు వడ్డించిన చికెన్‌లో నూనె ఎక్కువగా వేయడంతో పాటు సరిగా ఉడికించ లేదని ఆరోపించారు. రోజూ హాస్టల్‌లో వంట సరిగా చేయనందున తరుచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాయచూరు రూరల్: బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మంగళవారం రాత్రి సిరివారలో జరిగింది. నవల్‌కల్ నివాసి గంగప్ప(50) పొలం నుంచి ఇంటి కొస్తుండగా నగరం నుంచి హట్టికి వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించినట్లు సిరివార పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ వేటు

సాక్షి,బళ్లారి: సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గురుసిద్ధనగౌడతో పాటు ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ నుంచి సస్పెండ్ చేశారు. బుధవారం ఈ మేరకు పార్టీ రాష్ట్ర నేతలు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జగళూరు ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగళూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రామచంద్రప్ప ఓటమికి కారణం అయ్యారని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలు రుజువు కావడంతో ఆయన్ను, ఆయన కుమారులను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో దావణగెరె నుంచి ఆయన తనయుడు పోటీ చేయాలని భావించి పార్టీ టికెట్ రేసులో కూడా ఉన్నారు. అయితే లోలోపల పార్టీకి తీవ్ర ద్రోహం చేసినట్లు అధిష్టానానికి తెలియడంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా చెక్ పెట్టారు.

ఖైదీ మృతిపై విచారణకు డిమాండ్


మాట్లాడుతున్న హన్మంతప్ప

రాయచూరు రూరల్: నగరంలోని జైలులో విచారణాధీన ఖైదీ మృతిపై విచారణ జరపాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి(కృష్ణప్ప) జిల్లాధ్యక్షుడు హన్మంతప్ప పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 21న విచారణాధీన ఖైదీ రమేష్‌కు గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం రాయచూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించామని, చికిత్స ఫలించక మరణించాడని జైలు అధికారి అందాని మృతుని సోదరుడు ఆంజనేయకు తెలిపారన్నారు. ఆస్పత్రికి చేర్పించే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపకుండా అధికారులు గోప్యంగా ఉంచారని ఆరోపించారు. ఈవిషయంపై సీఐడీతో విచారణ జరిపించాలని ఒత్తిడి చేశారు.

నరేగ జాబ్‌కార్డ్ తనిఖీ అభియాన్


ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్న దృశ్యం

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి జీపీలో జాబ్ కార్డులు కలిగిన కుటుంబాల ఇంటింటి సర్వేను మహిళా సమాఖ్య సిబ్బంది, తండా రోజ్‌గార్ మిత్రలు చేపట్టారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల సాధారణ కేటగిరీగా నమోదైన కుటుంబాల ఇంటింటి సర్వే నిర్వహించి కార్డులను ధృవీకరించారు. టీపీ సహాయ సంచాలకులు షమీమ్‌బాను, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం తాలూకా కో–ఆర్డినేటర్ కొట్రేష్, సమాచార విద్యా కమ్యూనికేషన్ కో–ఆర్డినేటర్ హెచ్.నాగరాజ్, పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

చిన్మయ విద్యాలయలో...


చిన్మయ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

కోలారు: నగరంలోని చిన్మయ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం చిన్మయ పాఠశాలలో చిన్నారులు రాధాకృష్ణ వేషధారులై అలరించారు. మధ్యాహ్నం విద్యార్థులు ఉట్టిని కొట్టి సంబ్రమించారు. విద్యార్థులకు ప్రసాదం పంచి పెట్టారు. అదేవిధంగా నగరంలోని కీలుకోటలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నెరవేర్చారు. ఉదయం 7 గంటలకు విశేష పూజలను చేశారు.

కిష్కింధా క్షేత్రంలో..


కిష్కింధాలో హోమ పూజలు చేస్తున్న దృశ్యం

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది ఆదిశక్తి దుర్గామాత దేవస్థానంలో బుధవారం శ్రీకృష్ణ జయంతి వేడుకల్లో భాగంగా దుర్గామాత మానస పుత్ర, దాసోహరత్న బ్రహ్మానంద గురూజీ నేతృత్వంలో లోకకళ్యాణార్థం గోశాలలో కామధేను హోమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో నగర ప్రముఖులతో పాటు మార్వాడీ సమాజం వారి నుంచి గోపాలురకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ ప్రముఖులతో పాటు శ్రీరామనగర్ హరిబాబు, ఆలయ మేనేజర్ రామణ్ణస్వామి, గణేశ్‌స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ వాచీ కోసం స్నేహితుడి హత్య


హతుడు అస్లాం (ఫైల్)

హుబ్లీ: నగరంలోని బెంగేరి వెంకటేష్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి స్మార్ట్ వాచీ విషయమై స్నేహితులిద్దరి మధ్య ప్రారంభమైన ఘర్షణ హత్యతో అంతమైంది. హతుడు సిద్రామనగర నివాసి అస్లాం మకాందార్ కాగా గాయత్రినగర మంజునాథ్ నిందితుడు. కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడు అస్లాం మకాందార్ నిందితుడు మంజునాథ్ ఇద్దరు మంచి స్నేహితులు. కొద్ది రోజుల క్రితం మంజునాథ్ అస్లాంకు స్మార్ట్ వాచీని ఇచ్చాడు. అయితే అస్లాం సదరు వాచీని తిరిగి ఇవ్వకుండా వేధించాడు. ఈక్రమంలో మధ్య రాత్రి బెంగేరి వెంకటేష్ కాలనీలో ఎగ్ రైస్ తింటుండగా ఇదే విషయమై ఇద్దరూ ఘర్షణ పడ్డారు. మంజునాథ్ చాకుతో అస్లాం ఛాతీపై పొడిచాడు. దీంతో తీవ్రంగా రక్తస్రావమైన అస్లాంను అతడి స్నేహితులు కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక అతడు మృతి చెందాడు. ఘటనపై కేశ్వాపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లాభాల బాటలో సహకార సంఘం

కంప్లి: 2022–23వ సంవత్సరంలో తమ బ్యాంక్ రూ.4.24 కోట్ల లాభం గడించిందని బ్యాంక్ అధ్యక్షుడు హెచ్.జగదీశ్ వెల్లడించారు. పేటె బసవేశ్వర సభాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన వరలక్ష్మి క్రెడిట్ సహకార సంఘం 20వ వార్షిక మహాజన సభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ సంఘంలో 10,438 మంది సభ్యులు ఉన్నారన్నారు. రూ.5 కోట్ల 90 లక్షల 32 వేల షేర్ల పెట్టుబడులు కల్గిఉన్నామన్నారు. వివిధ రంగాల వారికి రుణాలను అందించడం, అందించిన రుణాలు సకాలంలో వారి నుండి తిరిగి రాబట్టడం వల్ల పట్టణంలో పేరు సంపాదించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. బ్యాంక్ మేనేజర్ ఎం.లోకేశ్వరరెడ్డి వార్షిక నివేదిక, ఆదాయ ఖర్చులను వెల్లడించారు. బ్యాంక్ ఉపాధ్యక్షులు టీ.కొట్రేష్, డైరెక్టర్లు హెచ్.మంజునాథ్, డీ.వీరప్ప, వాలి కొట్రప్ప, కే.సణ్ణ గవిసిద్ధప్ప, బణగార చంద్రశేఖర్, కే.పంపాపతి, కవితాళ చెన్నప్ప, డాక్టర్.వీరనగౌడ, ఎస్.పాటిల్, కే.ఉషారాణి, కేఎం.సౌభాగ్యమ్మ, జీ.ఫకీరప్ప, యంకప్ప పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగమంటూ రూ.31 లక్షల వంచన


నిందితుడు ప్రశాంత్ దేశ్‌పాండే

హుబ్లీ: నేకార నగర్‌కు చెందిన నివాసి ఒకరికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.31.04 లక్షలను వంచించిన కేసులో కేటుగాడిని కసబాపేటె పోలీసులు అరెస్ట్ చేశారు. విజయపుర జిల్లా ప్రశాంత్ దేశ్‌పాండే అరెస్ట్ అయిన నిందితుడు. నేకార నివాసిని పరిచయం చేసుకున్న యువకుడు రైల్వే శాఖలో తనకు ఉన్నత స్థాయి అధికారులందరూ పరిచయం ఉన్నారని నమ్మించాడు. అనేక మందికి ఉద్యోగం ఇప్పించానని అబద్ధాల నియామక పత్రం, జాయినింగ్ లెటర్‌ను చూపించాడు. ఇలా నమ్మించి రూ.31.04 లక్షలను తీసుకొని వంచించినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కసబాపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆ స్టేషన్ సీఐ రాఘవేంద్ర హళ్లూర నేతృత్వంలోని ప్రత్యేక బృందం పరిశోధించి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించింది. కాగా నిందితుడిపై శివమొగ్గ రిప్పన్‌పేటె, బాగలకోటె నవనగర తదితర పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనరేట్ ఓ ప్రకటనలో తెలిపింది.